

















శ్రీరస్తు

శుభమస్తు　　　　　　　　అవిఘ్నమస్తు

# భావయామి వేంకటేశమ్

## సంపుటి-II

### ఎన్నుకోబడిన
### అన్నమాచార్యుల సంకీర్తనలకు
### మున్నుడి

మరియు

### భావామృతం వివరణ

రచన
**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**
M.Tech.

# భావయామి వేంకటేశమ్

## సంపుటి-II

మొదటి ప్రచురణ
**డిసెంబరు 2010**

రచన
**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**
M.Tech.
**Cell: 9393021360**

వెల : అమూల్యం

ప్రతులకు :
ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం.61, సిద్ధార్థ నగర్,
హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360

డి.టి.పి. & ప్రింటింగ్ :
కె. మురళీ కృష్ణ
9848 51 51 09





**అన్నమాచార్యులవారి**
**602వ జయంతి సందర్భంగా భక్తితో**

ఆ.వె॥ ఇష్టదేవతలను యెల్లర భావింతు
'వేంకటేశ్వరునిగ, వేడుకొనెద
అన్నమయ్య కృతికి అత్యంత సులువైన
వివరమీదలంతు విజ్ఞులార!

- రచయిత



## అంకితము

చం॥
హరివెలయింపగా నరిగి ఆయన నందక ఖడ్గ మీభువిన్
వరముగ రూపుదాల్చి నుతి బాడెను కమ్మని కీర్తనంబులన్
వరదుడు "అన్నమయ్య" హరి భక్తుడు యందరి మోక్షదాతయున్
గురువుగనెంచి అంకితము కోరిక తీరగ నిత్తు నీకృతిన్.

# భావయామి వేంకటేశమ్

## సంపుటి II

### అన్నమయ్య కీర్తనల విషయ సూచిక


| క్ర.సం. | విషయం | పేజి |
|---|---|---|
| 1. | అందరికాధారమైన | 41 |
| 2. | అదివో అల్లదివో | 01 |
| 3. | అప్పులేని సంసారము | 191 |
| 4. | అయ్యో! పోయో బ్రాయము | 179 |
| 5. | అణురేణు పరిపూర్ణమైన | 3 |
| 6. | ఆంజనేయ అనిలజ | 185 |
| 7. | ఆదరమ్మ పొడరమ్మ | 157 |
| 8. | ఆదిమూర్తి యీతడు | 147 |
| 9. | ఇట్టి ముద్దులాడి | 5 |
| 10. | ఇందిరారమణుదెచ్చి | 119 |
| 11. | ఇందిర వడ్డించ | 135 |
| 12. | ఇటు గరుడని నీ వెక్కినను | 103 |
| 13. | ఇదె శిరసు మాణిక్యమిచ్చి | 67 |
| 14. | ఈడగు పెండ్లి | 66 |
| 15. | ఈతడు వో రాముడు | 189 |
| 16. | ఈ పాదమే కదా యిలయెల్ల | 23 |
| 17. | ఉదయాద్రి తెలుపాయె | 101 |




భావయామి వేంకటేశం


| | | |
|---|---|---|
| 18. | ఉయ్యాల బాలు నూచెదరు | 77 |
| 19. | ఊరకే దొరకునా | 43 |
| 20. | ఊరకైతే నిన్ను గానము | 127 |
| 21. | ఎంత నేరుపరి ఈ లేమ | 49 |
| 22. | ఎంతవాడవయ్య నిన్ను | 25 |
| 23. | ఎంత చదివిన నేమి | 149 |
| 24. | ఎందరితో బెనగేను | 85 |
| 25. | ఎందాక నిద్ర నీకు | 87 |
| 26. | ఎన్నడు మంచివాడ | 115 |
| 27. | ఏది తుది దీనికేది | 53 |
| 28. | ఏమని చెప్పేది ఈశ్వర మాయ | 27 |
| 29. | ఏమని వర్ణించునొకో | 19 |
| 30. | ఏ పురాణముల నెంత చదివినా | 159 |
| 31. | ఏలే ఏలే మరదలా | 95 |
| 32. | ఓ పవనాత్మజ | 93 |
| 33. | కంటి నఖిలాండ కర్త | 81 |
| 34. | కంటిమి నేడిదే | 71 |
| 35. | కట్టెదుర వైకుంఠము | 75 |
| 36. | కడునడుసు చొరనేల | 33 |
| 37. | కామయాగము చేసె | 171 |
| 38. | కొండవేల నెత్తినట్టి గోవిందా | 151 |

| | | |
|---|---|---|
| 39. | కొనరో కొనరో మీరు | 97 |
| 40. | కొమ్మలాల యెంతవాడె | 59 |
| 41. | కొలనిలోన మును గోపికలు | 63 |
| 42. | గతులన్ని ఖిలమైన | 13 |
| 43. | గరుడాద్రి వేదాద్రి | 111 |
| 44. | గురుతెరిగిన దొంగ | 47 |
| 45. | గోవింద గోవింద | 177 |
| 46. | చక్కని జాణ యిన్నిటా | 175 |
| 47. | చాలదా హరినామ సంకీర్తన | 161 |
| 48. | చూడ చిన్నదానవింతే | 131 |
| 49. | జయ మంగళము నీకు | 201 |
| 50. | తలపు లోపలి తలపు | 141 |
| 51. | తిరుమల గిరిరాయా | 137 |
| 52. | తిరువీధుల మెరసి దేవదేవుడు | 45 |
| 53. | తిరోతిరో జవరాల | 57 |
| 54. | తెప్పగా మర్రాకు మీద | 169 |
| 55. | తే శరణ మహం | 195 |
| 56. | నగుమోము తోడి | 183 |
| 57. | నమో నారాయణాయ | 143 |
| 58. | నవనీత చోర | 55 |
| 59. | నవరూప ప్రహ్లాద | 105 |







| | | |
|---|---|---|
| 60. | నాటికి నాడే నా చదువు | 197 |
| 61. | నారాయణా నీ నామమే | 79 |
| 62. | నారాయణాచ్యుత | 199 |
| 63. | నిత్యానంద ధరణీధర | 91 |
| 64. | నిత్యాత్ముడై యుండి నిత్యుడై | 89 |
| 65. | నీకే నే శరణు | 35 |
| 66. | నీవు తురగము మీద | 123 |
| 67. | నిండు మనసే నీపూజ | 61 |
| 68. | నేడే నాగవల్లి | 31 |
| 69. | నేడే పెండ్లి వేళ | 193 |
| 70. | నేలమిన్ను ఒక్కటైన | 17 |
| 71. | పంతగాడు మిక్కిలి | 125 |
| 72. | పరిపూర్ణ గరుడాద్రి | 15 |
| 73. | పాడరే సోబనాలు | 155 |
| 74. | పొడగంటి మయ్యా మిమ్ము | 121 |
| 75. | బ్రువంతి బౌద్ధాబుద్ధఇతి | 22 |
| 76. | భక్తి కొలదివాడే | 173 |
| 77. | భావించ నేరనైతి | 139 |
| 78. | మాధవా కేశవా | 117 |
| 79. | మాధవ భూధవ | 153 |
| 80. | మిన్నక వేసాలు మాని | 181 |

| | | |
|---|---|---|
| 81. | మూసిన ముత్యాలకేలే | 07 |
| 82. | మొత్తకురే అమ్మలాల | 107 |
| 83. | రామచంద్రుడితడు | 9 |
| 84. | రామభద్ర రఘువీర | 133 |
| 85. | రామదశరథ రామా | 99 |
| 86. | రాముడు లోకాభిరాముడు | 51 |
| 87. | లక్ష్మీ కళ్యాణము లీలతో | 83 |
| 88. | వందే వాసుదేవం శ్రీపతిం | 69 |
| 89. | వలచి వచ్చితి నేను | 163 |
| 90. | వలెనను వారిదే వైష్ణవము | 73 |
| 91. | వినరో భాగ్యము విష్ణుకథ | 129 |
| 92. | విభుడ వింతటికి | 165 |
| 93. | విశ్వప్రకాశునకు | 29 |
| 94. | వెఱపింపబోయి తానె | 167 |
| 95. | వేదుకొందామా | 39 |
| 96. | వేవేల చందాలవాడు | 37 |
| 97. | సహజవైష్ణవాచార | 113 |
| 98. | సందెకాడ పుట్టినట్టి | 145 |
| 99. | సామాన్యమా పూర్వ | 11 |
| 100. | సువ్వి సువ్వి సువ్వని | 187 |
| 101. | హరి నీప్రతాపము | 109 |






# ప్రార్థన

కం॥ హరినే నమ్మిన వానికి
జరుగదు యేనాడు కీడు, సంకీర్తనచే
తిరువేంకటేశు గొలిచిన
అరయవు మరుజన్మ అన్నమయ్యే తెలిపెన్

ఆ.వె॥ ఏడుకొండలయ్య నెంచుడు దిక్కని
కంటనీరు రాదు కరుణ పొంగు
అన్నమయ్య గీత మలరించు నెల్లర
భక్తి వెలుగుజూపు మనసులందు

ఆ.వె॥ కష్టమొచ్చినపుడు కాళ్లపైబడి యేడ్చు
నవ్వువేళ నరుడు నాస్తికుండె
'మాయ' చేయగలరె 'మాయాధినాథుని!!
అన్నమయ్య బాట నెన్నుకొనరె!!

కం॥ శ్రీపతి పదకమలంబుల
నీపట్టున గొలిచి మదిని, హితుడన్నయ్యన్
ఏపుగ నేధ్యానింతును
ఆపై కీర్తనల వివరమందింతు భళా!!

ఆ.వె॥ ఊరునన్నుజూచి ఉరిమింది పొమ్మని
"కాదు" రమ్మనంది కరుణబూని
అన్నమయ్యదారి అలవడలేదాయె
వేంకటయ్య నవ్వె వెనుకనుండి



## ముందు మాట (సంపుటి-II)

"మాయా మేయ జగంబు నిత్యమని సంభావించి"....అని హరిశ్చంద్రుడు కాటికాపరియై వేదాంతం తెలుపుతాడు. మన మాతృభాష అయిన ఈ తెలుగు ఎంత అద్భుతమైన భాష అంటే, ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. పై వాక్యంతో నా ముందుమాట ఎందుకు మొదలు పెట్టానంటే....

భగవానుడు తిప్పుతున్న ఈవిశ్వాన్ని మాయ ఆవరించి, సత్యం అసత్యంగాను, అసత్యం సత్యంగాను గోచరిస్తుంది. మిధ్య అయిన వన్నీ నిజాలుగా భావించి మనకు మనమే 'ధనం' అన్నదాన్ని సృష్టించుకొని దానితో పొందగలిగే సుఖాలన్నీ నిజంగా సుఖాలు కాదని, నివురు కప్పిన నిప్పులా,దుఃఖమే సుఖమనే వేషంలో వచ్చినదని, దానిని నమ్మరాదని పెద్దలు ఏనాడో చెప్పారు. పంచమ వేదమయిన భారతంలో చెప్పినదే 15 వ శతాబ్దిలో తాళ్ళపాక అన్నమాచార్యులవారు అద్భుతమైన తెలుగు కీర్తనలలో చెప్పారు.

తెలుగులో ఆ మహానుభావుడెందుకు చెప్పారంటే...తెలుగులో ఒక చిన్నమాటలో ఎంతో గొప్పభావం తెలుపవచ్చును. ఒకే అక్షరాన్ని రకరకాలుగా పలికి రకరకాల అర్థాలు వచ్చేట్లు చేయువచ్చును. ఉదాహరణకి 'ఆ' అనే అక్షరం గమనించండి. 'ఆ' అంటే 'అది' అని అర్థం. ( 'ఆ' పుస్తకం ఇటివ్వు). 'ఆ' అంటే 'ఏమిటి'? అని అర్థం ('ఆ' ఏమన్నావు ఇంకోసారి చెప్పు).'ఆ' అంటే 'అవును' అని అర్థం. ('ఆ' నేనూ సభలో వున్నాను). ('ఆ') అంటే ప్రశ్నార్థకం ('ఆ' అలా అయిందా?)

మళ్ళీ ఇంకొక్కసారి ఈ ముందుమాటలోని మొదటి వాక్యం గమనించండి. 'వేదాంతం తెలుపుతాడు'-అన్న వాక్యంలో తెలుపుతాడు అంటే తెలియజేస్తాడు అనే కదా! అర్థం. తెలుపు ఒక రంగు. తాడు, కట్టటానికి ఉపయోగపడే ఒకనూలు. రెండూ కలిపితే తెలుపుతాడు (తెలియజేస్తాడు) అయింది.





ఇంత విశాల పరిధి వున్న భాష కాబట్టే తాళ్ళపాక అన్నమాచార్యుల వారు తన కీర్తనలకు ఈభాషనెన్నుకొన్నారు. అన్నమయ్య సంకీర్తనలలో దైవస్తుతి కీర్తనలు కొన్ని సంస్కృతంలో వున్నా అవి సంఖ్యలో చాల తక్కువ, జన ప్రియత్వంలో ఎక్కువ.

దేశభాషలందు తెలుగులెస్స- అని శ్రీ కృష్ణ దేవరాయలు ఊరకనే అనలేదు. సంస్కృతం నుంచి ఆవిర్భవించినా తనదైన శైలిలో జాను తెలుగుగా రూపు దిద్దుకొని పల్లెల్లో నాట్లు వేసుకొని నేటికీ అజరామరంగా ఉన్నది జానపదుల తెలుగు. కాకపోతే నేటి ఇంగ్లీషు వ్యామోహం వల్ల బలహీనమై నాబోటి వాడి పద్యానికే తాత్పర్యం వ్రాయాల్సిన అగత్యం ఏర్పడింది.

అన్నమయ్య కీర్తనలకు భావం వ్రాయాలని నేను నిశ్చయించుకొని ఒకరి సలహా అడిగితే. తెలుగు కీర్తనలకి వివరణ అవసరమా అన్నట్లు మాట్లాడారు. పరమాత్మ దశావతారములను అచ్చతెలుగులో పాడిన అన్నమయ్య కీర్తనలు చూడండి. దీనికి సరి అయిన అర్థం (భావం) 'నాకు తెలుసా' అని ఎవరికి వారు మనస్సులో ప్రశ్నించుకోండి. దీక్షితులు నిజమే చెబుతున్నాడని మీకు తప్పక అనిపిస్తుంది. అన్నమాచార్యులవారి కీర్తనలు అంతతేలికగా కొరుకుడు పడవు.

సంస్కృత, తెలుగు నిఘంటువుల సహాయంతో మాత్రమే నేను ఈ నా సంకల్పం నెరవేర్చానని చెప్పటానికి నేనేమాత్రం సిగ్గు పడటం లేదు.

"ఎందరో మహానుభావులు అందరికీ వందనములు" ...అని అన్నారు త్యాగరాజ స్వామి. అన్నమాచార్యుల వారి సంకీర్తనలను సంరక్షించి, పరిశోధించి, పరిశ్రమించి, తగిన రాగములను కట్టి, సంకీర్తనలుగా పాడి, తాము ధన్యులవుటే కాక కోట్లాది మంది నాబోటి సామాన్య సంగీత ప్రియులను నిత్యమూ ఆనందపరుస్తున్న పెద్దలైన వారందరికీ పాదాభివందనలు. పిన్నలైన వారికి ఆ పెద్దవారంతటి వారు కావాలని శుభాశీస్సులు.

ఒకమాట... నిష్ణాతులు, వాగ్గేయకారులు, సంగీత విద్వాంసులు, సాహితీవేత్తలు, ఎవరో ఒకరి వారు కారు. వారు అందరివారు. అట్లాగే వారి కీర్తిప్రతిష్ఠలు వారివే కాదు అందరివీ. మా అన్నమయ్య, మా ఘంటసాల, మా బాలమురళి, మా లతా మంగేష్కర్, మా మహమ్మద్ రఫీ,... వీరికి జాతి కుల మత వయో బేధాలతో పని లేదు. కీర్తిశేషులైనా వీరు మాహృదయాలలోనే వున్నారు. రేపు మేములేకపోయినా వారు మా హృదయాలలోనే వుంటారు.

అందుకని నేను ఈ నా ప్రయత్నంలో ఎవ్వరెవ్వరి శ్రమనో, కష్టార్జితాన్నో, ఈ రచనను మెరుగు పెట్టటానికి ఆ'శ్రమ' ఉపయోగించుకొని వుంటే, వారికివే నాకృతజ్ఞతలు. వారందరి సహకారంతోనే ఈకృతి సాధ్యమయిందని మనస్ఫూర్తిగా చెబుతున్నాను.

నా రచనలు పుస్తకంగా నా మిత్రుల కివ్వటంలో నాకు అది భగవత్సేవ అనే భావనే కాని వేరే చింతన లేదు. డబ్బుకి నేనెన్నడూ సరస్వతిని అమ్మలేదు, అమ్మనుగాక అమ్మను.

నాలాగే ఇతరులుకూడ ఆలోచించక పోవచ్చు. వారి కష్టాన్ని వారు ప్రతిఫలరూపంలో ఆశించవచ్చును. నేను ఉపయోగించుకొన్న అన్నమయ్య కీర్తనలు వారి శ్రమ ఫలంగా వెలుగులోకి వచ్చి ఉండవచ్చును. అప్పుడు వారికి ఇందులో నేను వారి కష్టాన్ని దోచుకున్న భావన కలుగవచ్చును. మనందరికి గురువైన తాళ్లపాక గురుపుంగవులను చూచి నన్ను మన్నిస్తారని నా ఆకాంక్ష, విన్నపము కూడా. ఈ రచన చేయాలనే ఆలోచన పుట్టించిన బ్రహ్మ, శ్రీ ఎమ్.వి.ఎల్.ఎన్. మూర్తి గారు. ప్రోత్సాహాన్నిచ్చింది డా॥ బి.వి.ఎస్.ఆర్. మూర్తిగారు. సహకరించింది ఎందరో మహానుభావులు. అందరికీ నా కృతజ్ఞతాభివందనలు.





ఇకపోతే మున్నుడి ప్రతికీర్తనకి కావాలా? దాంట్లో పద్యం ఎందుకు? అనే ప్రశ్నలుత్పన్నమయ్యాయి. మున్నుడి అంటే ఉపోద్ఘాతం లేక అవతారిక. మున్నుడి తెలుగు మాట కాబట్టి దాన్నే ఎన్నుకొన్నాను. కీర్తన వైశిష్ట్యం తెలిపే ఉద్దేశ్యంతోనే ప్రతికీర్తనకి మున్నుడి చెప్పాను. ఇక ప్రతి కీర్తనకి ఒక పద్యం చెప్పటానికి కారణం మాత్రం పద్యాలపై నా ప్రేమ స్ఫురింప చేయటమే కాక, అన్నమాచార్యుల వారిని నా ఇష్ట దైవమైన వేంకటేశ్వరుని కీర్తించటమే.

భావామృతంలో కీర్తనని ప్రతి చరణంలోని ప్రతిమాటను వివరించాలని నా ఆశయం. అందుకనే పేరా లుగా విడివిడిగా వ్రాశాను. ఏ చరణాన్నయినా తేలికగా అర్థం చేసికొనవచ్చును.

నాకు ఆత్మానందం కలిగించిన ఈ నా ప్రయత్నం అనంతంగా సాగుతూనే ఉంటుంది. నా తుదిశ్వాసదాకా. ఎందుకంటే రోజుకి ఒకకీర్తన చేసినా అన్నమయ్య కీర్తనల కన్నీ భావం వ్రాయాలంటే నా జీవితకాలం చాలదు. అలా చాలకూడదనీ, ఈ నా అన్నమాచార్యారాధనలోనే వేంకటేశ్వరుని కీర్తిస్తూనే నా కలంతో పాటు శ్వాస కూడా ఆగిపోవాలని నా నిరీక్షణ.. నా ఆకాంక్ష.

నా వెబ్‌సైట్ **www.geetadeeksha.com** లో నా ఇతర రచనలు చదివి ఆనందించి నన్ను ఆశీర్వదిస్తారని ఆశిస్తాను.

**Note :** ప్రతి సంపుటిలోను ముందుమాట అంకితం యథాతథంగానే ఉంటాయి.









2-1

## మున్నుడి

అన్నమాచార్యుల వారి కీర్తనలతో పరిచయం వున్న యెవరికైనా తిరుమల కొండ కనబడగానే గుర్తుకు వచ్చి, నాలుకపై ఆడే కీర్తన ఇది. ఏడు కొండలవాడు ప్రతి అణువులో వున్న కొండ ఇది. దీనికి నమస్కరించి దీనినెక్కవలెను గానీ ఏదో 'ట్రెక్కింగ్' లాగా యెక్కకూడదు. బ్రహ్మాదిదేవతలు, మునులు దీని నివాసంగా యేర్పరచుకొన్నారంటే వింత ఏమీలేదు. సప్తగిరులనెక్కుతుంటే ఏదో తెలియని ఆనందం మనస్సుని ముప్పిరిగొంటుంది. ఆ అనుభూతి స్వానుభవేక వేద్యమే కాని చెప్పేది కాదు. మరి ఆనందం అంటే అనుభవమే కదా!

**చం॥ ఎనిమిది వత్సరంబులకు యేలిక వేంకటనాదుడంచుతాన్**
**కనుగొనె నన్నమయ్య మరికాదనెనన్యము ఐహికంబులన్**
**అనుపమ కీర్తనంబులివి అమృతధారలు యెంచి చూడరో**
**వినుమిక విందురా చెలికి వెన్నుని కొండలనెక్కి కొల్వుడీ**

**రాగం : మధ్యమావతి**

అదివో అల్లదివో శ్రీహరి వాసము
పదివేలు శేషుల పడగలమయము ॥అదివో॥

అదె వేంకటాచల మఖిలోన్నతము
అదివో బ్రహ్మాదుల కపురూపము
అదివో నిత్యనివాసమఖిల మునులకు
అదె చూడుడదె మొక్కుడానందమయము ॥అదివో॥

చెంగట నల్లదివో శేషాచలము
నింగినున్న దేవతల నిజవాసము
ముంగిట నల్లదివో మూలనున్న ధనము
బంగారు శిఖరాల బహు బ్రహ్మమయము ॥అదివో॥

కైవల్యపదము వేంకట నగమదివో
శ్రీవేంకటపతికి సిరులైనది
భావింప సకల సంపదరూపమదివో
పావనములకెల్ల పావన మయము ॥అదివో॥





**భావామృతం :**

(ఒకసారి వాయుదేవునికి ఆదిశేషునికి మధ్య తమలో అధిక బలశాలి యెవరనే వివాదంవచ్చి, తగవు తీర్చటానికి నారదుని ఆశ్రయించారట. ఆయన ఆనంద పర్వతము నాశ్రయించమంటే వారా పర్వతాన్ని అడిగారట. శేషుడు నన్ను గట్టిగా బిగించి పట్టుకొంటే నువ్వు ఆ పట్టు విడిపించు అన్నదట వాయుదేవునితో 'ఆనందగిరి'. ఆదిశేషుని పట్టుకి వాయుదేవుడు బిగిసిపోయి మానవులు ఊపిరాడక తల్లడిల్లారట. దేవతల అభ్యర్థన మేరకు శేషుడు జాలి తలచి పట్టుకాస్త సడలిస్తే వాయుదేవుడు ప్రచండవేగంతో ఆనందగిరిని ముక్కలు చేసేశాడట. దేవతల ప్రార్థన విని ఆదిశేషుడు ఒకదానిపై తన నివాసమేర్పరచుకొన్నాడట. అదే శేషాచలం. వృషభాద్రి, నారాయణాద్రి, అంజనాద్రి, గరుడాద్రి, వేంకటాద్రితో కలిసి ఏడుకొండలు ఆవిధంగా ఒక్కచోట వెలశాయి. వాటిని తన నివాసంగా ఏర్పరచుకొన్నాడు. వైకుంఠం నుంచి దిగివచ్చిన శ్రీమన్నారాయణుడు తనే శ్రీవేంకటేశ్వరుడై వాటిపై వెలిశాడు)

అదిగో అల్లదిగో ఆ కనబడుతున్న వేంకటాచలం చూశారా! అదే శ్రీహరి నివాస స్థానము. అది ఆదిశేషుని పడగలతో నిండిపోయి వున్నది. (మనబోటి అల్పులకి కనబడదనుకో..) పదివేల పడగలమయమైన దానిని భావించి నమస్కరించి తరించండి. ఆ కనబడుతున్న వేంకటాచలం చూశారా! అది బ్రహ్మాదిదేవతలందరికి ఆప్యాయమైనది. మహామునులందరికీ ఆ కొండ నిత్యమూ నివాసస్థానం. వారు ఉండటానికి యెంచుకొన్నచోటు అదే సుమా! దాన్ని చూడండి. మొక్కండి. ఆనందం నిండి వుండే నెలవు అదే.

దాని దగ్గరలోనే వున్న పర్వతమే శేషాచలము. స్వర్గంలో వుండే దేవతలు భూమిపైకి వచ్చినప్పుడల్లా స్వయంగా వుండే చోటు అదే. మనయెట్ట నెదుట వుండే మూలధనం అదే. బంగారు శిఖరాలు (గోల్డ్‌కాదు...) గల ఆ పర్వతం బ్రహ్మార్షులు, బ్రహ్మత్వం సిద్ధించిన మహామహులందరికీ ఆటపట్టుగా విలసిల్లుచున్నది.
ఇక ఈ వేంకటాచలం మహిమ నేమని వర్ణించను? ఇది మోక్షప్రాప్యస్థానము. శ్రీమన్నారాయణుని అర్చావతారమైన శ్రీవేంకటేశ్వరునికి అపురూపమైన భాగ్యము ఇది. చక్కగా భావించగలిగితే సర్వసంపదలకి మారు రూపు ఇదే. పవిత్రమైన వాటన్నింటిలోకి అత్యంత పవిత్రమైనది ఈ వేంకటాచలమే.

**2-2**

## మున్నుడి

షణ్ముఖప్రియరాగం వింటుంటే సన్నటివానజల్లు పడితే దాంట్లో ఆనందం తడుస్తున్నట్లుంటుంది. వేంకటేశ్వరుని రూపం కన్నులకు దర్శింపచేస్తున్న అన్నమయ్య మన చెవులలో అమృతం ధారగా పోస్తున్నారు. పరమయోగులు తపోశక్తితో తమ మానసాకాశంలో తటిల్లతలాగా మాత్రమే గోచరింపచేసుకో గల దివ్యరూపాన్ని తాళ్లపాకవారు అవలీలగా మనవంటి అతి సామాన్యులు సులభంగా సాకారంగా ఆకళింపు చేసుకోగల వేంకన్న రూపంగా ఈ కీర్తనతో దర్శింపచేశారు. తరించండి.

**ఉ॥ చూపెను వేంకటేశ్వరుని శోభను కన్నులగట్టినట్లు ఆ**
**రూపము దివ్యమోహనము లోకము లేలెడి ఆ జగత్పతిన్**
**ఆ పరమాత్మ నన్నమయ అద్భుత కీర్తనమందు దెల్పగా**
**తోపెను నాదుబోంట్లకును తోయజనాభు డహో! తటిల్లతై**

**రాగం : షణ్ముఖప్రియ**

అణురేణు పరిపూర్ణమైన రూపము
అణిమాది సిరి అంజనాద్రి మీది రూపము ॥అణురేణు॥

వేదాంతవేత్తలెల్లా వెదకేటి రూపము
ఆదినంత్యములు లేని ఆ రూపము
పాదుగ యోగీంద్రులు భావించు రూపము
ఈ దెస నిదివో కోనేటి దరి రూపము ॥అణురేణు॥

పాలజలనిధిలోన పవళించు రూపము
కాలపు సూర్యచంద్రాగ్నిగల రూపము
మేలిమి వైకుంఠాన మెరసిన రూపము
కీలైన దిదే శేషగిరి మీద రూపము ॥అణురేణు॥



భావయామి వేంకటేశం

ముంచిన బ్రహ్మాదులకు మూలమైన రూపము
కొంచన మర్రాకు మీది కొనరూపము
మంచిపరబ్రహ్మమై మమ్ము నేలిన
ఎంచగ శ్రీవేంకటాద్రి నిదే రూపము ॥అణురేణు॥

**భావామృతం :**

అతి సూక్ష్మమైన అణువులోను, ఇసుకరేణువంత సూక్ష్మమైన రూపములోనూ పరిపూర్ణంగా నిండి యుండు మహత్తర రూపము ఇది. అణిమాది అష్టసిద్ధులను ప్రసాదించగలది ఈ అంజనాద్రి మీద వెలసిన రూపము.

ఈ ప్రపంచంలో వేదములను, వేదాంతమును అవపోసన పట్టినవారు ఎటువంటిదో తెలుసుకొనగోరేది ఈ రూపమునే. మొదలు, తుదిలేని అద్భుతమైన రూపము కూడ ఇదే. యోగేశ్వరులందరు భావించులకు ప్రయత్నించే రూపమిదే. ఇటువైపు వచ్చి ఈ కోనేటి దగ్గిర వెలసిన దివ్యమైన రూపము ఇదే.

క్షీరసాగరమున (ఆదిశేషునిపై) పవ్వళించిన సుందర రూపము ఇదే సుమా! కాలము, కాలగతిని తెలిపే సూర్యచంద్రులు, అగ్నికూడ ఈయన రూపమే. వేంకటాద్రి మీద బంగారమువలె మెరిసిపోతున్న రూపము ఇదిగో. శేషగిరిమీద వెలసిన మూల రూపము ఈ మహానుభావునిదే. ఈ దివ్యరూపాన్ని గ్రహించండి.

బ్రహ్మాదులను సైతము ఆక్రమించగల మూలమైన రూపం ఇదే. చిన్న మఱ్ఱి ఆకుమీద పవ్వళించి యున్న చిన్మయరూపము ఇదే. పరబ్రహ్మ స్వరూపం ఇదే. మమ్మల్నందరినీ యెంపిక చేసి రక్షించుచున్న శ్రీ వేంకటేశ్వరుని దివ్యరూపము ఏడుకొండలవాని రూపము ఇదే. దీనిని భావించి తరించండి.

**2-3**

## మున్నుడి

అన్నమాచార్యులవారు రేపల్లెలో ఒకగోపికవలె భావించుకొని తోటిగోపికలకు సలహాలిస్తున్నారు. చిలిపి పిల్లలు చెప్పే దొంగసాకులు వాళ్ళ నగలు, అలంకరణలు అమాయకత్వం అన్నీ కళ్ళకు గట్టినట్లు వర్ణించగల ఆ రచనా వైభవం వివరించటం సాధ్యమవుతుందా? కృష్ణలీలలు వర్ణిస్తూనే వేంకటేశ్వరుడే బాలకృష్ణుడని భావనజేసి ఆయనకి మీ సర్వస్వం వప్పజెప్పమని అంటున్నారన్నమయ్య. ఆనంద భైరవిలో ఈ కీర్తన వినే వారిదే భాగ్యం కదా!

**ఉ॥ ముద్దుల మూట యీ బుడత మోహనరూపుడు, పొట్టనిండుగా**
**వద్దనునట్లు పట్టుడిక పాలను మానును దొంగబుద్ధి, యే**
**సుద్దులు చెప్పగల్గుదుము సుంతవినండని అన్నమయ్యనెన్**
**అద్దరి వేంకటేశ్వరుని అల్లరి కృష్ణుని వోలెనెంచెబో!!**

**రాగం : ఆనంద భైరవి**

ఇట్టి ముద్దులాడి బాలుడేడ వాడు వాని
పట్టి తెచ్చి పొట్ట నిండ పాలువోయరే ॥ఇట్టి॥

గామిడై పారితెంచి కాగేటి వెన్నలలో
చేమపూవు కడియాల చేయిపెట్టి
చీమకుట్టెనని చెక్కిట కన్నీరు జార
వేమరు వాపోవు వానివెద్దు వెట్టరే ॥ఇట్టి॥

ముచ్చువలె వచ్చితన ముంగమురువుల చేయి
తచ్చెడి పెరుగులోన తగబెట్టి
నొచ్చెనని చేయిదీసి నోరనెల్లజొల్లుగార
వొచ్చెలి వాపోవు వాని నూరడించరే ॥ఇట్టి॥





ఎప్పుడు వచ్చెనో మా యిల్లు చొచ్చి పెట్టెలోని
చెప్పరాని వుంగరాల చేయిబెట్టి
అప్పడైన వేంకటాద్రి అసవాలకుడు గాన
తప్పకుండ పెట్టె వాని తలకెత్తరే ॥ఇట్టి॥

**భావామృతం :**

ఓ అమ్మలారా! ఈ ముద్దులు మూటగట్టే పిల్లాడు యెంతటి అల్లరి పిడుగమ్మా! వీణ్ణి పట్టుకొని తెచ్చి బలవంతాన పాలు పట్టండి. (బొజ్జ నిండాక ఇంకా ఏం దొంగతనం చేస్తాడు?)

వీడి అల్లరి ఏం చెప్పనే! తానే ఒక గ్రామాధికారి అన్నంత డాంబికంగా వచ్చి కాగే వెన్నెలో చేమపూలు చెక్కివున్న బంగారు కడియాల తన చెయ్యి బెట్టాడు. చెయ్యి చుర్రున కాలి చెంపలపై జారే కన్నీళ్ళొచ్చాయేమో ఏమిటి సంగతంటే, నాకు చీమ కుట్టిందంటున్నాడు. మాటి మాటికీ వాపోతున్నాడు. వాడి మోసం మనకితెలియదా? ఎంత టక్కరి వాడు. మనం కూడా వాడిని ఏదో తెలీనట్లే వూరుకో బెడదాం.

వీడు దొంగతనంగా పెరుగు చిలికే కుండలో మురుగులున్న చేయి పెడితే వేగంగా తిరిగే కవ్వం తగిలి చేతికి దెబ్బ తగిలినట్లయింది. అమ్మో అనుకొని చొల్లు కారే తన చిన్నారి నోట్లో చటుక్కున తనవేలు పెట్టేసుకొని బాధపడుతున్న ఈ బంగారు తండ్రిని వోదార్చండే! ఓ చెలీ! పాపం వీణ్ణి చూస్తే జాలివేయటం లేదూ?

ఎప్పుడొచ్చాడో తెలీదు గాని వీడు తన చక్కటి వర్ణనాతీతమైన వుంగరాల చేతిని మా పెట్టె (ధనము దాచుకొన్న)లో పెట్టాడు. వీడెవరనుకొన్నారు? జగత్పిత వేంకటేశ్వరుడు. వీడు పోలిక చెప్పలేని మహానుభావుడు. వాడే మనదంతా దోచుకుంటే ఇంకా కావలసిందేమిటుంటుందే? ఈ పెట్టెని మీరే యెత్తివాడి నెత్తిన పెట్టేసేయండి. (నిశ్చింతగా ఉంటుండి). అంటే... వెర్రివాళ్ళల్లారా జగన్నాధుడికి మీ ధనం ఎందుకు ఏమన్నా వుంటే భక్తిధనం ఈయండి అంటున్నారు అన్నమయ్య.

**2-4**

## మున్నుడి

అన్నమాచార్యులవారి ఈ కీర్తన అలమేలు మంగ సౌందర్యాన్ని వర్ణిస్తూ, ఇంత స్వాభావికమైన అందం నీ చెంతనుండగా ఇంకా నీకు కస్తూరి, చేమంతులు, మట్టెల మోతలు, వల్లెవాటు, పెడమోము పెట్టుకోవటాలు వంటివన్నీ దేనికమ్మా? హాయిగా వేంకటనాథుని బిగి కౌగిట్లో సగభాగమైపోక నీకు ఏవేవో అలంకరణ లెందుకు? అంటున్నారు. పైపై అలంకారాలు 'పలుకు తేనెల తల్లివి' నీకెందుకు? ముద్దులొలికే నీ మాటలే నీకలంకారం. కొండల రాయని అండయే నీకు దండి.

**చం॥ వినుటకు తేనెజల్లువలె వేంకటనాథుని సేదదీర్చు ఈ**
**అనుపమ కీర్తనంబు, కవి అన్నయభావము 'మూసి'యుంచెరా**
**తెనుగు నిఘంటువున్ దెరచి తిప్పలు బొందితి దిక్కుతెల్వకన్**
**కనుగొన జాలితిన్ వసుధకాంతుని కాంతకు వర్ణనంబుగా**

**రాగం : మోహన**

మూసిన ముత్యానకేలే మొరగులు
ఆసల చిత్తానకేలే అలవోకలు ॥మూసిన॥

కందులేని మోము కేలే కస్తూరి
చిందు నీ కొప్పునకేలే చేమంతులు
మందయానమునకేలే మట్టెల మోతలు
గందమేలే పైపై కమ్మని నీమేనికి ॥మూసిన॥

భారపు గుబ్బల కేలే పయ్యెద, నీ
బీరపు చూపుల కేలే పెడమోము
జీరల బుజాల కేలే చెమటలు
గోరంట గోళ్లకేలే కొనవాండ్లు ॥మూసిన॥





ముద్దుల మాటలకేలే ముదములు, నీ
అద్దపు చెక్కుల కేలే అరవిరి
ఒద్దిక కూటమికేలే ఊర్పులు, నీకు
అద్దమేలే తిరువేంకటాధీశు గూడి ॥మూసిన॥

## భావామృతం

(ఓ అలమేలు మంగమ్మ తల్లీ! నీ కెందుకమ్మా ఈ అనవసరమైన తిప్పలు?) సముద్ర గర్భంలో ఎక్కడో ముత్యపు చిప్పలో మూసికొని యుండి ఎంతో ప్రయాసపడితేకాని దొరకని ముత్యాన్ని ఇంకా మూసివుంచి దాచవలసిన అవసరమేమున్నది? ఆశ కలిగి భ్రమపడే మనస్సునకు ఇంకా చపలత్వం కూడా దేనికి తల్లీ? నీకు ఈ కృత్రిమములు అనవసరం.

ఏ మాత్రము లోపంలేని నీ చక్కని మొగమునకు కస్తూరీ తిలకంతో అందంతేవాలా? నీవు నడుస్తుంటే అటూ ఇటూ ఊగే నీ కొప్పులో పూలు నిలుస్తాయా? మరి ఆ తలలో చేమంతి పూలెందుకమ్మా? (స్వామి వారి కడ్డం కాకపోతే....) పూలురాలిపోతాయని సుకుమారంగా నడుస్తున్నావు. ఇక నీ మట్టెలు సవ్వడుల నెలా చేస్తాయి చెప్పు తల్లీ? సహజ పరిమళాలు వెదజల్లు దివ్యమైన నీ తనువునకు ఇంకా గంధపుపూతలు అవీ దేనికి తల్లీ?

తల్లీ! బరువైన పయోధరములు గల నీకు ఇంకా ఆ పయ్యెద బరువు కూడా దేనికమ్మా? ధైర్యంగా స్వామివారి కళ్ళల్లో కళ్ళకలిపి చూడక పెడమోముతో చూడటం దేనికమ్మా? చీరె అలా నిండుగా కప్పేసుకొంటే చెమటలెందుకు పట్టవు? పడితే అవస ధ కదా? మరి? ఎందుకు ? గోరింటాకు పెట్టుకొని ఎఱ్ఱగా సొగసుగా నీ గోళ్ళుంటే వాటికి ఇంకా కొనవాండ్లు (గోళ్ళు కోసుగా చేసికొను అలంకరణ) దేనికమ్మా?

ముద్దు ముద్దుగా మాట్లాడే పలుకు తేనెల తల్లివి నీవు. ఇంకా నీవు నవ్వులొలికించటం దేనికి? తళతళా మెఱసే అద్దపు చెక్కిళ్ళు నీకుంటే వాటి మీద పూలరేకులు అద్దుకొని నానా తిప్పలు పడటం దేనాకమ్మా? వేంకటపతి కౌగిలంటే మాటలా? అందులోనూ ఆయన తమకంతోపుంటే ఆయాసంతో నీకువూపిరి తీసుకోవటం ఎలా సాధ్యం? అందుకని తిరువేంకటాధీసుని గూడి అర్ధాంగివై వర్ధిల్లు తల్లీ!

**2-5**

## మున్నుడి

శ్రీ రామచంద్రమూర్తి స్వయంగా శ్రీమన్నారాయణుడు. వైకుంఠం నుండి దిగివచ్చి తన పరివారంతో సహామానవుడిగా 'పుట్టి', రావణాది దానవులను మట్టు బెట్టి, ధర్మాన్ని నిలబెట్టి, శరణార్థులను వెన్నుదట్టి, ఆశ్రితులకు ఆటపట్టయినాడు. ఆయనను కీర్తించాలంటే అన్నమయ్య కీర్తనను మించిన సులువైన దారేలేదు. ఈ కీర్తన శ్రీ రాముడు తన జీవనకాలంలో ఎవరెవర్ని ఏవిధంగా కరుణించింది అలవోకగా వర్ణిస్తున్నారు. ఆయన ఆత్మబంధువై, ఎవరెవరికి ఏమె కరుణించాడో వినండి...

**ఆవె ॥ రామచంద్రుడొకడె రమణీయ గుణరాశి**
**పలువురికిని 'ఆత్మబంధు' వాయె**
**అన్నమయ్య వివరమందించె వినుడహో!!**
**దాశరథిగ వేంకటేశు దలచె.**

**రాగం : ద్విజావంతి**

రామచంద్రుడితడు రఘువీరుడు
కామితఫలములియ్య గలిగె నిందరికి ॥రామచంద్రు॥

గౌతము భార్యపాలిట కామధేనువితడు
ఘాతల కౌశికు పాలిటి కల్పవృక్షము
సీతాదేవి పాలిట చింతామణి యితడు
ఈతడు దాసులపాలి ఇహపరదైవము ॥రామచంద్రు॥

పరగ సుగ్రీవుపాలి పరమ బంధుడితడు
సరి హనుమంతుపాలి సామ్రాజ్యము
నిరతి విభీషణుని పాలి నిధానము యీతడు
గరిమ జనకు పాలి ఘనపారిజాతము ॥రామచంద్రు॥

తలప శబరిపాలి తత్తపు రహస్యము
అలరి గుహుని పాలి ఆదిమూలము
కలదన్న వారిపాలి కన్నులెదుటి మూరితి
వెలయ శ్రీ వేంకటాద్రి విభుడీతడు ॥రామచంద్రు॥





**భావామృతం :**

ఈ శ్రీ రామచంద్రమూర్తి రఘుకులమున పుట్టిన వీరాగ్రణి. ఈ మహానుభావుడు ఇంతమందికి వారు వారు కోరిన కోర్కెలను దీర్చినాడు. ఆ వివరములు వినండి.

(దేవదానవులు పాలసముద్రమును చిలికిన సమయంలో ఉద్భవించిన శ్రీ మహాలక్ష్మిని శ్రీ హరి చేబట్టగా మిగిలినవి చాలా వరకు ఇంద్రుని పరం చేశాడు శ్రీ మన్నారాయణుడు. అవి ఆ ఇంద్రునికి మేలే చేశాయో లేక అసూయాగ్రస్థులైన దానవులచే కష్టాల్నే తెప్పించాయో చెప్పలేము గాని ఈ శ్రీ రామచంద్రుడు ఆ దివ్యమైన ఐశ్వర్యాలకన్నా అధికమైన మేళ్ళను చేశాడు.)

ఈ శ్రీ రామచంద్రుడు గౌతముని భార్యఅయిన అహల్యను శాపవిముక్తురాలను చేసి ఆమె పాలిటి కామధేనువైనాడు. ఘాతలు (బాణములు లేక అస్త్రములు) స్వీకరించి విశ్వామిత్రునికి గురువుపదవిని అందించిన కల్పవృక్షము. (ఆయన చెప్పినట్లే చేసి ఆఖరికి తన భక్తుడైన యయాతిని కూడ వధిస్తానన్నాడు). సీతాదేవి పాలిటి 'చింతామణి' అనే ఐశ్వర్యప్రదాయకమైన దివ్యమణి వంటివాడు. రామదాసులందరికి ఈయన ఇహలోకంలో కోరికలను పరలోకంలో మోక్షమును ప్రసాదించిన దైవమూర్తి.

సుగ్రీవుడు పోగొట్టుకొన్నవన్నీ తిరిగి లభింపచేసిన పరమ బంధువు. హనుమంతుడికి ఈయన సామ్రాజ్యము వంటివాడు. విభీషణునికి ఆసక్తితో దాచిబెట్టిన 'పాతర' వంటి ధనము ఈ శ్రీరాముడే. మామగారైన జనకమహారాజునకు ఘనమైన మహిమ (ఎన్నటికీవాడిపోదు) గల పారిజతవృక్షము. (జానకి చేబట్టి శాశ్వతంగా జనకుని పేరు చిరస్థాయిగా వుంచాడు)

శబరి ఎంగిలిపండ్లుతని పరమాత్మకు జాతి భేదముండదన్న తత్త్వరహస్యాని చాటిచెప్పినవాడు. నావ నడిపించుకొని, అందరి బ్రతుకుల్ని ఒడ్డున చేర్చేవాడినే (ఆదిమూలమునే) ఒడ్డున చేర్చిన ఖ్యాతినిచ్చాడు. కలదు కలండనెడి వారికి (కలడోలేడో అనే సందేహం కలిగినా) కలనని నిరూపించిన వాడు. శ్రీ వేంకటాద్రి మీద విభుడు వేంకన్న రూపంలో వున్న శ్రీ రామచంద్రమూర్తి.

## 2-6

## మున్నుడి

ఓ వేంకటేశ్వరా! కర్మఫలం తప్పించడం ఎవరికి సాధ్యం అవుతుంది? అది నీ అంత భగవంతుడినే లెక్కచేయుటలేదే? ఎవడో అనామకుడు నీకు కూడా సంసారబంధం అంటగట్టి నీవు ఆవిడ మాట మీరలేవన్నాడు. ఇంకొకడు పనిలేని పెద్దమనిషి తను భవసాగరంలో పడుకోబట్టి నీమీద ఏవేవో కతలు చెప్పాడు. ఇంకొకడు జీవనోపాధికి తను కొండలకోనల్లో తిరిగి అలసిపోయాడు. వాణ్ణి అలాచేశావు కాబట్టి నీకు కొండలరాయుడవై మమ్మల్ని అనుక్షణం కాపాడక తప్పటంలేదు. అన్నమాచార్యా! ఎంత చమత్కారం!!!

**ఉ॥ ధర్మము తప్పిజీవులిల తాపముతో భవసాగరంబునన్**
**కర్మలజేయునైజమున, కాంతలవాంఛల, కొండలకోనలన్**
**పేర్మిశ్రమంబులంది సిరిపెంచగ జేస్తివి వేంకటేశ్వరా!**
**కర్మఫలంబు తప్పునిది కట్టెను నిన్నును అన్నమయ్యనెన్.**

**రాగం : ధన్యాసి**

సామాన్యమా పూర్వ-సంగ్రహంబగు ఫలము
నేమమున బెనగొనియె-నేడునీవనక ॥సామాన్యమా॥

జగతి బ్రాణులకెల్ల-సంసారబంధంబు
తగుల బంధించు దురి-తంపుగర్మమున
మగుడ మారు కుమారు-మగువ నీయురముపై
తెగి కట్టిరెవ్వరో-దేవుండవనక ॥సామాన్యమా॥

పనిలేక జీవులను-భవసాగరంబులో
మునుగ లేవగజేయు-మోహదోషమున
పనిపూని జలధిలో-బండబెట్టిరి నిన్ను
వెనకెవ్వరో మొదలి-వేలుపనక ॥సామాన్యమా॥





ఉండనీయక జీవ-నోపాయమున మమ్ము
కొండలను గొబల తతి-గొని త్రిప్పుఫలము
కొండలను నెలకొన్న-కోనేటి పతివనగ
నుండవలెసెను నీకు-నోపలేననక ॥సామాన్యమా॥

**భావామృతం :**

స్వామీ! తొల్లింటి కర్మఫలం అంటే సామాన్యమైనదా? దాన్ని తప్పించుకోవటం సాధ్యమయ్యే పనియేనా? అది ఎంతో నియమంతా సర్వేశ్వరుడవైన నిన్ను కూడలెక్కసేయక బాధించుచున్నది.

లోకంలో వుండే జీవరాసులన్నిటికీ సంసారబంధం అనేదాన్ని పెట్టావు. దానిఫలితంగా వెరెవ్వరో నీకు కూడ సంసార కారణమైన ఒక భార్యను నీగుండెల మీదపెట్టి ఆమె మన్మధునికేతల్లియైనదని నీ హృదయ సామ్రాజ్యపట్టమహిషి అని ప్రచారం చేశారు. చూశావా? మమ్మల్ని బాధించిన దానిఫలితం.

నీకు అక్కర కొచ్చేయేపనీలేదేమో కాని, మమ్మల్ని భవసాగరంలో పడి తేలుతూ, మునుగుతూ ఉక్కిరి బిక్కిరి అయ్యేలా చేసె కార్యక్రమం ఒకటి పెట్టుకొన్నావు. ఆ మోహంతో కలిగి దోషం వలన మేము ఎన్నో అవస్థలుపడుతున్నాం. ఆ కర్మ ఫలితంగా నిన్ను వేరే ఇంకెవ్వరో పనివేళా పాలసముద్రంలో పడుకోబెట్టారు. నువ్వు ఆదిదేవుడవు అనే గౌరవం కూడలేకుండా చేశారు (అన్నపానాదులు స్నానం, సంధ్యావందనం ఏమీ లేకుండా చేశారు).

మమ్మల్ని ఒకచోట స్థిమితంగా కూర్చొన నీయక జీవనోపాధి కోసం కొండల వెంట, కోనల వెంట తిరుగుతూ, గుహలలో పడుకొంటూ, నానా ఇక్కట్లుపడేలా చేశావు. దాని ఫలితం నిన్ను వదిలి పెడుతుందా ప్రభూ! అది నీవెంటబడింది. నీవేమో కొండల కోనేటి రాయుడవై కొండలలోనే నెలకొని (తిరుమలనాథుడవై) ఉండవలసివచ్చింది.

**2-7**

## మున్నుడి

"ఓం నమో నారాయణాయ" అనే పరమపావనమైన అష్టాక్షరీమంత్రము నుపదేశించి, శంఖచక్రాదులను భుజకీర్తులుగా ముద్రించి తిరునామంనుదుటిపై ధరింపచేసి వైష్ణవ మతాచారప్రకారం పరమగురువులు భక్తి కలిగిన వారికి ఆ మతదీక్షనిచ్చేవారు. ఘనముని అనే 'గురువు'చే పంచసంస్కారయుతుడై విశిష్టాద్వైత మతదీక్ష స్వీకరించి, ఆ పైన 'అన్నమయ్య' అన్నమాచార్యులైనారు. ఆయన శ్రీ వేంకటేశ్వరుడే సర్వస్వం అని అంకితమైపోయాడు. ఈ కీర్తనలో రామానుజుల వారిని నన్నుతించి తిరుమలకొండనెక్కేవాకిటిలో నిలిచి మమ్మల్ని ఆశీర్వదిస్తున్నారంటున్నారు.

**ఆ.వె॥వైష్ణవంబు బూని భక్తి 'రామానుజ**
**గురుల' నన్నమయ్య కొలిచినారు**
**వారిపేరనున్న అరుదైన కీర్తన**
**వేంకటపతి కూడ మెచ్చు దీని.**

**రాగం : మోహన**

గతులన్ని ఖిలమైన కలియుగమందును
గతి ఈతడే చూపె ఘనగురుదైవము ॥గతులన్ని॥

ఈతని కంరణనేకా ఇలవైష్ణవుల మైతి
మీతని వల్లనే కంటి మీ తిరుమణి
ఈతడే ఉపదేశమిచ్చెను అష్టాక్షరి మంత్రము
ఈతడే రామానుజు లిహపరదైవము ॥గతులన్ని॥

వెలయించెనీతడేకా వేదపురహస్యములు
చలిమి నీతడే చూపె శరణాగతి
నిలిపినాడీతడేకా ఎనిజముద్రాధారణము
మలసిరామానుజులు మాటలాడే ॥గతులన్ని॥





నియమములు ఈతడేకా నిలిపె ప్రపన్నులకు
దయతో మోక్షము చూపెతగనీతడు
నయమై శ్రీ వేంకటేశు నగమెక్కే వాకిటను
దయచూచి మమ్మునిట్టే తల్లిదండ్రి దైవము ॥గతులన్ని॥

**భావామృతం :**

ఈ కలియుగంలో కలి ప్రభావముచే అరిషడ్వర్గముల పాలై దిక్కులన్నీ అంతరించిపోయి గతి ఏదిరా భగవంతుడా అని ఆవేదన చెందుతుంటే నాకు ఈ మహానుభావుడైన శ్రీ ఘనముని గురుదేవుల వారు గొప్పగురుదేవులై దారిచూపించారు.

ఈయన దయవలననే మేము వైష్ణవులమై విష్ణువునాశ్రయించాము. ఈ తిరుమలమణిని ఈయన కృప వలననే చూచితిమి. అష్టాక్షరి మంత్రమని ప్రఖ్యాతిజెందిన 'ఓం నమో నారాయణాయ' అను మంత్రమును ఈ గురువే ఉపదేశించారు. ఇహ పరములు రెంటికీ దైవమైన ఈ ఆచార్యులే శ్రీరామనుజాచార్యుల వారు.

ఈ గురుదేవులే మాకు వేదములలోని తత్త్వరహస్యములనన్నింటినీ తెలియజేసిరి. కరుణాంతరంగులై మాకు ఆదిదేవుని శరణాగతి పొందుట నేర్పారు. వైష్ణవమత సంప్రదాయబద్ధముగా శంఖచక్రాది ముద్రలను ధరింపజేశారు. ఆపై మాతో శ్రీరామానుజులు జ్ఞానబోధచేసి మాటలాడిరి.

ఈ గురుపుంగవులే శరణాగతి యొక్కనియమములన్నీ మాకు నేర్పారు. ఈ మహానుభావుడే కరుణతో మాకు మోక్షమార్గం చూపారు. అందరినీ, నన్నూ కరుణించినట్లే అనుగ్రహించుటకే శ్రీవేంకటేశ్వరుని కొండను ఎక్కునప్పుడు వాకిటలోనే నిలిచి మమ్మల్లి ఈవిధముగా దీవించు తల్లీ, తండ్రీ, దైవమూ కూడా ఈ గురుపుంగవులే అయ్యారు.

## 2-8

### మున్నుడి

'పంచాననము' అంటే బాగుగా తెఱచియుంచిన నోరుగలది అని అర్థం. సింహమును ఆ పేరుతో పిలుస్తారు. నరసింహస్వామి, నరుని దేహము సింహపుతల గలవాడు. అందుకే నరసింహం అంటున్నాం. ఆ గంభీర పంచాననమును అన్నమాచార్యులవారు గీర్వాణ భాషలో కీర్తిస్తున్నారు. అది ఎటువంటి పంచాననమో తెలియాలంటే ఈ చక్కటి కీర్తన వినాల్సిందే. నా పరిమితిలో దీని భావామృత వివరణకు ప్రయత్నించాను. పెద్దలకు చిన్నచిన్నలోటు పాట్లు కనిపిస్తే ఇది ప్రహ్లాదవరదుని స్తుతి కావున కీర్తనకే ప్రాధాన్య మిస్తారని ఆశిస్తాను....

**మ॥ గరుడాద్రీశ్వరుడైన 'సింగ' మిదివో గంభీరరూపంబుతో**
**పరమంబైన అహోబలంపు గిరిపై బాగైన సింగంబహో!!**
**వరదుండౌ మనవేంకటేశ్వరుడెబో! ప్రహ్లాదు సంప్రీతి బ్రో**
**చెర ఆసింగము నన్నమయ్యకొలిచెన్‌సేవించి భావించుచున్.**

**రాగం : నాట**

పరిపూర్ణగరుడాద్రి పంచాననం
పరమం సేవే పంచాననం ॥పరిపూర్ణ॥

క్రూరదంష్ట్రాగ్నికణ ఘోర పంచాననం
పారీణ చక్రధర పంచాననం
వీరపంచాననం విజయపంచాననం
భార భూభారహర పంచాననం ॥పరిపూర్ణ॥

దివిజపంచాననం తీవ్రనఖకాననం
భకవనాశినీ తీర పంచాననం
కువలయాకాశ సంఘోష పంచాననం
పవిశబ్ద దంతరవ పంచాననం ॥పరిపూర్ణ॥





శ్రీ వేంకటాఖ్య ఘనశిఖరి పంచాననం
పావనం పంచముఖ పంచాననం
సేవిత ప్రహ్లాద సిద్ధి పంచాననం
భావితం శ్రీయుక్త పంచాననం ॥పరిపూర్ణ॥

**భావామృతం :**

చక్కగా సర్వకళలతో నిండి పరిపూర్ణమైన గరుడాచలం మీద వెలసిన పంచాననము (సింహము) ఈ అహోబల నృసింహుడు. ఉత్కృష్టులైన భక్తులు సేవించు సింహము ఇదియే.

భయంకరమైన కోరపళ్ళుగల పంచాననము ఇదిగో చూడండి. అన్నింటిలోనూ ఉత్తీర్ణుడైన పంచాననము ఇదే సుమా! అటువంటి పంచాననము నేడు చక్రహస్తుడై వెలసిననాడు. ఇది వీరత్వముగల సింహము. విజయమును పొందిన సింహము. చాల ఘనమైన భూభారమును కలిగించుచున్న దుష్టులను రూపుమాపుటకు అవతరించిన పంచాననము ఇదే.

ఆ పన్నులైన దేవతల కోసం వెలసిప దివ్యమైన సింహము ఇదే. భవనాశినీ నదీతీరమున మెలసిన పంచాననం ఇదియే. పాపులను చూచి భయంకరముగా గర్జించు పంచాననము ఇదియే సుమా! పిడుగుపాట ధ్వనిని కటిగించునట్లు పళ్ళునూరుతున్న సింహము ఇదియే.

శ్రీ వేంకటగిరి అని ప్రసిద్ధిజెందిన శిఖరముపైనున్న వేంకటశ్వరుడని పిలువబడే పంచాననము ఇదిగో ఇదే అహోబలంలో ఉన్నది. పంచముఖములు కలిగి పావనమైన సింహము ఇదే. బాలప్రహ్లాదుడు భక్తితో ప్రార్థించగా సిద్ధించిన సింహము ఇదే కదా! భావించబడి లక్ష్మీదేవితో పాటుగా వెలసిన పంచాననము అహోబల పంచాననము.

**2-9**

## మున్నుడి

హనుమంతుడు మనందరి ఆరాధ్యదైవం. సీతాశోక వినాశకుడు. అన్నమాచార్యులవారు పవనాత్మజునిపై ఎన్నియో అద్భుతమైన కీర్తనలు పాడారు. ఈ కీర్తనప్రత్యేకతేమంటే ఏడుకొండలవాడికి నేరుగా నీబంటు ఎంత గొప్పవాడయ్యా!! ఎన్ని అద్భుతాలు చేశాడు!! బాబోయ్ నడిరేయిని పట్టపగలు చేశాడు కదయ్యా!! అనిమెచ్చుకొంటున్నారు. అందుకే బ్రహ్మ అయ్యే 'పట్టా' సంపాదించుకొన్నాడని కీర్తిస్తున్నారు. "వెట్టగా రావణు" అనే మాట "వెట్టగు రావణు" అయివుంటుందని నా భావన.

**చం॥ అనుపమ మైన కీర్తనల ఆదిమ కావ్యములోని గాథలన్**
**మననము సేయు భాగ్యమును మాకిటు గూర్చెను అన్నమయ్య ఓ**
**వనజభవాదివంద్య! హనుమంతుడు దానవ గర్వఖర్వియై**
**ఘనతనుబొందె బంటయిన కారణమే కద! వేంకటేశ్వరా!**

**రాగం : గౌళ**

నేల మిన్నునొక్కటైన నీబంటు వొక్క-
వేలనే అక్షుని తెగవేసెగా నీబంటు ॥నేలమిన్ను॥

ఉంగరమెగరవేసి యుదధిలో బడకుండ
నింగికి చేయి చాచె నీ బంటు
చంగున జలధిదాటి జంబుమాలి నిలమీద
కుంగ దొక్కి పదముల కుమ్మెగా నీబంటు ॥నేలమిన్ను॥

వెట్టగా రావణు రొమ్ము విరుగ చేతనే గుద్దె
వెట్టతాడువంటి వాడు నీ బంటు
దిట్టమై మందులకొండ తేజమున నడురేయి
పట్టపగలుగ తెచ్చె బాపురే నీ బంటు ॥నేలమిన్ను॥





అలర నన్నియు జేసి అజుని పట్టానకు
నిలుచున్నా డదివో నీ బంటు
బలువేంకటేశ ఈ పవననందనుడు
కలిగి లోకములెల్ల కాచెగా నీ బంటు ॥నేలమిన్ను॥

**భావామృతం :**

(ఓ వేంకటేశ్వరా! నీ బంటు అయిన ఈ హనుమంతుడు ఎంత ఘనుడో చెబుతాను వినుము.)

ఈయన ఆకాశమునకు తన తల తాకునంత ఎత్తు ఎదిగి ఒక్క వేలుతో రావణుని చిన్న కొడుకైన అక్షకుమారుని ఒకపోటు పొడిచి చంపేశాడు. ఆయుధము కూడా అక్కరలేదు (ఆహా! ఎంత బలశాలి!!)

సురస అనే రాక్షసి నోటిలోకి దూరి చటుక్కున బయటకు వచ్చే సమయంలో శ్రీ రామముద్రిక అయిన ఉంగరాన్ని ఆకాశంలోకి ఎగురవేసి తను పని పూర్తియ్యాక మళ్ళీ చెయ్యిజాచి ఆ ఉంగరాన్ని పడకుండా తిరిగి పట్టుకున్న సమయస్ఫూర్తి గల వాడు నీ బంటు. ఒక్క గెంతులో సముద్రాన్నిదాటి లంకలో జంబుమాలి అనే రాక్షసుణ్ణి కుళ్ళతొక్కి పాదముతో కుమ్మి చంపేసిన దిట్ట నీ బంటు.

శత్రువు అయినందు వల్ల రావాణాసురునకు తన శక్తి చూపించడానికి చేతితో పిడికిలి బిగించి ఒక్క గుద్దు ఇచ్చాడు, స్వామి, రావణుడు రొమ్ము విరిగి స్పృ కోల్పోయాడు.(వాడు రాముడి చేతితో చావాలి గనుక అప్పటికి బ్రతికాడు.) ఇంకా ఎవ్వరికైనా యమపాశకం వంటివాడే నీబంటు. ఘనుడై, మందుల కొండయైన సంజీవని పర్వతాన్ని అర్ధరాత్రివేళ తేజస్సు చిమ్ముతూ పట్టపగలు అయినట్లు తీసుకువచ్చిన మహానుభావుడు నీబంటు,బాబోయ్

అన్ని అద్భుత కార్యములను నెరవేర్చి శ్రీ రామానుగ్రహం వలన పంచముఖబ్రహ్మ అవుతావనే దీవెనతో 'బ్రహ్మపట్టా' పొందిన ధీశాలి నీ బంటు. ఇదిగో చూడవయ్యా నీ బంటును. ఘనుడవైన తిరుమల నాయకా! వాయుదేవుని సుపుత్రుడైన నీ బంటు ఇట్లు కూడి లోకములనన్నింటినీ రక్షించుచున్నాడు.

**2-10**

## మున్నుడి

'రవిగాననిచో కవిగాంచునే కదా! అని చమత్కరించారు. శ్రీ కృష్ణదేవరాయులవారు. సూర్యుడు చూడలేనివికూడా 'కవి' చూడగలడు. ఎందుకండే అతను 'భావిస్తాడు'. అదే భావయామి వేంకటేశం అంటే. అన్నమాచార్యులవారు స్వామి నీలవర్ణుడే కాదు తెలుపు, నలుపు, పసుపు, బంగారు ఛాయ ఇంకా మాట్లాడితే అనేక రంగులు ఆయన శరీరకాంతిలో వున్నాయి అంటున్నారు. ఈ కీర్తన అర్థం చేసికొంటే మన పెదవులపై చిరునవ్వు వెలుగు చూస్తుంది. ఎందుకంటే ఆస్వామికి రూపమే లేదు కానీ అన్ని రూపములు ఆయనవే; ఏ రంగూలేదు, అన్ని రంగూలూ ఆయనవే....కదా!

**ఆ.వె॥ఏది స్వామిరంగు? ఎటుల తెలియనోపు?**
**గడుసు అన్నమయ్య 'కతలు' వినరె!!**
**పెక్కు వర్ణములనె వేంకటేశ్వరునకు**
**'రవి'కి కానరాదు, 'కవి' కి తోచు.**

**రాగం : ఆరభి**

ఏమని వర్ణించునొకో ఇంక పురాణములెల్ల
వేమారు కొత్తలాయె విశ్వలోకపతికి ॥ఏమని॥

పాలజలనిధిలోన పలుమారు దేలగాను
నీలవర్ణమెల్ల బోయి నిండు దెలుపైనట్టు
మేలిమి కప్పురకాపు మేను నిండ నించగాను
పోలిక వేరొక్కటాయె పురుషోత్తమునకు ॥ఏమని॥

వేడుక కాళిందిలోన వేమారు నీదగాను
ఆడనే కమ్మర నలుపైట్టు
తోడనే తట్టుపుణుగు తొప్పదోగనించగాను
జాడ వేరొక్కటాయె సర్వేశ్వరునికి ॥ఏమని॥





అలమేలు మంగ నురమందునే నిలుపగాను
అలరి బంగారు వర్ణమైనట్టు
నలుగడ సొమ్ములతో నానావర్ణములు
నిలిచె శ్రీ వేంకటనిలయ మూరితికి ॥ఏమని॥

**భావామృతం :**

పాపం! పురాణాలు ఈ స్వామి వారి రంగు ఇది, అని ఇదమిద్ధంగా చెప్పలేకపోతున్నాయి. ఈ జగత్పతికి ఎన్నియోమారులు కొత్తకొత్త రంగులు వస్తున్నాయి, మరి....

ఈయన అసలు నీలమేఘశ్యాముడు కాబట్టి నీలవర్ణదన్నాయి. కానీ తెల్లని పాలసముద్రంలో ఎన్నోసార్లు తేలియాడినందు వల్ల ఆ నీలవర్ణం కాస్త పోయి స్వచ్ఛమైన తెల్లని రంగువచ్చేసింది. అనేకమార్లు కర్పూరం కాపు వేసినందు వల్ల మంచి కర్పూరం రంగు వచ్చేసింది. ఇక ఈ పురుషోత్తముని పోలిక వేరొకటిగా మారిపోయినది.

యమునా నదిలో (కాళీయుణ్ణి వెళ్ళగొట్టి) అనేక మారుటు ఈదులాడాడు. ఇక చూడండి. ఆ కాళిందీ నది నల్లని రంగు ఈయనకు అంటి కమ్మరి వాడు (కొలిమిలో ఇనుమును కాల్చి పనిముట్లు చేసేవాడు) లాగా ఒళ్ళంతా నలుపైపోయింది. ఈ స్వామి ఒంటినిండా 'తట్టుపుణుగు' (ఒక సుగంధ ద్రవ్యం) తట్టి తట్టి మరీ అద్దినందువల్ల దాని రంగు ఆయనకి వచ్చేసింది. ఇక ఈ సర్వేశ్వరుడిది ఏ రంగు అని చెప్పగలము?

అమ్మణ్ణి అలమేలుమంగను నిత్యమూ హృదయంపై ఉంచుకొన్నాడు కదా! ఆవిడ రంగు ఈయనకి అంటి, స్వర్ణకాంతితో మెరిసిపోతున్నాడు. సరే! ఇవన్నీ ఇట్లావుంటే అనేక రత్నాభరణాలను ధరించుట చేత అంతులేని రంగులతో దేదీప్యమానంగా వెలిగిపోతున్నాడు. ఈ శ్రీ వేంకటాచలపతి కాంతులని కనులారా గాంచి తరించండి.

## 2-11

### మున్నుడి

భగవంతునికి ఒక రూపంవుండదు. అన్ని రూపములు ఆయనవే. ఒకమతం లేదు. అన్ని మతములూ ఆయన ఆరాధకులు స్థాపించినవే. పుట్టుకే లేని వాడికి చావు ఎలా వుంటుంది. అంతెందుకు భగవంతుడు అని పురుష శబ్దం వాడాము. అసలు భగవంతునికి లింగభేదమేమిటి? మనిషి తన మనుగడకి ఒక నిబద్ధత వుండటం కోసం తనకు తనే ఏర్పాటు చేసికొన్న ఒక కట్టడి రూపమే భగవంతుడు. సనాతన ధర్మంలో 'సహస్ర శీరుషః పురుషః' అని కీర్తించారు పెద్దలు. విశ్వరూపంలో ఒకదాని తర్వాత ఒకటున్నట్లు తలలున్న ఆకారాన్ని చూపిస్తారు. అది నిజమా!! కాదు చిత్రకారుని ఊహ. ఊహ అనుభవమైతేనే భావించగలం కాని అనుభవం కాకపోతే అవి 'అద్దెకు తెచ్చుకొన్న ఆలోచనలే'. రామకృష్ణ పరమహంస ఆ భగవంతుని 'కాళీమాత'గా భావించారు. బుద్ధుడు దివ్యజ్యోతిలాగ దర్శించాడు. 'తానీషా' ఒక రాజకుమారుడిలా దర్శించాడు. అన్నమయ్య ఆ భగవంతుని పెద్దపెద్ద నామాలున్న వేంకటేశ్వరునిగా దర్శించాడు. ఆదిశంకరులు ఎన్నో రూపాలలో దర్శించారు.

నేటి 21వ శతాబ్దంలో కూడ భక్తులు చాలమంది, చాలచోట్ల, చాలా విధములుగా దర్శించగలుగుతున్నారు. ఎవరు ఏవిధంగా భావిస్తే వారికి అలా కనులకు తోచినట్లు 'అనిపిస్తాడు'. 'సాయిబాబా' గా ఆ సర్వేశ్వరుని భావించే నాబోటి వారిని లెక్కించుట అసాధ్యం. తిరుమలలో జరిగిన ఒక దివ్య అనుభవంలో.. 'నకనక' ఆకలితో వున్న మాకు 'చక్కర పొంగలి' తినిపించాడు ఆ స్వామి. దురదృష్టమేమంటే రాత్రి 11.30 కి ఆయన రూములు (గదులు) ఇప్పించే దళారీగానే భావించిన నేను ఆయనను తిరిగి ఎన్నడూ చూడలేదు. తర్వాత తీసుకుంటా లెండి అని నా దగ్గర ఒక్క రూపాయి తీసుకోలేదు. కాబట్టి భగవంతుడే నిజం. మానవుడే ఒక అబద్ధం. భగవంతుడు నీవెలా భావిస్తే అలాగే వుంటాడు.

**ఉ॥ వృద్ధులు, పండితోత్తములు, వేదమునేర్చిన వేత్తలందరున్**
**శ్రద్ధగకొల్తురా'విభుని' సాధన మార్గములందు భేదమే**
**బుద్ధినిమించువారతనిబుచ్చిరిసర్వము'వాడె'యంచుఆ**
**బుద్ధుడె వేంకటేశ్వరుడు బోధన జేసెను అన్నమార్యుడున్.**





**రాగం : సామంతం**

బ్రువంతి బౌద్ధా బుద్ధ ఇతి
స్రువంతి భక్తా స్సులభ ఇతి ॥బ్రువంతి॥

గదంతి కిల సాంఖ్యాస్త్వాం పురుషం
పదవాక్యజ్ఞాః పదమితి చ,
విదంతి త్వా వేందాతిన
స్సదా బ్రహ్మ లసత్పదమితి చ. ॥బ్రువంతి॥

జపంతి మీ మాంసకాస్త్వాం చ
విపుల కర్మణో విభవ ఇతి,
లపంతి నయస కలాస్సతతం.
కృపాళుకర్తా కేవల మితి చ. ॥బ్రువంతి॥

భణంతి వేంకటపతే మునయో
హ్యణిమాది ప్రదమతుల మితి.
గుణవంతం నిర్గుణం పునరితి
గృణంతి సర్వే కేవలమితి చ. ॥బ్రువంతి॥

**భావామృతం :**

బౌద్ధులందరూ నీవే బుద్ధుడు అని చెబుతున్నారు. భక్తులందరూ నీవే భక్త సులభుడవని భక్తితో పలుకుతున్నారు.

సాంఖ్యులందరూ నీవే పురుషుడవు అని పలుకుతున్నారు కదా! వైయాకరుణులు నీవే 'పదము' (శబ్దము) అంటు నీకోసం వెతుకుతున్నారు. వేదాంతులు నీవే తత్త్వస్వరూపునిగా వెలుగొతున్నావని గ్రహించారు. నిన్నే బ్రహ్మ అన్నారు.

మీ మాంసకులు కర్మలన్నిటికి నీవే 'కర్త' అని ఎరిగియున్నారు. నైయాయికులు నిన్ను కేవలం దయయే స్వరూపంగా గల సర్వకర్తగా నిన్నెల్లపుడు పరిగ్రహించారు.

శ్రీ వేంకటేశ్వరుని ఆరాధించే మునులందరూ అణిమాది అష్టసిద్ధులకు నీవే ఆదికారకుడవని చెబుతున్నారు. గుణముల నెరింగిన బుద్ధిమందులు నీవే నిర్గుణతత్త్వమని తలచుచున్నారు. ఇదిట్లా వుంటే తక్కినవారంతా నీవే కేవలము (సర్వము) అని కేవల స్వరూపునిగా చెబుతున్నారు.

## 2-12

## మున్నుడి

అన్నమాచార్యులవారి హరినామ సంకీర్తన ఒక తేనుజల్లు అనటానికి ఈ కీర్తన ఒక చక్కటి ఉదాహరణ. ఒక చక్కటి ఉదాహరణ. ఒకటి రెండు మాటు తప్పించి అన్ని పదములు అరటిపండు ఒలిచి తినిపించినంత సులభంగా వుంటుంది. నామ సంకీర్తనతో విశిష్టతే అది. శరణాగతి కంటే శ్రీ హరిని కొలిచే మేటి దారి కలదా? ముమ్మాటికీ లేదు.

**సీ॥ పాదంబిదే కదా! వసుధగొల్చినయది**
**గొనకొని జగములన్ కొలిచినదియు**
**పాదంబిదే కదా! పట్టె రమాదేవి**
**సురలోకమంతయు కోరునదియు**
**పాదంబిదే కదా! వని కరీంద్రముగాచె**
**ఇహపరంబులనిచ్చి అహము జంపు**

తే॥ సీసపద్యంబు కీర్తన జేసినాను
స్ఫూర్తి తాళ్లపాక గురుల సొగసు కవిత
అన్నమయ్యకు సరిజోడు నరయగలమె!
వేంకటేశుని నుతియించు విభవమిదియె

### రాగం : రాగమాలిక

ఈ పాదమే కదా యిల యెల్ల గొలిచినది
ఈ పాదమే కదా ఇందిరా హస్తముల కితవైనది ॥ఈపాదమే॥

ఈ పాదమే కదా ఇందురును మ్రొక్కెడిది
ఈ పాదమే కదా యీ గగనగంగ పుట్టినది
ఈ పాదమే కదా యెలమి పెంపొందినది
ఈ పాదమే కదా యిన్నిటికి యెక్కుడైనది ॥ఈపాదమే॥





ఈ పాదమే కదా యిభరాజు దలచినది
ఈ పాదమే కదా యింద్రాదు లెల్ల వెదగినది
ఈ పాదమే కదా యీ బ్రహ్మ కడిగినది
ఈ పాదమే కదా యెగసి బ్రహ్మాండమంటినది ॥ఈపాదమే॥

ఈ పాదమే కదా యిహపరము లొసగెడిది
ఈ పాదమే కదా ఇల నహల్యకు కోరికైనది
ఈ పాదమే కదా యీక్షింప దుర్లభము
ఈ పాదమే కదా యీ వేంకటాద్రిపై నిరవైనది ॥ఈపాదమే॥

### భావామృతం :

ప్రపంచములోని సర్వులు సేవించెడిది ఈ పాద పద్మములనే కదా! శ్రీ మహాలక్ష్మికి చాల ప్రీతికరమైనవి ఈ పాదములే కదా!

ఇంతమంది భక్తులు మ్రొక్కుచున్నది ఈ పాదపంకజములనే కదా! ఆకాశగంగ పుట్టి ఏరులైపారి, నింగిలో దేవతలను భూమిపై మానవాళిని పాతాళమున సగరసుతులను పావన మొనర్చినది, ఈ పాదములనుండియే కదా! జగతిలో ఆనందము విస్తరింపజేయునదీ పాదములే కదా! ఇన్నిటికి శ్రేష్టమైనదియు ఈ పాదయుగళమే కదా!

అడవి కొలనులో గజేంద్రుని ముందరి కాళ్లను ఒడిసి నోటితో పట్టి పీడించుచున్న మొసలినుండి తనను రక్షించమని వేడుకొనినది ఈ పాదములనే కదా! హిరణ్యకశిపుని బాధ భరించలేక ఇంద్రాదిదేవతలు రక్ష కోరుటకు వెతికినది ఈ పాదములనే కదా! త్రివిక్రముడై వామనుడు తన రెండవ పాదముతో ఊర్ధ్వ లోకములనన్నిటినీ అణుమాత్రం సందులేకుండా ఆక్రమిస్తే అబ్బురపడి చతుర్ముఖ బ్రహ్మ భక్తితో సురగంగచే కడిగినది ఈ పాదములనే కదా! అప్పుడు బ్రహ్మాండమంతా నిండినది ఈ పాదమే కదా!

జీవులందరికి ఇహములో సుఖము, పరములో ఆనందమును యొసగునదీ పాదములే కదా! భూలోకంలో అహల్యాదేవిని శాపవిముక్తి కలిగించు ఈప్సిత మీ పాదమే కదా! మాబోటి సామాన్యులు చూడటం అసాధ్యమైనది ఈ పాదములనే కదా! (తిరుమలలో మనబోటి సామాన్యులకు దొరికిన అయిదు, పది సెకండ్ల సమయం స్వామి దివ్యమంగళ విగ్రహం చూడటానికే చాలదు. ఇక పాదాలనేం చూడగలం) ఈ వేంకటాద్రి నివాసమై స్థిరపడినది ఈ పాదమే కదా!

## 2-13

### మున్నుడి

'సమ్మటూరి' లో నెలకొన్న స్వామి చెన్నకేశవుడు. బృందావనంలోని గొల్లెతలను మురిపించి, వలపించి, మరిగించి, వశంచేసుకొని ఒక్కొక్క భామకు ఒక్కొక్క కృష్ణమోహనుడై శృంగార క్రీడలో వారికి చిదానందం ప్రసాదించిన పరమాత్ముడు ఆ 'చీరెల దొంగ'. అన్నమయ్య ఆ చెన్నకేశవ స్వామిపై చెప్పిన అనేక శృంగార కీర్తనలలో ఇదీ ఒకటి. అర్ధమయినట్లే వుండి ఏమీ అర్ధంకాని (వివరించలేని) కీర్తన. నానా తిప్పలు పడి వివరించిన దీని భావామృతం 'రమారమి' గా వివరించబడింది. రమారమణుడైన వేంకటేశ్వరుడే చెన్నుడంటారు ఆచార్యులవారు.

**కం॥ మిన్నగు వేంకటనాధుడె**
**'చెన్ను' డనే ధ్యాసతోటి శృంగారముగా**
**అన్నయ్య చెప్పె కీర్తన**
**లెన్నో యా 'సమ్మటూరి' యేలిక గొలువన్.**

**రాగం : హిందోళ**

ఎంతవాడవయ్య నిన్ను నేమనేము
సంతకూటముల వాడు సంబటూరి చెన్నుడా ॥ఎంతవాడ॥

సోగకన్నులను జూచి సొలపుల మాటలాడి
వాగపు గొల్లెతలను వలపించేవు
జాగులనవ్వులు నవ్వి జాజరపాటలు పాడి
బాగుగానప్పటి గొంత భ్రమయించేవు ॥ఎంతవాడ॥

బింకపు సాములు సేసి బెట్టగా బువ్వులు వేసి
అంకెకు వచ్చిన దాక నాస రేపి
లంకెలను గూచుండి లలితోమర్మములంటి
మంకుదనముల వారి మరిగించేవు ॥ఎంతవాడ॥





చీరల కొంగులు వట్టి సిగ్గులు బయటవేసి
గారవించి కౌగిటను కరగించేవు
యీరీతి శ్రీవేంకటేశ యిందరిని మేలుకొని
మేరమీరి చనవిచ్చి మెప్పించేవు ॥ఎంతవాడ॥

### భావామృతం :

'చెన్న' అంటే అందము అని అర్ధం. చెన్నుడు అంటే అందమైన వాడు. చెన్నకేశవునిగా శ్రీకృష్ణుని అనేకమంది ఆరాధిస్తారు. సమ్మటూరిలో వెలసిన చెన్నుడా (చెన్నకేశవా!) ఎంతవాడివయ్యా! నిన్నేమనేట్లుంది? ఈ సంబటూరి (సమ్మెటూరి) లో నెలకొన్న చెన్నకేశ్వరుడు, గోపికలు సంత కూటమికి వెళితే వెంటబడ్డ అల్లరివాడు.

ఓ మోహన కృష్ణా! సోగకళ్లతో జూచి, ఆడపిల్లలు పరవశించి పోవునట్లు మాటలాడి అభం శుభం తెలియని గోపికన్నియలను వలపింప చేసికొనినావు. వివశులను జేయు చిరునవ్వులు నవ్వి, చిలిపి శృంగార నర్మగర్భమైన పాటలు పాడి, అప్పటికప్పుడు వారందరినీ భ్రమింప జేశావు. ఎంత టక్కరి వాడవు.

తెగువ చూపే ఎన్నో ప్రయత్నాలు చేసి, విరివిగా పువ్వులను జల్లి నీ వశమయ్యే దాకా వాళ్లకి ఏవేవో ఆశలు రేపుతావు. తగులుకొని వారిపక్కనే కూర్చొని మర్మాంగములను ఎంతో ప్రేమతో స్పృశిస్తావు.

మొండి పట్టుదల కలిగిన వాడివి కనుక వారిని అట్లు వివశులను జేసి నీకు బాగా అలవాటుపడునట్లు చేసికొనినావు. ఎంతటి మాయకాడవు!! వాళ్ల చీరలన్నీ యెత్తుకెళ్లావు. వాళ్ల సిగ్గులన్నీ బుగ్గిపాలు జేశావు తరువాత అతిశయించిన అనురాగముతో వారిని నీ ఆలింగనంలో కరిగించినావు. ఓ శ్రీ వేంకటేశ్వరా! ఈ విధముగా ఇంతమందిని అతిశయించిన ఆప్యాయత నొసగి మెప్పించి వారికి మేలు కలిగించావు. ప్రభూ! వారి నట్లా ధన్యులను జేశావు తండ్రీ!

**2-14**

## మున్నుడి

అన్నమాచార్యులవారి వైరాగ్య కీర్తన వింటే మనసు ఆర్ద్రమైపోయి విచారం కారు మేఘంలా కమ్ముకొని వేంకటేశ్వరుని శరణాగతి దిక్కు అనే జ్ఞానం ఉదయించి, తల్లి ఒడి చేరిన పాపాయి ఏడుపు నాపి శాంతించినట్లు నిశ్చింత కలిగి యుంటారు. ఒకజీవి శుక్రకణం నుంచి శరీరాన్ని ఇంకొక జీవికి ఇచ్చి అది పెరిగి తిరిగి మట్టిలో కలిసేదాక గుణములు, బంధములు, సుఖదుఃఖములు కల్పించింది వేరెవ్వరు? ఆ తిరుమలేశుడే కదా! ఆయనిచ్చినవి ఆయన తిరిగి తీసేసుకుంటే మధ్యలో నీ ఏడుపెందుకు? నిజమే కదా..!

**చం॥ పనివడి కేశపాశమును బాగుగ ముండన జేయజూచినన్**
**వెనుకనె మొల్వదా మరల వింతయదేమిటి? అన్నమయ్యనెన్**
**తనువు లశాశ్వతంబులిల తాపము భోగములన్ని మిధ్యలే**
**వినుమిక దిక్కునీవనుచు వేంకటనాధుని గొల్వుడీ అనెన్**

**రాగం : రంజని**

ఏమి చెప్పేదిది ఈశ్వర మాయలు
దీము ప్రతిమకును త్రిజగము కలిగె ॥ఏమని॥

మల మూత్రంబుల మాంసపు ముద్దకు
కులగోత్రంబుల గురి కలిగె
తొలులు తొమ్మిదగు తోలు తిత్తికిని
పిలువగ పేరును పెంపును కలిగె ॥ఏమని॥

నెత్తురు నెమ్ముల నీరు బొగ్గుకును
హత్తిన కర్మములటు కలిగె
కొత్త వెంట్రుకల గుబురుల గంతికి
పొత్తుల సంసార భోగము కలిగె ॥ఏమది॥





నానా ముఖముల నరములు పిడుచకు
పూనిన సిగ్గులు భువి కలిగె
ఆనక శ్రీవేంకటాధిపు దేలగ
దీనికి ప్రాణము తిరముగ కలిగె ॥ఏమని॥

## భావామృతం

(ఈ కీర్తన భావామృతం ఎన్ని పేజీలు వ్రాసినా చాలదు. అన్నమయ్య హృదయాన్నీ ఈ కీర్తన పాడినప్పుడు ఆయనలో యెగసిన భావోద్వేగం ఏవో కొన్ని కాగితాలలో ఇమడ్చలేం. మనకంత శక్తిలేదు. అయినా.. మానవ ప్రయత్నం చేయాలి కదా..)

సర్వేశ్వరుడైన ఆ జగన్నాథుని  మాయలు (లీలలు) ఏమని చెప్పగలను? దీము (యెఱ) యొక్క ఆకారానికి భూనభోంతరములనే మూడు లోకములలో నివసించు అవకాశము కలిగినది. (ఒక జంతువును పట్టుకోటానికి వేటగాడు 'దీము' అని ఇంకొక ఎఱను ఉపయోగిస్తాడు. మనందరం మాయావి అయిన ఈశ్వరుని చేతిలో 'దీము' లమే.)

మలమూత్రాదులచే కప్పబడిన మాంసం ముద్దకు అమ్మ కడుపులోంచి బయటపడగానే కులగోత్రాల మీద నమ్మకం కలిగింది. తొమ్మిది కంతలున్న తోలు తిత్తికి దాన్నేదో పేరు పెట్టి పిలువగానే 'నేను' అనే భావం, తనపై తనకు మమకారం కలిగాయి.

నెత్తురు, చీము, నీరు, బొగ్గు కలిసిన ముద్దకు అతికించినట్లు కర్మలు కర్మఫలములు కలిగాయి. తీసేస్తే మళ్లీ మొలిచే వెంట్రుకల గంత ఈ శరీరం. దీనికి బంధాలు అనుబంధాలు గల సంసారం తగులుకొన్నది. దాంట్లో భోగాలు దుః ఖాలు తగులుకొన్నాయి.

రకరకములైన నరములున్న ఈ మాంసం ముద్దకు ఈలోకంలోకి రాగానే సిగ్గు ఎగ్గులవంటి భావాలు కలిగాయి. ఆ తరువాత శ్రీవేంకటేశ్వరుని అనుగ్రహం కలిగి తిరమైన (స్థిరమైన ఆత్మ) ప్రాణం వచ్చి చేరింది.

## 2-15

## మున్నుడి

భగవంతుడు నిరాకారుడు, నిరంజనుడు, నిర్గుణుడు, జీవుల కర్మఫలప్రదాత. ఇదే సత్యం. మన కర్మలే మనందరి సుఖ దుఃఖాలకు కారణం. భగవంతుడు సాక్షీభూతుడు. మరి ఈ హరికథలన్నీ వ్యర్థమా? కావు భగవన్నామ స్మరణ చేసే మేలే హరి కథాకాలక్షేపం, పురాణ శ్రవణం కూడా చేస్తాయి. ముఖ్యోద్దేశం నామస్మరణే. ఈ విశ్వాన్నే ప్రకాశింపచేసి శాశించి నశింపచేయగల వేంకటేశ్వరుడికి, యోగీశ్వరునికి జ్ఞానేశ్వరునికి అనంత ప్రభావశాలికి ఎంత చక్కటి కీర్తన వినిపిస్తున్నారో చూడండి అన్నమయ్య. స్వామిని కొలిచి తరించటానికి ఆయన విగ్రహం కూడా అనవసరం అంటున్నారు.

**ఉ॥ పుట్టుకలేనివాడు పరిపూర్ణుడు భావవికార శూన్యుడున్**
**దిట్టతనాన దీనులను తేకొని కాచు అనాధ నాథుడున్**
**చుట్టము వేంకటేశ్వరుడె సూక్తిటు చాటెను అన్నమార్యుడున్**
**గట్టిగ వేడుడీ శరణు కానివి యోచనలేల వ్యర్థమౌ.**

**రాగం : హంసనాదం**

విశ్వప్రకాశునకు వెలియేడ లోనేడ
శాశ్వతున కూహింప జన్మ మిక నేడ ॥విశ్వ॥

సర్వపరిపూర్ణునకు సంసార మిక నేడ
నిర్వాణమూర్తికిని నిలయ మిక నేడ
వుర్వీధరునకు కాలూద నొకచోటేడ
పార్వతీసుత్యునకు భావమిక నేడ ॥విశ్వ॥

నానాప్రభావునకు నడుమేడ మొదలేడ
ఆనన సహస్రునకు నవ్వ లివ లేడ
మౌని హృదయస్థునకు మాటేడ పలుకేడ
జ్ఞానస్వరూపునకు కాన విన నేడ ॥విశ్వ॥





పరమయోగీంద్రునకు పరులేడ తానేడ
దురితదూరునకు సంస్తుతి నింద లేడ
తిరువేంకటేశునకు దివ్యవిగ్రహమేడ
హరికి నారాయణున కవుగాము లేడ ॥విశ్వ॥

## భావామృతం

ఈ విశ్వమంతా ఆయనచే ప్రకాశింపబడుచున్నది. అటువంటి స్వామికి లోపలేమిటి? బయటేమిటి? ఈయన శాశ్వతమైనవాడు. ఎప్పుడూ ఉన్నాడు. అటువంటి స్వామికి జన్మ ఉండట మేమిటి?

చరాచర జగత్తంతా ఈయనే అయినప్పుడు సంసారముతో ఈయన కేమిటి? ఈ స్వామి ముక్తిప్రదాత ఈయనకి నివాసమని ఒకటుంటుందా? ఈ భూదేవే ఆయనచే ధరింప బడింది. ఈయన కాలుపెట్టని ప్రదేశమెక్కడ వుంటుంది? భావము చేత ప్రకటితమయ్యే పార్వతీ దేవియే స్తుతించుచుండగా ఈయనని భావించుట యెట్లు?

అనేక ప్రభావములు గల ఈ స్వామికి ఆరంభమేమిటి? అంతరమేమిటి? సర్వతోముఖునకు అటువైపు ఇటువైపు ఏమిటి? ఈ స్వామి వుండేదే మౌనుల హృదయ పద్మాలలో ఈయనకి ఇక మాట పలుకులతో పనేమిటి? జ్ఞాన స్వరూపుడైన ఈయనను కళ్లతో ఎలా చూడగలం? చెవులతో ఎలా వినగలం?

ఈయన పరమయోగీశ్వరుడు. ఈయనకు నా అనుకొనేవారు, పరాయివాళ్లు అనుకొనేవారు వుంటారా? సర్వ పాప నివారకుడైన ఈయన ఎవరినీ స్తుతించి పుణ్యంకాని నిందించి పాపము తెచ్చుకోవటం అంటూ వుండదు కదా! తిరుమలనాథుడు, వేంకటేశ్వరుని భావించగానే కనులముందుంటాడు. ఇక విగ్రహంతో పనేముంది? శ్రీహరి మరియు నారాయణమూర్తి అయిన ఈ స్వామికి అంగీకారం అభ్యంతరం ఏమిటి?

## 2-16

### మున్నుడి

పెండ్లి తంతు పరిశీలించి చూస్తే 'నాగవెల్లి' అని పిలువబడే తంతు, గృహప్రవేశం అనే తంతు ఉంటాయి. పెండ్లి కుమార్తె సిగ్గులు, ఆడమగపెండ్లి వారి పరాచికాలు, విందులు, సంగీత విభావరులు, చెప్పలేని 'పెండ్లి సందడి!' పరమాత్మ మనందరి తండ్రి కాబట్టి మనందరమూ పెళ్లి పెద్దలమే.. అన్నమయ్య అద్భుత కీర్తనలో ఏడుకొండలవాని పెండ్లినాటి నాగవెల్లి కార్యక్రమం ఆలకించండి. ఇంతకీ అది అందరూ అనుకొనేట్లు 'నాగవెల్లి కాదు, 'నాకబలి'. అంటే నాకము (స్వర్గం)లోని చంద్ర, రుద్ర, వసు, ఇత్యాది దేవతలకిచ్చే 'బలి' అనగా 'పూజ'.

**ఆ.వె॥విభుని పెండ్లి తంతు వీనుల విందుగా**
**తాళ్లపాక సుకవి తాను తెలిపె**
**స్వామివారి పెండ్లి జనులకు సందడి**
**'నాకబలికి' పేరు 'నాగవెల్లి'**

**రాగం : భైరవి**

నేడే నాగవెల్లి నేడే ఇల్లు నింపులు
పోడిమి గోవిందపతి భోగించీ నిదివో ॥నేడే నాగవెల్లి॥

అల్లదే దేవుని రథమల్లదే గరుడ ధ్వజ
మెల్ల లోకములు గెల్చి యేగీనదే
ఇల్లిదే లక్ష్మీభూము లిద్దరు దేవుళ్లు
చల్లేరు శాసలు తాము సరికి బేసికిని ॥నేడే నాగవెల్లి॥

సేనాపతి అల్లవాడే చేరి దేవతలు వారె
శ్రీనారాయణుడు చెలగీ నదే
ఆనుక అడుగడుగుకు ఆరగించీ వీధులను
వానలుగా అందరికీ వరము లొసగుచు ॥నేడే నాగవెల్లి॥





దేవదుందుభులు మ్రోసె దిక్కులెల్ల చల్లనాయె
శ్రీవేంకటేశుడితడె చిత్తగించీని
సేవించరో భావించరో జీవులాల బ్రతుకుదు
వేవేలు శోభనముల వేడుకకాడితడు ॥నేడే నాగవెల్లి॥

### భావామృతం

ఈరోజే నాగవెల్లి అనే పెండ్లి తంతు జరుగుచున్నది. గృహప్రవేశమహోత్సవం కూడా నేడే. ఇదిగో అతి మనోహరముగా భోగించుచున్న ఈ వేంకటేశ్వరుడని పిలువబడే గోవిందపతిని తిలకించండి.

అల్లదిగో దేవుని ఊరేగింపు రథమును చూడండి. ఆ ప్రక్కనే గరుడధ్వజము కనులవిందుగా కనిపిస్తోంది. జగద్విజేతయైన ఆ స్వామి ఊరేగింపుగా వస్తున్నాడు. ఇదిగిదిగో ఇటు చూడండి. శ్రీదేవి, భూదేవి అనే ఇద్దరు దేవేరులు పెళ్లికుమార్తెలై స్వామివారిమీద శాసలు (సేసలు) అనగా అక్షతలు చల్లుచున్నారు. తాము ఒకరి తరువాత ఒకరు చల్లుతున్నారు కనుక ఒకరు చల్లేవి సరిసంఖ్యలోను, ఇంకొకరు చల్లేవి బేసి సంఖ్యలోనూ (ఒకదేవి మొదటిసారి చల్లితే ఇంకొక దేవి రెండవసారి చల్లుతున్నది) ఉన్నవి.

అదిగో గంభీరంగా ముందు నడుస్తున్నాడే... ఆయనే స్వామివారి సేనాధిపతి విష్వక్సేనుడు. ఆయన వెనుక దేవతలందరూ ఒక క్రమంలో వస్తున్నారు. ఇదిగో ఈ శ్రీమన్నారాయణుడు విరాజిల్లుతున్నాడు. ఆ తరువాత ప్రతిచోటా ఆగి స్వామివారు ఆ తిరు వీధులలోనే ప్రజలు తరించునట్లు ఆరగింపు చేస్తున్నారు. వర్షపు ధారలాగా (నిజమైన వర్షం కూడా పడుతుంటుంది) ఆ స్వామి ప్రజలకు కోరిన వరములు ఇచ్చేస్తూ వుంటాడు.

దేవ దుందుభులు మ్రోగుతుంటే దిక్కులన్నీ పిక్కటిల్లుతుంటాయి. ఊరేగే ఈ స్వామియే వేంకటేశ్వరుడు. మనస్సులలో నిలుపుకొని ఈయనను సేవించండి. ఓ జీవులారా! భావించండి. (ఇది భావయామి వేంకటేశమ్) ఈ వేడుకల రాయుడికి అనంతమైన మంగళములు పాడండి. అలా సేవించి బ్రతుకుటకంటే ఇంకా ఏం కావాలి?

## 2-17

### మున్నుడి

మనందరిలోను ఆత్మరూపంలో శ్రీ వేంకటేశ్వరుడే ఉన్నాడు. సంసారసాగరంలో మమకారం ఆవరించి జన్మలనే సాగరంలో కొట్టుకొని పోతున్నాం. బురదలో ఇరుక్కుపోయాం. ఒకదానికొకటి తగులుకొని మమకారం వలన మనస్సుకు పాపం అంటిదాంట్లోవున్న పరమాత్మను మఱచునట్లుచేస్తుంది. భ్రష్టులమైపోయాం. ఆత్మరూపంలో వున్న ఆయనను మనంతటమనమే గుర్తించాలి. అందాకా ఈ జన్మలూ తప్పవు ఈ మునకలూ తప్పవు. ఈ కన్నీళ్ళూతప్పవు. అన్నమాచార్యుల వంటి గురువులు మొత్తుకొని చెబుతున్నా మన తలకెక్కటం లేదు....హతవిధీ!!

**కం॥ మమకారంబొక్కటియే**
**సమకూర్పును పాపమెల్ల, జత లంపటమై**
**విముఖుండగుననె అన్నయ**
**తమితో కనలేక నరుడు తన "అత్మేశున్"**

**రాగం : ముఖారి**

కడునడుసు చొరనేల కాళ్ళు కడుగగ నేల
కడలేని జన్మ సాగరమీద నేల ॥కడనడసు॥

దురితంబులకునెల్ల దొడవు మమకారంబు
లరిది మమతలకు తొడవడి యాసలు
గురుతయిన యాసలకు కోరికలు జీవనము
పరగనిన్నిటికి లంపటమె కారణము ॥కడనడసు॥

తుదిలేని లంపటము దుఃఖహేతువు దుఃఖ
ముదుటయిన తాపమున కుండగ జోటు
పదిలమగుతా పంబు ప్రాణసంకటము లీ-
మదము పెంపునకు తన మనసు కారణము ॥కడనడసు॥





వెలయ తన మనసునకు వేంకటేశుడు కర్త
బలిసి యాతని దలచు పనికి తా కర్త
తలకొన్న తలపు లివి దైవమానుషముగా
తలచి యాత్మేశ్వరుని దలపంగ వలదా ॥కడనడసు॥

**భావామృతం :**

అధికముగా బురదవున్న చోట కాళ్ళుపెట్టడం దేనికి? ఆ తరువాత కాళ్ళు కడుగుగొనలేక అవస్థపడటం దేనికి? అదే విధంగా అంతేలేని జన్మల జలధిలో పడి ఈదలేక తిప్పలు పడటం కూడ దండుగ కదా!

పాపము చేయుటకు ముఖ్యమైన అలంకారం (కారణము) మమకారమే. మరి ఆపుకొనలేని మమకారానికి కారణం చలించు ఆశలు. గొప్ప గొప్ప ఆశలకు కోరికలే జీవనము. ఇక వీటన్నిటికి కారణము ఏమిటో తెలుసా? లంపటం (మాలిమితో కూడిన బంధము).

అంతులేని లంపటం దుఃఖ హేతువై తీరుతున్నది. దుఃఖ మేమో అధికమైన తాపమును కలిగిస్తున్నది. ఈ తాపము ప్రాణ సంకటమై అధికమైన మదమును పెంపొందింపచేస్తుంది. ఇవన్నీ జరుగుటకు కారణం వేరెవ్వరో కాదు. మనస్సు మాత్రమే కారణం.

మనస్సు పరిపరి విధముల ప్రవర్తిల్లుటకు కారణం, కర్త ఆ శ్రీవేంకటేశ్వరుడు. కాని ఆ శ్రీవేంకటేశ్వరుని తలచుటకు కర్త అయ్యే ప్రయత్నం మాత్రం ఎవరికి వారే చేసికొనువలెను. అందరి ఆత్మలోవున్న ఆత్మేశ్వరుడైన శ్రీవేంకటేశ్వరుని ధ్యానించి ఆశ్రయిస్తేనే కదా! దైవికంగా ఇవన్నీ జరిగేది లేకపోతే జన్మలలో తిరుగుతూనే వుంటాడీ జీవుడు.

**2-18**

## మున్నుడి

ఆశలన్నీ అణగారిపోయి దిక్కువేరేదీ కనిపించని జీవుడు, పరమాత్మని ఆక్రోశిస్తూ పిలుస్తున్నాడు. "ప్రభూ! నీవే తప్ప నితః పరంబెరుగ, మన్నింపన్ తగున్ దీను నిన్, రావే ఈశ్వర! కావవే వరద! సంరక్షించు భద్రాత్మకా!"... నాటి గజేంద్రుడి నుంచి నేటి నాబోటి అసంఖ్యాకుల దాకా ఆ 'నామాలయ్యే' శరణు. గుండెల్ని పిండే ఈ కీర్తన అన్నమాచార్యుల వారాలపించినపుడు తిరుమలలో తరులు, గిరులు, సురులు కూడా హరిలా జలజలా కన్నీరు వరదయ్యేలా కురిపించి వుంటారు..

**ఆ.వె॥శరణుజొచ్చినాను సర్వేశ! నీకింక**
**నీదు చిత్తమయ్య! నిలుప దునుప**
**అన్నమయ్య కీర్తనంబ్రశులను నింపు**
**విభుని కనుల నిందు వింతలేదు.**

**రాగం : దర్బార్ కానడ**

నీకే నే శరణు నీవు నన్ను కరుణించు
యీకడ నాకడ దిక్కు యెవరున్నారికను ॥నీకేనే॥

కన్నుల చంద్రసూర్యులు గల వేలుపవు నీవు
పన్నిన లక్ష్మీభూమి పతివి నీవు
అన్నిట బ్రహ్మకు తండ్రియైన ఆదివేలుపవు
యెన్నగ నీకంటే ఘనమెవ్వరున్నారికను ॥నీకేనే॥

దేవతలందరు నీ తిరుమేనైన మూర్తి
ఆవల పాదాన లోక మణచితివి
నీ వొక్కడవే నిలిచిన దేవుడవు
యేవేళ నీకంటే నెక్కుడెవరున్నారికను ॥నీకేనే॥





అరసి జీవులకెల్ల అంతరాత్మవైన హరి
సిరుల వరములిచ్చే శ్రీవేంకటేశ
పురుషోత్తముడవు భువన రక్షకుడవు
యిరవైన నీవేకాక ఎవరున్నారికను ॥నీకేనే॥

**భావామృతం :**

ఓ ఆదిమధ్యాంత రహితా! శరణు. శరణు. శరణు. నీవు నన్ను కరుణింపుము ప్రభూ! ఇక్కడ గానీ అక్కడగానీ నాకు వేరు దిక్కెవరున్నారు? లేరు... లేరు... ఇక నీవే నాకుగతి.

నీవు నన్ను చూడలేదా?.. సూర్యుడు చంద్రుడు కన్నులుగా కలవాడివి. అట్టి దేవుడు చూడని దేమిటి? లక్ష్మీదేవిని భూదేవిని పతివై ఏలే శ్రీపతివి. అన్నివిధములా తండ్రివై బ్రహ్మదేవుని రక్షించి, నియమించిన ఆదిదేవుడవు నాకు నీకంటే ఘనుడు వేరెవరున్నారు స్వామీ! ఎవ్వరూ లేరు.

దేవతలందరికీ తిరు(ర)ముయైన (స్థిరముగా నున్న) మూర్తివి నీవు. పాదములతో అక్కడ (బలి చక్రవర్తివద్ద) లోకములను ఆక్రమించినవాడివి. మొత్తం సృష్టి అంతా జలరాశిలో మునిగిపోయినప్పుడు నీవొక్కడవే మర్రి ఆకుపై నిలకడగా పవళించి యుంటివి. ఏ వేళలోనైనా నీకంటే అధికుడెవరున్నారిక?

విచారించ, ఈ సమస్త జీవులకు అంతరాత్ముడవైన శ్రీహరివి నీవే. ఈ భువనములు రక్షించు పురుషోత్తముడవు నీవు. మా అందరికీ స్థానమై నీవు కాకపోతే మరి ఇంకొకరు ఎవరున్నారు తండ్రీ! లేరు... వేరెవ్వరూ లేరు.

## 2-19

### మున్నుడి

పాండురంగ విఠలునిగా తిరుమలాధీశుని భావించి అన్నమయ్య చెప్పిన చక్కటి కీర్తన ఇది. భావయామి వేంకటేశమ్‌లో ఈ కీర్తన నెన్నుకొని రుక్మిణీ సత్యభామల విభునిగా భావించి తరించే ప్రయత్నమే ఇది. ఆయన సురసేవితుడైన స్వామి. గొల్లభామల కోరికలను ఏకకాలంలో వారు కోరుకొన్న పద్ధతిలో తీర్చిన ఆ మహానుభావుణ్ణి ఎంచి వర్ణించలేని మహిమ అది. సాధారణ మానవులం మనకెట్లా అర్థమవుతుంది? యశోదకు పెంచి మురిపెం తీర్చుకోనిచ్చాడు. దేవకీ వసుదేవులకు కొడుకు పెళ్లిచేసే అదృష్టం ఇచ్చాడు. ఎవరికెంతో... అంతే...

**చం॥ కొలువయి రుక్మిణీ సతియు కోమలి సత్యయు స్వామిగూడగా**
**కొలిచెను అన్నమయ్య యిటు కూరిమితో 'విఠలున్' స్మరించుచున్**
**తలచుచు వేంకటేశ్వరుడె తానను భావన, ఇట్టి కీర్తనన్**
**తెలియను ఇన్నినాళ్ళు భళి!! దీని నెరింగితి ధన్యుడైతి బో!!**

**రాగం : అమీర్ కళ్యాణి**

వేవేల చందాలవాడు విఠలేశుడు
భావింప నలవిగాని పరమాత్ముడితడు ॥వేవేల॥

సతతము రుక్మిణీ సత్యభామ నడుమ
రతినెక్కిన సింగార రాయుడితడు
చతురత సనకాది సంయమీంద్రులమతి
నతిశయిల్లేటి పరమానంద మితడు ॥వేవేల॥

దేవతలకెల్లాను దిక్కుదెసై వెలుగొంది
తావుకొన్నయట్టి ఆధారమీతడు
మూవంక గొల్లెతలు మున్నుసేసిన తపము
కైవసమై ఫలించిన ఘన భాగ్యమితడు ॥వేవేల॥





వరముతో యశోద వసుదేవాదులకు
పరగిన కన్నుల పండుగీతడు
సిరులు మించినయట్టి శ్రీవేంకటాద్రి మీది
నిరతి దాసుల పాలి నిధాన మితడు ॥వేవేల॥

### భావామృతం

ఈ విఠలుడు పలు విధములైన వాడు. ఎందరెందరినో ఎన్నెన్నో విధములుగ ఈయన కరుణించి యున్నాడు. ఈయన భావనలకు అందని పరమాత్మ స్వరూపమే గదా!

భక్తితో కోరిన రుక్మిణికి, శృంగార భావనతో చేరిన సత్యభామకు రతి సౌభాగ్యమును వారికి తగ్గట్లుగా ఇచ్చిన శృంగార పురుషుడా స్వామి. ఇదిట్లా వుంటే సనక సనందనాది మునులకు అనంతమైన పరమానందమును కూడా ఆ యోగీశ్వరుడే ప్రదానం చేశాడు.

దేవతలకు అనేకమార్లు దిక్కు మొక్కు ఈజగద్రక్షుడే అయ్యాడు. వారేకష్టం వచ్చినా ముందు చెప్పుకొనేది ఈ సుర రక్షకునికే. వారి ననేక మార్లు అనేక విధములుగా కాపాడుటకు నెలకొనిన ఆధారభూతుడు ఈ మహానుభావుడు. ముప్పూటలా రేపల్లెలో గొల్లభామలను వారికి కైవసమై వారు వారు కాంక్షించినట్లు బాల కొక్క గోపాలుడై, నారీ నారీ నడుమ మురారియై, హరికీ హరికీ నడుమనొక 'వయ్యారి' యా అనునట్లు రాసక్రీడ జరిపి వారికి మహదానందం ప్రసాదించాడు. నిజానికి వారంతా దేవలోక కాంతలే. వారు స్వామిని ఆరాధించి నీ పొందు కావాలి స్వామీ అంటే వారికి ఘనమైన ఆ సౌభాగ్యాన్నిచ్చాడు, ఆ మహానుభావుడు.

యశోదకు చిలిపి కొడుకుగా తనను పెంచే భాగ్యం ఇచ్చి ఆనందమిచ్చాడు. ప్రసవ వేదన అనుభవించి కన్నకొడుకుని పెంచే భాగ్యం ఇవ్వలేదు కానీ, ఎనిమిది పెళ్లిళ్లు 'కొడుక్కి' చేసి, ఎనిమిది మందితో 'అత్తగారు' అనిపించుకొనే (అందులో ఒకామె స్వయంగా శ్రీమహాలక్ష్మి) అదృష్టమిచ్చాడు. ఆ విధంగా వసుదేవునికి, చతుర్ముఖ బ్రహ్మ (లోకాలకే పితామహుడైన) మనుమడయ్యే భాగ్యం ప్రసాదించాడు. ఆ తలిదండ్రులకు కన్నుల పండుగయ్యాడు. సిరులను ప్రసాదించు శ్రీవేంకటాద్రి మీద ఆ సర్వేశ్వరుడు మిక్కిలి ప్రీతితో శ్రీవేంకటేశ్వరుడే పెన్నిధివలె నిలిచియున్నాడు.

## 2-20

## మున్నుడి

రకరకాల వన్నెలతో పరిమళాలతో నిండిన పూల దొంతరమధ్య 'సంపంగి' లాంటిదీ పాట. అన్నమయ్య జానపదుల కోసం ప్రత్యేకంగా పూయించిన దీని సౌరభాన్ని ఆనందించండి. కరుణయే మూర్తీభవించిన ఈ 'అనాథరక్షకు'డు, వడ్డీకాసులవాడు ఆపద మ్రొక్కులవాడు, తోమని పళ్లాలవాడు, పుట్టుగొడ్డాండ్రకు బిడ్డలిచ్చేవాడు అని ఎందుకు కీర్తించబడుతున్నాడు? నిలువు దోపిడీ చేస్తే కూడా 'నీవే గతి తండ్రీ!' అని ఎందుకు వేడుకొంటున్నారు? పురుటి నొప్పులు అనుభవిస్తే గాని తెలియవు. ఇదీ అంతే..

**కం॥ 'వేడెదమా?' అన్నయ్యనె**
**నేడే శ్రీవేంకటేశు 'నీదై' కావన్**
**వీడని 'వడ్డీకాసుల**
**వాడట' జానపద గీతి పాడెను వినుడీ!**

**రాగం : ఝుంఝూటి**

వేదు కొందామా వేంకటగిరి వేంకటేశ్వరుని ॥వేదు॥
ఆమటి మ్రొక్కులవాడే ఆదిదేవుడే వాడు

తోమని పళ్లాలవాడే దురిత దూరుడే ॥వేదు॥
వడ్డీకాసులవాడే వనజనాభుడే పుట్టు

గొడ్డాండ్రకు బిడ్డలిచ్చే గోవిందుడే ॥వేదు॥
ఎలమి కోరిన వరాలిచ్చే దేవుడే వాడు

అలమేల్మంగా శ్రీవేంకటాద్రి నాథుడే ॥వేదు॥





## భావామృతం

శ్రీవేంకటాద్రిపై వెలసిన ఆ శ్రీవేంకటేశ్వరుని నేడే వేడుకొందామా? (రండి ఆలస్యమెందుకు) ఈ ఆదిదేవుడు 'ఆపద మ్రొక్కులవాడు'. చిన్న ఆపద రాగానే స్వామీ! మమ్మల్నీ గండంనుంచి గట్టెక్కించు నీ కొండకు వస్తాను. అని భక్తితో వేదనతో మ్రొక్కుకొంటే 'తప్పక' మిమ్మల్ని రక్షిస్తాడు. ఇది సత్యం. పునఃసత్యం. సర్వపాప నివారకుడైన ఈ సర్వేశ్వరుడు 'తోమని పళ్లాలవాడు'. ఈ స్వామికి అనేక రకములైన సేవలలో నివేదన కోసం (నైవేద్యం పెట్టుటకు) ఎల్లప్పుడు క్రొత్త పళ్లాలనే వాడుతారు. ఒకసారి ఉపయోగించిన పళ్లాలను మరొక్కసారి ఉపయోగించరు. ఆ పళ్ళాలను తోమి మళ్ళీ వాడరు. అందుకే ఆయన తోమని పళ్ళాలవాడు. (నేటికి కూడా)

ఈయన వడ్డీకాసులవాడు. కుబేరుడి దగ్గిర తన పెళ్లికోసం అప్పు తీసుకొని దానికి కలియుగమంతమై తను వైకుంఠం చేరేదాకా వడ్డీ కడతానని వాగ్దానం చేసియున్నాడు. అందుకే మన మ్రొక్కుబడికీ ఆలస్యమైతే మనమూ వడ్డీ కట్టాల్సిందే. పదివేల రూపాయిలు వేస్తానని (హుండీలో) సంవత్సరం తరువాత పదివేలు వేస్తే లాభం లేదు. పదివేలకి వడ్డీకూడా వేయాల్సిందే. ఆ మహానుభావుని పుట్టుకతోనో గొడ్రాలై నిస్సంతులైన స్త్రీలు గోవిందా మాకు బిడ్డని ప్రసాదించు తండ్రీ అని వేడుకొనే తల్లులు కోకొల్లలు.

ఈ దేవుడు భక్తులు కోరుకొన్న వరములను అతి సంతోషంతో ప్రసాదిస్తాడు. ఏడుకొండలవాడు అని పిలువబడే ఈ శ్రీవేంకటేశ్వరుడు తన దేవేరి అలమేల్మంగమ్మతో మనల్ని కరుణించుటకు వెలసియున్నాడు. జన్మధన్యమౌనట్లు భక్తితో సేవించండి.

## 2-21

### మున్నుడి

ఆదిదేవుడైన శ్రీమన్నారాణుడు ఎవరినెట్లా అనుగ్రహించాడో వివరిస్తున్నారన్నమాచార్యులవారు. దాసీపుత్రుడైన విదురిని ఇంట్లో విడిదియై విందులు తిన్నాడు, రారాజు ఇంటివైపు చూడలేదు. గొల్లభామలకు సామీప్యమోక్షమిచ్చాడు. కుచేలుడి అటుకులు ప్రీతితో తిన్నాడు యశోద చేత రోటికి కట్టేయించుకొన్నాడు. చద్దికట్టుకొనివెళ్ళి గోపాలకులతో పాటు గోవుల్నికాశాడు. సనకసనందనాది ఋషులు నిత్యమూ కీర్తించే సర్వేశ్వరుడు ఈ వేంకటేశ్వరుడే. సృష్టిలో అందరికీ 'ఆధారమే' ఈ స్వామి....

**ఉ॥ అందరికీతడే గురువు ఆదియనెన్ మన అన్నమయ్య, మీ**
**డెందము చిందులేయ వినుడీ యిట వేంకటశైలనాధుడున్**
**ఎందరికెట్లు ఆయె, తను ఇంపుగనా వివరంబులిచ్చెరా**
**ఇందు నిఘంటువున్ వెదకనెన్నియొమారులుతిప్పలాయెబో**

**రాగం :మధ్యమావతి**

అందరికాధారమైన ఆదిపురుషుడీతడు
విందై మున్నారగించె విదురుని కడ నీతడు ॥అందరి॥

సనకాదులు కొనియాడెడి సర్వాత్మకుడీతడు
వనజభవాదులకును దైవంబైనతడీతడు
యినమండలమున చెలగేటిహితవైభవుడీతడు
మునుపుట్టిన దేవతలకు మూలభూతి యీతడు ॥అందరి॥

సిరులొసగి యశోదయింట శిశువైనతడీతడు
ధరనావుల మందలలో తగ చరించెనీతడు
సరసతలను గొల్లెతలకు జనవులొసగెనీతడు
అరసియడుకుకుచేలుని అటుకులు లారగించెనీతడు ॥అందరి॥





పంకజభవునకును బ్రహ్మపదమొసగెను యీతడు
సంకీంనలాద్యులచే జట్టిగొనియె నీతడు
తెంకిగ నే కాలము పరదేవుడయినయీతడు
వేంకటగిరి మీద ప్రభల వెలసిన ఘనుడీతడు

॥అందరి॥

### భావామృతం :

సృష్టిలో ప్రతిజీవికీ ఆధారమైన ఆదిమపురుషుడు ఈ మహానుభావుడే. ద్వాపరయుగంలో ఆయన రారాజు దుర్యోధనుని వద్దకు పాండవరాయబాగా వెళ్ళి దాసీపుత్రుడైనా యోగ్యుడైన విదురుని ఇంట్లో బసచేసి భుజించాడు. రాజభోగం తిరస్కరించాడు.

సనక సనందనాది మునివర్యులు కీర్తించెడి సర్వాత్మస్థితుడీ నారాయణుడే. బ్రహ్మదులకు ఈయన దైవస్వరూపుడు. సూర్యమండలమున గొప్పవైభవముతో వెలుగొందెడి తేజోమూర్తి ఈ స్వామియే. వామనావతరంలో దేవతలకు అనుజుడై పుట్టి ఆదుకొనిన కరుణా సముద్రుడు ఈ జగద్రక్షకుడు.

గోపెమ్మ యశోదకు వైభవ మొసగి ఆమెనట్టింట శిశువై మురిపించినదీ మహానుభావుడే. భూమిపై ( వైకుంఠనాధుడు) గోపాలుడై ఆవులమందను కాచిసంచరించినదీతడే. అక్షరమ్ముక్కరాని గోపకాంతలకు సామీప్యమోక్షమును అనుగ్రహించిన శృంగారమూర్తియూ ఈ లోకేశ్వరుడే. గుప్పెడటుకులు తినిపించిన కుచేలునకు కొల్లలుగా సిరులిచ్చి కరుణతో జూచిన కరుణామూర్తి ఈ భగవానుడు.

పద్మసంభవుడైన చతుర్ముఖబ్రహ్మకు సృష్టి బాధ్యతనొసగినదీ ఆదిదేవుడే. సంకీర్తనజేయు భక్తులచే వెలకుతీయబడిన స్వామి ఈయనే కదా! ఏ కాలముననైనా పరదేవుడయిన స్వామికి నివాసస్థానమై వెలసినది వేరెవరోకాదు వేంకటగిరి మీద వైభవముతో వెలసిన ఘనుడైన ఈ శ్రీవేంకటేశ్వరుడే.

## 2-22

## మున్నుడి

"సాధన వలననే సమకూరుఫలములు" అన్నది ఆర్యోక్తి. దానినే అన్నమాచార్యులవారు చక్కటి కీర్తనలో తెలియజేస్తున్నారు. మనస్సులో చింతలన్నీ తొలగిపోయి తిరుమలనాథుని వైపు తిప్పకుండా తిరుమలయాత్ర కోటిసార్లు చేసినా ఆయన ప్రత్యక్షమౌతాడా? అసాధ్యం. ఆత్మశాంతి పొందలేని వాడు అష్టావధానంలో దిట్టఅయినా ఫలితం శూన్యం. అన్నమయ్య బోధనలో నాన్చుడు వ్యవహారం ఉండదు. సూటిగా చెప్పటమే....

**మ॥ తరమేమోక్షపుమార్గమందు జొర, యత్నంబెంచిసేనేరకన్**
**తరమే కర్మమలంబులన్ కడుగకన్ తాగాంచ జ్ఞానంబికన్**
**తరమే శాంతినిబొంది వేంకటవిభున్ దాస్యంబుతోగొల్వకన్**
**యెరిగించెన్ మన అన్నమయ్య వినుడీ యాకీర్తనంబెంచితిన్**

**రాగం :గౌళ**

ఊరకే దొరకునా ఉన్నతోన్నత సుఖము
సారంబు దెలిసికా జయము చేకొనుట ॥ఊరకే॥

తలపులోపలి చింత-దాటినప్పుడు గదా
అలరిదైవంబుప్ర-త్యక్షమౌట
కలుషంపు దుర్మదము-గడచినప్పుడు గదా
తలకొన్న మోక్షంబు-తనకు జే పడుట ॥ఊరకే॥

కర్మంబు కసటువో-కడిగినప్పుడు గదా
నిర్మలజ్ఞానంబు-నెరవేరుట
మర్మంబు శ్రీహరిని-మఱగు జొచ్చినగదా
కూర్మి తన జన్మమె-క్కుడు కెక్కుడౌట ॥ఊరకే॥





తన శాంత మాత్మలో-దగలినప్పుడు గదా
పనిగొన్న తన చదువు-ఫలియించుట
ఎనలేని శ్రీవేంక-టేశ్వరుని దాస్యంబు
తనకు నబ్బిన గదా-దరిజేరి మనుట ॥ఊరకే॥

**భావామృతం :**

అత్యుత్తమమైన మోక్షసౌఖ్యము తగిన యత్నముజేయక చేజిక్కుతుందా? ఒక పనిలో విజయం కలుగవలెనంటే ఆ పనిలోని సారమునంతా గ్రహించి తగిన సాధనజేయవలెను కదా! ఊరకే ఏకార్యమైనా నెరవేరుతుందా?

ఆలోచనలలో చింత విడనాడితేనే కదా! భగవత్సాక్షాత్కారం సాధ్యపడుతుంది. మలినములతోనున్న దుర్మదమును అతిక్రమిస్తేనే కదా! మోక్షం ప్రాప్తించేది. ఊరకే నాకు మోక్షం కావాలి, మోక్షంకావాలి అని తపనపడితే మోక్షం దొరుకుతుందా?

ఒక జన్మలో ప్రాప్తించిన మాలిన్యం ఆజన్మతో పోతుందనుకోవటానికి వీలులేదు. అది మరుజన్మలోనూ నీడలా వెంటాడవచ్చును. కాబట్టి ఏదో ఒక జన్మలో ఆ మాలిన్యాలన్నింటినీ పూర్తిగా కడిగివేసికొంటేనే కదా! నిర్మలమైన జ్ఞానం కలుగుతుంది. హృదయకమలంలో శ్రీమన్నారాయణుడు ప్రకాశిస్తేనే కదా!జన్మసాఫల్యం కలుగుతుంది. ఊరకే నాజన్మ చరితార్థం కావాలి అని కలలు కంటే అయిపోతుందా? ఎన్నటికీ అవదు.

ఆత్మశాంతి పొందిన తరువాత గాని ఎవ్వరికైనా తను చదువుకొన్న చదువుకు సార్థకత కలుగదు. జతలేని తిరుమలనాయకుడైన శ్రీవేంకటేశ్వరుని దాస్యము తనకు లభిస్తేనే గాని సంసారసాగరంలో ఒడ్డుజేరట మనేది జరుగదు. (దీని గురించి తెలిసీతెలియని తత్త్వబోధకులు ఏమి జెప్పినా నమ్మకండి. ఓం నమో వేంకటేశాయ అని శరణాగతినొందండి)

## 2-23

### మున్నుడి

'జన్మానికో శివరాత్రి' అన్నట్లు మనబోటి సామాన్యులకు వైకుంఠనాధుని దర్శనం లభించినంతకష్టం తిరుమలనాధుని బ్రహ్మోత్సవాల సమయంలో శ్రీవేంకటేశ్వరుని ప్రత్యక్షంగా చూచిసేవించటం. ఈ కీర్తన నాలపించి అతితేలికగా అంతపుణ్యమూ సంపాదించేదారి చూపించారు అన్నమాచార్యులవారు. ఆయన అందించిన భాగ్యమే ఇది.

**సీ॥ బ్రహ్మాండనాధుని బ్రహ్మోత్సవంబులన్**
**వర్ణించు కీర్తన పాడెదమిక,**
**పది దినంబులదాక పరమాత్మ గొలిచెడి**
**మోక్షపధంబిది ముదము 'కొసరు'**
**తిరువీధులందున ఊరేగు 'వేంకన్న'**
**వాహనంబులు మారు ప్రతిదినంబు**
**కనులార గాంచిన యెనలేని పుణ్యంబు**
**జన్మధన్యంబౌను స్వామి మెచ్చు**

**ఆ.వె॥ అన్నమయ్య నాడు ఆది శ్రీకారంబు**
**జుట్టి తాను మొదలుబెట్టినారు**
**వరముగాదె!! నాకు ఇరువదిపదిలోన**
**భావమెరుగజెప్ప బంధులార!**

### రాగం : శ్రీరాగం

తిరువీధుల మెరసీ దేవదేవుడు
గరిమల మించిన సింగారముల తోడను ॥తిరువీధుల॥

తిరుదండెలపైనేగీ దేవుడిదే తొలినాడు
సిరుల రెండవనాడు శేషుని మీద
మురిపేన మూడోనాడు ముత్యాలపందిరి క్రింద
పొరినాలుగోనాడు పువ్వుకోవిలలోను ॥తిరువీధుల॥





గక్కన నయినదవనాడు గరుడుని మీదను
యెక్కను ఆరవనాడు యేనుగుమీద
చొక్కమై ఏడవనాడు సూర్యప్రభలోనను
యిక్కువమెతేరును గుర్రమెనిమిదోనాడు ॥తిరువీధుల॥

కనకపుటందలము కదిసి తొమ్మిదోనాడు
పెనచి పదోనాడు పెండ్లిపీట
ఎనసి శ్రీవేంకటేశుడింతి అలమేల్మంగతో
వనితల నడుమను వాహనాల మీదను ॥తిరువీధుల॥

### భావామృతం :

(శ్రీవేంకటేశ్వరుని సాన్నిధ్యంలో ఆనాడు స్వయంగా చతుర్ముఖ బ్రహ్మ ఆరంభించి, నిర్వహించిన బ్రహ్మోత్సవముల వైభవాన్ని, అన్నమయ్య అద్భుత కీర్తనలో ఆస్వాదించి తరించండి).

దేవదేవుడైన శ్రీవేంకటేశ్వరుడు తిరుమల వీధులలో కాంతులీనుతూ శోభిల్లుచున్నాడు. వైభవము అతిశయిల్లగా గొప్పఅలంకరణలతో దర్శనమిస్తాన్నాడు.

పదిరోజుల ఈ బ్రహ్మోత్సవములలో శ్రీ వేంకటేశ్వరుడు మొదటిరోజున పావనమైనపల్లకీలో ఊరేగినాడు. ఇక రెండవ రోజున ఆదిశేషునిపై వెడలుచున్నాడు. మురిపెముతో మూడవరోజున ముత్యాలపందిరి వేయించుకొని దాని క్రింది ధగద్ధగాయమానంగా ఊరేగుచున్నాడు. క్రమముగా నాలుగవనాడు స్వామి గుడివలె కట్టబడి పుష్పకోవెలలో విజయంచేస్తున్నాడు. (కనులారగాంచి తరించండి) అయిదవరోజున అతిశీఘ్రముగా గరుత్మంతుని వాహనంపై పోవుచున్నాడు. బ్రహ్మోత్సవములో ఆరవనాడు స్వామి గజవాహనముపై వెడలినాడు. ఏడవనాడు స్వామి ఏదోషమూ లేని సూర్యప్రభవాహనంపై ఊరేగుచున్నాడు. ఇక ఎనిమిదివనాడు గుఱ్ఱములకట్టినరధముపై వెడటినాడు.

తొమ్మిదవ రోజున ఈ మహానుభావుడు బంగారుపు అందలము (పార్శ్వభాగములు లేని ఊరేగింపు పల్లకీ) మీద దగ్గర తరవి పోవుచున్నాడు. ఇక చిట్టచివరి దైనపదియవనాడు సమకూడిన కళ్యాణపు వేదికపై ఊరేగుచున్నాడు. పొందికగలిగిన ఈ శ్రీవేంకటేశ్వరుడు తనదేవేరి అలమేల్మంగమ్మతో వనితాజన సమూహముతో అనేక వాహనములపై ఊరేగుచున్నాడు. నయనానందకరంగా చూచి తరించండి.

## 2-24

### మున్నుడి

జానపదుల కోసం వారిశైలికనుగుణంగా వారి భాషవాడుతూ అన్నమాచార్యులవారు అసంఖ్యాకమైన కీర్తనలు చెప్పారు. ఆ మాటలు నేటి మన'ఆంగ్ల తెలుగు' మాత్రమే వచ్చిన నాబోటివారికి అర్థంకావు. వాడుకలో లేని కత్తి తుప్పుపట్టినట్లు 600 ఏళ్ళలో కొన్ని మాటలు నిఘంటువుల్లో కూడా కనుమరుగయిపోయాయి. 'కూగాగు' అంటే సరియైన అర్థం ఏమిటి? భాషమీద పట్టువున్న నా మిత్రులొకరి సూచనమేరకు కన్నడంలో 'కూగాగు' తెలుగులో 'దోబూచి' గా అర్థం చెప్పవచ్చు. అన్నమయ్యవాడిన జానపద భాష ఇదమిత్థంగా తెలియడంలేదు. మన దౌర్భాగ్యం....

**కం॥ "కూగూగం" టే నేమిటి?**
**ఏగతి నేర్వంగనోపు ఇట్టి పదములన్**
**రాగడలె అన్నమయ్యకు**
**తూగే సరిజోడు కొలువ తోయజనాభున్!!!**

**రాగం : మోహన**

గుఱుతెఱిగిన దొంగ కూగూగు వీడె
గుఱిలోనె దాగీని కూగూగు ॥గుఱుతెఱిగిన॥

నెలతల దోచీని నీళ్ళాడగానే
కొలనిదరిని దొంగ కూగూగు
బలువైన వుట్ల పాలారగించీని
కొలది మీఱిన దొంగ కూగూగు ॥గుఱుతెఱిగిన॥

చల్లలమ్మంగ చనుకట్టు దొడికీని
గొల్లెతలను దొంగ కూగూగు
యిల్లిల్లు తప్పక యిందరి పాలిండ్లు
కొల్లలాడిన దొంగ కూగూగు ॥గుఱుతెఱిగిన॥





తావుకొన్న దొంగ తగిలి పట్టండిదె
గోవులలో దొంగ కూగూగు
శ్రీవేంకటగిరి చెలువుండో యేమో
కొవిదుడగు దొంగ కూగూగు. ॥గుఱుతెఱిగిన॥

### భావామృతం :

'గుఱుతెఱిగిన దొంగ' అంటే జగత్ ప్రసిద్ధమైన చోరుడు అని అర్థం చెప్పుకోవచ్చు. వీడు జగత్ ప్రసిద్ధమైన దొంగ'దోబూచి'. అంతేకాక ఈయన భక్తుల గుఱిలోనె (లక్ష్యములోనే) దాగియుండే కూగూగు (దోబూచి).

కొలనులో స్నానం చేద్దామని స్త్రీలు నీళ్ళలో దిగగానే వాళ్ళ బట్టలను యెత్తుకొనిపోయిన దొంగ కూగూగు ఇతడే. పెద్ద 'ఉట్ల'లో ఎత్తుగా కట్టిన పాలుకూడ తెలివిగా కాజేసిన అపరిమితమైన దొంగ కూగూగు ఇతడే. (మన తెలివితేటలు ఆయన చాకచక్యం ముందు పనిచేస్తాయా? ఎంత వెర్రివాళ్ళం మనం!!)

చల్లలమ్ముకోవటానికి గొల్లభామలు నెత్తిన చల్లకుండలు పెట్టుకొని నడుస్తుంటే చనుకట్టు చలిస్తుండగా వాళ్ళవెంటబడి ఏడిపించే వాడే ఈ దొంగ కూగూగు. వీరూవారని గాక రేపల్లెలో ప్రతి గోపిక స్తనవైభవాపహరణ ఈ దొంగ కూగూగే గావించాడు. (ఎంత అదృష్టవంతులో!! సాక్షాత్తూ దేవతాస్త్రీలంతా, ఆ పురుషోత్తముని ప్రార్థించి, వరముగా పొంది, గోపికలవలె జన్మించి ఆ సౌభాగ్యాన్ని పొందారట. అదికదా! జన్మ అంటే)

ఈ మహనుభావుడు (నేడు తిరుమలలో) నెలకొనిన దొంగ. ప్రయత్నించి పట్టుకోండి (మీ తరమా?) గోవిందా అనండి. ఎందుకంటే ఈయన గోవులతో సంచరించే దొంగ కూగూగు. శ్రీ వేంకటగిరి మీద స్థిరపడిన సుందరాకారుడో ఏమో? అట్లా అయితే మాత్రం ఈ దొంగ కూగూగు జ్ఞానేశ్వరుడే. సందేహం లేదు.

## 2-25

## మున్నుడి

అలమేల్మంగమ్మను పొగుడుతూ శ్రీవేంకటేశ్వరునికి అన్నమాచార్యుల వారు విన్నవిస్తున్న వైనంతిలకించండి. సెలవలంటే 'హాలిడేస్' అనుకొనే నాలాంటి 'అమాయకులు' ఈ కీర్తన భావామృతం చదివి కొంత 'జాణతనం' నేర్చుకోవచ్చును. అలాగే "తెఱవ పెదవు"లంటే తెరిచియుంచిన పెదవులను– కానేమాదం వుంది. ఆ మాట అర్థం 'స్త్రీ పెదవులు' అని. అన్నమయ్య కీర్తనకర్థం చెప్పటం నల్లేరు మీద నడక కాదు అని తెలిసిందా? ఇక వేంకటనాధుని మురిపెం గ్రహించండి.

**చం॥ పెదవులలేత నవ్వునతల ప్రేమతలంపుల దాచియుంచగా**
**ముదితకుసంతసంబపుడుముంపున వచ్చెనుయెంత 'జాణ'యో!**
**మది తిరువేంకటేశ్వరుడు మాలిమితో తనభామగూడగా**
**పదకవితా పితామహుడు పాడెను కీర్తన నద్భుతండుగా.**

**రాగం : కళ్యాణి**

ఎంత నేరుపరి ఈ లేమ
దొంతివెట్టే సంతోసముల ॥ఎంతనేరుపరి॥

వెలది సెలవులను వెన్నెల గాసీ
చెలులునీ సుద్దులే చెప్పగను
తలపోతలనే దండలు గుచ్చీ
నెలకొని ఎదుటను నీ వుండగను ॥ఎంతనేరుపరి॥

వనిత చెక్కులను వానలు గురిసీ
తనియని విరహపు దమకమున
కనుచూపులనే కలువలు చల్లీ
నినుపుల వలపుల నీ రాకలకు ॥ఎంతనేరుపరి॥





తెఱవ పెదవులను తేనెలు చిందీ
మరి నీ వాడిన మాటలను
నెఱి శ్రీవేంకట నిలయ కూడితివి
జఱసి నీతో జాణతనముల ॥ఎంతనేరుపరి॥

**భావామృతం :**

ప్రభూ! ఈ భామిని ఎంత చాకచక్యంగలదో చూశావా? సంతోషములనన్నింటినీ ఈమె వరుసగా పేర్చి నీకు సమకూర్చింది స్వామీ!

ఈ వనిత లేత పెదవులపై మొలక నవ్వుల వెన్నెలలు కాస్తున్నాయి. ఎందుకో తెలుసునా? ఆమో చెలికత్తెలు నీ యొక్క లీలలను వివరిస్తున్నారు మరి. ఈమె నీ ఆలోచనలనన్నింటినీ సరాగమాలవలె గుచ్చుతున్నది. ఇంతలో వున్నట్లుండి నీవు ఆమె కన్నులముందు ప్రత్యక్షమయ్యావు. (ఇక ఆమె తత్తరపాటు నేమని చెప్పగలము!!)

ఈ జవరాలి చెక్కిళ్ళు కాంతులను విరజిమ్ముచున్నవి. ఈమె విరహముచే కలిగిన మైమరపునకు తృప్తి కలుగలేదేమో మరి. ఈమె తన కనుచూపులలో ఎఱ్ఱకలువపూలను పూయిస్తున్నది. ఎందుకంటే అతిశయించిన వలపులను తన కనులలో నింపుకొని క్షణమొక యుగములా ఆమె నీ రాక కోసం ఎదురుచూస్తున్నది.

ఈ తెఱవ (యువతి) యొక్క పెదవులు తేనెలూరుచున్నవి. ఎందుకంటే నీవు ఆమెతో చెప్పిన మాటలను తిరిగి ఆమె పదే పదే తన నోటితో పలుకుచున్నదికాబోటు. అందమైన శ్రీవేంకటగిరి నిలయుడవై ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు ఆమెను కూడగానే మా అలమేల్మంగమ్మ కూడా జాణతనముతో (నేర్పరితనంతో) నిన్ను ఎదుర్కొనినది స్వామీ!

**2-26**

## మున్నుడి

నేటి హంపీ విజయనగరము అన్నమయ్య కాలంలో ప్రసిద్ధమైన శ్రీరామచంద్రమూర్తి దివ్య క్షేత్రం. ఆ స్వామిని సందర్శించిన ఆచార్యులవారు ఎన్నో మధురమైన కీర్తనలకు జీవంపోశారు అక్కడ. ఈ కీర్తన ఆ కోవలోనిదే. శ్రీరామచంద్రుడు పరదైవం యొక్క సాకారరూపం అని తదనంతరకాలంలో త్యాగయ్యగారు, భక్తరామదాసు కీర్తించటానికి ఆద్యుడై శ్రీకారం చుట్టినది తాళ్ళపాకవారే. ముఖారి రాగంలో ఈ కీర్తన నాలపించిన వారిని వేంకటేశ్వరుడు అనుగ్రహిస్తాడు. సందేహం లేదు.

**తే॥ ఎట్టి సద్గుణ భూషితుడినకులమణి!!**
**అనుచు రామచంద్రు బొగడె నన్నమయ్య**
**ఆ 'ముఖారి' రాగంబున నవధరించి**
**తిరుమలేశుడే జానకీధరుడు యనెను.**

**రాగం :ముఖారి**

రామాడు లోకాభిరాముడు త్రైలోక్య-
ధాముడు రణరంగ భీముడు వాడె ॥రాముడు॥

వరుడు సీతకు ఫలాధరుడు మహోగ్రపు
శరుడు రాక్షస సంహరుడు వాడే
స్థిరుడు సర్వగుణాకరుడు కోందడ దీక్షా-
గురుడు సేవక శుభాకరుడు వాడే ॥రాముడు॥

ధీరుడు లోకైక వీరుడు సకలా-
ధారుడు భవబంధదూరుడు వాడే
శూరుడు ధర్మ విచారుడు రఘువంశ-
సారుడు బ్రహ్మ సాకారుడు వాడే ॥రాముడు।





। బలుడు ఇన్నిటా రవికులుడు భావించ ని-
ర్మలుడు నిశ్చలు డవికలుడు వాడే
వెలసి శ్రీవేంకటాద్రి విజయనగరములోన
తలకొనె పుణ్యపాదతలుడు వాడే ॥రాముడు॥

**భావామృతం :**

ఆ శ్రీరామచంద్రుడు లోకములన్నింటిలో మనోజ్ఞమూర్తి. ముల్లోకములూ ఆయన నెలవులే. ఆతడే యుద్ధరంగమున మహాపరాక్రమవంతుడు.

ఆ శ్రీరామచంద్రమూర్తి జానకీదేవికి మగడు. జీవుల ఫలప్రదాతయు నాతడే గొప్పశస్త్రాస్త్రములు కలవాడు. ఆయనే రాక్షసులనందరిని మట్టుబెట్టినవాడు. స్థిరమైన చిత్తము కలిగినవాడు.సర్వకాల సర్వావస్థలయందు కోదండచాపము ధరించి సిద్ధముగా నుంటానని దీక్షవహించిన శ్రేష్ఠుడు. ఆయనే తనను సేవించువారికి శుభములను ప్రసాదించువాడు.

ఆ శ్రీరాముచంద్రుడు ధీరత్వము మూర్తీభవించిన వాడు. లోకములన్నింటికీ ఏకైక వీరుడు. అన్నిటికీ ఆధారమైన వాడు. జీవులందరినీ భవబంధములనుంచి విముక్తులను చేయువాడు.గొప్ప శౌర్యము కలవాడు. ఏది ధర్మమో ఏదధర్మమో తెలిసిన వాడగుటచే ఎప్పుడూ ధర్మవిచారమును మాత్రమే చేయువాడు. రఘువంశమునకే చేవయైనవాడు. ఆయనే పరబ్రహ్మసాకారముగా నవతరించిన మహానుభావుడు.

ఆ శ్రీరామచంద్రమూర్తి గొప్పబలవంతుడు. ఈ చెప్పిన గుణములన్నియూ ఒకే చోట కలిగిన రవికుల తిలకుడు. భావించినచో ఆ శ్రీరాముడు నిర్మలహృదయము కలవాడు. నిశ్చలమైన బుద్ధి కలవాడు. ఏ విధమైన మనోవైకల్యమూ లేనివాడు ఆయన మాత్రమే. వేంకటాద్రి మీదనెలకొన్న శ్రీవేంకటేశ్వరుడే, నేడు విజయనగరములో తన పాదములు ప్రతిష్ఠింపబడినవాడై గొప్ప అర్చావతారముగా శ్రీరామచంద్రమూర్తిగా నున్నాడు.

## 2-27

### మున్నుడి

అత్యద్భుతమైన తత్త్వబోధ జేసే సంకీర్తన అన్నమయ్యపాడుతున్నారు. తుది, ఆదిలేని పరితాపం చెందుతున్నాననుకొంటున్నాడు మానవుడు. ఎన్నెన్నో కొలవులు చేసి యెందరెందరినో సేవిస్తున్నాడు. గర్వము, చింత, దైన్యము, ఆశ, లంపటాలు అన్నీ తనకే అనుకొంటూ ఆయా సమయాల్లో ఆ విధంగా సుఖదుః ఖాలనుభవిస్తున్నాడు. కానీ నిజానికి తను జీవాత్మననీ తాను తనకేమీ కాదనే సత్యం మాత్రం గ్రహించలేక పోతున్నాడు. అదే ఆ ఏడుకొండలవాడి మాయ. ఆయనని ధ్యానించనిదే ఇందులోంచి బయటపడటం అసాధ్యం.

**ఉ॥ ఎన్నియొ కొల్వులన్ చెలగు నెంతటి గర్వము నెత్తికెత్తురా**
**ఎన్నికుతంత్రముల్ నెఱపు నెన్నియొ ఆసలనొందు జీవుడున్**
**ఎన్నిటికేడ్చు? నెన్నిటికి నింపుగ నవ్వును అన్నమయ్యనెన్**
**ఇన్నియు నెన్నగా తిరుమలేశుని మాయని నేర్వలేడహో!!**

**రాగం : గోరక్ కళ్యాణ్**

ఏదితుది దీనికేదిమొదలు
పాదుకొను హరిమాయ పరుగు జీవునికి ॥ఏదితుది॥

ఎన్నిబాధలు తనకు నెన్నిలంపటములు
యెన్నివేదనలు మరియెన్ని దుఃఖములు
యెన్నిపరితాపంబు లెన్నితలపోతలు
యెన్నిచూచిన మరియు నెన్నైన కలవు ॥ఏదితుది॥

ఎన్నికొలువులు తనకు నెన్నియనుచరణలు
యెన్నిఆసలు మరియు నెన్నిమోహములు
మెన్నిగర్వములు తనకెన్ని దైన్యంబు లివి
ఇన్నియును తలప మరియెన్నైన గలవు ॥ఏదితుది॥





ఎన్నిటికి చింతించు నెన్నిటికి హర్షించు
నెన్నిటికి నాసించు నెన్నిటికి దిరుగు
యిన్నియును తిరువేంకటేశు లీలలు కాగ
ఎన్నిచూచినను తానెవ్వడును కాదు ॥ఏదితుది॥

**భావామృతం :**

జీవునికి శ్రీహరి యొక్క 'మాయ' ఆవరించి, ఊడలు వేసి, వ్యాపించి, బిగించివేయుచున్నది. ఈ మాయకు ఆదియేది? అంతమేది? ఇది తెలుసుకొనుట సాధ్యమా?

ఎన్నిబాధలు, ఎన్ని బంధనాలు, ఎన్ని వేదనలు, ఎన్ని సుఖములు, ఎన్ని దుః ఖములు, ఎన్నిపరితాపాలు, ఎన్ని ఆలోచనలు– ఈ మానవుడికి? లెక్కపెట్టి చూస్తే ఎన్నంటే అన్నివున్నాయి. (వీరూవారని లేదు, ప్రతివాడిదీ ఇదే గోల. ఈ గోలకు, గోడుకు అంతూలేదు)

ఎన్ని కొలువులు, ఎన్నిపదవులు, ఎన్ని వైభవాలూ, ఎంతమంది అనుసరించి అనుమతి కోసం ఎదురుచూచే వాళ్ళూ, ఎన్ని ఆసలు, ఎన్ని అడియాసలు, ఎన్ని మోహాలూ, ఎన్ని వ్యామోహాలూ, ఎన్ని గర్వించ తగ్గసంగతులు, ఎన్ని దీనత్వంతో పొందిన అవమానాలు– ఇవన్నీ ఆలోచనలే. తరచి చూస్తే ఎన్నంటే అన్నివున్నాయి.

ఈ మానవుడు ఎన్నిటికని చింతిస్తాడు? ఎన్నిటికి సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అవుతాడు? ఎన్నిటికి ఆశపడతాడు? ఎన్నిటికోసం కాలుకాలిన పిల్లిలా తిరిగి సతమతమవుతాడు? ఇవన్నీ తిరుమలాధీశ్వరుడైన శ్రీవేంకటేశ్వరుని లీలలు అవటం చేత, పాపం ఈ జీవుడికి ఎన్ని చూచినా, ఎన్ని జరిగినా, ఎన్ని అనుభవించినా తాను ఎవ్వడూకాడని 'తను' అనేదే లేని ఆత్మననే విషయం మాత్రం గ్రహించలేడు. (శ్రీవేంకటేశ్వరునే ధ్యానించి శరణాగతి పొందితే తప్ప ఈ మాయ దాటే దారే లేదు)

## 2-28

### మున్నుడి

'భజన' రూపంలో పరదేవతగ, శ్రీరామనిగ, శ్రీకృష్ణునిగ, నరసింహునిగా భావిస్తూ శ్రీవేంకటేశ్వరునిపై అన్నమయ్య ఎన్నో కీర్తనలు రచించారు. అటువంటి భజనలన్నీ జనబాహుళ్యంలో మిక్కుటమైన ఆదరణ పొందినవే. ఈ కీర్తన కూడా ఆ కోవలోనిదే. సంస్కృతం మూలం అయినప్పటికీ ఇందులో ప్రతిపదార్థం ఎవరించవలసిన అవసరం వున్న పదములు లేవు. కొసమెరుపుయేమిటంటే శ్రీ వేంకటేశ్వరుని ' నాకజనననుత నమో నమో' అన్నారు. నాకములో (స్వర్గంలో) జన్మించినవారిచేనుతుడు అంటే దేవతలచే కీర్తించబడు తిరుమలేశుడు.

**కం॥ నవనీత చోరు గృష్ణుని**
**వివరముగా కొలిచె తాను వేంకటపతిగా**
**కవి అన్నమయ్య, వినుడీ**
**దివిజేంద్రనుతుండటంచు దీటుగతెలిపెన్.**

**రాగం : ఝంఝూటి**

నవనీతచోర నమో నమో
నవమహిమార్ణవ నమో నమో ॥నవనీత॥

హరి నారాయణ కేశవాచ్యుత కృష్ణ
నరసింహ వామన నమో నమో
మురహర పద్మనాభ ముకుంద గోవింద
నర నారాయణ రూప నమో నమో ॥నవనీత॥

నిగమగోచర విష్ణు నీరజాక్ష వాసుదేవ
నగధర నందగోప నమో నమో
త్రిగుణాతీత దేవ త్రివిక్రమ ద్వారక-
నగరాధినాయకా నమో నమో ॥నవనీత॥





వైకుంఠ రుక్మిణీవల్లభ చక్రధర
నాకేశవందిత నమో నమో
శ్రీకర గుణనిధి శ్రీవేంకటేశ్వర
నాకజనన నుత నమో నమో ॥నవనీత॥

**భావామృతం :**

'వెన్నదొంగ' అని వేనోళ్ళ కీర్తించబడిన ఓ శ్రీకృష్ణా! నీకు నమస్కరించుచున్నాను. క్రొత్తక్రొత్త మహిమలు ఆర్ణవము (సముద్రం) పరిమాణంలో గల మహానుభావా! నీకు నమస్కరించుచున్నాను.

సర్వపాపములను హరించు శ్రీమన్నారాయణా! కేశవా! అచ్యుతా! శ్రీ కృష్ణా! నృసింహా! వామనా! నీకు నమస్కరించుచున్నాను. ముర అనుదానవుని మట్టుబెట్టిన స్వామీ! పద్మనాభా! ముకుందా! గోవిందా! నరనారాయణుడవై వంతుల ప్రకారం వేయి సంవత్సరాల యుద్ధంలో సహస్రకవచుడను రాక్షసుని (ఆఖరివంతుగా నరుడైన అర్జునుని చేతిలో నారాయణుడైన కృష్ణుని వ్యూహంతో సహస్రకవచుడే కర్ణుడై కవచంతో పుట్టికూడ మరణించాడు) వధించిన ప్రభూ! నీకు నమస్కరించుచున్నాను.

వేదములచే గోచరింపబడు విష్ణుమూర్తీ! ఓ పద్మనయనా! వాసుదేవా! గోవర్ధనధారీ! నందనందనా! నీకు నమస్కరించుచున్నాను. సత్త్వరజస్తమోగుణములకు అతీతుడా! త్రిభువన నాయకుడవైన త్రివిక్రమా! ద్వారకానగరాధినాథా! నీకు నమస్కరించుచున్నాను.

ఓ వైకుంఠవాసా! రుక్మిణీ వల్లభా! దేవేంద్ర సన్నుతా! నీకు నమస్కరించుచున్నాను. అష్టైశ్వర్యములను ప్రసాదించు ఓశ్రీవేంకటేశ్వరా! సద్గుణకలాపా! స్వర్గములో జన్మించిన దేవతలచేతనుతించబడు ఓ దేవదేవా! నీకు భక్తితో శరణాగతితో వినమ్రుడనై నమస్కరించుచున్నాను.

**2-29**

## మున్నుడి

నాట్యగతికి అనుగుణంగా, ఒక నర్తకి నృత్యం చేస్తుంటే చెప్పిన కీర్తన ఇది. కొన్నిరోజులు 'సాళ్వనరసింహరాయల' సంస్థానంలో వున్న అన్నమాచార్యులవారు 'బహుశా' ఒక నర్తకి నాట్యానికి అనుగుణంగా చెప్పిన కీర్తన అయివుంటుంది. ఇది కూడా అలమేల్మంగమ్మ తిరుమలనాథుని మురిపిస్తూ నృత్యం చేస్తున్నట్లు భావించి ఆమెనుద్దేశించి ఆచార్యులవారు పాడినట్లు తలపిస్తున్నది. తిరో తిరో, ధిమి ధిమ్కి, తిత్తి తిత్తి, మమారే.... వంటి పదాలకు వేరే అర్థంలేదు. అట్లావుంటే, మజ్జా మాజ్జా... అంటే నేటికాలంలో 'శహబాష్'.... అన్నమాట.

**ఆ.వె॥ తాళగతులపాడి తాళ్లపాకన్నయ్య**
**నృత్యగీతమిట్లు నేర్పినారు**
**మంగనృత్యగతులు మాధవున్ మురిపించు**
**తారహారమదిరి తళుకులెగయ.**

**రాగం : గంభీరనాట**

తిరో తిరో జవరాల తిత్తి తిత్తి ఈ
తలలమైన నీ తారహార మదిరే ॥తిరో తిరో॥

ధిమి ధిమ్కి తోంగతోంగ దిద్ధిమిక్కి ఆరే
మమారే పాత్రారావు మజ్జా మజ్జా
కమలనాభుని తమకపుటింతి నీకు
అమరె తీరుపు ఇదె అవధరించగదో ॥తిరో తిరో॥

ఝుక జక్క జంఝుం ఝుణకిణాని
ప్రకటపు మురువొప్పెత భళా భళా
సకల పతికి సరసపు కొమ్మ నీ
మొకసిరి మెరసె చిమ్ముల మురిపెముల ॥తిరో తిరో॥





మాయిమాయి అలమేలు మంగనాచ్చారి
బాయని వేంకటపతి పట్టపురాణి
మ్రోయ చిరుగజ్జెల నీమాతలానేని
సోయగమైన నీ సొలపు చూపమరె ॥తిరో తిరో॥

**భావామృతం :**

ఓ జవ్వనీ! నృత్యానికి అనుగుణంగా తిరుగు. అట్లు నీవు నర్తించుచున్నప్పుడు నీ మెడలోని తారహారములు తళుకులీనుచు అదిరిపడుచున్నవి. (కదలిపోవుచున్నవి) తిరో తిరో....తిత్తి తిత్తి ఈ.

పద్మనాభుడైన శ్రీమన్నారాయణుని మైమరపించు భామినీ! ఆ నృత్యగీతమునకు సమమగునట్లు (తీరుపు) నీ హావభావములన్నియు అమరియున్నవి. ఇదిగో నీవు ఇక సావధానురాలవై సిద్ధముగానుండుము. ధిమి ధిమ్కి, తోంగ తోంగ,దిద్ధిమిక్కి, ఆరే...మమ్మారే... పాత్రకనుగుణంగా వున్నది సెబాసూ! సెబాసూ!

సకలమునకు, సర్వమునకు అధినాథుడైన జగన్నాథుని ప్రియరాలా! నీ ముఖశోభ మెరిసిపోవుచున్నది. నీ నడకలలో కులుకులు (మురిపెములు) విరజిమ్మబడుచున్నవి. ఇక ఝుక జక్క, జంఝుం, ఝుణకిణా- అని ప్రస్ఫుటమైన నీ సౌందర్యము (మురువు) వెలయుచున్నది. భళా! భళా!

ఓ అలమేలుమంగ నాంచారీ! మఱుగు. (దాచివుంచు తల్లీ!) ఎల్లప్పుడు అనుసరించియేయుండే శ్రీవేంకటేశ్వరుని పట్టపురాణివి. మ్రోగుచున్న నీ చిరు గజ్జెలు చేయుమంజులమైన సవ్వడులు పారవశ్యముతో కూడిన నీ చూపులతో కలసి ఇంకా మనోహరమై చూపట్టుచున్నవి.

## 2-30

### మున్నుడి

గోవిందరాజస్వామిని సేవిస్తూ అన్నమాచార్యులు వారు చెప్పిన మధుర సంకీర్తన ఇది. ఆ వర్ణన చూస్తుంటే స్వామి ఎదురుగా వున్నట్లే అనిపిస్తుంది. కీర్తనలో 'ఉలిపచ్చి నవ్వులు' అల్పమైన మొలక నవ్వు అని అర్థం. అంటే సన్నని చిరునవ్వులు. అంటే కనిపించీ కనిపించని చిరునవ్వు. ఈ పదాలు ఆచార్యులవారి కెలావస్తాయో అబ్బురమే! 'వలకేల కొప్పు' అంటే ఏమిటో ఇద మిద్ధంగా ఏ నిఘంటువులోను నాకు దొరకలేదు. మనోహరమైన వుంగరాల జుట్టు (వలలాగ కనిపిస్తుంది కదా!) వున్నకొప్పు అని భావించాను.

**కం॥ గోవిందరాజు గొల్వగ**
**ఈ విధినా అన్నమయ్య యింపుగ పాడెన్**
**సేవించి తలచె వరదుడు**
**శ్రీ వేంకటే విభుడటంచు జెప్పెను కృతులన్.**

**రాగం : సింధుభైరవి**

కొమ్మలాల యెంతవాడె గోవిందరాజు
కుమ్మరించీ రాజసమే గోవిందరాజు ॥కొమ్మలాల॥

ఉలిపచ్చి నవ్వులతో ఒత్తిగిలి పవళించి
కొలువు సేయించుకొనీ గోవిందరాజు
జలజాక్ష, లిద్దరును సరిపాదాలొత్తగాను
కొలదిమీరమెచ్చీనీ గోవిందరాజు ॥కొమ్మలాల॥

అదెనాభికమలాన అజునిపుట్టించి తాను
కొదలేకవున్నవాడు గోవిందరాజు
చెదరక తన వద్ద సేవసేసే సతులకు
గుదిగుచ్చీ వలపులు గోవిందరాజు ॥కొమ్మలాల॥





ఒప్పుగా వామకరము ఒగిచాచి వలకేల
కొప్పు కడునెత్తినాడు గోవిందరాజు
ఇప్పుడు శ్రీవేంకటాద్రి నిరవై శంఖుచక్రాలు
కుప్పె కటారము(లు) బట్టె గోవిందరాజు ॥కొమ్మలాల॥

**భావామృతం :**

ఓ యువతుల్లారా! (వూరేగింపులో వున్న సాటి స్త్రీలతో అన్నమయ్య తానూ ఒకర్తెగా భావించి పాడుతున్నారు) ఈ గోవిందరాజస్వామి ఎంతటివాడో చూశారా. ఈయన తన రాచఠీవినంతా కుమ్మరించి మనపై కురిపిస్తున్నాడు. ఎంత మనోహరుడు ఈ గోవిందరాజు.

ఈ స్వామి సన్నని లేతమొలక నవ్వులు చూడండి. ఎంత సొగసుగానున్నాయో! ఒత్తిగిలి పవళించిన ఈయన విరాజమానుడై కొలవుదీరియున్నాడు. పద్మములవంటి కన్నులు గల శ్రీదేవి, భూదేవి ఆయనకు చక్కగా పాదములొత్తుచున్నారు. వారిని ఈయన పరిపూర్ణమైన అనుగ్రహంతో మెచ్చుకొంటున్నాడు. (ఎంత చక్కటి భావన!!)

అదిగో చూడండి ఈ మహానుభావుడు తన నాభిలోంచి పుట్టిన పద్మములో పుట్టుకలేని బ్రహ్మదేవుని పుట్టించి ఈ జగద్రచనకు కారణభూతుడైన ఆదిమూర్తి. ఈయనకు కొదవ అనేది వుంటుందా? లేనేలేదు. తనకు సేవచేయుచున్న భార్యలిద్దరినీ (లక్ష్మీదేవి, భూదేవి) అతిశయించిన వలపులలో ముంచెత్తుతున్నాడు ఈ గోవిందరాజస్వామి.

ఈయన తన ఎడమ చేతిని ఒక విధముగా (సుకుమారంగా కనుపించే దృఢమైనచేయి) చాచియుంచాడు. ఈ గోవిందరాజస్వామి నడినెత్తి మీద వుంగరాల జుట్టు కొప్పువలె బిగించబడి ఎత్తి వుండి 'వల' తీరుగా కనిపించుచున్నది. ఇప్పుడు ఈయనే ఆ వేంకటాద్రి సంస్థానాధీశుడైన శ్రీవేంకటేశ్వరుని వలె భాసిల్లుచున్నాడు. శంఖ, చక్రములను, విచ్చుకత్తిని ధరించిన ఈ గోవిందరాజస్వామిని చూచి, సేవించి, ధన్యులై తరించండి.

**2-31**

## మున్నుడి

'చిత్తశుద్ధిలేని శివపూజలేలరా' అని యోగివేమన అభిప్రాయం ప్రతిఫలించే అన్నమయ్య సంకీర్తన నాస్వాదించండి. 'ఇందుగలడందులేడను సందేహమే వలదన్న' పోతనగారి భావాలూ తొంగిచూస్తున్నాయి.'బంగారమూ మట్టిముద్దా సమానంగా చూడాలనే' గీతా వాక్యమూ తోయజాక్షుడు శ్రీకృష్ణభగవానుని బోధా ద్యోతకమవుతున్నది. 'అంతయు నీవే హరిపుండరీకాక్ష' అని అన్నమాచార్యుల వారూ ఎన్నోసార్లు కీర్తించారు. ఇది చదివాకనైనా పూజ అంటే ఏమిటో తెలిసి స్వామిని సేవిద్దాం.

**ముత్తకోకిల॥**

**పూజయేదియొ అన్నమాచార్యుడు పూని తావివరించెరా**
**పూజ జేసిన గాదురా మరి పూలు బుట్టెడు తెచ్చియున్**
**ఈ జగంబులనేలు నాథుడు యెవ్వడా 'మలయప్పయే'**
**ఏజంపంబులు వద్దురా మదినెంచి నిల్పుము చాలదా!!**

**రాగం : బౌళి**

నిండు మనసే-నీ పూజ
అండగోరకుండు- టదియు నీ పూజ ॥నిండు॥

ఇందు హరి గల దందు లేడనేటి
నిందకు బాయుటే- నీ పూజ
కొందరు చుట్టాలు-కొందరుపగనే
అందదుకు మాను-టదియె నీ పూజ ॥నిండు॥

తిట్లులు గొన్నని-దీవెన గొంతని
నెట్టుకోనిదే-నీ పూజ
పెట్టిన బంగారు- పెంకును నినుమును
అట్టే సరియను -టదియు నీ పూజ ॥నిండు॥





సర్వము నీ వని-స్వతంత్ర ముడిగి
నిర్వహించుటే- నీ పూజ
పర్వి శ్రీవేంకట- పతి నీ దాసు ల
పూర్వ మనియెడి- బుద్ధి నీ పూజ ॥నిండు॥

**భావామృతం :**

పరిపూర్ణమైన మనస్సును పరమాత్ముడవైన నీ కర్పించుటయే నీకు నిజమైన పూజ. మానవమాత్రులైన రాజులనో, ధనవంతులనో ఆశ్రయించి వారి అండదండలు కొరుకొనకుండుటయే నీ నిజమైన పూజ.

శ్రీ హరి ఇక్కడున్నాడు అక్కడలేడు అను చెడుమాటలకు తావివ్వకుండుటయే నీ శ్రేష్ఠమైన పూజ. మానవులలో కొందరు నాబంధువులు కొందరు పగవారు అనే అందదుకు (మిక్కిలి బేధ భావము) లేకుండుటయే నీ నిజమైన పూజ.

పరులమాటలలో కొన్ని నిందలని , కొన్ని దీవెనలని వాటిని బట్టి వికారముల నొందకయుండుటయే నీ పూజ. పెన్నిధియైన బంగారము, మట్టిపెంకు, ఇనుపముక్క మొదలైన వన్నియును సమానమైన విలువగలవానిగా తలంచి వాటిపై ఏ విధమైన వ్యామోహములకు లోను కాకుండుటయే నీ పూజ.

ఏ పని చేసినా సర్వమూ నీవే అనే భావనతో నీ వలననే జరుగుతున్నవనే యోచనతో, తాను స్వతంత్రించక నీ దాసునిగా సర్వమూ నిర్వహించుటయే నీ అత్యుత్తమమైన పూజ. సర్వమూ తానే అయిన ఓ శ్రీవేంకటేశ్వరా! నీ దాసులు అపురూపమైనవారు అనునట్టి బుద్ధిని సదాకలిగియుండులయే నీ నిజమైన పూజ.

**2-32**

## మున్నుడి

అన్నమయ్య సరసశృంగార కీర్తన విని పులకించని రసికులుండరేమో!! అమలిన శృంగారం ఆచార్యుల వారి ప్రత్యేకత. కృష్ణుని లీలలు ఎంతవినినా తనివితీరని భక్తులు మెచ్చే కీర్తన ఇది. గోపికలు ఏ విధంగా శరణు అన్నారో వివరిస్తున్నారు. నవీన'తెలుగు' పిల్లలకు అర్థం కాకపోయినా 'ముఖారి' రాగం ఆ 'లోటు' తీర్చి మురిపిస్తుంది. సాధ్యమైనంత నర్మగర్భంగా వివరించడానికి నేను ప్రయత్నంచేసినట్లు తెలుస్తూనే వున్నది.

**చం॥ పిరుదులు దాటు కేశములె బేలల మానము గప్ప, నవ్వుచున్**
**మురహరి సిగ్గు దోచెనని ముద్దుల 'గున్యుచు' మ్రొక్కిరంచు తాన్**
**నిరుపమమైన కీర్తనము నీటుగ జెప్పెను అన్నమయ్యయున్**
**సరసుడు వేంకటేశ్వరుడె సారస నేత్రుడు కృష్ణుడంచనెన్.**

**రాగం : ముఖారి**

కొలనిలోన మును గోపికలు
మొలక నవ్వులతో మ్రొక్కిరి నీకు ॥కొలనిలోన॥

పిరుదులు దాటిన పించపు టలకల
తురుములు వీడగ దొయ్యలులు
అరిది నితంబము లందునె దారుక
మురిపెపు గరముల మ్రొక్కిరి నీకు ॥కొలనిలోన॥

నిద్దపు మానము నెలతలు లోగుచు
గద్దరి తొడలనె కట్టుచును
ముద్దుటుంగరంబుల కరములతో
ముద్దుల గునియుచు మ్రొక్కిరి నీకు ॥కొలనిలోన॥





పాలిండ్ల పెను భారంబుల కర-
మూలపు మెఱుగులు ముంచగను
వేలపుబ్రియముల వేంకటేశనిను
మూలకు బిలుచుచు మొక్కిరి నీకు. ॥కొలనిలోన॥

### భావామృతం :

పూర్వం రేపల్లెలోని కొలనులో గోపికలు (వస్త్రాపహారివైన నిన్ను చూచి) చిరునవ్వులు ఒలికిస్తూ నీకు మ్రొక్కిరి. (వారికి నీ లీల ఆనందాన్నే ఇచ్చి ఉండాలి కదా!)

పిరుదులు దాటిన కేశపాశములలోని నిడుపైన వెంట్రుకలు విడిపోగా ఆ రమణులు వాటితోనే పట్ట నశక్యమైన తమ పిరుదులను ఎట్లో కప్పుకొని నీకు నమస్కరించిరి.

(ఓ శ్రీకృష్ణా! మానవుల మానాపహరణ చేసి వారి అభిమానాన్నే హరించే నీ కంటే 'ఉపకారి' జీవులకెవరుంటారు?)

నునుపాటి మానమును ఏదో విధంగా లోగుట్లుగా వుంచే విశ్వప్రయత్నంచేస్తూ ముద్దరాండ్రు దిట్టమైన తమ తొడల మరుగునందుంచే ప్రయత్నంలో ముద్దుటుంగరములు వ్రేళ్ళలపై మిలమిలలాడుచుండగా, ముద్దులొలికే తమ కులుకులు ఒలికిస్తు (కృష్ణా! మమ్మల్ని ఏడిపించకు అని) నీకు మ్రొక్కుకొన్నారు.

చేతులెత్తి నీకు నమస్కరించి నప్పుడు ఓ నల్లనయ్యా! వారి కరమూలముల కాంతులు భారమైన పయోధరములను ముంచెత్తి కొంతమరుగు ప్రసాదించినవి. వేంకటేశ్వరుని రూపమున కనువిందుజేస్తున్న నాటి మనోహరా! మిక్కుటమైన ప్రేమలు దాచలేక వారంతా నిన్ను కాస్తమూలకు రావయ్యా మహాప్రభో! అని నీకు చేతులెత్తి మ్రొక్కినారు.

## 2-33

### మున్నుడి

ఏ కోరికా, వికారము, ఏ సంగత్వము లేని సర్వస్థితుడు భగవంతుడు. ఆయనేపరమాత్మ. ఆయన లీలా వినోదం కోసం నిరాపేక్షతో సృష్టిని చేసి, రక్షించి తనే అంతం చేస్తూ వినోదిస్తున్నాడు. ఈ కార్యక్రమంలో జీవులను సృషించుటకు తన 'అంశ' నే వినియోగిస్తున్నాడు. ఆయన నుంచి వుద్భవించిన జీవులందరూ ఆయనే కదా! అందుకనే జీవాత్మే పరమాత్మ. అయితే తన వినోదం కోసం ఒక 'మాయ'ను సృష్టించి దాని పెత్తనంలో జీవికి కోరికను కల్పించాడు. దానిమూలంగా కలిగే వికారాలను సృషించి జీవికి అంటగట్టాడు. బంధాలు, సుఖదుఃఖాలు, రాగద్వేషాలు కల సంసారం అనే మహాసముద్రంలో పడవేసి జీవిదాన్ని ఈదలేక తిప్పలు పడుతుంటే ఇట్లాంటి స్థితిలో కూడ ఈ జీవి తనని కోరితే అనుగ్రహిస్తాడు. లేని వారికి జన్మల తిప్పలు తప్పవు. ఈ జన్మలచక్రంలో తన అనుగ్రహం ప్రకారం కొందరిని ఎంతో ఉన్నతమైన దేవతలుగా, కొందరిని మధ్యములైన మానవులుగా, కొందరిని అధములైన దానవులుగా, భూమిపై కొందరిని పశుపక్ష్యాది జంతువులుగా, కొందరిని వృక్షాలుగా చేసి వీళ్ళందరికీ వారి వారి జీవితకాలంలో కలిగే కోరికల్ని వారి అర్హతల ప్రకారం తీరుస్తున్నాడు. దేవతలంతా ఆయన స్నేహంతో బ్రతకాలని కోరుకుంటే వాళ్ళని గోపకులంలో పుట్టించి వారి కోరికలన్నీ తను కృష్ణుడై తీర్చాడు. కొందరికి తనకు పాలిచ్చే భాగ్యం, కొందరికి స్నేహం, కొందరికి యుద్ధం, కొందరికి తను శిష్యుడుయ్యే భాగ్యమిచ్చాడు. ఎనిమిది మందికి తనకి భార్యలయ్యే భాగ్యమిచ్చాడు. పదహారు వేలమంది రాచకన్నెలకు తను ' భర్త' అయ్యాడు. కుబ్జకు తన బిడ్డతల్లే కావాలంటే బిడ్డనే ఇచ్చాడు. పెళ్ళి ఆవి అడగలేదు, ఈయన ఇవ్వలేదు. గోపికలలో కొందరికి తనతో ఆడి పాడే అదృష్టమిచ్చాడు. కొందరిని బొమ్మలపెళ్ళి చేసుకున్నాడు. అలాంటి మూడు పెళ్ళిళ్ళు వివరిస్తున్నారు అన్నమాచార్యులవారు ఈ కీర్తనలో.

**ఉ॥ ఈడుగుపెండ్లి చేసెదము ఇద్దరినంచని గోకులంబులో**
**కూడగ భామలందరును కొంటెదనంబుల కృష్ణమూర్తి ఆ**
**చేడెల లోన ముయ్యరిని 'చిత్రము' గాతను పెండ్లి యాడుటన్**
**పాడెను అన్నమయ్య తన భావన 'కొండలరాయు' నెంచుచున్.**





**రాగం : మధ్యమావతి**

ఈడగుపెండ్లి ఇద్దరి జేసేము
చేడెలాల ఇది చెప్పెరుగా ॥ఈడుగా॥

పచ్చిక బయళ్ళ పడతి యాడగా
ముచ్చట కృష్ణుడు మోహించి
(వి) వెచ్చపు పూదండ వేసి వచ్చెనట
గచ్చుల నాతిని కానరుగా ॥ఈడుగా॥

ముత్తైపు ముంగిట ముదిత నడవగా
ఉత్తముడే చెలి వురమునను
చిత్తరువు వ్రాసి చెలగివచ్చె నౌళ-
జొత్తుమాని ఇటు చూపరుగా ॥ఈడుగా॥

కొత్త చవికెలో కొమ్మ నిలిచితే
పోత్తున తలబాలు వోసునట
ఇత్తల శ్రీ వేంకటేశుడు నవ్వుచు
హత్తి సతిగూడె నని పాడరుగా ॥ఈడగు॥

**భావామృతం :**

ఓ భామలారా! ఇక్కడ ఈడూజోడూ కుదిరిన పెండ్లిని చేసెదము. ఇది మీరింకెవ్వరికీ చెప్పరుకదా!

పచ్చని పచ్చిక బయళ్ళలో గోపిక ముచ్చటగా ఆడుతుంటే ఆ కొంటె కృష్ణుడు మోహించి, విరిసిన పూలదండను ఆమె మెళ్ళో వేసి వచ్చాడట. అతని మాయలమారి వేషాలు చూశారా. (ఇది ఒకరకం పెండ్లే కదా!)

ముత్యాలు పరచిన తన ముంగిటలో ఒక కన్నెపిల్ల నడచి వస్తుంటే పురుషోత్తముడైన ఆ కృష్ణయ్య ఆ అమ్మాయి గుండెల మీద తన బొమ్మ చేత్తో వ్రాసి వచ్చాడట. అవ్వ!! ఈ రహస్యం దాచుకోకుండా మీరు అందరికీ ఆ నోట ఈ నోట చెప్పి చూపించరు కదా! (ఇదీ ఒక రకం పెండ్లి కాక మరేమిటి?)

కొత్తగా వేసిన పందిరి క్రింద ఒక అమ్మాయి నిలుచుని వుంటే ఈ కొంటె కృష్ణమూర్తి చెలిమితో ఆమె తలపై తలంబ్రాలు పోశాడట. మరి అది పెండ్లి కాదా? ఈ ప్రకారం శ్రీవేంకటేశ్వరుడే ఆ కోణంగి కృష్ణుడై నవ్వుతూ ఒత్తుకొని తన భామని కూడెనని మీరంతా పాడరు కదా!

## 2-34

### మున్నుడి

అన్నమాచార్యుల వారు ఈ కీర్తనలో తనను రామదూత హనుమగా 'భావించి', శ్రీవేంకట రఘువీరునికి సీతవృత్తాంతము నెరింగించి, నీవు ఇచ్చిన 'ముద్రవుంగరము' (ముద్దుటుంగరం కాదు), స్వీకరించవయ్యా అని 'రామక్రియ' రాగంలో రఘురాముని యొక్క 'రామ' (నారి) గురించి అద్భుతంగా పాడుతున్నారు. దశరథ తనయునికి దశశిరుని (రావణుని) తలలనుత్తరించి దక్షిణదిశనున్న ధరణీనందనను కాచి దశదిశలలా కీర్తినొందమని చెబుతున్నారు.

**మ॥ ఘనుడౌపావని నావహించుక మదిన్ గానంబు తానీవిధిన్**
**వినిపించెన్ మన తాళ్ళపాక గురువా వీరాగ్రణిన్ గొల్చుచున్**
**వనజాక్షున్ తిరువేంకటేశ్వరుని శ్రీవత్సాంక సంభూషితున్**
**తన రామయ్యగ నెంచి మాత తను సందర్శించుటన్ జెప్పెరా.**

**రాగం : రామక్రియ**

ఇదె శిరసుమాణిక్యమిచ్చి పంపె నీకు నాకె
అదనెఱిగి తెచ్చితి నవధరించవయ్యా ॥ఇదె శిరసు॥

రామ నిను బాసి నీరామ నే చూడగ నా-
రామమున నిను పాడె రామరామ యనుచు
ఆ మెలుత సీతయని యపుడు నే తెలిసి
నీ ముద్ర వుంగరము నే నిచ్చితిని ॥ఇదె శిరసు॥

కమలాప్తకులుడ నీ కమలాక్షి నీ పాద
కమలములు తలపోసి కమలారి దూరె
నెమకి యాలేమను నే నీదేవి యని తెలిసి
అమరంగ నీ సేమమటు వినిపించితిని ॥ఇదె శిరసు॥





దశరథాత్మజ నీవు దశశిరుని జంపి యా-
దశనున్న చెలిగావు దశదిశలు పొగడ
రసికుడ శ్రీ వేంకట రఘువీరుడ నీవు
శశిముఖి చేకొంటివి చక్కనాయె పనులు ॥ఇదె శిరసు॥

**భావామృతం :**

ఓ శ్రీరామచంద్రా! ఇదిగో ఆ సీతమ్మతన తలలో ధరించిన మాణిక్యమును (చూడామణి) నాకు ఇచ్చి నీ కిమ్మంటే, సమయం చూచి (రాక్షస స్త్రీలు చూడకుండా) దానిని తెచ్చాను. స్వీకరింపుము ప్రభూ!

శ్రీరామా! నీకు దూరమైన నీ నారి (రామ) ని నేను చూచినప్పుడు ఆ వనములో (రామములో) రామ రామయనుచు నీ నామ సంకీర్తనమే నిరంతరము చేయుచుండినది. అప్పుడు నాకు (తరుణి) తప్పక నీ సీత అయివుంటుందని అనిపించి, తెలుసుకొని శ్రీరామముద్ర వున్న నీ వుంగరమును నీ ఆనవాలుగా ఆమెకు ఇచ్చాను ప్రభూ!

ఓ సూర్యవంశజుడా! పద్మనయన అయిన నీ సీత నీ చరణాంబుజములనే తలపోసి కమలములకు శత్రువయిన చంద్రుని నిందించుచున్నది (తన విరహ బాధను పెంచుతున్నాడని). అటువంటి ఆ దేవిని వెదకి నేను అశోకవనములోనున్న ఆమె నీ భార్యగా గుర్తించి సిద్ధమై నీక్షేమ సమాచారమును ఆమెకు విశదీకరించాను.

ఓ దశరథ కుమారా! నీవు పదితలలున్న ఆ దక్షిణదిశ వాసిని సంహరించి, నీ సీతను కాపాడుము. దశ దిశలా నీ కీర్తిని నిలుపుము. అట్లే, రసికాగ్రణివైన ఓ వేంకట రఘువీరా! నీవు ఆ తరువాత చంద్రవదనయైన సీతమ్మను స్వీకరించగా కార్యములన్నియును సిద్ధించినవి.

**2-35**

## మున్నుడి

అన్నమాచార్యులవారి ఈ సంస్కృత కీర్తనము అమృతసేవనమే అని నా భావన. ప్రతి కీర్తనలో వలేనే ఇందులో కూడా కొరుకుడు పడని రెండు మాటలున్నాయి. 'బృందారకాధీశు' దంటే దేవతల అధినాధుడైన ఇంద్రుడు అని అర్థం. అట్లాగే 'కరపురనాధ సంరక్షణే తత్పరం' అంటే శ్రీనివాసునిగా తన మామగారికి వాగ్దానం చేసిన ప్రకారం కరిపుర ఏలికను కాపాడతానని చినమామగారు తొండమానుని, తన బావమరిదిని సదా సంరక్షించు దీక్షగల స్వామి. అన్నమయ్య అద్భుతసృష్టి ఇది.

**కం॥ బృందారకాధినాధుడు**
**వందనములు సేసిగొల్చు వసుదేవసుతున్**
**సుందరముగ 'గీర్వాణి'ని**
**అందంబుగ అన్నమయ్య హరి గీర్తించెన్.**

**రాగం : శ్రీరాగం**

వందే వాసుదేవం శ్రీపతిం
బృందారకాధీశ వందితపదాబ్జం ॥వందే॥

ఇందీవరశ్యామ మిందిరాకుచతటీ-
చందనాంకిత లసచ్చారుదేహం
మందారమాలికా మకుట సంశోభితం
కందర్పజనక మరవిందనాభం ॥వందే॥

ధగధగిత కౌస్తుభాధరణ వక్షస్థలం
ఖగరాజవాహనం కమలనయనం
నిగమాధి సేవితం నిజరూపశేషప-
న్నగరాజ శాయినం ఘననివాసం ॥వందే॥





కరిపురనాథ సంరక్షణే తత్పరం
కరిరాజవరద సంగత కరాబ్జం
సరసీరుహానం చక్రవిభ్రాజితం
తిరువేంకటాచలాదేవం భజే ॥వందే॥

**భావామృతం :**

ఓ వాసుదేవా! నీకు వందనమాచరించెదను. ఓ లక్ష్మీపతీ! నిన్ను కీర్తించెదను. సురేంద్రుడైన వాసవునిచే కొలువబడు పాదపద్మములు గల ఓ దేవా నీకు భక్తితో నమస్కరించు చున్నాను.

మెరిసిపోవు నల్ల కలువ వంటి దేహచ్ఛాయ గల స్వామీ! ఇందిరాదేవి కుచగిరుల నలంకరించిన చందనముచే యేర్పడిన గుర్తులచే ప్రకాశించు సుందరమైన శరీరంగల రమణుడవు. మందారపుష్పమాలలచే చేయబడిన కిరీటముచే బాగుగా శోభిల్లు దేవదేవుడవు మన్మథుని జనకుడవు. (అతని కంటే సుందరుడవని వేరే చెప్పాలా?) చతుర్ముఖ బ్రహ్మ నివాసమైన పద్మము నాభిలోనున్న వాడవు. అట్టి నీకు నేను భక్తితో నమస్కరించుచున్నాను.

వక్షస్థలమున కౌస్తుభమణి ధగధగలాడునట్లు ధరించుస్వామివి. పక్షీంద్రుడైన గరుత్మంతుని వాహనముగా స్వీకరించినవాడవు. పద్మదళముల వంటి కన్నులు గలవాడవు. వేదములచే బాగుగా కీర్తించబడువాడవు. నిరాకార నిరంజనుడవైననూ నీ ఆశ్రితులు నిన్ను సేవించుటకు నిజరూపము ధరించి ఆదిశేషుని తల్పముగా చేసికొని శయనించు శేషశాయివి. ఘనమైన వైకుంఠము నివాసముగా కలవాడవు.

కరిపురాధీశుని కాపాడుతానని వాగ్దానం చేసి తనశంఖచక్రాలతోనే ప్రత్యక్షంగా పోరాడిన దీక్షాదక్షుడవు. గజేంద్రుని కాపాడుట కాయత్తమైన కరకమలములు గల దేవుడవు. పద్మముఖుడవు. సుదర్శన చక్రముతో దేదీప్యమానంగా ప్రకాశించువాడవు. తిరుమలాధీశుడైన శ్రీవేంకటేశ్వరుడవు. ఓ మహానుభావా! అట్టి నిన్ను నేను భజించెదను గాక!

**2-36**

## మున్నుడి

గరుడాచలమున (అహోబలమున) వెలసిన నరసింహస్వామి, వేంకటేశ్వరుడే అని భావించి అన్నమాచార్యులవారు ఎన్నో మధురసంకీర్తనలు పాడారు. ఇలవేలుపైన ఆ నృసింహుని కీర్తనలు జనబాహుళ్యంలో గొప్పఆదరణను కూడా పొందాయి. 'అరుదుగా' అనే పదాన్ని నేటికాలంలో మనం 'అప్పుడప్పుడు' అనే భావనతో వుపయోగిస్తాం. కానీ 'అరుదుగా' అంటే 'అత్యద్భుతంగా' అని అర్థం. నృసింహుడు అరుదుగా కాచే అనంతుడు అన్నారు ఆచార్యులవారు. అవధరించండి...

**ఆ.వె॥కంటిమితనినేడె గరుడాచలంబున**
**ఇంటివేయిపయిన ఈశ్వరుడిని**
**పనిచి అన్నమయ్య ప్రహ్లాదవరదుని**
**వేంకటేశుడనుచు వినుతిజేసె.**

**రాగం : శుద్ధధన్యాసి**

కంటిమి నేడిదె గరుడా చలమున
యింటి వేలుపగు యీశ్వరుడితడు. ॥కంటిమి॥

శ్రీనరసింహుడు చిన్మయ కాంతుడు
దానవాంతకుడు దయానిధి
నానామహిమల నమ్మిన వారిని
వూనక కాచే పోషకుడితడు ॥కంటిమి॥

దేవాదిదేవుడు దినకరతేజుడు
జీవాంతరంగుడుశ్రీవిభుడు
దైవ శిఖామణి తలచినవారికి
సేవలుగొనికాచే విభుడితడు ॥కంటిమి॥





పరమమూర్తి హరి ప్రహ్లాదవరదుడు
కరుణానిధి బుధకల్పము
పరగు శ్రీవేంకటపతి తనదాసుల-
నరుదుగ కాచే అనంతుడితడు. ॥కంటిమి॥

**భావామృతం :**

నేడు ఈ గరుడాద్రిపై అహోబల నరసింహస్వామిని చూచుచున్నాము. ఈ నృసింహుడు మనందరికి ఇలవేలుపు. మనల్నిరక్షించే సర్వేశ్వరుడు ఈ మహానుభావుడే.

ఈ శ్రీనృసింహుడు చిన్మయమూర్తి అయిన ప్రభువు. ఈయన దానవులను మట్టుబెట్టుటకై అవతరించిన దయాసముద్రుడ.తననే నమ్ముకొని 'అన్యధాశరణంనాస్తి' అని శరణు వేడినవారిని రకరకములైన మహిమలను చూపి, పూనుకొని రక్షించే సర్వజన పోషకుడు. (ఈ స్వామిని ఆశ్రయించండి)

ఈ నృసింహుడు దేవతలందరికీ ఆరాధ్యదైవం. సూర్యకాంతితో వెలుగులు విరజిమ్మే తేజోమూర్తి. జీవులందరికీ అంతరాత్మగానున్నవాడు ఈ లక్ష్మీకాంతుడే. దేవతలందరికీ ఈయన శిరోమణివలె ప్రసిద్ధిజెందియున్నాడు. తననే ధ్యానించువారిని, సేవించువారిని కాపాడే వాడే ఈ జగన్నాధుడు. (ఈ మహానుభావుని ఆర్తితో వేడుకోండి)

ప్రహ్లాదుని రక్షించుటకే అవతరించిన ఈ దివ్యమూర్తి పరమమొసగుమూర్తి. ఈయన కరుణానిధి. జ్ఞానమూర్తులయిన పండితులకు ఈ స్వామి కల్పవృక్షము వంటివాడు. ఈయనే తిరుమల కొండపై శోభిల్లు శ్రీవేంకటేశ్వరుడు కూడా. ఈయన తనకు దాసులైన తన భక్తులను అత్యద్భుతముగా కాపాడు అనంతుడు (ఎన్నటికీ అంతము లేని వాడు) ఈయనను శరణని తరించండి.

## 2-37

### మున్నుడి

వైష్ణవుడై యుండట మంటే పెద్ద పెద్ద పంగనామాలు ధరించి శంఖుచక్రాలు భుజకీర్తులుగా ధరించి మడీదడీ అని ఆచారం పాటించి ఏవేవో మంత్రాలు చదివి పూజలు చేయటంకాదు అంటున్నారు అన్నమాచార్యులవారు. మతము మనోనిగ్రహానికి రాచబాటకావాలి కానీ ఏవేవో ఆచారాలు మాత్రమే అవసరం అని చేప్పేనిరంకుశం కాకూడదు. నాడు గీతాచార్యుడు చెప్పిన ధర్మం వదలివేసి ఏవేవో ధర్మాల వెంటబడితే ప్రయోజనం శూన్యం. ఈ చెవితో విని ఆచెవితో వదిలేయక వినండి మరి...

**చం॥ ఘనమగు వైష్ణవం బనగ కాదుర యొక్కమతంబు మాత్రమే**
**వినుమని సారమంత విడిబెట్టెను అన్నమయ తాళ్ళపాకలో**
**గొనకొని సర్వధర్మముల గ్రుంకక దిక్కని వేంకటేశునే**
**మనమున నెంచుమా శరణు మాకిక నీవని 'వైష్ణవం' బదే.**

**రాగం : మలహరి**

వలెనను వారిదె - వైష్ణవము- ఇదె
వలపు దేనె పో-వైష్ణవము ॥వలెనను॥

కోరిక లుడుగుచు-గుణి నిన్నిటిపై
వైరాగ్యమె పో-వైష్ణవము
సొరకు గోపము-జలముదనలో
వారించుట పో-వైష్ణవము ॥వలెనను॥

సుడిగోను దేహపు-సుఖదుఃఖములో
వడి జొరనిదె పో-వైష్ణవము
ముడివడి ఇంద్రియ-ముల కింకరుడై
వడబడ నిదెపో-వైష్ణవము ॥వలెనను॥





ఉదుటున దన సక-లోపాయంబులు
వదలుట పో నిజ- వైష్ణవము
ఎదుటను శ్రీవేంక-టేశ్వరు నామము
వదనము చేర్చుట పో- వైష్ణవము. ॥వలెనను॥

### భావామృతం :

ఎవరు నాకు కావాలి అని స్వీకరించితే వారిదే వైష్ణవము. ఈ వైష్ణవతత్త్వము జాతి, దేశ పరిమితులు లేక మకరందపు సౌరభాలను యెల్లెడల విరజిమ్ముతుంది పో. దీంట్లో సందేహం లేదు.

మనస్సులో వివిధమైన కోరికలను విడనాడి, భోగములపై విముఖులై వైరాగ్యభావం అలవరచుకొనుటయే పో వైష్ణవమంటే. ప్రతిసారీ తనలో తొంగిచూచే క్రోధాన్ని నిగ్రహించి తలయెత్తకుండా అదుపులో వుంచటమే పో వైష్ణవమంటే. (డాంబికంగా నామాలు పెట్టుకోవటం కాదు).

సుడిగాలిలా చుట్టుముట్టి దేహాన్ని వ్యాకులపరుస్తుంటాయి సుఖ దుఃఖములు. నిజమైన వైష్ణవమంటే ఈ ద్వంద్వముల పీడనుంచి విముక్తుడవుటయే పో. వేరేమీ కాదు. విడిచిపెట్టకుండా తగులుకొని వేదించే ఇంద్రియములకు బానిసకాకుండ, వాటికి లొంగిపోకుండుటయే పో వైష్ణవం అంటే. (ఇంకామరేమియూకాదు).

పూనికతో సర్వధర్మములను పరిత్యజించి సర్వేశ్వరునికి శరణాగతి నొందుటయే పో వైష్ణవమంటే. వదలక ప్రత్యక్షముగా మనయెదురున్న శ్రీవేంకటేశ్వరుని నామమును (బొట్టుకాదు) నీ వదనమున చేర్చుట అంటే నోటితో పలుకుటయే పో (ముఖంపై పెట్టుకోవటంకాదు) వైష్ణవం అంటే. ఇవేవీ చేయకుండా ఏవేవో ఆచారాలు పాటించి మడీదడీ అంటే అది వైష్ణవం కానే కాదు.

## 2-38

### మున్నుడి

శ్లో॥ వేంకటాద్రి సమంస్థానం బ్రహ్మాండే నాస్తికించన
వేంకటేశసమోదేవో న భూతోర్న భవిష్యతి.

ఈ కీర్తనకి ఈ దివ్యశ్లోకమే స్ఫూర్తి అయివుంటుంది. ఏడుకొండల మహిమను వర్ణిస్తున్నారు అన్నమయ్య. అర్థం తెలియకపోయినా నాబోటివాళ్లంతా విరివిగా వాడే పదములెన్నో ఈకీర్తనలో వున్నాయి, 'నిట్టచరుల','కాణాచి', 'కొటారులు' ఇత్యాదివి. ఈ రూపేణా తెలుసుకొని నేను ధన్యుడనైనాను. అన్నీ చేసేది శ్రీనివాసుడే, చేయించేదీ శ్రీనివాసుడే. నా బోటివాళ్ళు కేవలం 'నిమిత్తమాత్రులు'. నిజం....

**ఉ॥ కట్టెదులన్ కనుంగొనరె గ్రక్కున,నయ్యది విష్ణులోకమే**
**తెట్టెలగట్టెనో మహిమ దీటుగ, ఈ తిరుశైల పంక్తిపై**
**చుట్టుమువోలె శ్రీవిభుడు శోభనముల్ వెలయించె, గాంచుడీ**
**దిట్టతనాన కీర్తనము తేకొని పాడెను అన్నమార్యుడున్**

**రాగం : హిందోళము**

కట్టెదుర వైకుంఠము కాణాచయిన కొండ
తెట్టెలాయె మహిమలే తిరుమల కొండ ॥కట్టెదుర॥

వేదములే శిలలై వెలసినది కొండ
యేదేస పుణ్యరాసులే యేరులైనది కొండ
గాదివి బ్రహ్మాది లోకముల కొనల కొండ
శ్రీ దేవుడుండేటి శేషాద్రి యీకొండ ॥కట్టెదుర॥

సర్వదేవతలు మృగజాతులై చరించే కొండ
నిర్వహించి జలధులే నిట్టచరులైన కొండ
వుర్వితపసులే తరువులై నిలిచిన కొండ
పూర్వపు టంజనాద్రి యీ పొడవాటి కొండ ॥కట్టెదుర॥





వరములు కొటారుగ వక్కణించి పెంచే కొండ
పరుగు లక్ష్మీకాంతు సోబనపు కొండ
కురిసిన సంపదలెల్ల గుహల నిండిన కొండ
విరివైన దిదివో శ్రీవేంకటపు కొండ ॥కట్టెదుర॥

**భావామృతం :**

ఇదిగో మన యెట్టయెదుటనున్న కొండలను గమనించారా! ఇదే ఏడుకొండలని ప్రసిద్ధి చెందిన తిరుమలకొండ. శ్రీహరి చిరకాల నివాసం (కాణాచి) అయిన వైకుంఠమే ఈ కొండ అని గ్రహించండి. దీని మహిమలన్నీ రాసులుగా పోగయి (తెట్టెలై) ఒకే చోటకుప్పగావున్న మహిమాన్వితమైన కొండ ఇది.

వేదములన్నీ శిలలుగా వెలసినదే ఈ తిరుమల. ఎటుచూసినా, దీనిపై పారే ఏరులన్నీ మహానుభావులు చేసిన పుణ్యముల యొక్కరాసులే. దీని శిఖరములన్నీ ప్రేమతో బ్రహ్మాదిలోకములు రూపం దాల్చినవే. ఈ శేషాద్రి వుంది చూశారా, ఇది సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు వుండే కొండ.

ఈ కొండపైనున్న మృగములు మృగజాతులు అన్నీ కూడా కిన్నెర, కింపురుష, గంధర్వాది దేవతలే. సమస్త సముద్రములు పూనుకొని ఈ కొండపై నిట్టచరులై (సెలయేళ్ళుగా) పారుతున్నాయి. మహర్షులందరు ఈ కొండపైనున్న వృక్షములే సుమా!! ఇదిగో ఎత్తయిన ఈ కొండవున్నది చూశారా, ఇదే తూర్పువైపునన్ను అంజనాద్రి.

పరమాత్ముడొసగిన వరములన్నీ గిడ్డంగులు (కొటారుల) గా వచించబడినదీ సమృద్ధినిచ్చే కొండే. (ఆయన వరములే పెద్దపెద్ద నిలువలు) చూడగా శ్రీనాధుని మంగళప్రదమైన కొండ ఈ తిరుమలయే. సర్వసంపదలు కురిసి రాసులుగా గుహలలో నిండి పోయిన కొండ ఇదే. ఓ ప్రజలార! ఇదిగో ఈ శ్రీవేంకటాద్రి గొప్ప విస్తృతమైన కొండ.

**2-39**

## మున్నుడి

విశిష్టమైన లాలిపాటను అన్నమాచార్యులవారు చిన్నారి 'వేంకట కృష్ణయ్య' కోసం పాడుతున్నారు. గోపికలు నోటితో "నొయ్యనొయ్య" అని ధ్వనులు చేస్తూబాలకృష్ణుని ఆకర్షిస్తూ ఉయ్యాలలో వూపుతున్నారు. "లాలి లాలి" అంటూ వాళ్ళుపాడే లాలి పాట వీనుల విందుగా వున్నది. కొంతమంది కొమ్మలు (యువతలు) "ధిమ్మిధిమ్మి" అంటూ నాట్యం చేస్తున్నారు. ఆనందంతో పరవశించిన 'వేంకట కృష్ణయ్య' కాలి గజ్జెలు "ఘల్లు ఘల్లు" మని ధ్వనిస్తుండగా తను కూడా నర్తించాడు. శబ్దప్రధానమైన ఈ కీర్తన నింతకన్న వివరించటం నా వలనవుతుందా?

**ఆ.వె॥"నొయ్య, నొయ్య" అన్నమయ్య పాడిన పాట**
**"లాలి, లాలి" అనుచు పలుకు పాట**
**"ధిమ్మి, ధిమ్మి" ఆడె కొమ్మలు, వేంకన్న**
**గజ్జెలపుడుమ్రోగె "ఘల్లు, ఘల్లు".**

**రాగం : మధ్యమావతి**

ఉయ్యాల బాలునూచెదరు కడు-
నొయ్య నొయ్య నొయ్యనుచు ॥ఉయ్యాల॥

బాల యవ్వనలు పసిడి ఉయ్యాల
బాలుని వద్ద పాడేరు
లాలి లాలి లాలి లాలెమ్మ
లాలి లాలి లాలనుచు ॥ఉయ్యాల॥

తమ్మిరేకు కనుదమ్ముల నవ్వుల
పమ్మిజూపుల బాడేరు
కొమ్మలు మట్టెల గునుకుల నడపుల
ధిమ్మి ధిమ్మి ధిమ్మినుచు ॥ఉయ్యాల॥





చల్లు చూపుల జవరాండ్రు రే-
పల్లెబాలుని పాడేరు
బల్లిదు వేంకటపతి జేరందెలు
ఘల్లు ఘల్లు ఘల్లనుచు. ॥ఉయ్యాల॥

**భావామృతం :**

రేపల్లెలో గోపికలందరు ఉయ్యాలలో చిన్ని కృష్ణుని ఉంచి ఊపుతున్నారు. వారు నొయ్య నొయ్య నొయ్యనుచు మధురంగా పలుకుతూ ఆ స్వామిని మిక్కుటముగా నాకర్షించుచున్నారు.

ఆ గోపికలు బాలయవ్వనులు. అనగా అప్పుడే యౌవనం తొంగిచూస్తున్న కన్నెపిల్లలు. వారు బంగారు ఉయ్యాలలో బాలకృష్ణుని యుంచి ఆయన వద్దచేరి లాలిపాట పాడుతున్నారు. వారంతా బృందగానము వలె లాలి, లాలి, లాలెమ్మలాలి, లాలి, లాలి అని మధురముగా పాడుతున్నారు. (జగద్రక్షకుని ఆ విధంగా సేవించే అదృష్టవంతులు. భాగ్యమంటేవారిదే)

నల్లకలువ పూరేకుల వంటి రెండు కళ్ళు (కనుదమ్ములు) ఆ గోపికలు తమ చూపులు ఉయ్యాల కనుగుణంగా అటూఇటూ తిప్పుచూ (పమ్మిచూపులు), తీయగా లాలిపాట పాడుతున్నరు. కొంతమంది యువతులు(కొమ్మలు) తమ మట్టెల సవ్వళ్ళు చేయునట్లు గునకుచు (బ్రౌను నిఘంటువులో ఈ మాటకు 'ఆడపిల్లల పరుగువంటి నడక' అని సూచించబడిందని మహీధర సీతారామశర్మగారు భావించారు) వీనులవిందు కలిగించుచూ ధిమ్మి దిమ్మి ధిమ్మని నృత్యము చేయుచున్నారు.

జవ్వనులు తమ చూపులను నలుదిక్కులా 'చల్లే' వయస్సులో ఉండటం వలన వారు అదే పని చేస్తున్నారు. మరి అప్పుడు పరాక్రమశాలి అయిన మన వేంకటపతి, వరుసగా గుచ్చబడిన అందియలు (చేరందెలు) ఘల్లుఘల్లు మనునట్లు ఈ అన్నమయ్య కీర్తన కనుగుణంగా అందియలు మారు మ్రోగిస్తున్నాడు. (ఓ మహానుభావా! నేనెంత అదృష్టవంతుడిని నేనూ శ్రీవేంకటేశ్వరునే భావించుచున్నాను).

## 2-40

### మున్నుడి

శరాణాగతి పాడవలెనంటే అన్నమాచార్యులవారు అద్వితీయులు. ఆ దారిలో శ్రీవేంకటేశ్వరుని "స్వామీ! నీవే దిక్కు. నాకింకో దారిలేదు 'శరణు' అని వేడుకొంటే తప్పక దారి చూపిస్తాడు. చీమకి, ఏనుగు బలం ఇస్తాడు. కూటికి లేక అటుకులు తినబెట్టినవానికి అష్టఐశ్వర్యములనిస్తాడు. అంతెందుకు, నాబోటి అవిటి అనామకుడితో అన్నమయ్య సేవ ఈ విధంగా చేయిస్తున్నాడు. ఈ కీర్తన 'మున్నుడి' వ్రాసేదాకా దీనికి ఏ పద్యం వ్రాస్తానో దైవసాక్షిగా నాకు తెలియదు. దీనికి శార్దూల వృత్తం వ్రాయాలని నేను అనుకో లేదు. నాకు 'శార్దూల' మంటేభయంకూడాను...

**శా॥ స్వామీ! దిక్కికనీదు నామ మొకటే సంసార సంద్రంబు నే**
**నే మాత్రంబు సంహిపజాల దయతో ఈతాపమున్ దీర్పుమా**
**ఏమో!! యెవ్వడు చూడవచ్చె శరణైయేతెంచి వేంకన్నయే**
**నామానంబును గాచుదారి దెలుపున్ నాకన్నయే తోడవన్.**

### రాగం : హిందోళం

నారాయణా నీ నామమె గతి యిక
కోరికలు మాకు కొనసాగుటకు ॥నారాయణా॥

పైపై ముందట భవజలధి
దాపు వెనక చింతాజలధి
చాపలము నడుమ సంసారజటధి
తేపయేది ఇవి తెగ నీదులకు ॥నారాయణా॥

పండెను ఎడమ పాపపురాశి
అండను కుడిని పుణ్యపు రాశి
కొండను నడుమ త్రిగుణరాశి
నిండ కుడుచుటకు నిలకడ యేది ॥నారాయణా॥





కింది లోకములు కీడు నరకములు
అందేటి స్వర్గాలవె మీద
చెంది అంతరాత్మ శ్రీవేంకటేశ నీ
యందె పరమపద మవల మరేది ॥నారాయణా॥

### భావామృతం :

ఓ శ్రీమన్నారాయణుడా! మా కోరికలు సిద్ధించవలెనంటే మాకు నీ నామ సంకీర్తన తప్ప మరొక దారి లేదు. ఆ కోరికలకు అంతూపొంతూ లేదు. అవి కొనసాగుతూనే వుండాలంటే నీ వొక్కడివే మాకు దిక్కు.

పైనవున్నదేమో పుట్టుకలు తప్పని సరైన భవసాగరము. వెనకాలే దగ్గరగా వెంటవున్నదేమో దుఃఖసాగరము (అన్నీ దుఃఖాలే) మధ్యకాలమంతా చాపల్యంతో కూడిన సంసారసాగరం (దీంట్లో అన్నీ భ్రమలే). దీన్ని ఈదుటకు నాకు తేప (తెప్ప) యేది? (నీ నామస్మరణతప్పఇంకోదారే లేదు.)

ఎడమవైపున అనంతమైన పాపముల రాశి (కుప్ప) పడివున్నది. అక్కడేనా కుడివైపంతా నేను చేసికొనిన పుణ్యముల రాశి కూడా వున్నది. నట్టనడుమవున్నదేమో సత్త్వరజస్తమోగుణములను ఆలవాలమైన త్రిగుణాలరాశి స్థిమితంగా అనుభవించుటకు నిలకడ కూడా లేదు.

మా క్రిందవున్నవన్నీ కీడుచేసే నరకం మొదలైన అథోలోకాలు. పైనున్నవన్నీ స్వర్గం మొదలైన ఊర్ధ్వలోకాలు. ఇక అంతర్యామియై ఓ శ్రీవేంకటేశ్వరుడా! నీవున్న చోటే పరమపదం వున్నది. అదికాక అవతల మరొకటున్నదా? లేదు గాక లేదు.

## 2-41

## మున్నుడి

"ఇప్పుడిటుకలగంటి" అని ఆదిలో అన్నమాచార్యులవారు తన కలలో వేంకటేశ్వరుని, దివ్యతిరుమలక్షేత్రాన్ని కలగన్నానని అద్భుతమైన కీర్తన వినిపించారు. ఇప్పుడు ఆచార్యులవారు ప్రత్యక్షంగా కనులముందు దివ్యతిరుమల క్షేత్రాన్ని చూచి తన్మయులై ఆ భావావేశంలో ఈ అమృతసాన్నం చేయిస్తున్నారు. బృందావని రాగంలోని ఈ కీర్తన నెన్నిసార్లు వినినా తనివి తీరదు. ఈ కీర్తనకు 'మున్నుడి' వ్రాస్తున్నప్పుడు నాకు కలిగిన ఆనందం కూడా వర్ణించలేను. అన్ని పనులు అందరూ చేయలేరు. చేయాలంటే శ్రీహరినే శరణు అనవలసిందే....

**మ॥ "కనుగొంటిన్ అఖిలాండకోటులకు తాగర్తౌ మహాస్వామినిన్**
**అనఘున్ జూచితి పాపరాశి తొలగెన్ "అన్నయ్య వాక్రుచ్చెరా**
**వినిపించెన్ మహనీయ కీర్తనము శ్రీక్షేత్రంబు గీర్తించుచున్**
**గొనినే 'మున్నుడి'వ్రాసి ధన్యుడయితిన్కొల్తున్సదా శ్రీహరిన్.**

**రాగం : బృందావని**

కంటి అఖిలాండ కర్తనధికుని గంటి
కంటి నఘములు వీడుకొంటి నిజమూర్తి గంటి ॥కంటి॥

మహనీయ ఘనఫణామణులశైలము గంటి
బహువిభవముల మంటపములు గంటి
సహజ నవరత్న కాంచన వేదికలు గంటి
రహివహించిన గోపురంబులవె కంటి ॥కంటి॥

పావనంబైన పాపవినాశనము గంటి
కైవశంబగు గగనగంగ గంటి
దైవికపు పుణ్యతీర్థములెల్ల పొడగంటి
కోవిదులు కొనియాడు కోనేరు గంటి ॥కంటి॥





పరమయోగీంద్రులకు భావగోచరమైన
సరిలేని పాదాంబుజములు గంటి
తిరమైన గిరిచూపు దివ్యహస్తము గంటి
తిరువేంకటాచలాధిపు చూడగంటి ॥కంటి॥

**భావామృతం :**

అఖిలాండకోటిబ్రహాండనాయకుడైన స్వామిని, వాటి కర్త మరియు అధినాయకుడైన మహానుభావుని చూచితిని.నా పాపరాశులనెల్ల తొలగించుకొంటిని. ప్రత్యక్షముగా కనుల ముందు కనివించు మూర్తిని గాంచితిని.

మహనీయమైన గొప్ప పడగలు కలిగిన ఆదిశేషుని పర్వతము శేషాచలమును కనుగొంటిని. అక్కడున్న అనేక రకములైన వైభవములతో సహజముగా నేర్పిడిన నవరత్న శోభితమైన బంగారు వేదికలను కనులార గాంచితిని. ఎంతో ఒప్పు అయిన (రహివహించిన), గోపురములనుచూచితిని.

పవిత్రమైన 'పాపనాశనము' అను దివ్యక్షేత్రమును దర్శించితిని. ఎట్లో చేరుకొని సాధించి ఆకాశగంగను దర్శించి (సాన్నమాడి) తరించితిని. దైవికంగా అదృష్టవశమున ఎన్నో దివ్యపుణ్య క్షేత్రములను సందర్శించితిని. మహపండితుల చేత కీర్తించబడునట్టి కోనేటిని చూచితిని.

దివ్యులైన యోగీంద్రులు తమ భావనలలో మాత్రమే సందర్శించగల అద్వితీయమైన పాదపద్మములను జూచితిని. ఇదిగో ఈ తిరుమలను దర్శించండి చరితార్థులవండి అని చూపుతున్న పావనమైన 'హస్తమును' చూచితిని. ఆ విధముగా వాటన్నింటికి అధినాధుడైన శ్రీవేంకటేశ్వరుని దర్శించితిని.

## 2-42

### మున్నుడి

శ్రీనివాసుడు అలమేల్మంగల పరిణయం మహావైభవంగా జరుగుతోంది. ఆవిడా ఆయన స్వయంగా లక్ష్మీనారాయణులే అనునట్లున్నారు. (నిజం కూడా అదే కదా) పెండ్లిలో వుంటే సూనకములు, బాసికములు, హోమగుండాలు, మధుపర్కాలూ, మదనమంత్రాలు, తలంబ్రాలు, కర్పూరవసంతాలు, చవికెలు, పావకోళ్ళు మొదలైనవి ఈ పెండ్లిలోనూ వున్నాయి. అన్నమాచార్యులవారు ఆవివరాలు అద్భుతమైన కీర్తనలో అందిస్తున్నారు. విని తరించండి.

**కం॥ తిరుమలనాథుడి మంగయు**
**నరులారా! లక్ష్మి మరియు నారాయణులే,**
**పరిణయ వర్ణనమన్నయ**
**మురిపెంబుగనాపించె ముదమున వినుడీ.**

**రాగం : ఆహిరి**

లక్ష్మీకళ్యాణము లీలతోబాడే మిదే నేడు
లక్ష్మీనారాయణులే లలనయు నీవును ॥లక్ష్మీ॥

చూపులే చూపులు మీకు సూనకము బాసికము
వూపచున్న గుబ్బలివి బూజగుండలు
తీపులమోవితేనెలు తీరని మధుపర్కము
దాపుగబెండ్లియాడేరయ్య తగుదగు మీకును ॥లక్ష్మీ॥

మాటలు మీకిద్దరికి మదనమంత్రములు
మేటితలబాలు మీలో మించునవ్వులు
గాటమైన పులకలు కప్పురవసంతాలు
నీటునబెండ్లాడరయ్య నెరవేరె మీకును ॥లక్ష్మీ॥





కౌగిలి కౌగిలి మీకు కందున పెండ్లి చవికె
పాగినకోరికలే పావకోళ్ళు
ఆగిన శ్రీవేంకటేశ అలమేలుమంగా నీవు
వీగక పెండ్లాడుడయ్య వేడుకాయె మీకు ॥లక్ష్మీ॥

**భావామృతం :**

నేడు మంగళప్రదమైన కళ్యాణము గురించి పాడి, ఇదిగో ఆ వివరాలు లీలతో చెబుతున్నాము. ఓ మహానుభావా! నీవును ఆ తల్లి అలమేల్మంగ స్వయంగా లక్ష్మీనారాయణులే. (మామూలు పెళ్ళిలో అలా భావించమంటారు, కానీ ఇక్కడ స్వయంగా ఈ వధూమరులు లక్ష్మీనారాయణులే)

మీరు ఒండొరులను పరవశంతో చూచుకొనుచున్నారు. మీ చూపులే సూనకము (స్త్రీలుతలలో ధరించు పాపిడిబిళ్ళ) మరియు బాసికము (వధూవరులు నుదుటకట్టుకొనే పట్టీ). ఊగుచున్న ఘనస్తనద్వయమే ఐరేణికుండలు. మీ మీ మధురాధరసుధయే మధుపర్కము అనే పెరుగు తేనె కలిసిన పానీయం. (మధుపర్కము అంటే వధూవరులకిచ్చే చదివింపు వస్త్రములు అని శ్లేషకూడా ఇక్కడవున్నది) మీరు ఏకమై పరిణయమాడుతున్నారు స్వామీ! మీకు పరస్పరం ఇది తగునట్లున్నది.

స్వామీ! పురోహితులు మీచే వేరే మదన మంత్రాలు చదివించ నక్కరలేదు మీరు మాట్లాడుకొనే మాటలే అలా వున్నాయి. మీరు ఒకరిని చూచి ఒకరు సమ్మోహనంగా నవ్వుకొంటుంటే ఆ నవ్వులు ఒకరిపై ఇంకొకరు తలంబ్రాలు పోసికొంటున్నట్లుంది. ఆ చేతులు ఒండొరుల తలలకు (కావాలని) తగిలించుకొంటున్నప్పుడు కలిగే పులకింతలే కర్పూరవసంతం ఆడుకొంటున్నారా (వెంట్రుకలు నిక్కబొడుచుకొంటే అలాగే వుంటుంది) అనునట్లున్నది. మీ ఇద్దరూ వైభవంగా పరిణయమాడండి స్వామీ మీకన్నీ నెరవేరుతాయి.

మీరుఒండిరులను పరవశించి కౌగిలించుకొనగా తాపముదీర్చు ఆ ఆలింగనమే వివాహమండపమా అనిపిస్తోంది. వ్యాపించినగాఢమైన కోరికలే పావకోళ్ళు (వరుడు ధరించుకొయ్యపాదరక్షలు). నిలిచిన ఓ శ్రీవేంకటేశ్వరా! నీవూ, నీదేవేరియైన అలమేలుమంగమ్మ వెనుదీయక నిత్యకళ్యాణం జరుపుకోండి. మీకు అదొకవేడుక. (మాకు అదే భాగ్యము.)

## 2-43

### మున్నుడి

అన్నమాచార్యులవారు శ్రీవేంకటేశ్వరుని కృపలేకపోతే, తను అన్నివిధాలా అసమర్థుడననీ ఆయనకు మొక్కి శరణు జొచ్చితే ఆయన్ని కీర్తిస్తే తనంత బలవరి ఉండడనీ పిరికితనం పటాపంచలవుతుంది. అంటున్నారు. మానవులకు అజ్ఞానం తొల్లింటిది. అంటే జన్మజన్మకీ పెరుగుతూ ముదిరి పాకాన పడింది. ఇప్పుడు చటుక్కున పొమ్మంటే పోతుందా? సంసారసాగరం దాటగలనా? ఇంద్రియాల పోరును ఆపగలనా? మోక్షం సాధించగలనా? నా మనస్సును వంచగలనా? అంటున్నారు. ఇక మనమెంతండీ....

**ఉ॥ ఎందరితో పెనం దును యెక్కడనే బొరలేను శ్రీపతీ!**
**అందదు లోతు నాకు, ఇక నా భవసాగర మీదసాధ్యమా?**
**డెందము లోన నిల్పి నిను తీవిగ కీర్తన పాడి కొల్చెదన్**
**"పందనుగానునేనుతగు బల్లిదుడన్"యనె అన్నమార్యుడున్.**

### రాగం :సామంతం

ఎందరితో బెనగేను-యెక్కడని పొరలేను
కందర్పజనకనీవె-గతిగాక మాకు ॥ఎందరి॥

నిక్కి నాబలవంతాన-నేనే గెలిచేనంటే
నొక్క పంచేంద్రియముల-కోపగలనా
తక్కిన సంసార వార్ధి-దాటగలనో మరి
దిక్కుల కర్మ బంధము-తెంచివేయ గలనో ॥ఎందరి॥

పన్నుకొన్నపాయమున-పరముసాధించేనంటే
యెన్ననీమాయకుత్తర-మీయగలనా
వన్నెలనామనసే-వంచుకోగలనో మరి
కన్నటి యీప్రపంచమే-కడవగలనో ॥ఎందరి॥





ఉల్లములో నిన్ను ధ్యాన-మొగి నేజేసేదనంటే
తొల్లిటి యజ్ఞానము-తోయగలనా
ఇల్లిదే శ్రీవేంకటేశ-యెదుటనే నీకు మొక్కి
బల్లిదుడనౌదు గాక-పందనే గాగలనా ॥ఎందరి॥

### భావామృతం :

ఓ ప్రభూ! నేనెంతమందితో తలపడగలను? నీవు మాకు రక్షకుడివై మా దిక్కు కాకపోతే, ఓ మన్మథుని జనకుడా! నేనెక్కడికి పోగలను?

అంతులేని గర్విష్ఠినై నాకున్న బలముతో నేనే గెలిచేద్దాంలే అనుకొంటే నాకున్న కళ్ళు, ముక్కు, నాలుక, చెవులు, చర్మం అనే ఐదు ఇంద్రియాలలో ఒక్కదానినన్నా గెలువగలనా? వాటి దాడిని సహించగలనా? మాయతో గూడిన ఈ సంసార సాగరమును దాటే శక్తి నాకున్నాదా? అన్ని దిక్కులా వ్యాపించిన నా కర్మలవలన కలిగిన బంధనములు (తల్లిదండ్రులు, సతీసుతులు, బంధువులు అనే బంధనములు) తెంచుకోగలనా? తండ్రీ! నాకది సాధ్యపడుతుందా?

వయస్సున్ననాడు మోక్షం సాధించాలనే ఆలోచనే కలుగలేదు. ఎట్లాకలుగాతుంది? సాటిలేని నీ మాయకు జవాబు చెప్పగల సామర్థ్యం నాదగ్గరేదీ? రకరకములైన భ్రమలకు లొంగే నా మనస్సును వంచ గలనా? నా యెదుటనున్న ప్రపంచమును గడవ గలనా? అది నావల్లవుతుందా స్వామీ!

ఏదో క్రమక్రమముగా మనస్సు నిగ్రహించి నిన్ను ధ్యానం చేద్దాంలే అనుకొంటే, అనాదిగా వస్తున్న నా ఇదివరకటి అజ్ఞానాన్ని తోసిరాజనగలనా? శ్రీవేంకటేశ్వరా! ఇదిగో నీ ఎదుట జేరి నీకు మ్రొక్కుగానే అంతులేని బలవంతుణ్ణి అవుదును గాక! అటువంటి నేను పిఱికివాడిని కాగలనా? ఏనాటికీ గాను. నేను తప్పక విజేతనవుతాను.

**2-44**

## మున్నుడి

అన్నమాచార్యులవారు 95 సంవత్సారు జీవించి 32000 కుపైగా సంకీర్తనలు రచించి తిరుమలనాధుని నభూతో నభవిష్యతి  అనునట్లు సేవించారు. పన్నెండు సంవత్సరములు అహోబలంలోవుండి శఠగోపయతీంద్రుల ద్వారా విశిష్టాద్వైత మతమును స్వీకరించి అన్నమాచార్యులని ప్రసిద్ధిచెందారు. శ్రీవేంకటేశ్వరునిగా కీర్తించారు. కలశాపురి ఆంజనేయుని కూడా వేంకటేశుని దాసునిగానే కీర్తించారు. ఈ కీర్తన నారాయణుని మేలుకొలుపు.

**చం॥ "తెలతెలవారెనయ్యో! మరిదేనికియింతటి నిద్రమత్తు శ్రీ**
**లలనమనోహరా!"అనుచు లావుగపాడెను అన్నమయ్య"నా**
**పిలుపిది మేలుకొల్పుటకు, వేంకటనాయక! వచ్చిరయ్య నీ**
**కొలువుకు జేరుచున్ సురులుకూడుచు"నంచనె మేటికీర్తనన్.**

**రాగం : కాంభోజి**

ఎందాకనిద్ర నీకిదె తెల్లవారెగదె
ఇందిరారమణ నీవిటు మేలుకొనవే ॥ఎందాక॥

కమలనాభుడ నీకు గంగాది నదులెల్ల-
నమర మొక మజ్జనం బాయతము సేసె
తమితోడ కనకాద్రి తానే సింహాసనము
విమలమై యొప్పెనదే విచ్చేయవే ॥ఎందాక॥

హరి నీకు నజుడు పంచాంగంబు వినిపించ
నిరతమగు వాకిటను నిలిచినాడు
సురలు నీ యవసరము చూచుకొని కొలువునకు
సరవి నా ఇత్తవడి సందడించేరు ॥ఎందాక॥





కామధేనువు వచ్చె కనుగొనుటకై నీకు
శ్రీమహాదేవి నీ చేలాగు కదివో
యీ మహిమ శ్రీవేంకటేశ నీకే చెల్లె
కామించియన్నియును గైకొంటి విపుడు ॥ఎందాక॥

**భావామృతం :**

ఓ ఇందిరా రమణా! (లక్ష్మీపతీ!) నీవు ఎంత దనుక నిద్రించెదవు స్వామీ! తెల్లవారిపోయినది కదా! ఇప్పుడు నీవు మేలుకోవలెను ప్రభూ! (మేమంతా నీ కోసం తపిస్తున్నాము.)

ఓ పద్మనాభా! పవిత్రమైన గంగ మొదలైన నదులన్నీ నీ చిత్తంవచ్చిన దాంట్లో స్నానమాచరించి మమ్మల్ని తరింపజేయమని వేడుకొంటూ నిరీక్షిస్తున్నాయి. నీపై అపేక్షతో ఈ 'కనకగిరి' (అక్కడవున్న స్వామి పైన ఈ కీర్తన చెబుతున్నా రన్నమయ్య) తనంత తానేగొప్ప సింహాసనమై నీకై పవిత్రముగా శోభిల్లుచున్నది. అదిగో తిలకించు ప్రభూ! నీవు లేచివచ్చి ఇటు మమల్ని తరింపచేయుము తండ్రీ!

ఓ శ్రీహరీ! అజుడు (పుట్టుకలేని చతుర్ముఖ బ్రహ్మ) నీవు స్నానమాడి సిద్ధమవగానే నేటి పంచాగము వినిపించి తిథి వార వర్జ్య విశేషములను నిత్యమూ నీకు తెలిపినట్లే తెలుపుటకు నీ వాకిటిలో నిలిచి సిద్ధముగానున్నాడు.

దేవతలందరూ నీకేమే మవసరమవుతాయో వాటిన్నిటినీ క్రమబద్ధంగా నీ కొరకు సిద్ధముగానుంచుటకు హడావిడి చేస్తున్నారు (ఎంత అద్భుతమైన భావనో చూడండి). కంగారుపడుతున్నారు. లే ప్రభూ!  ఇకనైనా లేచి రావయ్యా!

నిన్ను దర్శించుకొని కావలసినవన్నీ ఏర్పాటు చేయుటకొరకు కామధేనువు కూడా వచ్చేసింది చూడు. నీ చెల్లెలు పార్వతీదేవి (మహాదేవి) నిన్ను భక్తితో స్తుతించుటకు విచ్చేసింది. ఇంత వైభోగం ఇంకొకరికి చెల్లునా? ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు దేనినపేక్షిస్తే అది తక్షణమే సిద్ధమవుతుంది. ఇప్పటికిప్పుడే వీటిని స్వీకరించితివి. ఓ శ్రీపతీ! మహానుభావా! మేమంతా ధన్యతనొందాము.

## 2-45

### మున్నుడి

అన్నమాచార్యులవారు తొలినాళ్ళలో చెప్పిన అత్యద్భుత సంకీర్తన ఇది. అజరామరమైన ఈ కీర్తనను ఈనాటికీ చలనచిత్రాల్లో పాటల రచయితలు (కనీసం కృతజ్ఞతలు తెలపకుండా) తమ రచనగా పేరు బహుమతులు పొందుతున్నారంటే.... ఆచార్యా! వారి తరుపున నేను మీ ఆత్మకు క్షమార్పణలు చెబుతున్నాను.

**సీ॥ నిత్యాత్ముడైయుండి నిత్యుడై వెలుగొందు**
**సత్యాత్ముడైయుండు సత్యమూర్తి**
**ప్రత్యక్షమైంయుండి బ్రహ్మమైయుండేటి**
**తిరువేంకటేశుండు పర మొసంగు**
**ఆ మూర్తి గుణముల నాలపించెను భళా!!**
**మధుర కీర్తనమున సుధలు కురియ**
**ఆ దేవుని విభూతి అన్నమాచార్యుందు**
**తెలుగు కవనమున తెలిపినారు**

**ఆ.వె॥ సందియంబులేల హిందోళ రాగాన**
**పులకరించు తనువు మురియు మనసు**
**వేంకటేశు గొలువ వేవేల పుణ్యాలు**
**తరుగ జేయు నఘపు గిరులనైన**

**రాగం: హిందోళము**

నిత్యాత్ముడైయుండి నిత్యుడై వెలుగొందు
సత్యాత్ముడైయుండి సత్యమై తానుండు
ప్రత్యక్షమై యుండి బ్రహ్మమైయుండు సం-
స్తుత్యుడీ తిరు వేంకటాద్రి విభుడు ॥నిత్యాత్ము॥

ఏ మూర్తి లోకంబు లెల్ల నేలెడు నాత-
డే మూర్తి బ్రహ్మాదులెల్ల వెదకెడె నాత-
డే మూర్తి నిజమోక్షమియ్యజాలెడు నాత-
డే మూర్తి లోకైక హితుడు ॥





ఏ మూర్తి నిజమూర్తి యే మూర్తియునుగాడు
యే మూర్తి త్రైమూర్తు లేకమైన యాత-
డేమూర్తి సర్వాత్ముడే మూర్తి పరమత్ము-
డామూర్తి తిరువేంకటాద్రి విభుడు ॥ ॥నిత్యాత్ము॥

ఏ దేవు దేహమున నిన్నియును జన్మించె
నే దేవు దేహమున నిన్నియును నణగె మరి
యే దేవు విగ్రహంబీ సకల మింతయును
యే దేవు నేత్రంబు లిన చంద్రులు ॥

ఏ దేవుడీ జీవులన్నింటిలో నుండు
నే దేవు చైతన్య మిన్నిటికి నాధార
మే దేవుడవ్యక్తుడే దేవుడద్వంద్వు
డా దేవుడీ వేంక్రటాద్రి విభుడు ॥ ॥నిత్యాత్ము॥

### భావామృతం :

నిత్యమూ ఆత్మస్వరూపుడై నిత్యాత్మునిగా జీవులన్నింటిలోను వెలుగొందుచున్న ఈ మహానుభావుని చూడండి. (ఆ రూపంలో మనికి కనిపించనప్పటికీ...) ఈ తిరుమల నాయకునిగా (మనం) సంస్తుతిచేయుటకు పరబ్రహ్మస్వరూపుడైన ఈ స్వామి మన ఎదుట ప్రత్యక్షమైయున్నాడు.

ఏ మూర్తి ఈ లోకములన్నింటిని యేలుచున్నాడో, ఏ మూర్తిని బ్రహ్మాది దేవతలంతా వెదకురున్నారో, ఏ మూర్తి నిజమైన మోక్షమీయగలడో, ఏ మూర్తిలోకములకు ఏకైక హితప్రదాతయో, ఏ మూర్తి నిజమైన మూర్తియో, ఏ మూర్తి ఎటువంటి 'మూర్తిరూపం' లేనివాడో, ఏ మూర్తిలో బ్రహ్మ విష్ణు మహేశ్వరులు కలసి ఒకటిగానుంటారో, ఏమూర్తి సర్వాత్మునిగా, పరమాత్మగా కీర్తించబడుతున్నాడో అదిగో ఆ తిరువేంకటేశ్వరుడు ప్రత్యక్షంగా కనిపిస్తున్నాడు చూచి తరించండి.

ఏ దేవుని దేహమునుండి ఇవన్నీ (విశ్వమంతా) జన్మించినవో ఏ దేవుని దేహములోనే ఇవన్నీ తిరిగి కలసిపోతున్నాయో, ఏ దేవుని విగ్రహమే ఈ సర్వస్వమంతా అయివుందో, ఏ దేవుని రెండె కన్నులు స్వయంగా సూర్యచంద్రులు అయినవో, ఏ దేవుని చైతన్య స్వరూపం వీటన్నింటికీ ఆధారముగానున్నదో, ఏ దేవుడు అవ్యక్తునిగాను, ద్వంద్వరహితుడై ఏకునిగానున్నాడో (ఒకే...ఒక్కడు) ఆ దేవుడే ఈ వేంకటాద్రినాథుడు. ఈ స్వామిని శరణని సేవించండి.

## 2-46

### మున్నుడి

అన్నమాచార్యులవారి సంస్కృత సంకీర్తనలు చాలవరకు స్తుతిపరమైనవే. అందువలన చాల వరకు ఒకదానినొకటి పోలి ఇదివరకు వినినట్లేవుంటాయి. కేశవ నామాలన్నింటినీ ఒకే కీర్తనలా చెప్పిన ఘనత తాళ్ళపాకవారిది. ఈ కీర్తనలో కూడా అన్నమయ్య శ్రీవేంకటేశ్వరుని 'నిత్యానందు'డని, 'పరిపూర్ణానందు'డని 'నానావర్ణనిజదేహు'డని కీర్తిస్తున్నారు. నీలవర్ణుని అటువంటి విశేషణములతో నుతించుట ఆచార్యులవారి ప్రత్యేకత. 'కైవల్యకాంత శృంగార రమణు'డట స్వామి. ఆహా!.... మనం నిత్యము వుపయోగించే చాలామాటలకి మనకు అర్థం తెలియదు.

**కం॥ కాత్యాయని తను కొలుచును**
**నిత్యము శ్రీకాంతుడైన నీరజనాభున్**
**నిత్యానందుడు అనియెడి**
**సత్యమునా అన్నమయ్య సంకీర్తించెన్.**

**రాగం : ధన్యాసి**

నిత్యానంద ధరణధర ధరారమణ
కాత్యాయనీ స్తోత్ర కామ కమలాక్ష ॥నిత్యానంద॥

అరవిందనాభ జగదాధార భవదూర
పురుషోత్తమ నమో భువనేశ
కరుణాసమగ్ర రాక్షసలోక సంహార
కరణ కమలాధీశ కరారాజవరదా ॥నిత్యానంద॥

భోగీంద్రశయన పరిపూర్ణ పూర్ణానంద
సాగర నిజావాస సకలాధిప
నాగారిగమన నానావర్ణనిజదేహా
భాగీరధీ జనక పరమ పరమాత్మ ॥నిత్యానంద॥





పావన పరాత్పర శుభప్రద పరాతీత
కైవల్యకాంత శృంగారరమణ
శ్రీవేంకటేశ దాక్షిణ్య గుణనిధి నమో
దేవతారాధ్య సుస్థిర కృపాభరణ ॥నిత్యానంద॥

**భావామృతం :**

ఓ భూరమణా! వేంకటనాయకా! నిన్ను ఎంత స్తోత్రించినా తనివి తీరదు. నీవు ఎప్పుడూ నిత్యానందదవు. ఆదివరాహమై భూమండలమును నీ ముట్టిపై ధరించావు. పార్వతీదేవి నిన్ను నుతించగా ఆమె అభీష్టములను ప్రసాదించు వాడవు. పద్మములవంటి (పద్మదళముల వంటి) కన్నుల గలవాడవు.

స్వామి! నీవు పద్మనాభుడవు. విశ్వమున కంతటికీ ఆధారభూతుడవు. సంసారతాపం. హరింపజేయువాడవు. పురుషోత్తముడని పేరుపొందినవాడవు. అట్టి నీకు నమస్కరించెదను. నీవు భువనములన్నింటికీ ఈశ్వరుడవు. పరిపూర్ణమైన దయగలవాడవు. దానవులను ఛేదించి సంహరించువాడవు. లక్ష్మీదేవికి నాధుడవు. గజేంద్రుని మకరము బారినుండి రక్షించిన దేవదేవుడవు.

ప్రభూ! నీవు ఆదిశేషుడే తల్పముగా శయనించువాడవు. పరిపూర్ణడవు. ఏ పని నిర్వహించినా దానిని అశేషముగా నెరవేరుస్తావు. సంపూర్ణమైన ఆనందముతో నుండువాడవు. పాలసముద్రమునకు యజమానివి. సర్పములకు శత్రువైన గరుత్మంతునిపై పయనించు విష్ణుడవు. నీలవర్ణుడడైనా, పాండురంగడివైనా, సత్యనారాయణుడివైనా అనేక వర్ణములతో నొప్పువాడవు. ఆకాశంనుండి అవతరించిన గంగాదేవికి తండ్రివి. సర్వశ్రేష్ఠుడవు. పరమాత్మవు.

ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు పవిత్రుడవు. శ్రేష్ఠులందరికీ శ్రేష్ఠుడవు, శుభములనొసంగువాడవు, శ్రేష్ఠమైన మోక్షమునొసగువాడవు, మోక్షలక్ష్మికి శృంగారనాయకుడవ, కృప, కటాక్షము మొదలైన దాక్షిణ్యగుణములకు నిధియైనవాడవు, దేవతలందరికీ ఆరాధ్యుడవై వారిని సుస్థిరముగా నుంచు దయ ఆభరణమైనవాడవు. ఇన్ని విశిష్టగుణములున్న నీవు నన్ను అనుగ్రహింపుము, తండ్రీ!

**2-47**

## మున్నుడి

పవనపుత్రుడైన కలశాపురం హనుమంతుని కీర్తిస్తూ అన్నమాచార్యులవారు చెప్పిన కీర్తన ఇది. నేటికాలంలో మనం 'బాబోయ్'! అని ఆశ్చర్యపోతుంటే అన్నమయ్యకాలం నాటి తెలుగు వారు 'బాపురే!' అని ఆశ్చర్యపోయేవారు.'బాపు' అంటే 'బాబు'. ఇంకొక విశేషమేమంటే 'సాహసమిటువలె చాటితిగా' అనే మాటనేటి కాలంలో 'సాహసమిట్లు చాటితివిగా', అని ప్రయోగిస్తున్నాం. 'రవిగ్రహణ', 'దశముఖహర అనే మాటలు అన్నమాచార్యులవారి 'ముద్ర' వున్న అసాధారణ సంబోధనలు.

**తే॥ ఓ పవనసుతా! ఓ ఘనా! ఓ కపీశ!**
**బాపురే! నీవు తెగువతో పరగినావు**
**ఆంజనేయుని కొలువున అన్నమయ్య**
**మేటికీర్తన వినిపించె వేంకటేశ!**

**రాగం : శ్రీరాగం**

ఓ పవనాత్మజ ఓ ఘనుడా
బాపు బాపనగ పరగితిగా ॥ఓ పవనాత్మజ॥

ఓ హనుమంతుడ ఉదయాచల ని-
ర్వాహక నిజసర్వప్రబలా
దేహము మోచిన తెగువకు నిటువలె
సాహసమిటువలె చాటితిగా ॥ఓ పవనాత్మజ॥

ఓ రవి గ్రహణ ఓ దనుజాంతక
మారులేక మతి మలసితిగా
దారుణపు వినతా తనయాదులు
గారవింపనిటు కలిగితిగా ॥ఓ పవనాత్మజ॥





ఓ దశముఖహర ఓ వేంకటపతి-
పాదసరోరుహ పాలకుడా
ఈ దేహముతో ఇన్నిలోకములు
నీ దేహమెక్క నిలిచిగా ॥ఓ పవనాత్మజ॥

**భావామృతం :**

వాయునందనుడవైన ఓ ఆంజనేయా! ఓ ఉద్దండుడా! నీ భక్తులందరు 'బాబోయ్' 'అమ్మబాబోయ్' అనునట్లు వర్ధిల్లితివి కదా!

తూర్పునవున్న 'ఉదయాచలము'ను నిర్వహించిన ఓ హనుమంతా! అన్ని విధములా వ్యాపించిన మహానుభావా! సూర్యగమనమునకు అనుగుణంగా మహాకాయమును దాల్చి ఇటువంటి సాహసము చూపించితివి (సూర్యని ద్వారా వేదములను నేర్చుటకు స్వామి గొప్ప ఆకారముతో సూర్యుని అనుసరిస్తూ, వింటూ ఏకసంతాగ్రాహిగా వేద విద్య నేర్చాడు.) ఇటువంటి ధైర్యము (సూర్యుని దగ్గరకు ముఖం పెడితే కాలి బూడిదైపోతాం కదా!) ఇంకకరికి వుంటుందా?

(చిన్నపాపాయిగా వున్నప్పుడే సూర్యుని తినే పండు అనుకొని ఆ సూర్యుని 'గ్రహించుటకు' ఎగిరి పట్టుకోబోయాడు.) అంత అల్లరి పిల్లవాడా! ఓ రాక్షసాంతకా! లంకలో ఎదురులేక చిత్తమొచ్చినరీతి వ్యవహరించితివి కదా! వినతాసుతుడైన గరుత్మంతుడు తను స్వయంగా గొప్ప శక్తిమంతుడై కూడ నిన్ను తన సాటివానిగా గుర్తించి ఆదరించగా ఈ విధముగా ప్రబలినాడువు కదా

పదితలల రావణాసురుని గర్వభంగము జేసిన ఓ మారుతీ! శ్రీ వేంకటేశ్వరుని పాదపద్మములను తలదాల్చు మహానుభావా! ఇటువంటి అసదృశమైన దేహముతో ఇన్నిలోకములను నీ దేహము అధిగమించునట్లు నిలిచితివి కదా! నీ పరాక్రమము సాటిలేనిది.

## 2-48

### మున్నుడి

అన్నమాచార్యులవారు, పరువంలో వున్న సరసమైన ఒక జానపదుల జంటను చూచి ఆ బావా మరదళ్ళ సరసానికి ముచ్చటపడి వారినే ఆ ద్వాపరం నాటి రేపల్లెలోని కృష్ణయ్య అతని మరదలుగా వూహించారు. అప్పుడప్పుడూ మరదలి పరువాలని ఏదోవంకతో తాకుతూ చలోక్తులాడుతున్నాడు ఆ బూటకాల బావ. వాడిగా, గిలిగింత చూపులతో అతనిని మురిపించింది మరదలు. అప్పుడు భావనాకాశంలో ఒక మెఱుపు మెరిసి తను దేవకన్యననీ, అతను స్వయంగా శ్రీమన్నారాయణుడైన శ్రీవేంకటేశ్వరుడని గ్రహించి ఆ బావకు 'దగ్గరై' నీకు తగులైపోయాను బావా! అన్నది.

**చం॥ సరసము తోటి పాడెనిటు జవ్వనియౌజవరాలు బావాతో**
**మరదలి నివ్విధిన్ చెనక మాన్యతకాదుర బావ! యేలనా**
**పరువును తీతువంచు తన బావను వేడెను అన్నమయ్య ఆ**
**తిరుమలనాయకున్ గొలిచె ధీటుగ జానపదంపు కీర్తనన్.**

**రాగం : శుద్ధసావేరి**

ఏలే ఏలే మరదలా
చాలు చాలు చాలును
చాలు నీతోడి సరసాలు బావా ॥ఏలే॥

గాటపు గుబ్బలు కదలగ కులికేవు
మాటల తేటల మరదలా
చీటికి మాటికి చెనకేవు వట్టి
బూటకాలు మాని పోవే బావా ॥ఏలే॥

అందిందే నన్ను అదలించి వేసేవు
మంద మేలపు మరదలా
సందుకో తిరిగేవు సటకారి ఓబావా
పొందు కాదిక పోవే బావా ॥ఏలే॥





చొక్కపు గిలిగింత చూపుల నన్ను
మక్కువసేసిన మరదలా
గక్కున నను వేంకటపతి కూడితి
దక్కించుకొంటివి తగులైతి బావా ॥ఏలే॥

**భావామృతం :**

ఎందుకే! ఎందుకే! మరదలా! (నన్ను లెక్కసేయవు?) చాలు చాలు బావా! నీతో సరసాలు ఇంకచాలు. (నాదారిన నన్ను వదిలేయి.)

ఘనమైన స్తనభారంతో వుక్కిరి బిక్కిరి అవుతున్న నా మరదలా! అవి కదులుతుంటే నువ్వు కులుకుతున్నావు నీ మాటలు అతి సరళంగా మనోహరంగా కూడా వుంటాయి. ఇదిగో బావా! చీటికీ మాటికీ ఏదోవంక పెట్టుకొని నన్ను తాకుతున్నావు. నీవు వట్టి మాయ మాటలు చెప్పేవాడివి. నీ మాటలు కట్టి పెట్టి నీ దారిన నీవుపో నన్ను నా దారిని పోని.

ఓ మరదలా! నన్ను అందిందే (మఱీమఱీ) చిరు కోపంతో గద్దించి పారేస్తున్నావు. నీవు అసలే మంద (దె) మేలపు (ఉపేక్షించు) మరదలివి. ఓబావా! పోపోవే! నీవు అతిచనువుతో నన్ను తాకుతూ తిరుగుతావు. నీవు సటకారి (మోసకారి) వాడివని నాకు తెలుసు. నీతో పొందు (స్నేహం) కుదిరేది కాద కానీపోపోవయ్యా.

ఓ మరదలా! నీ చూపుల తూపులు వాడిగా నాకు గుచ్చుకొని గిలిగింతలు పెడుతున్నాయి నీవు నాకు అతిప్రియమైనదానివి. ఓ బావా! నీవు శ్రీవేంకటేశ్వరుడవై నన్ను సమీపించి నా భావనలలో చటుక్కున నీ వశం చేసుకొన్నావు. నన్ను దక్కించుకొన్నావు. ఇక నీ వశమైపోయాను. బావా! నేను మనోవాక్కాయకర్మలా నీ దానిని.

2-49

## మున్నుడి

అన్నమాచార్యులవారు సర్వరోగ నివారిణియైన ఒకమందు సేవించమని చెబుతున్నారు. “జనకుడు గెలుపుతో గొని బ్రతికినయా మందు”, అనుపాదము వలన దీన్ని ఎన్నుకొన్నాను. శ్రీరామచంద్రుడు దుష్టశిక్షణ కవతరించిన శ్రీహరి అని జనకమహారాజుకు తెలుసు. ఆయన రాజర్షి, తామరాకు పై నీటిబొట్టులా నిస్సంగుడై బ్రతికాడు రాగద్వేషాతీతుడై భవబంధాలపై విజయంసాధించి కర్తవ్యపాలనయే భగవంతునికి కైంకర్యం అన్నట్లు జీవించాడు. ఆయనా ఇదేమందు ఇంకొకలాగ తీసికొన్నాడు.

**ఉ॥ మందులలోన శ్రేష్ఠమగు భాగ్యపు మందిది నారదాదులున్**
**ముందుగ నెంచినారు భళి! మోదముతో ధ్రువుడున్ మునీంద్రులున్**
**పొందుగ గ్రోలిరంచనెను పుల్కలదేరిన అన్నమయ్య ఈ**
**సుందరమైన కీర్తనపు శోభలగాంచుము వేంకటేశ్వరా!**

**రాగం : శంకరాభరణం**

కొనరో కొనరో మీరు-కూరిమి మందు
ఉనికి మనికి కెల్ల-నొక్కటే మందు ॥కొనరో॥

ధ్రువుడు గొనినమందు-తొల్లియు బ్రహ్లాదుడు
చవిగా గొనిన మందు-చల్లని మందు
భవరోగముల వీడి-పారగ బెద్దలు మున్ను
జవకట్టికొనిన ని-చ్చయమైన మందు ॥కొనిరో॥

నిలిచి నారదుడు గొ-నిన మందు జనకుడు
గెలుపుతో గొని బ్రతి-కిన యా మందు
మొలచి నాలుగుయుగ-ముల రాజులు ఘనులు
కలకాలము గొని -కడగన్న మందు ॥కొనిరో॥





అజునకు బర-మాయువై యొసగిన మందు
నిజమై లోకము లెల్ల- నిండిన మందు
త్రిజగములు నెఱుగ-తిరువేంకటాద్రిపై
ధ్వజమెత్తి గోనేటి-దరి నున్న మందు ॥కొనిరో॥

**భావామృతం :**

ఓ ప్రజలారా! అత్యంత శ్రేష్ఠమైన ఈ మందు (ఔషధము) ఏంతో ప్రీతిపాత్రమైనది. ఈ మందు మీరు తప్పక తీసికొనవలెను. మీ అందరి నిలకడకు జీవనమునకు కూడా ఈమందే ఆధారం సుమా!

పూర్వం కృతయుగంలో ధ్రువుడు, ప్రహ్లాదుడు వంటి బాలురు కూడా సేవించి ఏ మాత్రమూ వెగటులేని తీపిమందు అని గ్రహించి ఈ చల్లని మందు సేవించి ధన్యులయ్యారు. మహానుభావులైనవారు చాలమంది అనాదిగా, జమకట్టికొని (స్వాధీనము చేసికొని)శాశ్వతమై భవరోగనాశనియైన ఈ దివ్యౌషధాన్ని సేవించారు.

ఆనాడు త్రేతాయుగంలో జనకమహారాజు రాజర్షియై భవతాపములపై గెలిచి జ్ఞానియై సేవించి తరించిన చక్కటిమందు ఇదే. నారదుడు త్రిలోక సంచారియై తనతో పాటు పలువురికి ఈ మందు త్రాపించి తరింపచేశాడు. ఆయనవలన నాలుగు యుగములలోని రాజులు పుట్టి తమ కర్తవ్యం నెరవేరుస్తూనే ఘనులై ఎల్లప్పుడూ ఈ మందు తీపికొంటూనే తమ జీవితాంతమూ ధన్యతబొందారు.

చిరాయువైన చతుర్ముఖ బ్రహ్మగారు సేవించే ఔషదం ఇదే సుమండీ! ఇదెక్కడ దొరుకుతుందో, అనే సంశయం వద్దు. సత్య స్వరూపముగా లోకములన్నింటి లోనూ నిండివున్న మందు ఇదే. నేడూ తిరువేంకటాచలముపై పవిత్రమైన ఈ కోనేటి ఒడ్డున దొరికే శ్రీవేంకటేశ్వరుడు అనే ఈ మందు సేవించండి. ధ్వజమెత్తి చాటుబడుతున్న ఈ దివ్యౌషధ రాజమును సేవించి తరించండి.

**2-50**

## మున్నుడి

హంపీ విజయనగరంలోని విజయరామచంద్రుని కీర్తిస్తూ అన్నమాచార్యులవారు చెప్పిన అనేక సంస్తుతి కీర్తనలలో ఇది కూడా ఒక ఆణిముత&యం. 'వినుతామరస్తోత్రరాము' 'తామరస్తోత్రరామా! వినవయ్యా' అనుకొనే నాబోటి అఅమాయకులకు ఇది సంస్కృత కీర్తన కాబట్టి దీన్ని 'వినుత అమరస్తోత్ర రామా!' గా అర్థం చేసికొనవలెనని వినతి. 'కలిత ప్రతాఎఎప సుప్రసిద్ధమైన ప్రతాపముకలవాడని. రోజూ పారాయణగా పాడఉకోదగిన అజరాకీర్తన ఈ రామసంకీర్తన.

**ఆ.వె॥ "రామ! దశరథసుత! రాఘవా! కాకుత్థ్స**
**సత్యకాముడీవు సద్గుణడవు.**
**సన్నుతించినారు అన్నమాచార్యులు**
**రాముడిపుడు గిరులరాయుడనుచు.**

**రాగం : విశారద**

రామ దశరథరామా నిజ సత్య-
కామా నమో నమో కాకుత్థ్సరామ ॥రామా॥

కరుణానిధి రామ కౌసల్యానందన రామ
పరమ పురుష సీతాపతిరామ
శరధిభంధన రామ సవనరక్షక రామ
గురుతర రవివంశవ కోదండరామ ॥రామా॥

దనుజహరణ రామ దశరథ సుత రామ
వినుతామర స్తోత్ర విజయరామ
మనుజావతారా రామ మహనీయ గుణరామ
అనిలజప్రియ రామ అయోధ్యారామా ॥రామా॥





సులలితయశ రామ సుగ్రీవవరద రామ
కలుష రావణ భయంకర రామా
విలసిత రఘురామ వేదగోచర రామ
కలిత ప్రతాప శ్రీవేంకటగిరి రామ ॥రామా॥

**భావామృతం :**

శ్రీరామచంద్రుడు, దశరథరాముడు సత్యవ్రత దీక్షాదక్షుడు, కాకుత్థ్స వంశకులదీపకుడు. అట్టి ఓ మహానుభావా! నీకు నమస్కరించుచున్నాను.

శ్రీరామ! నీవు కరుణా సాగరడవైన కరుణానిధివి, కౌసల్యాసుతుడవు, పరమపురుషుడవు, సీతాపతివి, సాగరముపైన వంతెన నిర్మించినవాడవు, విశ్వామిత్రని యాగము (సవనము) ను రక్షించినవాడవు. శ్రేష్ఠమైన సూర్యవంశమున జన్మించినవాడవు. కోదండము అను ధనస్సుని ధరించియే యుందునని దీక్షవహించినవాడవు.

ఓ శ్రీరామచంద్రా! నీవు ఖరదూషణాది రాక్షసులను వేలకొలదివున్నను సునాయాసంగా తుదముట్టించినవాడవు నీవు దశరథనందనుడవు. అమరులైన దేవతల యొక్క స్తోత్రములచే నుతింపబడువాడవు. విజయనగరమున వెలసిన విజయరాముడువు. మానవుని అవతారమును ధరించిన శ్రీమన్నారాయణుడవు.

మహనీయమైన గుణములు కలవాడవు. వాయునందనుడైన హనుమకు ప్రియాతి ప్రియమైన స్వామివి. అయోధ్యా నగరాధీశుడవు.

విమలమైన మనోజ్ఞమైన యశస్సుచే విలసిల్లు మహానీయుడవు నీవు. సుగ్రీవునికి అభయమునొసగి రక్షించితివి. దుష్టుడైన రావణునికి భయంకరుడవు. విలసిల్లి రఘువంశతిలకుడవు. వేదములచేత కనుగొనబడు పురుషోత్తముడే నీవు. సుప్రసిద్ధమైన ప్రతాపము కలిగిన శ్రీవేంటగిరిరాముడు శ్రీవేంకటేశ్వరుడే.

## 2-51

### మున్నుడి

అన్నమాచార్యులవారి మధురశృంగార కీర్తన ఇది. నాయిక స్వామి రాకకై వెన్నెలవేళ ఎదురుచూస్తూ 'విరహోత్కంఠిత'యై తన చెలికత్తెతో వాపోతున్నఘట్టం. ఎంతరాత్రయిందంటే స్తనయుగ్మంపై నున్న ముత్యాలదండలోని ముత్యాలు, నునువెచ్చగా వుండటంపోయి, చల్లబడినవట. కలువకన్నెలు చాల సేపు వికసించి అలసిపోయి కను మోడ్చినవట. 'వెన్నెల వేసంగిమొగ్గ'' అయిన చంద్రుడు వికసించాడట. మాటలు తడబడి, కురులలో పువ్వులనటానికి బదులు పువ్వులలోని కురులు'బుగలు కొనగసెఅసె' (బాగా వ్యాపించివిరిసినవట). వాటిపై తుమ్మెదలు దాడిచేస్తున్నాయట. అహో....

**మ॥ ఉదయాద్రిన్ తెలుపాయె శ్రీవిభుడురాబోడేమిదేమో కదా!**
**ముదితన్ వేరొక దాని జట్టుగొనెనో! మోసంబు జేసేనొకో!!**
**యెదపై ముత్తైపు దండ చల్లబడెనే! యేజాము కానున్నదో!**
**ఇదిగో కీర్తన నన్నమయ్య తెలిపెన్ ఈ లేమతాపంబులన్.**

### రాగం : చంద్రిక

ఉదయాద్రి తెలుపాయె ఉడురాజు కొలువిడె
అదనెరిగి రాడాయె నమ్మ నావిభుడు ॥ఉదయాద్రి॥

చన్నులపై ముత్యాల సరులెల్ల చల్లనాయె
కన్నులకు కప్పొదవె కాంతా నాకిపుడు
కన్నెకలువల జాను కనుమోడ్చినది మీద
వెన్నెల వేసంగిమొగ్గ వికసించె గదవె ॥ఉదయాద్రి॥

పువ్వుల లోపలి కురులు బుగులు కొనగ నెఅసె
దు(ద)వ్వుల తుమ్మెద గములు తరమి డాయగను
రవ్వసేయ శుక పికము రాయ(యి)డి కోర్వగ రాదు
అవ్వల నెవ్వతె పసలకు అలరున్నసవాడో ॥ఉదయాద్రి॥





పన్నీట జలకమార్చి పచ్చకప్రము మెత్తి
చెన్నుగ కొప్పున విరుల చెలువందురిమి
ఎన్నగల తిరువేంకటేశుడిదె నను గూడె
కన్నులు మనసును తనియ కరుణించె గదవె ॥ఉదయాద్రి॥

### భావామృతం :

ఓ చెలియా! ఇదెక్కడి చోద్యమే!! రేరాజు (చంద్రుండు) కొలువుదీరి వచ్చాడు. తూర్పుకొండ తెల్లబడిపోయింది. ఇది సరియైన 'సమయం' అని తెలిసికూడా అతగాడు (స్వామి) ఇంకారాడు. ఇదేమిటమ్మా! నా నాధుడు ఎందుకు రాడు?

ఎంతరాత్రయిందంటే రాత్రిచలికి నాస్తనయుగ్మం పైనున్న ముత్యాలదండ చల్లబడిపోయింది. ఓ రమణీ! నాకిప్పుడు కళ్ళుకూడా కూరుకుపోతున్నాయి. మేలుజాతి కలువకన్యలు పాపం కళ్ళుమోడ్చినవి. ఆకాశంలోనున్న ఆ 'వెన్నెల వేసంగి మొగ్గ' (చందమామ) వికసించాడు. (బాగుగా పైకి వచ్చి కాంతులు వెదజల్లుతున్నాడు.) ఇతగాడు ఇంకారాడేమిటే?

ఇది చూశావా? పువ్వులలోని కురులు, కాదు కాదు కురులలోని పువ్వులు 'బుగులు కొనగ నెఅసి'నవి (బాగుగా వ్యాపించి విరిసినవి.) దువ్వుల (దవ్వుల అనగా చాలదూరము వరకు) తుమ్మెదలు ఆ తలలోని పూలపై వాలి మకరందం తాగేయాలని తరిమి తరిమి వెంటపడుతున్నాయి. చిలుకలు గోరింకలు రకరకాల ధ్వనులు చేస్తున్నాయి. నేను ఈ రాయడి (రాయిడి అయివుండవచ్చు ఎందుకంటే రాయిడి అంటే ఉపద్రవం అని అర్ధమున్నది) ఓర్వలేకపోతున్నానే. కొంపతీపి ...అక్కడ పవళింపు సేవకు ఇంకెవ్వతైనా దొరికిందా యేమిటే... అతగానికి. దానికి అలవాటు పడలేదు కదా!

(క్షణకాలంలో అమ్మవారి లాలిత్యం అసూయను గెలిచి వెంటనే ఆమె చల్లటి పన్నీటితో స్నానం చేసి ఒళ్ళంతా పచ్చకర్పూరం పరమళభరితంగా మెత్తుకొని, అందంగా తన కొప్పులో పూలు తురిమింది. ఇంతలో ఎన్నగల (అత్యధికుడైన) కరుణాంతరరంగుడై స్వామి నన్ను కూడినాడు. దానివలన ఆమె కన్నులు మనస్సు అమితంగా తృప్తిచెందాయి.

## 2-52

### మున్నుడి

అన్నమాచార్యుల వారు శ్రీవేంకటేశ్వరుని యొక్క బ్రహ్మోత్సవాలలో గరుడ వాహనంపై శౌర్యమూర్తియై వెలిగిపోతూ బంగారు గరుడనిపై వూరేగుతున్న సందర్భంలో పాడిన అమరసంకీర్తన ఇది. అన్నమయ్య ఎన్నుకొన్న శబ్దాలంకారాలు గమనించండి. దిక్కులు పిక్కటిల్లే ఆ రెక్కల చప్పుడు మీ మనస్సులో ఒకసారి భావించండి. గరుడోత్సవం తిరుమల బ్రహ్మోత్సవంలో దర్శించి మనస్ఫూర్తిగా శరణాగతితో మొక్కినవారికి మరుజన్మరాదని పెద్దలంటారు. ఒక పట్టాన కొరుకుడు పడని పదములెన్నో చూడండి.....

**చం॥ గరుడుని నెక్కి శ్రీపతిటుగ్రక్కున వచ్చెను దిక్కులన్నియున్**
**అరయగ"బగ్గునన్ పగిలె" అన్నయ కీర్తన అద్భుతం బహో!!**
**కొరతిది అర్థమౌట తలకున్ పెనుభారము యెంచిచూడగా**
**తిరుమల నాయకా! కొలుతు దీర్పుము కష్టము నాకునియ్యెడన్.**

### రాగం : కేదారం

ఇటుగరుడని నీవెక్కినను
పటపట దిక్కులు బగ్గన బగిలె ॥ఇటు గరుడని॥

ఎగసిన గరుడని యేపున 'ధా' యని
జిగిదొలక చబుకు చేసినను
నిగమాంతంబులు నిగమ సంఘములు
గగనము జగములు గడగడ వడకె ॥ఇటు గరుడని॥

బిరుసుగ గరుడని పేరెము దోలుచు
బెరసి నీవు కోపించినను
సరుస నఖిలములు జరత్రఇతములై
తిరుపున నలుగడ దిరదిర దిరిగె ॥ఇటు గరుడని॥





పల్లించిన నీ పసిడి గరుడనిని
కెల్లన నీవెక్కినయపుడు
ఝల్లనె రాక్షస సమితి నీ మహిమ-
వెల్లి మునుగుదురు వేంకటరమణా ॥ఇటు గరుడుని॥

### భావామృతం :

ఓ ప్రభూ! ఈ విధముగా నీవు గరుత్మంతునిపై నెక్కిపయనించుచున్నప్పుడు, పటపట శబ్దములతో దిక్కులన్నియు భగ్గుమని పగిలిపోయినవి. (ఆతని వేగమును సహించలేక దిక్కులు పిక్కటిల్లినవని భావము.)

'ధా'యని పైకి లేచిన గరుత్మంతుని విజృంభణమునకు అనుగుణముగా, తళుక్కుమని నీవు కొరడా ఝుళిపించగా వేదాంతములు వేదములు కూడా నివ్వెరపోయినవి. ఆకాశంతో పాటు జగములన్నియు గడగడ వణికిపోయినవి.

దిట్టమైన వేగము గల ఆ గరుత్మంతుని నీవు తోలుచు ఆ వేగముచాలదని నీవు కఠినుడవై కోపించుచుందువు. (నీ కేమో నీభక్తులను ఆదుకోవాలని ఆత్రుత..) నీ కోపాగ్ని సహించలేక సమీపముననున్న సమస్తమూ శిథిలమై నలుదిక్కులా 'దిరదిర' మని తిరుగుతూ పరిభ్రమించసాగినవి. (దుస్సహమైన నీకోపాగ్నికి ఎవరు తట్టుకోగలరు ప్రభూ!)

నీవు కూర్చొనుటకు అనువుగా 'మెత్త' ఒకటి ఆ గరుడుని పై పరుచబడివున్నది. అట్లు 'పల్లించిన' నీ బంగారు గరుడనిపై "ఫెళ్ళుమని" నీవు ఎక్కినంతనే అక్కడ రాక్షసుల (గుండెలు) ఝల్లుమన్నాయి (భయంతో) ఓ వేంకటరమణా! నీ మహిమల పరంపర వలన దుర్మార్గులందరూ ఆ వెల్లువలో మునిగిపోతారు.

## 2-53

### మున్నుడి

గరుడాద్రిపైనున్న అహోబలనృసింహునిపై అన్నమయ్య అనేక కీర్తనలు చెప్పి మనందరినీ తరింపజేశారు. ఈ కీర్తనలో నరసింహుని ఆచార్యులవారు ప్రహ్లాద నరసింహా అని చాలా అద్భుతంగా మాటి మాటికీ ప్రతిచరణానికీ కీర్తించారు. ఇక్కడ ప్రహ్లాదుడంటే అంతా అనుకునేట్లే హిరణ్యకశిపుని కొడుకు కాదు, మిక్కిలి “హ్లాదము” అనగా ఆనందము కలిగించువాడని అర్థం. కీర్తనలో మనకితెలిసిన ప్రహ్లాదుని ప్రసక్తిరాంగానే సరళంగా వానిని నీ “బంటు” అన్నారు అన్నమయ్య. స్వామివారి ‘ఉగ్రపుబుద్ధి’ తిప్పటానికి లక్ష్మీదేవే అంకుశమట. ఏమి చమత్కారం!!

**ఆ.వె॥ప్రస్తుతించినారు ‘ప్రహ్లాద నరసింహు’**
**తానహోబలమున ‘తాళ్ళపాక’,**
**అన్నమయ్య పాట అలరించె కాబోటు**
**కొండలయ్య ఆయె కొలువు దీరి.**

**రాగం : బేగడ**

నవరూప ప్రహ్లాద నరసింహా
అవిరళతేజ ప్రహ్లాద నరసింహా ॥నరరూప॥

పగరపై కోపము బంటుజూచి మానితి
నగుమొగము ప్రహ్లార నరసింహా
ఎగువ నీ కోపమున కితడె మాటుమందు
అగపడె మాకును ప్రహ్లాద నరసింహా ॥నరరూప॥

అంట ముట్టరాని కోపము అంగన జూచిమానితి
నంటు చెల్లు ప్రహ్లాద నరసింహా
జంట నీ బుద్ధి తిప్ప సతియే అంకుశము
అంటువాయ మికను ప్రహ్లాద నరసింహా ॥నరరూప॥





ధరమొరవెట్ట దేవతలే మొక్కితే మానితి
గరుడాద్రి ప్రహ్లాద నరసింహా
ఇరవై శ్రీవేంకటాద్రి నిందు అందు నీవె సుద్ది
అరసితి మిదివో ప్రహ్లాద నరసింహా ॥నరరూప॥

### భావామృతం

నరుని వలె కోపతాపములు, ఆశ్రిత వాత్సల్యమూ, అంగనా ప్రియత్వమూ, సన్నుతికి సంతోషించుట కలిగిన నవరూపుడవైన ఓ ప్రహ్లాద నరసింహా! నీవు అంతులేని తేజస్సుగల మహానుభావుడవు.

దుర్మార్గుడై, నియంతయై, హరి భక్తులను హింసించు హిరణ్యకశిపుడు వరగర్వియై హరిద్వేషియై హరి భక్తుడైన తనస్వంత కొడుకు ‘ప్రహ్లాదు’నే హరిమాట మానమని అనేక విధములుగా హింసించసాగాడు. అతనిని సంహరించుటకు నృసింహుడైన శ్రీహరి వానిని చంపి కోపంతో ఊగిపోయాడు. తన బంటు అయిన ప్రహ్లాదుని జూచి ఆయన కోపం తగ్గి నగుమోము ప్రహ్లాదనరసింహుడైనాడు. ఆయన కోపానికి ఆ చిన్నారి బాలుని సంస్తుతియే మాటుమందు (అంటే...అందరికీ తెలియని మందు). నేటికి అదే (నీ కీర్తనయే) నీకు మాపై కోపానికి సరియైన మందు అని మాకు అనిపిస్తోంది తండ్రీ!

(మళ్ళీ ఆ హిరణ్యకశిపుని పరివారం నీపై యుద్ధానికి రాంగానే వాళ్ళందరినీ తుదుముట్టించావు. ఈ సారి నీ కోపాన్ని ఆపటం అసాధ్యమై పోయింది. అప్పుడు..) తాకుటకసాధ్యమైన నీ కోపాన్ని నీ అంగన (లక్ష్మీదేవి) ని చూచి మానివేశావు. నీ కోపాలు ఆ తల్లి ముందు చెల్లవు. నీ జంటయైన ఆ దేవి నీ భార్యకాబట్టి తనే అంకుశం వలె నీపై పని చేసింది.

అప్పుడు భూదేవితో సహా దేవతలందరూ ‘అమ్మయ్య’ అనుకొని నీకు మొక్కివేడుకున్నారు. కరుణాంతరంగుడవైన నీవు అహోబలంలో గరుడాద్రిపై వెలసి వారిని అనుగ్రహించిన ప్రహ్లాద నరసింహుడవైతివి. శ్రీవేంకటాద్రి నివాసమైయున్న శ్రీవేంకటేశ్వరుడవు కూడా నీవే. ఇదిగో ఇక్కడా పరిశుద్ధంగా ప్రహ్లాద నరసింహుని వలెమేము నిన్ను చూస్తున్నాము ప్రభూ!

**2-54**

## మున్నుడి

అన్నమాచార్యులవారు తనని తాను గోపికగా యశోద సఖిగా భావించుకొని వేంకట రమణుని చిన్ని కృష్ణయ్యగా భావించి గోపెమ్మలతో ఈ కీర్తన రూపంలో ఈ ముద్దులపాపడని కొట్టవద్దమ్మా వాడు ముత్యంలాంటివాడు అని నచ్చచెబుతున్నారు. వాడు 'ముర్వుర' లో ఎక్కువైనవాడట. (త్రిమూర్తులలో విష్ణువన్నమాట) 'మూలభూతి' అట (ఆది పురుషుడు). చీకటి పడేదాకా, వెన్న తినీ తినీ ముక్కులోంచి వచ్చేస్తుందేమో పొట్టలో సందులేక అన్నంత వెన్న తిన్నాడట ఆ పిల్లాడు. ఎంత విచిత్రమైన ఊహ!!

**ఉ॥ "మొత్తకుడమ్మలాల! ఇటు ముద్దులబారుడు వీడు చూడుడీ!!**
**ముత్తెమువోలె తాన్ మెఱసిముంగిటనాడుచునున్నవాడు,మీ**
**రిత్తరి'వెన్నదొంగ'యని యీతని తిట్టకుడన్న గోపికై**
**క్రొత్తగ అన్నమయ్య తను 'కొండలరాయని'కృష్ణుడంచెనెన్**

**రాగం : కాంభబోజి**

మొత్తకురే అమ్మలాల ముద్దులాడు వీడె
ముత్తెము వలెనున్నాడు ముద్దులాడు ॥మొత్తకురే॥

చక్కని యశోదతన్ను సలిగెతో మొత్తగాను
మొక్కబోయీ కాళ్ళకు ముద్దులాడు
వెక్కసాన రేపల్లె వెన్నలెల్లా మాపుదాక
ముక్కునవయ్యగ తిన్న ముద్దులాడు ॥మొత్తకురే॥

రువ్వెడి తాళ్ళదల్లి రోలదన్ను గట్టెనంటా
మువ్వల గంటలతో ముద్దులాడు
నవ్వెడి చెక్కులనిండా నమ్మిక బాలునివలె
మువ్వురలో నెక్కుడైన ముద్దులాడు ॥మొత్తకురే॥





వేల సంఖ్యల సతుల వెంట బెట్టుకొనిరాగా
మూలచన్ను కుడిచీనీ ముద్దులాడు
మేలిమి వేంకటగిరి మీద నున్నాడిదె వచ్చి
మూలభాతి తానైన ముద్దులాడు ॥మొత్తకురే॥

**భావామృతం :**

ఓ అమ్మలారా! మీరు వీడిని కొట్టవద్దమ్మా వీడెంత ముద్దులు మూటగట్టే బాలుడో చూడండి. వీడు ముత్యం వలె మెఱిసి పోవటంలేదూ? చూడండి.

ఈతని తల్లి అందమైన యశోదమ్మ. వీడి అల్లరి భరించలేక ఆమె పీటతో కొట్టబోతే ఆమె కాళ్ళపై బడి మొక్కి ఇంకెప్పుడూ అల్లరి చేయను అని ముద్దుముద్దుగా అన్నాడు. రేపల్లెలో వీడు చాలా ఎక్కువగా చీకటిపడే దాకా వెన్నలు తింటూనేవున్నాడు. ఎంత తిన్నాడంటే వీడి పొట్ట పట్టక ముక్కుల్లోంచి వెన్న వచ్చేస్తుందేమో అన్నంతగా తిన్నాడర్రా! ఈ ముద్దులపిల్లాడి అల్లరేంచెప్పను?

ఇతని తల్లి యశోద వీడి అల్లరి భరించలేక రువ్వెడి తాళ్లతో (వాడి పారేసిన పాత తాళ్ళతో) ఒక రోటికి వీడిని కట్టేసిందట. వాడికాలి మువ్వలలోని గంటలు చప్పుడు చేశాయట. అటువంటి అందెలతో నున్న ముద్దులమూట ఈ చిన్నికృష్ణుడు.

వీడొక్కడే నమ్మదగ్గవాడిలాగ చెక్కిళ్ళనిండా ఎలా నవ్వుతున్నాడో చూడండి. ఈ ముద్దుల ముత్యం ఎవరనుకొన్నారు. త్రిమూర్తులలోనే సర్వశ్రేష్ఠుడైన శ్రీమన్నారాణుడు.

వేల సంఖ్యలో గోపికలంతా మూకుమ్మడిగా పితూరీ చేయటానికి ఇంటిపైకి వస్తే ఆ మూల తల్లి ఒడిలో నంగనాచిలా పడుకొని ఎలా రొమ్ము చీకుతున్నాడో చూడండి. ఎంత ముద్దొస్తున్నాడో!! బంగారపు వేంకటగిరి మీదనున్న ఈ ముద్దుల పాపడు (మూలభూతి) ఆదిపురుషుడు, అయిన శ్రీవేంకటేశ్వరుడే సుమా!!

**మున్నుడి** **2-55**

శ్రీ మన్నారాయణుని దశావతార విభవమును వర్ణించాలంటే అన్నమాచార్యులవారికి సాటి మరొకరుండరని నాభావన. ఎంత నర్మగర్భంగా చెబుతారంటే నా బోటివాళ్ళు నిఘంటువుల్ని వెదకి, పెద్దలను అడిగి, కొంత భావించి, నానా తిప్పలు పడితే ఏదోఒక కొలిక్కి వస్తుంది. అంతమాత్రాన ఆచార్యులవారి భావం ఖచితంగా (మనం అంతా ఈనాడు ఈ పదాన్ని 'ఖచ్చితం' అంటున్నాం, కానీ దీని అర్థం చెక్కినట్లు అని....) ఇదీ అని చెప్పే "దమ్ము" మన ఎవరికీలేదేమో! మన భావన పరిధి అంతేనని సరిపెట్టుకోవాలి... ప్రయత్నించటమే మన కర్తవ్యం.

**ఆ.వె॥హరి ప్రతాపములను అన్నయ్య వివరించె**
**మేటి కీర్తనమున సాటిలేక**
**ముని దశావతారముల వర్ణన వలెనే**
**మనసు పులకరించు వినినయంత.**

**రాగం : హిందోళం**

హరీ నీప్రతాపమున కడ్డమేది లోకమున
సరి వేరీ నీకు మరి సర్వేశ్వరా ॥హరీనీ॥

నీవు నీళ్ళు నమిలితేనె నిండెను వేదములు
యీవల తలెత్తితేనె ఇంద్ర పదవులు మించె
మోవమూతి గి(గ)రిపితే మూడులోకలు నిలిచె
మోవిబార నవ్వితేనె ముగిసి రసురులు ॥హరీనీ॥

గోర గీరితే నీరై కొండలెల్ల తెగ బారె
మారుకొంటె బయటనే మడుగులై నిలిచే
చేరియడుగు వెట్టితే శిలకు ప్రాణము వచ్చె
కూరిమి కావలెనంటె కొండ గొడుగాయెను ॥హరీనీ॥



భావయామి వేంకటేశం

కొంగు జారినంతలోనే కూలెను త్రిపురములు
కంగి కమనించితేనె కలిదోషములు మానె
రంగుగ నీ శరణంటే రక్షించితి దాసులను
ముంగిట శ్రీవేంకటేశ మూలమవు నీవే ॥హరీనీ॥

**భావామృతం :**

ఓ శ్రీహరీ! నీశౌర్యమునకు అడ్డునిలవగల దేవున్నావున్నదా? లోకములన్నింటిలోను నిన్నెదిరించగలవారెవరు? ఓ సర్వేశ్వరా! నీ విభవము నేనేమని వర్ణించను.

నీవు నీళ్ళను నమలగానే (పుక్కిలించగానే) వేదములన్నీ రక్షించబడ్డాయి. (మత్స్యావతారము), ఇటువైపు తలెత్తగానే (అవతరించగానే) ఇంద్రాది దేవతలకు పదవులు నిలిచాయి(కూర్మావతారం.) ఎందుకంటే నీవు మందరగిరి మోస్తేనే కదా దేవతలకి అమృతం దొరికింది. ప్రభూ! నీవు దీర్ఘముగా సాగిన మూతిని ధరించగానే (వరాహావతారం), ముల్లోకాలు నిలిచినవి. ముఖమంతా నవ్వుపులుముకోంగానే (నరసింహావతారం) రాక్షసుల కథ అంతా సమాప్తమైపోయింది. ఓ మహానుభావా! నీవు కాలిగోరితో గీకగానే హిమాలయాలన్నీ నిండి పోతాయేమోనన్నట్లు గంగపారి అందర్నీ పునీతుల్ని చేసింది.(వామనావతారము) నీవు ఎదుర్కొగానే బాహాటంగానే (నెత్తురు) మడుగులై పాదముతాకించినంతమాత్రాన శిలకు ప్రాణం వచ్చేసి (అహల్యయై) తరించింది పారినది (పరశురామావతారం). నీవు (శ్రీరామావతారం). నీవు ప్రేమతో వుద్యమించగానే కొండగొడుగై అందర్నీ రక్షించింది (గోవర్ధనగిరి నెత్తిన శ్రీ కృష్ణావతారం).

నీవు కొంగుల్నివూడదీయగానే త్రిపురములు కూలిపోయినవి (భార్యల శీలం చెడిపోతేనే త్రిపురాసురులు మరణిస్తారు). (బుద్ధావతారం). ప్రయత్నించి దహించివేయగానే కలిపురుషుని దోహములన్నీ నాశనము చేయబడినవి (కల్కి అవతారం). ఎదుటనే శ్రీవేంకటేశ్వరుడవైన నిన్ను మేము ఒప్పగునట్లు శరణు జొచ్చినంతనే నీ దాసులమైన మమ్మల్ని వెనువెంటనే రక్షించితివి. అందుకే పైన చెప్పిన ఆ అవతార పురుషులందరికీ మూలపురుషుడవు నీవే తండ్రీ!

**2-56**

## మున్నుడి

అన్నమాచార్యులవారు అహోబిలంలో వెలసిన నృసింహ దేవుని ఇల్లాలు లక్ష్మీదేవిపై చెప్పిన మధురమైన సంకీర్తన ఇది. ఆ తల్లే అలమేలుమంగమ్మ అని ఆచార్యులవారి భావన. ఈ నరసింహుని ఇల్లాలు శ్రీమహాలక్ష్మి భక్తులపాలిటి కల్పవృక్షం ఆ తల్లి. సర్వసంపదలనొసగి కరుణించే జగజ్జనని ఈ తల్లి. 'ఈపె' అంటే నేటి కాలంలో 'ఈమె' అని...

**సీ॥ గరుడాద్రి వేదాద్రి యిరవైన కలిమియై**
**చింతామణై ఈమె సిరులొసంగె**
**పాలసంద్రములోన పద్మాలయే తాను**
**శ్రీనరసింహుని చాన ఈమె**
**లోకమాతని పేరుజేకొన్న ఇందిర**
**చాకచక్యంబుతో లోకమేలు**
**ఘనసంపదల నిచ్చు కమలనాభుని కాంత**
**మదనుని కన్నట్టి మాత ఈమె**

**తే॥ తాను హరిప్రియ, శ్రీకాంతు తరుణి ఈమె**
**వేంకటేశుని ఇంతియై వెలసియుండె**
**ఆ అహోబలంబున గొల్చె అన్నమయ్య**
**తావుకొన్న నిధానము, తల్లిమాకు.**

**రాగం : రీతిగౌళ**

గరుడాద్రి వేదాద్రి కలిమి ఈపె
సిరులొసగీ చూడరో చింతామణి ॥గరుడాద్రి॥

పాలజలధి పుట్టిన పద్మాలయ ఈపె
లాలిత శ్రీనారసింహు లక్ష్మీ ఈపె
మేలిమి లోకమాతయై మించిన మగువ ఈపె
ఈలీల లోకములేలే ఇందిర ఈపె ॥గరుడాద్రి॥





ఘనసంపద లొసగు కమలాకాంత ఈపె
మనసిజు గనిన రమాసతి ఈపె
అనిశము బాయని మహా హరిప్రియ ఈపె
ధన ధాన్య రూపపు శ్రీతరుణి ఈపె ॥గరుడాద్రి॥

రచ్చల వెలసినట్టి రమావనిత ఈపె
మచ్చిక గల అలమేల్మంగ ఈపె
ఇచ్చట వేంకటాద్రినీ అహోబలమునందు
నిచ్చలూ తావుకొనిన నిధానము ఈపె ॥గరుడాద్రి॥

### భావామృతం

శ్రీ మహాలక్ష్మి 'వేదాద్రి' అని పిలువబడే గరుడాద్రి (అహోబలం) పై నెలకొన్న ఐశ్వర్యము. ఈమె సంపదల నొసగే చింతామణి. (పాలసముద్ర మథనమున లక్ష్మీదేవి తోబుట్టిన 'మణి' కోరుకున్న భాగ్యముల నొసగే దివ్యమణి)

క్షీరసాగరమథనమున పుట్టి పద్మములో నివాసము గొనిన తల్లి ఈమె. ఉగ్రనరసింహుని లాలించి తన స్వాధీనం చేసి కొనిన శ్రీమహాలక్ష్మి ఈమె. లోకములన్నింటికి జననియై బంగారమువలె అన్నిటినీ మించిపోయినది ఈమె. ఈవిధముగా జగములనన్నింటినీ పరిపాలించుచున్న ఇందిరాదేవియే ఈమె.

ఎన్నెన్నో ఘనమైన సంపదల నొసగే కమలాదేవి ఈమెయే. అందాల మన్మథుని గన్నతల్లి ఈ రమాదేవి. శ్రీహరిని క్షణముకూడ విడిచి యుండలేని హరిప్రియ ఈమె. ఈ ప్రపంచంలోని జనులనందరినీ ధనరూపములో, ధాన్యరూపములో ఈ ఐశ్వర్యకాంత అనుగ్రహిస్తున్నది.

దేవ దానవులు రచ్చజేస్తే క్షీరసాగరమును పోటా పోటీగా మథించినప్పుడు) వెలసిన రమాదేవి ఈమె. ఆప్యాయత సాకారమైన జగజ్జనని అలమేల్మంగయే ఈమె. వేంకటాద్రిపైననేగాక ఇక్కడ అహోబలంలో కూడ నిత్యమూ నెలకొన్న నిధానము ఈ మహాలక్ష్మి. ఈమెను కీర్తించి తరించండి.

## 2-57

### మున్నుడి

నా చిన్నప్పుడు సదాచార కుటుంబాలలో తరచూ వినపడే మాట 'వీటికి చదువూ సంధ్యా లేవేమిట్రా'... అని. నేడు అన్నమాచార్యువారి కీర్తనకు మున్నుడి వ్రాస్తుంటే మా పెద్దల మాటలకర్థం 'తళుక్కున' మెఱసింది. సరస్వతీ కటాక్షం వున్న వాడికి చదువు (ఏబీసీడీలు కాదు, వేదవిద్య) వచ్చేది. ఆ దేవి కరుణలేని వాడికి 'వడుగు' చేసి సంధ్యావందనము చేస్తూ, ఏదో 'వృత్తి' తో ఏదో బ్రతకమనేవారు. ఏది ఏమైనా సంధ్య. వార్చుట మాత్రం నిత్యకృత్యమే. భక్తి మార్గంలో భగవంతుని శరణాగతిని పొందిన వానికి సంధ్యతో కూడా పనిలేదు. మరి వారికి 'సంధ్య' అంటే ఏమిటో వివరిస్తున్నారు... అన్నమయ్య.

**ఉ॥ సంధ్యన వైష్ణవుండెపుడు చక్కటి వర్తన సంచరించుటే**
**సంధ్యన శ్రీహరిన్ మదిని సన్నుతిజేయుట యెల్లవేళలన్**
**సంధ్యన సేవభాగవత సాధులజేయుట, అన్నమయ్యనెన్**
**సంధ్యన 'వేంకటేశ' యని జన్మతరించగ తృప్తి గొల్పుటే**

**రాగం : సామంత**

సహజ వైష్ణవాచార వర్తనుల
సహవాసమె మా సంధ్య ॥సహజ॥

అతిశయమగు శ్రీహరి సంకీర్తన
సతతంబును మా సంధ్య
మతి రామానుజమతమే మాకును
చతురతమెరసిన సంధ్య ॥సహజ॥

పరమభాగవత పదసేవనమే
సరవినెన్న మా సంధ్య
సిరివరు మహిమలు చెలువొందగ వే
సరక వినుటే మా సంధ్య ॥సహజ॥





మంతుకెక్క తిరుమంత్ర పఠనమే
సంతతమును మా సంధ్య
కంతు గురుడు వేంకటగిరి రాయని
సంతర్పణమే మా సంధ్య ॥సహజ॥

### భావామృతం

వైష్ణవ సిద్ధాంతములను నమ్మి శ్రీమన్నారాయణుని శరణు పొందినవానికి ఆ వైష్ణవులతో 'సహవాసము' చేస్తూ జీవించుటయే సంధ్య (సంధ్య వార్చుట), అను సంధ్యావందనము.

మా వైష్ణవులకు నిరంతరమూ శ్రీహరి నామ సంకీర్తన విశిష్టముగా చేయుటయే సంధ్యావందనము. త్రికరణ శుద్ధిగా శ్రీరామానుజాచార్యులవారి మతము (విశిష్టాద్వైతము) నవలంభించుటయే, మాయొక్క నేర్పరితనం చాటునటువంటి సంధ్య.

శ్రీమన్నారాయణుడే సర్వస్వం అని సద్బుద్ధితో సన్మార్గంలో జీవించే పరమ భాగవతోత్తములను గురువులుగా గౌరవించుచూ వారి పాదసేవనము చేస్తూ ఒక పద్ధతిగా జీవించుటయే నిజమైన సంధ్య. శ్రీపతియైన శ్రీహరి యొక్క దివ్యమహిమల గురించి విసుగులేకుండా శ్రద్ధగా వినుటయే మాకు సంధ్యావందనము.

ప్రసిద్ధికెక్కిన "ఓం నమో నారాయణాయ అను పవిత్ర అష్టాక్షరీ మంత్రమును త్రికరణ శుద్ధిగా ఎప్పుడూ జపించుటయే మాకు సంధ్యావందనము. మన్మధుని జనకుడైన వేంకటాద్రి సర్వేశ్వరుడు శ్రీవేంకటేశ్వరుని సంతర్పణ (తృప్తిగా సేవించుట) యే మా విశిష్టాద్వైతులకు నిజమైన సంధ్యావందనము. అంతేగాని భక్తిలేకుండా ఏదో ముక్కునపెట్టుకొన్నది చీదినట్లు, ప్రొద్దు పొడుచుటకు ముందు అయిదు ఘడియల కాలము, సూర్యుడు నడినెత్తిన వున్నప్పుడు, ప్రొద్దుగ్రుంకిన వెనుక మూడు ఘడియలు భగవంతునికి నమస్కరించుట (ప్రార్థించుట) మాత్రమే ఎన్నటికీ సంధ్యావందనము కాదు.

**2-58**

## మున్నుడి

నాకు సహజగుణములన్నీ దుర్గణములే. నేనెప్పుడు మంచివాడనవగలను? ఎప్పుడు కృతార్థాడనై నీదయపొందుతాను? ఎట్లాగైనా నీవే నన్ను క్షమించి నన్ను ఆదుకోవాలి. ఓ దేవా! ఎందుకంటే... వేప చేట్టు చేదుపోతుందా? పాము విషం పోతుందా? పాపపుణ్యలు తగులుకొన్న నాకు చాపల్యం ఎందుకు వుండదు? కామక్రోధములు పెనవేసుకొన్న నేను మదపుటేనుగులా కాక ఎలా ప్రవర్తిస్తాను? ఇవన్నీ ఒక్కసారిగాపోయి ఓ మహానుభావా! నాకు చటుక్కున శాంతము రమ్మంటే వస్తుందా? అంటున్నారు అన్నమాచార్యులవారు.

**చ॥ సహజము వేపమానికిని చావకయుండుట చేదు, నిక్కమౌ**
**సహజము అన్నమార్యుడనె సర్పవిషంబది పండ్లనుంటయున్**
**సహజము కామక్రోధముల సామజమట్లుగ నేను నీల్గితిన్**
**మహి తిరు వేంకటేశ్వరుని భక్తిని గొల్వక శాంతమొచ్చునా?**

**రాగం : సామంతం.**

ఎన్నడు మంచివాడనయ్యేను నేను
నన్ను నీవు మన్నించి నడపవే దైవమా ॥ఎన్నడు॥

వేపమానికిని చేదు ఎడువకయుండేది
యే పొద్దు సహజమే ఎంతైనాను
పాపపుణ్యలంపటాన బరగి వుండేటి నేను
చాపల దుర్గుణినౌట సహజమే ॥ఎన్నడు॥

పాముకు విషమెప్పుడు పండ్లబెటు కుండేది
భూమిలో సహజమే పొరినెంతైనా
కామక్రోధుడ నాకు గరుణ యించుక లేక
సామజపు దుర్మదము సహజమే ॥ఎన్నడు॥





అటుగాక శ్రీవేంకటాధిప నాకికవేరే
తటుకున నేడు శాంతము వచ్చీనా
ఘటన నీ కృపయందు గలిగిన మేలు నాపై
తటుకన ముంచి నన్ను దరిచేర్చవే ॥ఎన్నడు॥

**భావామృతం :**

ఓ దైవమా! శ్రీవేంకటేశ్వరా! పాహిమాం! నన్ను రక్షించు. నేను ఎన్నడు మంచివాడనవుతాను, ఎన్నడు నీ కృప పొందుతాను? అది అంత తేలికగా అయ్యే పనియేనా? నన్ను నీవే క్షమించి దయతో సన్మార్గంలో నడపాలి. ఎందుకంటే...

వేపచెట్టుకు 'చేదు' సహజగుణము. అది ఎన్నడైననూ దాని చేదు గుణం వదులుకొంటుందా? ఎంతైనా, ఏం చేసినా దాని సహజగుణం పోతుందా? పాప పుణ్యాలు లంపటంలో ఇరుక్కుపోయిన నేను అంతులేని పాపాలూ చేస్తున్నాను, అడపా దడపా పుణ్యాలూ చేస్తున్నాను. చిత్త చాపల్యం అనే దుర్గుణము ఒకటి నన్ను పీడించటం వలన అవన్నీ చేస్తున్నాను. మరి అదేమో నా సహజగుణం. ( ఈ పాప పుణ్యాల వల్ల నాకు జనన మరణాల పీడ తప్పటం లేదు.)

పాముకు పండ్లలో (కోరలలో) విషము వుండటం సహజం. అది పెట్టింది కూడా నీవే. అందుకని అత్యంత సహజమైన కాటువేసే గుణాన్ని అది వదులుకోదు. మానవులమైన మాకు కామ, క్రోధ, మోహ, లోభ, మద, మాత్సర్యములనే ఆరు దుర్గుణాలచే పీడించబడే నేను మదపుటేనుగు వలె ప్రవర్తించక ఎలా వుంటాను? అది నా సహజ గుణం.

ఓ శ్రీవేంకటేశ్వరా! అట్లాకాకుండా చటుక్కున సులభంగా ఒక్కసారి ఈ రోజున శాంతస్వభావం వచ్చేస్తుందా? మరేమిటి దారి? నిశ్చయించుకొని నీవు నాపై నీ కృపజూపి నాకు మేలు చేయాలి. నన్ను నీ దరి జేర్చుకోవాలి. ఈ లంపటాలనుంచి నన్ను విముక్తుణ్ణి చేయాలి. నన్ను రక్షించాలి. అంతే...

## 2-59

### మున్నుడి

త్రిసంధ్యలలో శ్రీ మన్నారాయణుని 'కేశవ నామాలను' కీర్తించటం మన ఆర్షసంప్రదాయం. నేటి ఉరుకుల పరుగులకాలంలో, నిలుచునేతింటున్నాం. స్నానం కూడా మొక్కుబడిగానే చేస్తున్నాం. మనబోటివారి కోసమేనేమో అన్నమాచార్యులవారు ఇటువంటి 'భజన' రూపంలోని కీర్తనలు చెప్పారు. ఇందులో కేశవనామాలే కాక స్వామి దశావతార నామాలూ వున్నాయి. 'కాపీ' రాగం భజనకు చక్కగా సరిపోయింది. సంస్కృత సంకీర్తన అవటం వల్ల ఉచ్చారణలో లోపంలేకుండా చూసుకుంటే చాలు. మూడు నిముషాల్లో ముక్తికి దగ్గరగా జరగవచ్చును.

**కం॥ హరినామ భజన నిర్విధి**
**జరుపగ అన్నయ్య కెవరు సాటిర జగతిన్**
**తిరువేంకటేశు సన్నుతి**
**శరణాగతి కంటె మేటి సాధన కలదే?**

**రాగం : కాపి**

మాధవా కేశవా మధుసూదనా విష్ణు
శ్రీధరా పదనఖం చింతయామి యూయం ॥మాధవా॥

వామన గోవింద వాసుదేవ ప్రద్యుమ్నా
రామ రామ కృష్ణ నారాయణాచ్యుత
దామెదరానిరుద్ధ దైవపుండరీకాక్ష
నామత్రయాధీశ నమో నమో ॥మాధవా॥

పురుషోత్తమ పుండరీకాక్ష దివ్య
హరి సంకర్షణా అధోక్షజా
నరసింహ హృషీకేశ నగధరా త్రివిక్రమా
శరణాగత రక్ష జయజయ సేవే ॥మాధవా॥





మహిత జనర్దన మత్స్య కూర్మ వరాహ
సహజ భార్గవ బుద్ధ జయ తురగ కల్కి
విహిత విజ్ఞాన శ్రీవేంకటేశశుభకరం
అహమిహ తవపదదాస్యం అనిశం భజామి ॥మాధవా॥

**భావామృతం :**

ఓ మాధవా! కేశవా! మధుసూదనా! (మధు అనే రాక్షసుని మర్దించిన వాడు), విష్ణుమూర్తీ!, శ్రీధరా! నేను నీ పాదముల వ్రేలిగోళ్ళను (పదనఖం) గూర్చి ఎల్లవేళలా బాగుగా ఆలోచించెదను..(ధ్యానింతును).

ఓ వామనావతారా! గోవిందా! వాసుదేవా! శ్రీరామావతారా! బలరామా! శ్రీకృష్ణా! నారాయణా! అచ్యుతా! దామోదరా! అనిరుద్ధా! దైవపుండరీక నయనా! బ్రహ్మ విష్ణు మహేశ్వరులను త్రిమూర్తుల యొక్క నామములూ కైవశము చేసికొనిన మహానుభావా! నమో నమః అంటూ నమస్కరించుచున్నాను.

ఓ పురుషోత్తమా! తెల్లతామరలవంటికన్నులు కలిగిన దివ్యపురుషా! శ్రీహరీ! సంకర్షణా! అధోక్షజా! నరసింహా! హృషీకేశా! నగధరా! (గోవర్ధనోద్ధరా!)! త్రివిక్రమా (మూడు పాదములతో సర్వజగతిని ఆక్రమించిన అద్భుతరూపా!) శరణన్నవారిని రక్షించుటయే దీక్షగా గల ప్రభూ! జయ జయ ధ్వానములతో నిన్ను సేవించుచున్నాను. నన్ను రక్షింపుము తండ్రీ!

దివ్య మహిమలు గల ఓ జనార్దనా! ఆద్యవతారములు అనగా మత్స్యకూర్మవరాహ అవతారములు ధరించి ఆయా సందర్భాను గుణంగా దుష్టశిక్షణ శిష్టరక్షణ చేసిన దేవదేవా! తరువాత పరశురామునిగా భీభత్సం, బుద్ధునిగా శాంతం, హయగ్రీవునిగా తత్త్వబోధ, కల్కిరూపంలో విలయం ప్రదర్శించిన సర్వేశ్వరా! నీవే నేడు బాగుగా వేలుచేయు విజ్ఞానమును ప్రసాదించి శుభములనొసగే శ్రీవేంకటేశ్వరుడవైతివి. అట్టినిన్ను నేను ఇక ఎల్లవేళలా భక్తితో నీ పాదదాసుడనై భజించెదను.

# 2-60

## మున్నుడి

ఆర్తితో, శరణాగతితో శ్రీమన్నారాయణుని అనుయాయులను పలువురను పేరుపేరునా పిలిచి వేడుకొంటున్నారు అన్నమాచార్యులవారు. అయ్యా! దయచేసి నన్ను కరుణించి ఇందిరానాధుని తెచ్చినాకివ్వండి. చాలపొద్దయింది. నేను స్వామిని పూజించుకోవాలి. ఓ ఆంజనేయా! ఓ గరుత్మంతా! ఓ ప్రహ్లాదా! ఓ అర్జునా! ఓ ఆదిశేషా! ఓ కార్తవీర్యార్జునా! అయ్యలారా! నాకు స్వామిని చూపించండి. మిమ్మల్ని వేడుకొంటున్నాను. ఎంత అద్భుతమైన కీర్తనయో కదా! శివరంజని రాగంలోని ఈ కీర్తన రాళ్ళను, శ్రీనాధుని కూడా కరిగిస్తుంది.

**ఉ॥ ఇందిర ప్రాణవల్లభుని ఈయరొమాకనె అన్నమార్యుడున్**
**పొంది మహానుభావునిక పూజలు సేయుటకాయె జాగనెన్**
**సుందరమైన రాగమిది సొంపగు ఈ 'శివరంజనిన్' వినన్**
**ఎందుకు శంక? రాల్గరుగు ఏలిక వేంకటనాథుతోడుతన్.**

**రాగం : శివరంజని**

ఇందిరారమణు దెచ్చి యీయరో మాకిటువలె
పొంది ఇతని పూజింప పొద్దాయె నిపుడు ॥ఇందిరా॥

ధారుణిమైరావణు దండించి రాముదెచ్చి
నేరుపున మించిన అంజనీ తనయా
ఘోరనాగపాశముల కొట్టివేసి యీతని
కారుణ్యమందినట్టి ఖగరాజ గరుడా ॥ఇందిరా॥

నానా దేవతలకు నరసింహు కంభములో
పానిపట్టి చూపినట్టి ప్రహ్లాదుడా
మానవుడై (డౌ) కృష్ణ మహిమల విశ్వరూపు
పూని బండి నుంచుకొన్న పోటుబంట అర్జునా ॥ఇందిరా॥





శ్రీవల్లభునకు అశేష కైంకర్యముల
శ్రీవేంకటాద్రిపైన శేషమూరితీ
కైవసమైన యట్టి కార్తవీర్యార్జునుడా
దేవుని నీవేళ నిట్టే తెచ్చి మాకు నియ్యరే ॥ఇందిరా॥

**భావామృతం :**

ఇందిరాదేవిప్రియైన శ్రీమహాలక్ష్మీవల్లభుని తర్వగా తీసికొనివచ్చి మాకియ్యండి. మిమ్మల్ని వేడుకొంటున్నాను. చాల ప్రొద్దెక్కింది. మేమా శ్రీహరిని పూజించుకోవాలి. నా మొరవినండి.

పాతాళలోకంనుంచి భూలోకం వచ్చి శ్రీరామచంద్రుని అపహరించి బలినీయ బోయిన మైరావణుని శిక్షించి తుదముట్టించిన ఓ అంజనీపుత్రా! హనుమా! నీవు మిక్కిలి బుద్ధిమంతుడవు. (నా మొర వినవా!) ఇంద్రజిత్తు నాగాస్త్రంతో రామలక్షణులను సర్పబద్ధులనుచేయగా ఘోరమై ఆనాగపాశములనన్నింటినీ నిర్వీర్యంచేసి ఆ స్వామి కరుణను పొందిన ఓ పక్షిరాజా! గరుత్మంతా! నీవన్నా నన్ను కరుణించి ఆ శ్రీహరిని తెచ్చి నాకీయరాదా?

ఉగ్రనరసింహుని స్తంభంలో నుంచి తెప్పించి ఆయన హిరణ్య కశిపుని వధించగా ప్రార్థించి శాంతుని జేసి, తరువాత దేవతలందరికీ ఆయన అనుగ్రహం ప్రసాదింపజేసిన ప్రహ్లాదా! నాపై దయతో నాకు కూడా ఆయన దర్శనం ఇప్పించరాదా? మానవరూపంలోవున్న శ్రీకృష్ణపరమాత్మ విశ్వరూపం చూపించి అనుగ్రహించగా ఆయననే తన రథ సారధిగా నియమించుకొని తన రథంలోన వుంచుకొన్న వీరాధివీరా! అర్జునా! నీవైన నా స్వామిని నాకు ప్రసాదించరాదా?

శ్రీపతికి అంతులేని భగవత్సేవలు చేయుచూ శ్రీవేంకటాద్రి మీద స్వామిచెంతనే వుండే ఓ ఆదిశేషా! నన్ను కనికరించి నా స్వామిని నాకు చూపించలేవా? నా మొరాలకించవా? సహస్రబాహువులలో రెండు మాత్రం వుంచి తక్కినవన్నీ ఖండించిన పరశురాముని ప్రార్థించి ఆయన అనుగ్రహం సంపాదించిన ఓ కార్తవీర్యార్జునా! నీవైనా ఇందిరారమణుని ఈవేళ నాకు తీసికొని వచ్చి ఈయరాదా? నన్ను ధన్యుని చేయరాదా?

## 2-61

### మున్నుడి

శ్రీవేంకటేశ్వరుని దివ్యమంగళ విగ్రహాన్ని తిలకించి భావోద్వేగంతో అన్నమాచార్యులవారు చెప్పిన అజరామరమైన సంకీర్తన ఇది. నన్నెప్పుడూ విడిచిపెట్టకు స్వామీ! అని వేడుకొంటున్నారు. తనకులదైవమూ, నిధానము, ఏడుకొండలవాడే నన్నారు. తన పాలిటి పారిజాతము, చింతామణి, కామధేనువు శ్రీనివాసుడేనంటున్నారు. అందర్నీ రక్షించే భూమాత భర్తవయ్యానీవు అంటున్నారు. చెడిపోకుండా బ్రతికించే సిద్ధమంత్రం నీవు అంటున్నారు. 'కూడా' విడిచి పెట్టకుండా తిరిగే మాప్రాణబంధువంటున్నారు. ఇదికదా భక్తి అంటే...

**చం॥ సురజన రక్షకుండు పురుషోత్తముడీ విభుదాదిదేవుడున్**
**వరముల రాశిగా నిడును బాసట దీనజనాళి దాతయున్**
**హరిని భజించె కీర్తనము అద్భుతమైనది అన్నమయ్య తాన్**
**మురిపెము దీర వేంకటవిభున్ తనుగొల్చెను జన్మధన్యమై.**

**రాగం : మోహన**

పొడగంటిమయ్య మిమ్ము పురుషోత్తమా, మమ్ము
నెడయకవయ్య కోనేటి రాయడా    పొడగంటి

కోరిమమ్మునేలినట్టి కులదైవమా, చాల
నేరిచి పెద్దలిచ్చిన నిధానమా
గారవించు దప్పిదీర్చు కాలమేఘమా, మాకు
చేరువ చిత్తములోని శ్రీనివాసుడా    ॥పొడగంటి॥

భావింప కైవసమైన పారిజాతమా, మమ్ము
చేవదేర గాచినట్టి చింతామణీ
కావించి కోర (రి) కలిచ్చే కామధేనువా, మమ్ము
తావైరక్షించేటి ధరణీ ధరా    ॥పొడగంటి॥





చెడనీక బ్రతికించే సిద్ధమంత్రమా, రోగా-
లడచి రక్షించే దివ్యౌషధమా
బడి బాయక తిరిగే ప్రాణబంధువా, మమ్ము
గడయించినట్టి శ్రీవేంకటనాథుడా    ॥పొడగంటి॥

### భావామృతం :

ఓ పురుషోత్తమా! కోనేటి రాయా! నేడు మిమ్ము దర్శించి ధన్యుల మయ్యాము తండ్రీ! ఇకపై మమ్ము క్షణం కూడా విడిచిపెట్టవద్దు ప్రభూ!

నీవు మా'కులదైవానివి.' అందుకని మమ్ము అనుగ్రహంతో పరిపాలించు స్వామివై నావు. మా పెద్దలందరూ ఈ విషయం గ్రహించి నిన్ను మాకిచ్చారు. అందుచేత నీవు మాకు 'పాతర' వంటి'నిధానము' అయినవాడవు. మమ్మల్ని ఆదరించి మా దప్పిక తీర్చునట్టి కడు నల్లటి జలంధరము (నీరు వున్న కారుమేఘము) నీవే ప్రభూ! నీవు ఎక్కడో వైకుంఠంలో లేవు. దగ్గరగా మామనస్సుల్లోనే శ్రీనివాసుడవైయున్నావు. (మా దురదృష్టం వలన మేమది గ్రహించలేకున్నాము.)

నిన్ను మనస్సులో భావించినంత మాత్రం చేతనే ఎన్నడూ వాడని పారిజాతవృక్షం వలె దివ్య సౌరభాలను వెదజల్లబడినవా అన్నట్లు ఆహ్లాదాన్నిస్తావు. 'దైవమణి'యైన 'చింతామణి వలె ధైర్యము నొసగి రక్షింతువు. కామదేనువు వలె కామించిన కామనములన్నీ (కోరికలను) తీరుస్తావు. మా అందరికీ నివాసస్థానమై రక్షించే భూమాతకే నీవు భర్తవు (నీకంటే రక్షించేవాడెవడు?)

'ఓం నమో వేంకటేశాయ' అనే సిద్ధమంత్రం సర్వులను చెడనీయక బ్రతికిస్తుంది కోనేటి రాయుడు అన్ని రోగాలను రూపుమాపే దివ్యౌషధము. గిరిగీసినట్లు, బడి బాయక (క్రమము తప్పక) మా సమీపముననే నిలిచి కాపాడే ప్రాణ బంధుడవు నీవే . ఓ శ్రీవేంకటేశ్వరా! మమ్మల్ని నీ స్వంతం చేసికొన్నావు తండ్రీ!

## 2-62

### మున్నుడి

శ్రీమన్నారాయణుని కల్కి అవతారమును వివరించే కీర్తన ఇది. క్షీరసాగరమథనంలో జన్మించిన 'ఉచ్ఛైశ్రవము' అనే తెల్లని దివ్యాశ్వము ఇంద్రుని చేరింది. వేంకటేశ్వరుడే కల్కియై తెల్లని ఆ అశ్వాన్నెక్కి శంఖ, చక్ర, గదా, ధనుః ఖడ్గధారియై దుష్టశిక్షణకు, శిష్టరక్షణకు బయలుదేరాడు. జయలక్ష్మి రూపంలో అమ్మవారు కూడా స్వామిని కౌగలించి, గట్టిగ పట్టుకొని, వెన్నంటిందట. కొంతమంది ఈ కీర్తన వేంకటనాథుడు వేటకు వెళ్లడాన్ని వివరిస్తోంది అంతే, అంటున్నారు. కానీ శేషుని 'డాలు' గా చేసికోవటం, ధూమకేతువుని బల్లెంగా చేసికోవటం వంటి చరణాలు నాకు కల్కివర్ణనే అనిపిస్తోంది.

**ఉ॥ "వేట" కు నేగెనంట హరి వెన్నును దట్టిన భామతోడుతన్**
**దీటుగ గుఱ్ఱమెక్కెనట తేకొని ఆయుధ ప్రాణియై అహో!!**
**సాటి మరెవ్వడో తెలుపసాధ్యమె? లేరుర అన్నమయ్యకున్**
**మేటిది కీర్తనంబు తిరువేంకటనాథుని గొల్పుడీయెడన్**

**రాగం : అఠాణా**

నీవు తురగము మీద నేర్పుమెరయ
వేవేల రూపములు వెదజల్లితపుడు ॥నీవు॥

పదిలముగ నిరువంక పసిడి పింజల యంప-
పొదల తరకసములొరపులు నెరపగా
గదయు శంఖంబు చక్రము ధనుః ఖడ్గములు
పదివేలు సూర్యబింబములైన వపుడు ॥నీవు॥

సొరిది శేషుని పెద్దచుట్టు పెనుగేవడము
సిరిదొలక నొకచేత చిత్తగించి
దురమునకు తొడవైన ధూమకేతువు చేత
నిరవైన బల్లెమై ఏచెనందపుడు ॥నీవు॥





కరకజడతో రమాకాంత జయలక్ష్మియై
తొరలి కౌగిట నిన్ను తొడికి పట్టి
చరచె వెను వేంకటస్వామి నిను గెలువమని
మెరుగు కుచకుంభముల మిసిమితో నపుడు ॥నీవు॥

### భావామృతం

ప్రభూ! నీవు నేర్పునంతయు ప్రదర్శించుచూ దివ్యాశ్వము మీద (ఉచ్ఛైశ్రవముపైన) వేలకొలది కాంతులను వెదజల్లుతూ అనేక రూపములతో ప్రకాశించితివి.

స్థిరముగా ఇరువైపులా బంగారపు కుచ్చులు (బాణము చివరనుండు కుచ్చు. అది బాణం సూటిగా వేగముగా దూసుకుపోవుటకుపయోగిస్తుంది). ఆయన అంబుల పొదిలో మెరుపులు మెరిపించెను. కౌమోదకి అను గద, పాంచజన్యము అను శంఖము, సుదర్శనము అను చక్రము, శారఙ్గము అను ధనస్సు, నందకము అను ఖడ్గము ఆయన ఆయుధములై పదివేల సూర్యబింబములు ఒకచోటనే కాంతినిస్తున్నాయా అన్నట్లుంది.

వరుసగా చుట్టబడిన ఆదిశేషుని యొక్కచుట్లు విచిత్రమైన పెద్ద'డాలు' (కత్తి యుద్ధం లో ప్రత్యర్థి కత్తివేటును అడ్డుకొనే గుండ్రటి పళ్ళెము) వలె ఆయన చేతులలో విరాజిల్లెను. వినాశనముకు సంకేతమైన 'తోకచుక్క' ఆస్వామి చేతిలో పొడవాటి బల్లెమువలె భూషణమై, విజృంభించినది.

(ఒక ప్రక్క స్వామివారు దుష్టశిక్షణకు ఇలా సంసిద్ధుడై అశ్వారూఢుడవంగానే...) లక్ష్మీదేవిని నేనూ సిద్ధమేనని, కరకజడతో (వేటకుపయుక్తమౌ సామాగ్రితో, చెర్నాకోలతో (అశ్వాన్ని అదలించు కొరడాతో) జయలక్ష్మీ రూపంలో ఆయనకు అశ్వం మీద తోడయింది. ఆ దేవి నీకు తగినట్లుగా నిన్ను బిగి కౌగిట పట్టుకొని నీ వెన్నుదట్టి ధైర్యమునిచ్చినది. (ఆమె ధైర్యలక్ష్మి కదా!) ఓ వేంకటస్వామీ! నిన్ను ఆమె విజయం సాధించమని ఆ విధంగా ప్రోత్సహించుచుండగా మెరయుచున్న ఆమె కుచకుంభములు మిలమిలలాడినవి. ఓ మహానుభావా! ఆమె నీకు అన్ని విధమలా సరి జోడీ తండ్రీ!

**2-63**

## మున్నుడి

అన్నమాచార్యులవారు ఆంజనేయునిపై చెప్పిన అసంఖ్యాక కీర్తనలలో ఇది ఒక మణిపూస. సముద్ర గర్భంలో పరిశోధించేవారు తాముయెంతలోతుకు పోతే అంత విశేషం కనుక్కోగలరట. ఈ కీర్తనల వైశిష్ట్యం కూడా అంతేనేమో అనిపిస్తోంది. నేను చదువుకొనే రోజుల్లో రాయలసీమకు చెందిన నా మిత్రుడొకరు 'కిట్టించి' అనే మాటని అలవాటుచేశాడు. అర్థం తెలియని ఆ పదాన్ని 'ఉజ్జాయంపుగా సరిచేసి ఏదోరకంగా సరిఅయినదిగా చూపించటం' అనే అర్థంలో వాడేవాళ్ళం. అన్నమయ్య దయవల్లనేడు ఈ కీర్తనలో కిట్టి 'అంటే ' 'సమీపించి' అని తెలిసింది. ధన్యోస్మి...

**ఆ.వె॥ పంతగాడు అయిన పవనాత్మజున్ గొల్చె**
**నన్నమయ్య పాడి అద్భుతముగ**
**బ్రహ్మపట్టమేల వరముపొందుటయెల్ల**
**తిరుమలేశు కృపని తెలిపినారు.**

**రాగం : మలయమారుతం**

పంతగాడు మిక్కిలి నీ పవనజుడు
రంతుకెక్కె మతంగ పర్వత పవనజుడు ॥పంతగాడు॥

వాలాయమై యెంతభాగ్యవంతుడో దేవతలచే
బాలుడై వరములందె బవనజుడు
పాల జలనిధి దాటి పరగ సంజీవి దెచ్చి
యేలక ముందర బెట్టె యీ పవనజుడు ॥పంతగాడు॥

సొంటులు సోదించితెచ్చి సుగ్రీవు రాఘవునికి
బంటుగాక బొందసేసె బవనజుడు
వొంటినే రాముని ముద్రవొసగి సీత ముందర
మింటిపొడవై పెరిగె మేటి పవనజుడు ॥పంతగాడు॥





కిట్టి శ్రీవేంకటేశ్వరు కృపచే ముందరి బ్రహ్మ-
పట్ట మేలనున్నవాడు పవనజుడు
చుట్టి చుట్టి తనకు దాసులయిన వారికి
గట్టి వరములిచ్చె నీ ఘనపవనజుడు. ॥పంతగాడు॥

**భావామృతం :**

ఓ శ్రీవేంకటేశ్వరా! నీ పవనపుత్రుడు ఎంతో పట్టుదలగలవాడయ్యా! ఆ మతంగ పర్వతాన్ని రంతుకెక్కాడు (ఆటలాగా ఎక్కాడు) నీ బంటు అయన వాయునందనుడు.

ఆయ యెంతటి భాగ్యవంతుడో కదా! దేవతలచే తనబాల్యంలో, (వాలాయమై) నిరంతరముగా వరములు పొందినవాడు ఆ పవనజుడు. పాలసముద్రమును కూడా దాటి వెళ్ళి సంజీవని పర్వతం తెచ్చి తన స్వామియైన రామచంద్రుని ముందరనుంచి (లక్ష్మణుని మూర్ఛతప్పించి) ఆయన కాపుడయ్యాడు ఈ పవనజుడు.

నమ్మదగినవారో, కారో తెలుసుకొని (సొంటులు సోధించి) తీసికొనివచ్చి సుగ్రీవుని రాఘవునికి బంటుగా అయ్యేట్లు చేసి (మైత్రిని నిలిపినవాడు) ఈ పవనజుడు. ఒక్కడే వెళ్ళి శ్రీరామముద్రికను సీతాదేవికి ఇచ్చి ఆమె తనను చిన్న కోతివలెనే భావిస్తోందని గ్రహించి అద్భుతంగా ఆకాశమంత ఎత్తుపెరిగి తన శక్తి చూపించి ఆమె ఆశలు చిగురింపజేసిన మేటిఘనుడు ఈ పవనపుత్రుడు.

శ్రీవేంకటేశ్వరునికి 'కిట్టి' (దగ్గరవాడై) ఆయన కృపను బొంది రానున్న బ్రహ్మకల్పములో పంచముఖ బ్రహ్మ అవుతాడనే వరమును అనుగ్రహింపబడినవాడు ఈ పవన నందనుడు. బాగుగా సమీపించి (చుట్టిచుట్టి) తనకు దాసులైన భక్తులకు దిట్టమైన వరములను ప్రసాదించు ఘనుడు ఈ పవనపుత్రహనుమ.

## 2-64

### మున్నుడి

అద్భుతమైన వాదనాపటిమతో అన్నమాచార్యులవారు ఓ వేంకటేశ్వరా! ఏదో ఒకకారణం లేకపోతే నిన్ను చూచుట ఎట్లు సాధ్యమవుతుంది? మేము గడ్డితినే జీవులము నీవు పురుషోత్తముడివి. అసురులు బలవంతులైతే, అధర్మం పెచ్చుమీరితే, సంభవామి యుగే యుగే అన్నావు కదా! అప్పుడు నిన్ను కనులారా గాంచగలము. నీకంటే నీ దాసులే మాకుమేలు. నీవు ఎక్కడ వుంటావో చెప్పలేం గానీ నీ దాసులు వుండేచోట మాత్రము నీవు తప్పక వుంటావు". ఔరా!! ఏమి వాదన ఆచార్యులవారిది?

**మ॥ అరరే!! ఏమది వింతగొల్ప వినుమా అన్నయ్యవాదంబులన్**
**ధరలో దైత్యులు మేలు జేతురట నీ దాసుల్ని దండించుచున్**
**తరుగై ధర్మము మంచి కల్గునట ఓ దామోదరా! వింటివా?**
**మురవైరీ! ఇది ఏమి వింత అయినన్ మోదంబుకల్గెన్ భళా!!**

**రాగం : సామంతం**

ఊరకైతే నిన్ను గాన-మొక కారణానగాని
పూరి జీవులము నీవు-పురుషోత్తముడవు. ॥ఊరకైతే॥

అసురలు భువి బుట్టు-టది వుపకారమే
అసురులు బాధింతు- రమరులను
పొసగ వారికి గాను-పూనక వచ్చి నీవు
వసుధ జనించితేను-పడి నిన్ను గందుము ॥ఊరకైతే॥

అదరి ధర్మము చెడి-యధర్మమైనా మేలు
వెడగు మునులు విన్న-వింతురు నీకు
తదరి ధర్మము నిల్ప-ధరణి బుట్టుదు వీవు
బడి నిన్ను సేవించి-బ్రదుకుదు మపుడే ॥ఊరకైతే॥





నీ కంటె మాకు జూడ-నీ దాసులే మేలు
పైకొని వారున్న చోట-బాయకుందువు
చ కొని శ్రీవేంకేశ-చెప్పగానే వారిచేత
నీ కథలు విని విని-నే మీదేరితిమి ॥ఊరకైతే॥

**భావామృతం :**

ఓ ప్రభూ! మేము నిన్ను ఊరకనే చూడాలంటే సాధ్యమయ్యే పనికాదు. ఎందుకంటే నీవేమో పురుషోత్తముడవు. మేమేమో పూరి జీవులము. (గడ్డితినే పశువుల్లాంటి, అజ్ఞానులం).

రాక్షసులు భూమిపై జన్మించుట చేత వుపకారమే జరిగింది. ఎందుకంటేవాళ్ళు అట్లాపుట్టి దేవతలను బాధించ బట్టేకదా! వారిని సంహరించుటకు నీవు భూమిపై జన్మిస్తావు. అప్పుడు నిన్ను కనులారా చూచి మేము తరించగలము లేకపోతే నీవెందుకు వస్తావు, మేం నిన్ను ఎట్లా చూస్తాము?

విజృంభించి ధర్మం పూర్తిగా చెడిపోయి అధర్మం పెట్రేగిపోవడమే మంచిది స్వామీ! ఎందుకంటే అటువంటప్పుడు ధర్మసంస్థాపన కొఱకు నేను మరల మరల భూమిపై జన్మిస్తాను అని భగవద్గీతలో నీవే చెప్పావు కదా!! ధర్మం చెడగానే పాపం వెర్రి మునులంతా గగ్గోలు పెడతారు. అప్పుడు పాపులనడ్డగించి ధర్మం నిలబెట్టటానికి నీవు భూమిపై అవతరిస్తావు. అప్పుడు నిన్ను సేవిస్తూ బ్రతుకవచ్చును. ఓ వేంకటేశ్వరా! మాకు నీకంటే నీ దాసులవల్లనే ఎక్కువ వుపకారం జరుగుతుంది. ఎందుకంటే వారున్న చోట నీవు తప్పకవుంటావు కదా! వాళ్ళ ద్వారా నీ కథలు వినీ వినీ మేము ధన్యులయ్యాము తండ్రీ!

**2-65**

## మున్నుడి

మనమంతా మానవమాత్రులం. నారదమహర్షివలె నిరంతరం 'నారాయణ' అనలేము. వేదవ్యాసుని వలె విష్ణు గాధలు రచించలేము. సంధ్యావందనం కూడా చేయంకాబట్టి విష్ణుని నామజపం కూడా చేయటంలేదు. పోనీ గోపికలవలె అనన్య ప్రేమ వున్నదా స్వామిపైన అంటే అదీ లేదు. మనకి అనవసరమైన వన్నీ కావాలి. మరి మనగతేమిటి? అన్నమాచార్యులవారు అభయమిచ్చి, వినండి.... విష్ణుకథలు వినండి... భక్తితో వినండి. వెన్నెముక శరీరానికెట్లా బలమో, మీ భాగ్యం కొలది ఈ 'వెనుబలం' అయిన గాధలు వినండి అంటున్నారు.

**కం॥ వినరో విష్ణుని గాథలు**
**అనుపమ భాగ్యంబు లన్నమయ్యటు తెలిపెన్**
**వెను బలము భక్తకోటికి**
**యెనలేనివి వేంకటేశు హితకరములవే.**

**రాగం : శుద్ధధన్యాసి**

వినరో భాగ్యము విష్ణుకథ
వెనుబలమిదివో విష్ణుకథ ॥వినరో॥

ఆదినుండి సంధ్యాది విధులలో
వేదంబైనది విష్ణుకథ
నాదించీ నిదె నారదాదులచే
వీథి వీథులనే విష్ణుకథ ॥వినరో॥

వదలక వేదవ్యాసులు నుడివిన
విదిత పావనము విష్ణుకథ
సదనం బైనది సంకీర్తనయై
వెదకిన చోటనే విష్ణుకథ ॥వినరో॥





గొల్లెతలు చల్లలు గొనకొని చిలుకగ
వెల్లవిరియాయె విష్ణుకథ
యిల్లిదె శ్రీవేంకటేశ్వరు నామము
వెల్లిగొలిపెనీ విష్ణుకథ ॥వినరో॥

**భావామృతం :**

ఓ మానవులారా! మీభాగ్యంకొలది శ్రీమన్నారాయణుని విష్ణుగాధలను వినండి. శరీరమునకు వెన్నెముక వలె మీకు ఆ విష్ణుగాధలు మూలాధారమైన బలమునిస్తాయి. వీటిని విని తరించండి.

మన సంప్రదాయములో మొదటినుండీ సంధ్యావందన సమయంలో "ఓం కేశవాయస్వాహ"... అంటూ మొదలుపెట్టి పఠించేది విష్ణునామములే. ఇది యెన్నడోమన పెద్దలచే "వేదంబైనది" (తొలిచదువుగా తెలుపబడినది). నారదమహర్షి వంటి పుణ్యాత్ములు నిరంతరం 'నారాయణ' అంటూ గానం చేస్తూ వీథివీదికీ ఆ విష్ణుకథను ప్రచారం చేశారు. మనమెంత అదృష్టవంతులమో కదా!

విడువకుండా వేదవ్యాస మహామునిలాంటి మహానుభావుడు పదినెనిమిది పురాణములను రచించి పండితులచే అంగీకరింపజేసి పునీతములైన విష్ణుగాధలను తెలిపారు. ఆ సంకీర్తన పవిత్రమైన నెలవు వలె వెదకిన చోటనే కనబడి (ఎక్కడెక్కడో శ్రమపడి వెదకనక్కర లేదు) మనకి పుణ్యం ప్రసాదించే విష్ణుకథ.

గొల్లభామలు రేపల్లెలో చల్ల చిలుకుతూ ప్రేమతో శ్రీకృష్ణుని లీలలు గానం చేసేవారట. ఆ విధంగా కూడా విష్ణుని కధలు ప్రసిద్ధిజెందాయి (వెల్లవిరి అయినవి). ఇదిగో ఈ శ్రీవేంకటేశ్వరుని నామమే వెల్లిగొలిపే (వ్యాపించిన) విష్ణుకధయై 'ఓం నమోవేంకటేశాయ' అని ప్రసిద్ధిచెంది మనని తరింపచేయుచున్నది.

## 2-66

### మున్నుడి

ఇది అన్నమాచార్యులవారు సాళ్వనృసింహరాయలి 'కొలువు'లో వున్న రోజులలో చెప్పిన కీర్తన అయివుండవచ్చును. సరసశృంగార పరిమళాల ఈ కీర్తనలో అలమేలుమంగమ్మని పొగడుతున్నారు ఆచార్యులవారు. ఓ కలికీ! యెక్కడ నేర్చుకొన్నావమ్మా ఈ 'విద్య'లన్నీ!! నీగురించి 'కబుర్లు' వినాలంటే కోట్లువున్నాయి, అని ఆవిడ జాణతనం మెచ్చుకొంటున్నారు. వేంకటేశునితో ఆమె సమాగమముని కీర్తిస్తున్నారు. ఏడుకొండలవాడిని 'భావించ' గలవారికి మాత్రమే ఈ కీర్తన 'భావామృతం' అర్థం కావాలని విశ్వప్రయత్నంచేశాను సుమండీ.....

**తే॥ అమల శృంగార కీర్తన నన్నమయ్య**
**తిరుమలేశుని కొలువంగ తెలిపినారు**
**సాధ్యమైనంత గోప్యంబు జతయగుటయు**
**కోరిచేసినయత్నమే యెరుగరయ్య!**

**రాగం :ముఖారి**

చూడ చిన్నదాన వింటే సుద్దులు కోటానకోటి
యేడేడ నేరుచుకొంటివేవో కలికి ॥చూడ॥

కిన్నెర మీటులలోని గిలిగింతలు నీ
వన్నెల కనుచూపుల వలవంతలు
యెన్నరాని యిచ్చకపు టెలయింతలు
యెన్నడు నేరుచుకొంటివే వో కలికి ॥చూడ॥

సారెకు నెడవాయని సరసములు నీ
తారుకాణ సన్నల తమకములు
గారవించి బుజ్జగించే గమకములు
యేరీతి నేరుచుకొంటివే వోకలికి ॥చూడ॥



భావయామి వేంకటేశం

కందువ శ్రీవేంకటేశు కలయికలు నీ
యందమైన సమరతి యలయికలు
పొందుల మునిముంగిలి పొలయికలు
యెందెందు నేరుచుకొంటివే వో కలికి ॥చూడ॥

### భావామృతం :

ఓ చిన్నదానా! చూడబోతే నీ సంగతులు అన్నీ వింతలే. అవి కోటాను కోట్లున్నాయి. ఓ కలికీ! (మనోజ్ఞురాల వైప భామినీ!) యెక్కడ నేర్చితివమ్మా? (విద్యలన్నీ....)

వీణమీటినట్లు చక్కిలిగింతలు పెట్టుట, సోగకను చూపులతో 'వలవంతలు' (పూవింటివాని వేదన) కలిగించుట, అసంఖ్యాకమైన ప్రీతికర కూటములు... అహో!!! యెక్కడ నేర్చితివమ్మా?

ఒక్కసారి కూడ విడిచిపెట్టని సరస సల్లాపములు, వేగిరపాట్లు చేయు సంజ్ఞలు, వెనువెంటనే అభిమానపూర్వకమైన బుజ్జగింపులతో చేయు అసంఖ్యాకమైన గమకములు (యత్నములు) .... భళీ!! యెక్కడనేర్చుకొన్నావమ్మా ఇవియన్నీ?

సమర్థవంతుడైన శ్రీవేంకటేశ్వరుడు నీ ప్రియ వల్లభుడు. ఆ స్వామితో నీ కలయికలు అందమైన సమరతి యలయికలు (నిస్త్రాణలు). మీ పొందులలోని తొలి అలయుటలు (పొలయికలు) యెక్కడ నేర్చుకొంటివమ్మా?....సెబాసు!! ఓ కలికీ! నీ వసాధ్యురాలివు తల్లీ!

**2-67**

## మున్నుడి

అన్నమాచార్యులవారి కీర్తనలలో ‘రామనామా సంకీర్తనలు’ కర్ణపేయములే గాక పుణ్యనిలయములు. ఈ కీర్తనలో శ్రీరామభద్రుని నామమే కామధేనువువలె అన్ని కోరికలూ తీర్చేశక్తి కలది అంటున్నారు. కాకాసురుడు జానకికి ద్రోహంచేసినా కరుణామూర్తియై దయాసాగరుడై వానిని క్షమించాడు. రాజశేఖరులందరిలోను శిరోమణి ఈ మహానుభావుడు. పాపుల పీడితయైన భూదేవి ప్రార్ధనపై అయోధ్యాపురిలో వుండి భూభారం తగ్గిస్తానని చెప్పి తన మాట నిలబెట్టుకొన్నాడట ఆ ‘వేంకటాద్రి రాముడు’. ఓ ప్రభూ! నమో నమః

**కం॥ రామా! రవికులతిలకా!**
**నామంబే కామధేను, నగపుత్రినుతా!**
**నీమముగ తిరుమలేశని**
**భూమిజవర! అన్నమయ్య పొందిక గొలచెన్**

**రాగం : ఆనందభైరవి**

రామభద్ర రఘువీర రవి వంశతిలక నీ
నామమే కామధేను నమో నమో ॥రామభద్ర॥

కౌసల్యానందవర్ధన ఘనదశరథ సుత
భాసుర యజ్ఞరక్షక భరతాగ్రజ
రాసికెక్క కోదండ రచన విద్యాగురువ
వాసితో సురులు నిను వడి మెచ్చేరయ్య ॥రామభద్ర॥

మారీచసుబాహు మర్దన తాటకాంతక
దారుణవీరశేఖర ధర్మపాలక
కారుణ్య రత్నాకర కాకాసుర వరద
సారెకు వేదవిదులు జయ వెట్టేరయ్యా ॥రామభద్ర॥





సీతారమణ రాజశేఖర శిరోమణి
భూతలపుటయోధ్యాపుర నిలయా
యీతల శ్రీవేంకటాద్రి నిరవయిన రాఘవా
ఘాత నీ ప్రతాపమెల్ల కడునిండె నయ్యా॥రామభద్ర॥

**భావామృతం :**

ఓ రామభద్రా! రఘుకులవీరాగ్రణీ! సూర్యవంశ తిలకా! నీ నామస్మరణయే (మాకు) కామధేనువు వలె అనుకొన్న కోరికలనెల్లా తీరుస్తుంది. అటువంటి నీకు అనేక నమస్కారములు.

నీవు తనయుడవై జన్మించుట చేత కౌస్యలాదేవి ఆనందం వర్ధిల్లింది. దశరథాత్మజుడని పేరుపొంది ఆయనకు ఘనకీర్తి నాపాదించావు. కౌశికుని యాగమును నిర్విఘ్నంగా జరిపించి కీర్తితో భాసించావు. భరతునికి అన్నగారివై నిరంతరం ఆయనచే పూజింపబడ్డావు. అధికములగు కోదండ విద్యలలోను వాటినైపుణ్యములలోను నిరుపమానమైనవాడవు. అందుచేత దేవతలు కూడ నిన్ను ప్రఖ్యాత్ముడవని శీఘ్రముగా మెచ్చుకొన్నారు.

ఓ శ్రీరామచంద్రా! నీవు తాటక అను రాక్షసిని సంహరించుటయే గాక, ఆమె కొడకులైన మారీచ సుబాహులను మర్దించి అంతమొందించావు. అరివీర భయంకరుడవు. ధర్మపరిపాలకుడవు. కరుణాసాగరుడవై దుష్టబుద్ధితో నీ భార్యను హింసించినా శరణు వేడాడని కాకాసురుని దయతో క్షమించి కాపాడిన మహానుభావుడవు.

వేదవిద్యాపారంగుతులు సదా జయ జయ నినాదములతో నిన్ను కీర్తిస్తున్నారయ్యా!

ఓ సీతామనోవల్లభా! రాజప్రముఖులందరిలోను తలమానికమా! భూదేవి ధ్యానించివేడగా పాపులను నిర్మూలించి అయోధ్యా నిలయుడవై నీమాట నిలబెట్టుకొన్నావు. ఓ రాఘవా! ఈనాడు శ్రీవేంకటాద్రి నివాసమైన నీ దారుణ ప్రతాపముతో ఈ జగతి బాగుగా పరిపుష్టి చెందినది ప్రభూ!

**2-68**

## మున్నుడి

ఆరువందలు సంవత్సరముల క్రిందట ఏడుకొండల వేంకన్నకు ఏయే వంటలు నైవేద్యంపెట్టే వారో తెలుసుకోవాలనుందా? మరి ఈ అన్నమాచార్యులవారి కీర్తన వినాల్సిందే. మనం నైవేద్యం పెట్టాక ఆయన దేవేరి అలమేల్మంగమ్మ కొసరి కొసరి వడ్డించి ఆప్యాయంగా తినిపిస్తుందట స్వామికి. అది చూచే భాగ్యం మనబోటి అల్పులకెలాగో లేదు. ఈ కీర్తన ద్వారా భావిద్దాం. మారాముచేయక తినవయ్యా స్వామీ! అంటున్నారు. కొండల పొడుగునా దివ్యాన్నం రాసిగా పోశాం స్వామీ ఆరగించి కాస్త ఆ తరువాత భేష్ అని మెచ్చుకోవయ్యా అంటున్నారు.

**ఉ॥ ఇందిర ప్రేమతో వలపు లింపుగ కూరిన పిండివంటలన్**
**'చిందక' నారగింపమని చెప్పెను పాడుచు అన్నమయ్య, ఈ**
**చందముగా భుజించుటకు స్వామిక తీరికనేటి 'రద్దిలో'**
**ఎందులభించు? ఐననిది యెంతటి అద్భుతమైన కీర్తనో!!**

**రాగం : కళ్యాణి**

ఇందిర వడ్డించ యింపుగను
చిందక యిట్టె భుజించవో స్వామి ॥ఇందిర॥

అక్కాళపాకాలు అప్పలు వడలు
పెక్కైన సయిదంపు పేణీలును
సక్కెర రాసులు సద్యోఘృతములు
కిక్కిరియ నారగించవో స్వామీ ॥ఇందిర॥

మీరిన కెళంగు మిరియపు తాళింపు
గూరలు కమ్మని కూరలును
సారంపు పచ్చళ్ళు చవులుగనిట్టే
కూరిమితో చేసికొనవో స్వామీ ॥ఇందిర॥





పిండివంటలును పెరుగులు పాలు
మెండైన పాకాలు మెచ్చి మెచ్చి
కొండల పొడవున కోరిదివ్యాన్నాలు
వెండియు మెచ్చవే వేంకటస్వామీ ॥ఇందిర॥

**భావామృతం :**

ఇందిరాదేవి చక్కగా ఆప్యాయంగా వడ్డిస్తుంటే మారాము చేయకయిట్టే (వెంటనే) ఆరగించవయ్యా తండ్రీ! ఆలస్యందేనికి?

బాగుగా అక్కళింపజేసిన (సన్నటిమంట మీద చాలాసేపు మగ్గించిన) వంటలు ఇవి. ఎన్ని వున్నాయోచూడు. అప్పలు (నేటికాలంలో అప్పాలు అంటున్నాం), వడలు, ఎన్నోరకముల గోధుమపిండి (సముదంపు) వంటకాలు, పేణీలు, సమృద్ధిగా చెక్కర, నెయ్యి పొర్లునట్లు (సద్యోఘృతము) చేసిన వంటకాలు వున్నాయి. కిక్కిరిసి (ఏ మాత్రం సందులేనట్లుగా) భుజించవయ్యా స్వామీ! (నీవు తృప్తిగా తింటే మాకింకేంకావాలి?)

ఎక్కువగా మిరియములు దట్టించిన తాళింపు పెట్టిన కూరలు ప్రభూ! ఇవి. కమ్మటి కూరలు ఆరగించవయ్యా. ఇదిగో ఇటు చూశావా శ్రేష్ఠమైన (సారంపు) పచ్చళ్ళుయెన్నివున్నాయో చూశావా? రుచిగావుంటాయి. వీటన్నిటినీ ఇట్టే చెలువముతో స్వీకరించు స్వామీ! (ఆలశ్యమై పోతోంది మరి...)

అనేకమైన పిండివంటలేకాక పెరుగుతో చేసినవి, పాలతో చేసిన పాయసములు, సమృద్ధిగా నున్న వంటలు. వీటిని ఏదో ముట్టీ ముట్టనట్టు తినకూడదు. మెచ్చుకొంటూ మెచ్చుకొంటూ సెబాస్ అంటూ తినాలి. ఈ కొండల పొడుగునా నీకు ప్రేమగా దివ్యాన్నములను రాసిగాపోశాం ఆరగించు మహానుభావా! ఓ వేంకటేశ్వరా! అటుపిమ్మట మెచ్చుకొని మమ్మల్ని తరింపజేయుము తండ్రీ!

## 2-69

### మున్నుడి

“రాయుడు” అంటే రాజు అని అర్థం. వేంకటరాయుడుఅనే పేరు ఆంధ్రదేశంలో సుప్రసిద్ధం. అన్నమాచార్యులవారు కొండల కోనేటి రాయుడని స్వామివారిని కీర్తిస్తున్నారు. సురతి విజ్ఞానంలో దిట్ట అని శ్రీనివాసుని ఆచార్యులు మాత్రమే అనగలరు. ఆయన స్వామి వారి ‘నందక ఖడ్గం’ కదా! కామించి నిన్ను కోరాను స్వామీ! అంటున్నారు, ఇదొక మణిపూస....

**సీ॥ తిరుమల రాయడు దేవరాహుత్తుండు**
**సురత విజ్ఞాని ఈ సుగుణరాసి**
**చెలువపు తిమ్మయ్య పలు వినోదాలయ్య**
**త్యాగాలరాయడు అమితభోగి**
**చెప్పిన ధర్మమే చెల్లుబాటౌవాడు**
**మాటలకందని మన్మథుండు**
**సామవేద ప్రియుడు సరసవైభవముల**
**విలసిల్లు వైకుంఠ నిలయుడతడు**

**ఆ.వె॥“కొండ”లన్నమయ్య “కోనేటిరాయని”**
**కొలుచు తీరుజూడ పులకలగును**
**“కరుణజూపునంట కామించి కోరిన”**
**ఇట్టి మాటజల్లులెట్లు కురియు?**

**రాగం : హంసధ్వని**

తిరుమలగిరిరాయ దేవరాహుత్తరాయ
సురతి బిన్నాణరాయ సుగుణకోనేటిరాయ ॥తిరుమల॥

సిమలసింగారరాయ చెలువపు తిమ్మరాయ
సరసవైభవరాయ సకల వినోదరాయ
వర వసంతముల రాయ వనితల విటరాయ
గురుతైన తేగరాయ కొండటకోనేటి రాయ ॥తిరుమల॥





గొల్లెతల ఉద్దండరాయ గోపాలకృష్ణరాయ
చల్లవెద జాణరాయ చల్లపరిమళరాయ
చెల్లుబడి ధర్మరాయ చెప్పరాని వలరాయ
కొల్లలైన భోగరాయ కొండలకోనేటిరాయ ॥తిరుమల॥

సామసంగీతరాయ సర్వమోహనరాయ
ధామవైకుంఠరాయ దైత్య విభాళరాయ
కామించి నిన్ను కోరితే కరుణించితివి నన్ను
శ్రీమంతుడ నీకు జయశ్రీవేంకటరాయ ॥తిరుమల॥

**భావామృతం :**

తిరుమలగిరులకు ఏలికవైన ఓ ప్రభూ! నీవు దేవరాహుత్త రాయడివి. (రాహుత్తుడు అంటే గుఱ్ఱపుస్వారీ చేయువాడు. దేవరాహుత్తుడంటే దైవాశ్వమైన ఉచ్ఛ్రశ్రవముపై నెక్కినవాడు. అంటే కల్కిరూపి అయిన రాయడు అని అర్థం.) సురతి విజ్ఞానం తెలసినరాయా! సుగుణాలకుప్పవైన కోనేటిరాయా! నీకు జయము.

సకలైశ్వర్యములు గల శృంగారరామా! నీవు చెలువపు తిమ్మరాయడి.( స్నేహభావన గల కొండలరాయడవు.) అన్ని వైభవములు దాపుననే గల రాయడవు. అన్ని వినోదములు కలిగినవాడవు .వసంతకేళిలో నిష్ణాతుడవు. ఇక అనేక భామలకు ప్రియుడవని చెప్పవలసిన అవసరమేలేదు. (‘కుబ్జ’) నాకు పెళ్ళిగిళ్ళీ అక్కరలేదు ఒక కొడుకు కావాలన్నది) స్వామీ! నీవు గురుతైన తేగరాయడవు. (గుర్తుంచుకోదగ్గ త్యాగములు చేసినవాడవు. తండ్రి మాటకోసం రాజ్యాన్నే త్యాగం చేసిన కొండలలో వున్న కోనేటిరాయడవు.

స్వామీ! నీవు గోపికలకు సర్వస్వము అయినరాయడివి. గోవులను కావున కృష్ణరాయడివి. జాణతనం వెదజల్లినవాడవు. చల్ల (మజ్జిగ) పరిమళంపై మరులుకొన్నవాడవు. నీవు చెప్పిన ధర్మమే చెల్లుబాట్లు చేసినవాడవు. మన్నధుని (వలరాయడు) కంటే మిక్కిలి సౌందర్యవంతుడవు. అంతులేని భోగములనుభవించు రాయడవు. ప్రభూ! నీవు కొండలలోని కోనేటి రాయడవు.

స్వామీ! నీవు సామవేదం పఠించేవారి సంగీతరవమునకు పులకరించు రాయడివి. నీవు సర్వులను మోహింపజేయువాడవు. వైకుంఠ ధామమునకు ఏలికవు. దితి సంతతిని తుదముట్టించినవాడవు. ఓ వేంకటేశ్వరా! నిన్ను ప్రేమగా ఏదికోరినా దయతో నన్ను అనుగ్రహించావు. శ్రీనివాసా! నీకు సర్వదా జయమగుగాక! శ్రీవేంకటరాయా! నీకు శుభమగు గాక!

2-70

## మున్నుడి

అన్నమాచార్యులవారి భావవైచిత్రిని అర్థం చేసికొనటం ఒక్కొక్కప్పుడు నల్లేరు మీదనడకకాదు. ఈ కీర్తన అదే విషయాన్ని బల్లగుద్ది చెబుతోంది. "నీ భావమేమిటో, నీవెందుకు నాకు మానవ జన్మనిచ్చావో తెలుసుకోలేని పశువునయ్యాను స్వామీ! నా అపరాధం మన్నించు" అని దీనంగా వేడుకొంటున్నారు, "నీవు మాకు మానవజన్మనిచ్చి, పంచేంద్రియాలనిచ్చి, రకరకాల బంధుత్వాలనిచ్చి, బ్రతికి సన్మార్గంలో మంచిచేయరా" అని యెక్కడో నా జీవుణ్ణి తెచ్చి భూమ్మీదకు పంపిస్తే... నేను మోక్షం, ముక్తి అంటూ నా కర్తవ్యాలను మరువదగునా? నీ ఆనతి మీర దగునా? అంటున్నారు...

**చం॥ ఎరుగను తప్పిదంబులను ఈశ్వర! నే పశుబుద్ధినైతి, నే**
**పరమును నెంచినీ వొసగు బంధములన్ విడనాడజూచితన్**
**నిరతము నీదు యాజ్ఞలను నిందలు జేసితి అన్నమయ్యనైన్**
**తిరుమలరాయ! నీవొసగు దేనినికాదన జాలుదున్ ప్రభూ!**

**రాగం : గుజ్జరి**

భావించనేరనైతి -పశుబుద్ధినైతిని
యీవల నా యపచార- మిదిగావవయ్య ॥భావించి॥

హరినీవు ప్రపంచ-మందుబుట్టించితి మమ్ము
పరమునే సాధించేది-బలు ద్రోహమవుగాదో
సిరులనేలేటివాడు-చెప్పినట్లు సేయక
విరసాలు బంట్లకు -వేరే సేయదగునా ॥భావించి॥

పంచేంద్రియములు నాపై-బంపువెట్టితివి నీవు
ఎంచి వాని దండించే-దిది నేరమౌగాదో
పెంచేటి తలిదండ్రులు-ప్రియమై వడ్డించగాను
కంచము కాలదన్న సం-గతియా బిడ్డలకు ॥భావించి॥





మిక్కిలి సంసారము-మెడగట్టితివి నాకు
అక్కర నే వేసారేది- అపరాధ మవుగాదో
దిక్కుల శ్రీవేంకటాద్రి-దేవుడనీవియ్యగాను
ఎక్కడో జీవుడ నేను-యెదురాడదగునా ॥భావించి॥

**భావామృతం :**

ఓ ప్రభూ! నీ అభిప్రాయమును భావించ లేకపోయాను. పశుబుద్ధి కలవాడనగుటచే నేనేవేవోదారులు తొక్కాను. ఇక నా అపరాధములను నీవు గాక మరెవరు మన్నిస్తారు? నన్ను క్షమించు తండ్రీ!

ఓ శ్రీహరీ! ఈ ప్రపంచంలో నన్ను పుట్టించినవాడవు నీవు. నేనేమో స్వర్గం వంటి లోకాలకోసించి 'పరము' కావాలని వెంపర్లాడుతున్నాను. శ్రీపతివి నీవు చెప్పినట్లు సేయటం మా వంటి సేవకులధర్మం. అంతేగాని దానికి విరుద్ధంగా చేయదగానా? నీ ఆజ్ఞ నుల్లంఘించదగునా?

ఓ మహానుభావా! కళ్ళు, ముక్కు, నాలుక, చెవులు మరియు చర్మం అను ఐదు ఇంద్రియములను నాకు ఇచ్చావు. నీ జీవితకాలంలో వాటివల్ల మేలుపొంది జీవితం పండించుకో అని నీవు చెబితే... మేము చేస్తున్నదేమిటి? వాటిని దండించి నిగ్రహించాలని చూస్తున్నాం. ఇది నేరము కాదా? కని, కష్టపడి పెంచే తలిదండ్రుల మాట కాదని, వాళ్ళు తృప్తిగా తినమని వడ్డించిన కంచము మా ముందర బెడితే.. దాన్ని కాలదన్ని వాళ్ళను బాధించడం బిడ్డలు చేయాల్సిన పనియేనా? (మరిలోకాలకే తండ్రివైన నిన్ను ధిక్కరించటం ఇంకెంత పాపము?)

నీవు ఏదో వుద్దేశ్యంతోనే ఈ బరువైన సంసారాన్ని నా మెడకు గట్టావు. అది అక్కర లేదని నేను విసుగుకొని దానినుంచి విముక్తుడనుగావాలని ప్రయత్నించటం ధర్మమా? సర్వవ్యాప్తుడవై దిక్కులన్నింటిలో నీ వేంటే...ఓ శ్రీవేంకటేశ్వరా! దేవదేవుడవై నీవిచ్చింది తీసికొనక, యెక్కడో అలమటించే ఈ జీవుడికి మానవజన్మనిచ్చావన్న కృతజ్ఞత కూడా లేకుండా నీ మాటను యెగర్దించుట నేను చేయాల్సిన పనియేనా? కాదు ముమ్మాటికీ కాదు. నా అపరాధం మన్నించు తండ్రీ!

## 2-71

## మున్నుడి :

శ్రీవేంకటేశ్వరుడు మన 'తలపుదైవము' అంటే 'కోరుకొనేదైవం. ఆయన వుండేదెక్కడ? మన తలపులో' అంటే మన భావనలో. "పదియును పదియైన తలపు' అంటే తొమ్మిదినొక్కటి సంఖ్య కాదు, 'చక్కటి తలపు' అని అర్థం. నిఘంటువు చేతిలో వున్నా ఈ కీర్తన వివరించడం కష్టమే. ఎందుకంటే కొన్ని చోట్ల అన్నమాచార్యులవారి భావం మన భావనకందదు. దశావతారవర్ణన ఇంత నర్మగర్భంగా చెప్పడం ఎవరికి సాధ్యం? 'గొడుగువట్టిన వాని కోరి అడిగిన తలపు' అంటే..వామనుని గురించి అని తెలుసు, కాని గొడుగుపట్టినదెవరు? భావించండి మరి....అంతతేలిక కాదు.

**తరళము : తలపులోపలి దైవమై మన దాపునుండెడి దైవమై**
**పలు విధంబుల రూపుదాల్చిన మాధవున్ వినుతించెరా**
**తొలిది మత్స్యము, కల్కిఅంత్యము తోయజాక్షుడు లీలతో**
**అలరగా తన కీర్తనంబున అన్నమయ్యటు తెల్పెరా**

**రాగం : వసంతం**

తలపులోపలి తలపుదైవ మీతడు
పలుమారు బదియును బదియైన తలపు ॥తలపు॥

సవతైన చదువులు సరుగదెచ్చిన తలపు
రవళిదరి గుబ్బలిని రంజిల్లు తలపు
కవగూడ గోరి భూకాంతముంగిట తలపు
తివిరి దూషకు గోళ్లదెగటార్చు తలపు ॥తలపు॥

గొడుగు వట్టిన వాని కోరియడిగిన తలపు
తడబడక విప్రులకు దానమిడు తలపు
వొడిసి జలనిధిని గడ గూర్చి తెచ్చిన తలపు
జడియక హలాయుధము జళిపించు తలపు ॥తలపు॥





వలపించి పురసతుల వ్రతము చెరిచిన తలపు
కలికి తనములు చూప గలిగున్న తలపు
యిల వేంకటాద్రిపై నిరవుకొన్న తలపు
కలుష హరమై మోక్ష గతిచూపు తలపు ॥తలపు॥

## భావామృతం :

ఈ స్వామి తలపులోపలి (భావనలోని) 'తలపు దైవం' (కోరుకోవలసిన దైవము) ఎన్నియెా విధముల 'పదియును పదియైన' (చక్కని) తలపు (భావన). ఆవిధములనన్నింటినీ వివరిస్తాను గ్రహించండి.

ఈ మహానుభావుడు సవతైన చదువులు సరగు తెచ్చిన తలపు, (సమానమైన వేదములను వర్ధిల్లునట్లు జేసిన భావన.. అనగా మత్స్యరూపుడు). ఈయన రవళిదరిగుబ్బలి రంజిల్లు తలపు (ఘూర్ణిల్లు సముద్రమున పర్వతముక్రింద విలసిల్లిన భావము.. అనగా కూర్మావతారుడు). ఈయన, కవగూడ గోరి భూకాంతముంగిట తలపు (జత అవుదామని భూదేవి తన యెదుట నిలిచిన భావన.. అనగా వరాహావతారము). ఈయన, తివిరి దూషకు గోళ్లదెగటార్చు తలపు (తనను దూషించు దుర్మార్గుని ప్రయత్నించి గోళ్లతో మరే ఆయుధం లేకుండా సంహరించిన భావన.. అనగా నరసింహుడు). ఈ స్వామి, గొడుగువట్టిన వాని కోరి అడిగిన తలపు (గొడుగువట్టి గౌరవించిన బలిని అర్థించి మూడడుగులు దానము గ్రహించిన భావన... అనగా వామనుడు). ఈయన తడబడక విప్రులకు దానమిడు తలపు (సంకోచించకుండా, తను నృపతులను వధించి సంపాదింన భూమండలాన్నంతా బ్రాహ్మణులకు దానంచేసిన భావన.. అనగా పరశురాముడు) ఈయన, వొడిసి జలనిధిని గడగూర్చి తెచ్చిన తలపు బ్రహ్మాస్త్రముతో బెదరగొట్టి సముద్రుని తనవద్దకు తెప్పించిన భావన... అనగా శ్రీరామావతారము). ఈయన, జడియక హలాయుధము జళిపించిన తలపు (వెఱపులేక నాగలిని ఝళిపించిన భావన.. అనగా బలరాముడు).

ఈ స్వామి వలపించి పురసతుల వ్రతము చెరచిన తలపు (త్రిపురాసురుల భార్యలను మోహమున ముంచి వారి పాతివ్రత్య దీక్షను భంగపరచి ఆ త్రిపురాసురుల చావుకి కారణమైన భావన.. అనగా బుద్ధ భగవానుడు). ఈయన కలికి తనములు చూప గలిగున్న తలపు (మనోజ్ఞమైన ప్రతాపము చూపగలిగిన భావన.. అనగా కల్కిఅవతారము). శ్రీవేంకటాద్రిపై నివాసమైన తలపు. సర్వపాపములను నివారించి మోక్షము నొసగు భావనామూర్తి ఈ శ్రీ వేంకటేశ్వరుడే.

**మున్నుడి** **2-72**

గీర్వాణ భాషలో శ్రీమన్నారాయణునిపై స్తుతిని అద్భుతమైన శ్రీరాగంలో వినిపిస్తున్నారన్నమాచార్యులవారు. మనసు పులకరించి పోతుంది ఇది వింటే. సగుణ బ్రహ్మ, సర్వులచే పారాయణ చేయబడు ఆ తిరుమలేశుడు శోభనమూర్తి అని కీర్తిస్తున్నారు. ఇది సుదీర్ఘమైన కీర్తన. అయినా ఆద్యంతంగా, కర్ణపేయంగా సాగిపోతుంది. కరిరాజవరదుడు రవిచంద్ర నేత్రుడు, శ్రీవత్సాంకితుడు, పుండరీకాక్షుడు అయిన శ్రీవేంకటేశ్వరుడు ఈ కీర్తన విని నిస్సందేహంగా పులకరించి పోతాడు.

**కం॥ నారాయణునుని, సర్వము**
**పారాయణు సంస్కృతమున ప్రార్థించి రిటన్**
**మీరిన భక్తిని అన్నయ**
**శ్రీరాగము శిలల కరుగజేయును వినుడీ**

**రాగం : శ్రీరాగం**

నమో నారాయణాయ
నారాయణాయ సగుణ బ్రహ్మణే సర్వ
పారాయణాయ శోభనమూర్తయే ॥నమో॥
నిత్యాయ విబుధ సంస్తుత్యాయ నిత్యాధి-
పత్యాయ మునిగణప్రత్యయాయ
సత్యాయ ప్రత్యక్షాయ సన్మానస సాం-
గత్యాయ జగదవన కృత్యాయ తే నమో ॥నమో॥
అక్రమోద్ధత బాహు విక్రమాతిక్రాంత
శుక్ర శిష్యోన్మూలనక మాయ
శక్రాది గీర్వాణ వక్రభయ భంగ నిర్
వక్రాయ నిహతారి చక్రాయతే నమో ॥నమో॥
అక్షరాయాతి నిరపేక్షాయ పుండరీ
కాక్షాయ శ్రీవత్సలక్షణాయ
అక్షీణ విజ్ఞాన దక్ష యోగీంద్ర సం
రక్షానుకంపా కటాక్షాయ తేనమో ॥నమో॥
కరిరాజవరదాయ కౌస్తుభా భరణాయ
మురవైరిణే జగన్మోహనాయ
తరుణేందు కోటీర తరుణీ మనస్స్తోత్ర
పరితోషచిత్తాయ పరమాయతేనమో ॥నమో॥





పాత్రదానోత్సవ ప్రథిత వేంకటరాయ
ధాత్రీశకామితార్థప్రదాయ
గోత్రభిన్మణిరుచిర గాత్రాయ రవిచంద్ర
నేత్రాయ శేషాద్రి నిలయాయ తే నమో ॥నమో॥

**భావామృతం :**

ఓ నారాయణుడా! నీకు వందనములు. సుగుణములకు నెలవైన పరబ్రహ్మ స్వరూపుడవు నీవు. సర్వమూ నేర్చినవాడవు. నీవు సుందరమూర్తివి. అట్టి నీకు వందనము. ఓ మహానుభావా! నీవు నిత్యము వుండెడివాడవు. గొప్ప పండితులచే చక్కగా స్తుతింపబడువాడవు. మునిజనుల నమ్మకమైన వాడవు. సత్యస్వరూపుడవు. ప్రత్యక్షముగా కరుణించువాడవు. సద్బుద్ధిగల వారి సాంగత్యాభిలాషివి. జగత్తు నంతటిని తృప్తిపరచువాడవు. అటువంటి నీకు నమస్కారములు.

ఓ దేవదేవా! అన్యాయం పెట్రేగినప్పుడు నీ బాహువుల పరాక్రమముచే దాని నెదిరించువాడవు. శుక్రాచార్యుని శిష్యులైన దైత్యులను నిర్మూలించు నియమము కలవాడవు. ఇంద్రాది దేవతలకు అతిశయించిన భయమును నిర్మూలించిన వాడవు. ఏ విధమైన వక్ర స్వభావమూ లేనివాడవు. శత్రువులను తరుగు చక్రము గలవాడవు. అట్టి నీకు వందనములు.

ఓ లోకేశా! నీవు నాశనము లేనివాడవు. ఏ కోరికలూ లేనివాడవు. పద్మదళ నేత్రుడవు. శ్రీవత్సమును పుట్టుమచ్చ నీ లక్షణముగా కలవాడవు. ఎన్నడూ క్షీణించని విజ్ఞాన దక్షత కలవాడవు. విశిష్టులైన యోగులను రక్షించి మిక్కిలి కరుణతో అనుగ్రహించువాడవు. అట్టి నీకు నమస్కారములు.

ఓ స్వామీ! నీవు అలనాడు గజేంద్రుని కాపాడినవాడవు. దివ్య కౌస్తుభమణి చేత అలంకరింపబడిన వాడవు. 'ముర' అను రాక్షసుడు శత్రువుగా కలవాడవు. జగన్మోహనుడవు. లే వెన్నెల వెలుగులు విరజిమ్ము కిరీట ధారివి. లేబ్రాయపు గోపికలచే కీర్తించబడి మిక్కిలి సంతుష్టాంతరంగుడవై కైవల్యము నొసగినవాడవు. అట్టి నీకు వందనములు.

ఓ జగన్నాథా! నీవు పాత్రులకు వారికి తగినవి అనుగ్రహించుటలో ప్రసిద్ధిజెందిన శ్రీవేంకటేశ్వరుడవు. మానవుల కామితములను దీర్చువాడవు. వివిధ దివ్య రత్నములచే బొడమిన కాంతులచే ప్రకాశించు దేహము కలవాడవు. శేషాద్రి నిలయమైనవాడవు. అటువంటి ఓ పరమపురుషా! నీకు శతకోటి వందనములు.

## 2-73

## మున్నుడి

ఇది అచ్చతెలుగులో అన్నమాచార్యులవారు చెప్పిన అందాల చందమామ పాట. తెలుగే కదా! తేలికే అనుకొనే తెలివి తక్కువైన వారి తెలివి తెలతెలబోయేట్లు చేసే తెలివైన తెలుగు పాట. చంద్రుడికి తిరుమలయ్యకు చుట్టరికం తెలియని వాళ్ళకి యెన్నిసార్లు చదివినా తెలియని కీర్తన "మలయుచు తమలోని మట్టిమానిపంట" అంటే.. ఏమో ఇదమిద్ధంగా తెలియదు. నేను 'బుఱ్ఱ' బద్దలు కొట్టుకొన్నా 'మట్టిమాని పంట' అంటే ఖచ్చితంగా ఏమో అర్థంకాలేదు. నా భావన నేను చెప్పాను. చిత్తగించాల్సింది శ్రీవేంకటేశ్వరుడే. ద్వైతులు, అద్వైతులు అని కొట్టుకొనేవాళ్లం, మనకేదైతే నేమి? కదా!

**చం॥**

**గొనకొని నేత్రమై హరికి గూరిమి గూర్చెడి పంట, యీతడున్**
**మును 'సిరి'తోడబుట్టెనట, మోదకరంబగు పంట జాబిలై,**
**తనువుల కామరోగమున దగ్ధము జేయును అన్నమయ్యనెన్**
**అనువుగ వేంకటేశ్వరుని కబ్బిన చల్లని యింటిపంటనెన్**

**రాగం : రామక్రియ**

సందెకాడ బుట్టినట్టి చాయల పంట యెంత-
చందమాయె చూడరమ్మ చందమామ పంట ॥సందెకాడ॥

మునుప పాలవెల్లి మొలచి పండిన పంట
నినుపై దేవతలకు నిచ్చపంట
గొనకొని హరికన్ను గొన చూపుల పంట
వినువీధినెగడిన వెన్నెలల పంట ॥సందెకాడ॥

వలరాజు పంపున వలపు విత్తిన పంట
చలువై పున్నమి నాటి జాజర పంట
కలిమి కామిని తోడ కారుకమ్మిన పంట
మలయుచు తమలోని మట్టిమాని పంట ॥సందెకాడ॥





విరహుల గుండెలకు వెక్కసమైన పంట
పరగ చుక్కలరాశి భాగ్యము పంట
అరుదై తూరుపు కొండ నారగ బండిన పంట
యిరవై శ్రీవేంకటేశనింటిలోని పంట ॥సందెకాడ॥

**భావామృతం :**

ఇదిగో 'చందమామ' చూశారా... ఇది సంధ్య చీకట్లు ముసురుకొంటుంటే 'చాయల పంట' (కాంతులు వెదజల్లే ఫలము) గా పుడుతుంది. ఎంత చందమాయె? (ఎంత అందమైనదో చూడండమ్మా!

ఎంతో పూర్వమే, పాలసముద్రములో పుట్టి పుడుతూనే యువకుడైన (పండిన) ఫలము ఇదియే. దేవతలకు నినుపై (పూర్ణముగా) కనిపిస్తూ ఇష్టమైన ఫలము. శ్రీ మహావిష్ణువునకు ఒక కన్నుగా (ఇంకొక కన్ను సూర్యుడు) ఆయన కొనచూపులతో చూస్తాడు కాబట్టి చల్లగా ఉండే ఫలము ఇదే. ఆకాశవీధిలో వెన్నెలలు వెదజల్లే ఫలము ఈ చందమామ.

ఈ అందాల చందమామ ఘనత నింకా చెప్పాలంటే, ఈయన వలరాజు (మన్మధుడు) కు సహాయకుని వలె ప్రేమ మొలకెత్తిస్తుంటాడు. అందుకే ఈయన వలపుల ఫలము. చల్లని పున్నమి రాత్రులలో వ్యామోహపరచు ఫలము ఈ చందమామ. సిరులమ్మతోడబుట్టిన విశ్వవిఖ్యాతమైన ఫలము. ఉద్యమించి చీకట్లలో మనోజ్ఞముగా వటవృక్షములపై తళుకులీను ఫలము ఈ చందమామ.

ఇక విరహపీడితులకు ఈ చందమామ గుండెమంట. వారి గుండెలకు ఇతని దర్శనమే దుర్భరమైనది. అంత దుస్సహమైన ఫలము ఈ చందమామ. వినువీధిలోని తారా తోరణానికి ఈయన దర్శనమే మహద్భాగ్యమైన ఫలము. అరుదుగా (నెలకొక్కరోజు మాత్రమే) తూర్పుకొండ మీద పూర్ణముగా పండే పంట ఈ జాబిల్లి. (జాబిల్లి అంటే జానుపిల్లి అంటే కుందేలు తనలో వున్నవాడు అంటే చంద్రుడు). చంద్రుడు అనబడే ఈయన స్థిరమైన, శ్రీ వేంకటేశ్వరుని ఇంటిలోని ఫలము, (క్షీరసాగరమధనంలో పుట్టినవన్నీ శివుడు గరళం కంఠంలో నిలిపిన అనంతరం, దక్కినది శ్రీహరికే కదా!) వలె శోభించాడు.

2-74

## మున్నుడి

అహోబల నరసింహస్వామి వారిని కీర్తిస్తూ చెప్పిన చక్కటి కీర్తన ఇది. ఎటువైపునుంచి చూచినా మననే స్వామివారు చూస్తున్నట్లు అనిపిస్తుంది. అది ఆ క్షేత్రంలోని ప్రత్యేకత. మొహం నవ్వుతున్నట్లుంటుంది. నారదాదుల గానం వింటూ పరవశించే ఈ నృసింహుడే తానకమై (స్థానమై) వేంకటాద్రిమీద శ్రీ వేంకటేశ్వరుడై తనదాసులకు అభీష్టములనిస్తున్నాడట. అన్నమాచార్యులవారి భావనా ప్రపంచంలో సర్వం తిరుమల రాయుడే. శంఖచక్రాల స్వామే 'జంటకోరల' ప్రహ్లాదవరదుడు.

**ఉ॥ ఆదిమ మూర్తియై వెలసెనాతడు కావగ దైత్యనందనున్**
**ఏదెస జూచినన్ కనులకీతడె విందు అహోబలంబునన్**
**పాదుకొనెన్ నృసింగమయి పాడెను కీర్తన నన్నమయ్య ఈ**
**మాదిరి వేంకటేశ్వరుని భావన నెవ్వడు చేసెనీ భువిన్**

**రాగం : శంకరాభరణం**

ఆదిమూర్తి యీతడు ప్రహ్లాదవరదుడు
ఏదెస జూచినా తానె ఈతడిదె దేవుడు ॥ఆదిమూర్తి॥

నవ్వుల మోముతోడ నరసింహరూపు తోడ
జవ్వని తొడమీద సరసమాడ
పువ్వుల దండలు ఇరు బుజాలపై వేసుకొని
ఉవ్విళ్లూర కొలువై వున్నాడు దేవుడు ॥ఆదిమూర్తి॥

సంకు చక్రములతోడ జమళికోరల తోడ
అంకెల కటి అభయ హస్తాలెత్తి
కంకణాల హారాలతో ఘనకిరీటము వెట్టి
పొంకమైన ప్రతాపాన పొదలీని దేవుడు ॥ఆదిమూర్తి॥





నానా దేవతలతోడ నారదాదుల తోడ
గానములు వినుకొంటా గద్దెపై నుండి
ఆనుక శ్రీవేంకటాద్రి నహోబలము నందు
తానకమై వరాలిచ్చీ దాసులకు దేవుడు ॥ఆదిమూర్తి॥

**భావామృతం :**

ప్రహ్లాదవరదుడైన ఈ నరసింహస్వామి ఆదిదేవుడు. ఏవైపు నుండి ఈ స్వామిని చూచినా భక్తులకు ఆ స్వామి తమనే చూస్తున్నట్లు అనిపిస్తుంది. ఇటువంటి ప్రత్యేకతకల దేవుడు ఈ అహోబల నరసింహస్వామి.

నరుని దేహమూ సింహము తల గలిగిన రూపంతో ఈ స్వామి మొహంలో నవ్వు ప్రతిఫలిస్తుంటుంది. ఈయన ఎడమ తొడపై కూర్చునియున్న లక్ష్మీదేవి ఈయనతో సరసమాడుచున్నది. రెండు భుజములపై పూలదండలు వేసుకొనిన ఈ స్వామి, మిక్కిలి సంతోషంతో కొలువైవున్నాడు. అట్లు విలసిల్లుతున్న ఈ దేవుని తిలకించండి.

చతుర్భుజుడైన ఈ స్వామి వారిరెండు హస్తాలలో శంఖ చక్రములు ప్రకాశించుచున్నవి. ఈయన జంటకోరలు చూడండి. ఈయన నడుము దగ్గిరగా అభయ హస్తమును ఎత్తి పట్టుకొని యున్నాడు. ఈయన ముంజేతి కంకణములు, మెడలో మణిహారములు, తలపై ఘనమైన కిరీటం శోభిల్లుచున్నవి. పొందికయైన ప్రతాపముతో ఈ దేవుడు వర్ధిల్లుచున్నాడు.

వివిధ దేవతలు (గంధర్వ, కిన్నెర, కింపురుషాది సురులు) నారదాది మునులు ఈ స్వామి వారిని కీర్తిస్తున్నారు. వాటిని వింటూ స్వామివారు సింహాసనంపై కూర్చొని యున్నారు. ప్రక్కనే వున్న తిరుమల స్థానమైయున్న శ్రీ వేంకటేశ్వరుడే అహోబలంలోని ఈ నరసింహుడు. ఈ స్వామి వరాలిచ్చి తన దాసులను అనుగ్రహించే దేవుడు.

## 2-75

### మున్నుడి

'సిరి' అంటే శ్రీమహాలక్ష్మి. ఆవిడ ఇచ్చే వైభవం కేవలం 'ధనము' మాత్రమే కాదు. సంతోషం కూడ ఒక సంపదే. ఎంత చదివినా, ఎంత వినినా నీతి బోధలు ఏ మాత్రం ఉపయోగం లేదు. మనిషి దుర్గుణములు పోకుండా, చెడుమార్గములు వదలిపెట్టక, దురుసుగా ప్రవర్తించే పొగరుపోకుండా, పరదూషణ వదలకుండా, అబద్ధాలు చెప్పే అలవాటు విడిచిపెట్టకుండా, ఆత్మలో శ్రీవేంకటేశ్వరుని నిలుపుకొనకుండా ఎవరికైనా 'చింత' అనేది పోతుందా? 'సిరి' కలుగుతుందా? ఎ..న్న..టి..కీ సాధ్యంకాదు అంటున్నారు అన్నమయ్య.

**ఆ.వె.॥ ఎంత చదివి యేమి? యెంత వినిననేమి?**
**చింత పోదు, రావు సిరులు కూడి**
**ఇట్లు సేయకున్న హితవుల జెప్పెను**
**అన్నమయ్య, తిరుమలయ్య! వినుము**

**రాగం : దుర్గ**

ఎంత చదివిన నేమి వినిన తన
చింత యేలమాను సిరులేల కలుగు ॥ఎంత॥

ఇతర దూషణములు ఎడసిన గాక
అతికాముకుడు కానియప్పుడు గాక
మతి చంచలము కొంతమానిన గాక
గతియేల కలుగు దుర్గతులేల మాను ॥ఎంత॥

పరధనముల యాస పాసిన గాక
అరిది నిందలు లేని యప్పుడు గాక
విరసవర్తనము విడిచిన గాక
పరమేల కలుగు నాపదలేల మాను ॥ఎంత॥





వేంకటపతి నాత్మవెదకిన గాక
కింక మనసున తొలగిన గాక
బొంకుమాట లెడసి పోయిన గాక
శంక యేల మాను జయమేల కలుగు ॥ఎంత॥

**భావామృతం :**

జీవనోపాధికి వుపయోగించే 'చదువు' కాని. భట్టీయం చేసే వేదపారాయణం కానీ, పురాణ కాలక్షేపాలు కానీ (నేటి కాలంలో దూరదర్శన భక్తి కార్యక్రమాలు కానీ) ఎంత చదివినా, ఎంత వినినా తెలియని విషయాలు తెలుస్తాయోమో కాని, మనిషికి తన విచారము పోతుందా? సుఖం అనే 'సిరి' కలుగుతుందా?

పరులను నిందించే పాడు అలవాటు విడిచిపెట్టక, అతి కామాతురుడు (స్త్రీ వ్యసనపరుడు) పొందే బలహీనతలు విడనాడక, స్థిరత్వంలేని చంచల మనస్తత్వం పోకుండా.. ఎవ్వరికైనా, ఎన్నడైనా సద్గతి కలుగుతుందా? దుర్గతులు రాకుండా వుంటాయా?

ఇంకొకడి ధనం మీద ఆశపడే నీచమనస్తత్వం వదలిపెట్టకుండా, పరదూషణ చేసే పాడు అలవాటు విడనాడక (నోరు మంచిదైతేనే వూరు మంచిది అనే నిజం తెలుసుకోకుండా) దురుసుగా పొగరుబోతుగా ప్రవర్తించే పాడు అలవాటు మానక, పుణ్యం కలుగుతుందా? పోనీ మెడకు తగులుకొనే ఆపదలు పోతాయా?

శ్రీ వేంకటేశ్వరుడే సర్వస్వం అని నమ్మి ఆ దేవదేవుడిని ఎవరి ఆత్మలో వారు ప్రతిష్టించుకొని నిత్యమూ దర్శించటం అలవాటు చేసుకోవాలి. 'కోపము' అనే దురలవాటును విడిచి పెట్టేయాలి (తనకోపమె తన శత్రువు..). అసత్యానికి ఆమడదూరంలో వుండాలి... ఇట్లా వుంటే జయం కలుగుతుంది. అంతేకాని అన్నీ అనుమానాలే. అపనమ్మకములే అయిన వానికి మంచి జరుగుతుందా? అస్సలు జరుగదు.

## 2-76

## మున్నుడి

గోవింద నామస్మరణ చేస్తూ తిరుమల కొండల నెక్కితే పునర్జన్మ వుండదని నాభావన. ఈ కీర్తనలో ప్రతిచరణమూ గోవింద స్మరణయే. సంగీతం వచ్చిన అదృష్టవంతులు ఈ అన్నమయ్య కీర్తన పాడుతూ యెక్కితే వింటున్న వారు గోవిందా అంటూ వారి చరణాల్లో తమ చరణాలు (నడక) కలుపుతూ చరణ చరణానికీ (కీర్తన చరణం) గోవిందా అంటుంటే ఆ ఏడుకొండలవాడు మీ వెంట తనుకూడా నడుస్తాడు. మీకు సందేహం వద్దు. నన్ను నమ్మండి. ఏదీ అనండి... గోవిందా... గోవిందా... గోవిందా.

**ఉ॥ కొండను వ్రేలనెత్తితిని గోకుల రక్షకు కాని, గోపికల్**
**కొండెములెంచి చెప్పి నిను కొట్టగ జూచిరిగా యశోదచే**
**మెండుగ 'వుట్లు' తెంపితివి? విప్పిన చీరెలు దోచుకొంటివా?**
**అండవు వేంకటేశ! ఇవి అన్నియు లీలలె అన్నమయ్యనెన్.**

**రాగం : కేదారగౌళ**

కొండ వేల నెత్తినట్టి గోవిందా నిన్ను
గొండించేరు యశోదకు గోవిందా ॥కొండ॥

గొల్లెతలు మొక్కేరు గోవిందా నీ
కొల్లల చీర లిమ్మని గోవిందా
గొల్లువెన్న దొంగిలగ గోవిందా నిన్ను
కొల్లున నవ్వేరు వీరె గోవిందా ॥కొండ॥

గోవుల గాచేవేళ గోవిందా పిల్ల-
గోవిని వలచిరి గోవిందా
గోవాళులై యమునలో గోవిందా నీకు
కోవరమున్నారు రా గోవిందా ॥కొండ॥





కొట్టేటి వుట్ల కింద గోవిందా నీతో
గొట్టెవాటై పెనగేరు గోవిందా
గుట్టుతో శ్రీవేంకటాద్రి గోవిందా కూడి
గొట్టాన బెట్టేరు బత్తి గోవిందా ॥కొండ॥

**భావామృతం :**

గోవర్ధన పర్వతమును చిటికిన వ్రేలిపై నెత్తిన ఓ గోవిందా! నీవు రేపల్లెలోని ఆబాలగోపాలాన్ని రక్షిస్తే ఆ గోపికలు ఏం చేశారో చూశావా? మీ అమ్మ యశోదకు నీపై కొండెములు (చాడీలు) చెప్పి నిన్ను కొట్టించాలని చూశారు. (యెంత కృతఘ్నులు!!)

ఓ గోవిందా! నీకు గోపికలంతా మొక్కి వేడుకొన్నారు. ఓ గోవిందా నీవు దొంగిలించిన మా చీరెలు మాకు తిరిగి ఇచ్చి మామానములు కాపాడు ప్రభూ! అని దీనంగా వేడుకొన్నారు. గొల్లువెన్న (అప్పుడే చిలికిన వెన్న) నీవు దొంగిలిస్తే ఓ గోవిందా! వారు గొల్లుమని నవ్వుకొన్నారు. (మరి ఆ కోపం అంతా యెక్కడికి పోయిందో!!)

నీవు గోవులను కిశోరప్రాయంలో కాస్తూ వుండగా యెంత మనోహరంగా పిల్లగోవిని (మురళిని) మ్రోగించేవాడివి!! ఓ గోవిందా! అప్పుడు గోపికలంతా నిన్ను ప్రేమించారు. యమునా నదీ తీరంలో గోవాళులై (యవ్వనముగలవారై) గోపికలు నీకోసం కోవారమున్నారు. (కాపు కాసారు లేక పొంచియున్నారు)

ఓ గోవిందా! నీవు "వుట్లు" (పాలు, వెన్న, నెయ్యి దాచుమట్టి పాత్రలుంచుటకు త్రాళ్లతో నల్లి (వ్రేలాడగట్టు బంధనము) పగులగొట్టినప్పుడు వాటిక్రింద కొట్లాడుకుంటూ గోపబాలురు మూకుమ్మడిగా పోగయ్యేవారు. గోవిందుడవైన ఓ వేంకటేశ్వరా! నిన్ను భక్తులంతా భద్రంగా నీ గుడిలో నిన్ను బెట్టి భక్తితో పూజిస్తున్నారు. గోవిందా! గో... విందా... అంటున్నారు.

## 2-77

### మున్నుడి

శరణాగతితో శ్రీవేంకటేశ్వరుడే దిక్కని నమ్మిన వారికి అత్యంత ప్రీతికరమైనది 'భజన' అనే నామసంకీర్తన. భావం వివరించ వలసిన అవసరం లేని అద్భుత అమృత గుళికలు అన్నమాచార్యులవారి శ్రీహరి నామ సంకీర్తనలు. నాబోటి పరిమిత బుద్ధిగలవారికి ఇందులో కూడా ఎందెందు వెదకి జూచినా అందందే కలదు పెద్ద సందేహంబు.. కాబట్టి భావామృతం అవసరమే అయింది. "నవ సావయావ సారూప్యుడట" తిరుమలేశుడు. అంటే, ఎట్లా భావిస్తే, అట్లాంటి రూపంగల క్రొత్త రూపం. దానికి అవయవాలు కూడా భావననుంచి పుట్టినవే... అహో!!

**తే॥ హరిని శరణని వేడిరి అన్నమయ్య**
**విష్ణునామాలు వీనుల విందుకాగ**
**తిరుమలేశుని నిలిపిరీ తీరుగాను**
**భావనాతీతు తనదగు భావమందు**

### రాగం : శివరంజని

మాధవ భూధవ మదన జనక
సాధురక్షణ చతుర శరణు శరణు ॥మాధవా॥

నారాయణాచ్యుతానంత గోవింద శ్రీ-
నారసింహా కృష్ణ నాగశయన
వారాహ వామన వాసుదేవ మురారి
శౌరి జయ జయతు శరణు శరణు ॥మాధవా॥

పుండరీకేక్షణ భువనపూర్ణగుణ
అండజగమన నిత్య హరి ముకుంద
పండరి రమణ రామ బలరామ పరమ పురుష
చండ భార్గవరామ శరణు శరణు ॥మాధవా॥





దేవదేవోత్తమ దివ్యావతార నిజ-
భావ భావనాతీత పద్మనాభ
శ్రీవేంకటాచల శృంగారమూర్తి నవ
సావయవ సారూప్య శరణు శరణు ॥మాధవా॥

### భావామృతం :

ఓ మాధవా! భూకాంతా మనోవల్లభా! మన్మధుని కన్నతండ్రీ! సాధు వర్తనులను రక్షించుటలో విశేషమైన నైపుణ్యం గల మహానుభావా! శరణు శరణు. రక్ష రక్ష!!

ఓ నారాయణుడా! చ్యుతి (నాశనము) లేని అనంతుడా! గోవిందుడా! శ్రీనారసింహా! శ్రీకృష్ణా! శేషునిపై శయనించు స్వామీ! ఆది వరాహరూపా! వామనావతారా! వాసుదేవా! ముర అనే దైత్యునికి శత్రువుయైన శౌరీ! జయము. సర్వదా నీకు జయము. ఓ ప్రభూ! నన్ను రక్షింపుము శరణు శరణు.

పద్మదళముల వంటి కన్నులుగల దేవా! చతుర్దశ భువనాలలో (పదునాలుగు లోకాలలో) పూర్ణగుణములచే విలసిల్లు స్వామీ! అండజుడు (గ్రుడ్డునుండి పుట్టినవాడు) అయిన గరుత్మంతుని వాహనముగా పయనించు స్వామీ! నిత్యమైవున్న శ్రీహరీ! ముకుందా! పండరీపుర నివాసా! శ్రీరామచంద్రా! బలరామా! పరమ పురుషా! తీవ్రమైన పరశురామా! శరణు శరణు తండ్రీ! నన్ను రక్షింపుము.

దేవతలలో విశిష్టులైన వారి అందరిలో ఉత్తముడవైన ఓ దివ్యావతారా! సత్యమే స్వరూపముగా గలవాడవగుటచే భావనలకందని మహానుభావా! పద్మము నాభియందుగల ప్రభూ! శ్రీవేంకటాచల నిలయుడవైన శృంగార రాయా! ఎట్లా భావిస్తే అట్లాంటి కొంగ్రొత్త రూపంగల వేంకటేశ్వరా! శరణు శరణు! తండ్రీ! నన్ను కనికరించు ప్రభూ!

## 2-78

### మున్నుడి

అహోబలంలో నరసింహస్వామి వారికి ఆదిలక్ష్మికి కళ్యాణ మహోత్సవం జరుగుతున్నది. తానూ ఒక యువతి వలె తోటి వనితలతో పాడుతూ చెబుతున్నారు అన్నమాచార్యులవారు. భవనాశినీ నదికి ఇరుగడల (రెండు తీరములూ) అమ్మవారినీ అయ్యవారిని మంగళ స్నానం చేయించి మంచి పూలదండలు వేసి సుముహూర్తం మించిపోకుండా వేదాద్రి గరుడాద్రి అనే పెండ్లి పీటలపై కూర్చుండబెట్టారట. కనకావతి, భోగావతీ నదీ జలాలతో వసంతం ఆడారట. వధూవరులు గరుడాదిపైనే కాక వేంకటాద్రిపై కూడా సరసములాడుకొంటూ కూడికూడి వేడుకగానున్నారట...

**ఆ.వె.॥ వధువు ఆదిలక్ష్మి వరుడు నృసింహుడు**
**అన్నమయ్య భావమద్భుతంబు**
**పెండ్లిపీటలాయె వేదాద్రి గరుడాద్రి**
**తిరుమలాయె వేడ్క గరుడకొండ**

**రాగం : ఆనంద భైరవి**

పాడరే సోబనాలు పడతులాలా
వేడుకలిద్దరికిని వెలసె చూడరే ॥పాడరే॥

కొండలే పీటలుగా కూర్చున్నారెదురు బడి
అండనే నారసింహుడు ఆదిలక్ష్మియు
వెండిపైడి నిండుకొన్న వేదాద్రి గరుడాద్రులు
పెండిలాడే రిద్దరును ప్రియమున చూడరే ॥పాడరే॥

భవనాశి జలముల పాయక తోడనీళ్లాడిరి
ఇవలా నవలా తాము ఏటిదరుల
జవళి మంచి పూవుల సరిసేసలు వెట్టుచు
తవిలి సుముహూర్తాన తప్పక చూచేరు ॥పాడరే॥





పొందుగ కనకావతి భోగావతి నదులు
సందడి వసంతముగా చల్లులాడుచు
అందమై శ్రీవేంకటాద్రి అహోబలాన ఒక
చందమున కూడి కూడి సరసము లాడేరు ॥పాడరే॥

### భావామృతం :

ఓ వనితల్లారా! మీరు ఇప్పుడు మంగళగీతములను పాడండి. ఆదిలక్ష్మికి అహోబల నరసింహ స్వామివారికి కళ్యాణమహోత్సవం జరుగుతున్నది చూచి తరించండి.

అమ్మవారు అయ్యవారు ఆదిలక్ష్మీదేవి, అహోబలనరసింహుడు. అక్కడే రెండు కొండలు పెండ్లి పీటలు కాగా ఎదురెదురుగా కూర్చునియున్నారు. వెండితోను బంగారముతోను ఆ రెండు కొండలైన వేదాద్రి గరుడాద్రి నిండియున్నాయి. వారు ఆవిధంగా ఆసీనులై పెండ్లి చేసుకొనుచున్నారు. మీరు ఆనందంగా తిలకించండి.

ఆదిలక్ష్మి నరసింహస్వామి మంగళస్నానములు యెక్కడ చేశారో తెలుసా? భవనాశినీ నదీ జలములతో ఇటువైపూ అటువైపూ వైభవంగా నదీతీరంలో మంగళస్నానం చేశారు. జవళి (అంటే...విక్రయించగా కొన్నటువంటి నూతన వస్త్రములను ధరించి), మంచి పుష్పములే అక్షతలుగా ధరించి ఎప్పుడో ఒకసారి వచ్చే ఇటువంటి సుముహూర్తంలో జరిగే పెండ్లిని మీరు తప్పక వీక్షించండి.

చక్కగా కనకావతి, భోగావతి అను రెండు నదులు చల్లుకొంటూ మీరు వసంతములాడు కొనుటకు, మంచి సందడి జరుపుకొనుటకు సిద్ధముగా నున్నవి. అందమైన వేంకటాద్రి ఈ అహోబల గరుడాద్రి రెండూ సమానమే. ఒక్కటే.. అనే విధముగా ఈ ఆదిలక్ష్మి నరసింహులిద్దరు కలిసిపోయి ఒకరి నొకరు చిలిపిగా చూసుకొంటూ (అల్పులమైన మనకు అర్థంకాని విధంగా) సరసములాడుకొంటున్నారు. చూచి, భావించి, తరించండి.

**2-79**

## మున్నుడి

గోపికలలో తనుకూడ ఒక గోపికై అన్నమాచార్యులవారు పాడుతున్న ఈ కీర్తనలో బాలకృష్ణుని లీలలు వినిపిస్తున్నారు. దేవకి కారాగారంలోనే ప్రసవ వేదన అనుభవించి నల్లనయ్యను కన్నది. కానీ పెంచే అదృష్టం యశోద దక్కించుకొన్నది. అమరులకు కూడా దక్కని ఆయన పరిష్వంగ సుఖం, చల్ల వాసన కొట్టే గోపికలకు దక్కింది. ఆదిపురుషుడై కూడ ఆవులను కాచాడు. మనుష్య శరీరంతో అందర్నీ మాయ చేశాడు. భారతయుద్ధం నిర్వహించి భూభారం నిర్మూలించి ధర్మస్థాపన జేశాడు. ఆయన లీలల నెరుగుట సాధ్యమా?

**ఉ॥ ఆడుచు పాడరమ్మ సతులందరు మీకిదె భాగ్యమౌనులే**
**వేడుక సంతసంబులిక వెల్లివిరౌయనె అన్నమార్యుడున్**
**కూడిరి గోపభామినులు కొల్వగ; విశ్వము జూపె నోటిలో**
**తోడుగ ధర్మమున్ నిలిపె తోయజనాభుడు వేంకటేశుడై.**

**రాగం : అమృతవర్షిణి**

ఆడరమ్మా పాడరమ్మా అందరు మీరు
వేడుక సంతసములు వెల్లివిరియాయెను ॥ఆడరమ్మ॥

కమలనాభుడు పుట్టె కంసుని మదమణచ
తిమిరి దేవకీదేవి దేహమందును
అమరులకు మునుల కభయ మిచ్చె నితడు
కొమరె గొల్లెతలపై కోరికలు నిలిపె ॥ఆడరమ్మ॥

రేయి పగలుగ చేసి రేపల్లె పేరుగజొచ్చె
ఆయెడ నావుల గాచె నాదిమూలము
యీ యెడ లోకాలు చూపె నిట్టె తన కడుపులోన
మాయసేసి యిందరిలో మనుజుడై నిలిచె ॥ఆడరమ్మ॥





బాలలీలలు నటించి బహుదైవికము మించె
పాలువెన్నెలు దొంగిలె పరమమూర్తి
తాళి భూభారమణిచె ధర్మము పరిపాలించె
మేలిమి శ్రీవేంకటాద్రిమీద నిట్టె నిలిచె ॥ఆడరమ్మ॥

**భావామృతం :**

ఓ అమ్మలారా! మీరందరూ ఈ సమయము వలన ఆడండి. సొగసుగా పాడండి. సంబరములు వేడుకలు వెల్లివిరిసెను.

పద్మనాభుడు దేవకీ దేవి అష్టమగర్భమున జన్మించినాడు. ఆతడు తన మేనమామ అయిన కంసుని మదముయొక్క తిమిరి (తిమ్మిరి) ని అణచినాడు. అతడు దేవతలకు మునులకు అభయమునొసగి రక్షించెను. లేబ్రాయపు గొల్ల కన్యలపై మరులు కొనెను.

ఆ కృష్ణుడు రేపల్లెలో పెరిగి పెద్దవాడవుతున్నాడు. అక్కడి ప్రజల ఆనందానికి అవధుల్లేవు. వారికి రేయింబవళ్లు ఒక్కలాగుననే ఆనందమిస్తున్నాయి. అందరు గోపబాలకుల వలెనే అతగాడు కూడా ఆవులను మేపుటకు పచ్చని గడ్డి కోసం బృందావనంలో సుదూర ప్రాంతాలకు పోయేవాడు. ఆదిపురుషుడైన నారాయణుడే అక్కడ అట్లా చేస్తే ఇక్కడ చిన్నారి బాలకృష్ణుడు "మన్ను తింటున్నావా? ఏదీ నీ నోరుచూపించు" అని గద్దించిన యశోదకు తన చిన్నారి నోటిలో త్రిభువనాలను ఇట్టే చూపించి నివ్వెరపోవునట్లు చేశాడట. ఇంతమందిని ఇన్ని విధములుగా మాయజేసిన ఆ మధువైరి తనుమనుజునిగానే నిలిచాడు.

బాలలీలలను నటించిన ఆ కృష్ణయ్య పరమాత్ముని వలె అనేక మహిమలు చూపించాడు. ఆ పరమ పురుషుడే పాలు వెన్నా దొంగతనం చేశాడు. ఉద్యమించి ఆయన భూభారమును తగ్గించి (దుష్ట శిక్షణకు పూనుకొని) ధర్మ సురక్ష చేశాడు. బంగారపు వేంకటగిరులపై ఇట్టే నిలిచినవాడై శ్రీవేంకటేశ్వరునిగా ఆ కృష్ణయ్య అందరినీ కాపాడుతున్నాడు.

**2-80**

## మున్నుడి

అన్నమాచార్యులవారు ఘంటాపథంగా ఒక మాట చెబుతున్నారు. 'అయ్యా! మీరే పురాణం చదవండి, యెక్కడైనా యెన్నడైనా హరిదాసుడెవ్వడైనా చెడిపోయాడా? లేదు, ముమ్మాటికీ చెడిపోలేదు. వారిని నీడలా వెన్నంటి ఆ శ్రీనాథుడే రక్షించాడు. ఆయనని చేరటానికి వుపయోగపడని ఏ చదువైనా ఏ మతమైన ఏ ధర్మమైనా నిరుపయోగమే అంటున్నారు. తిరుమలేశుని సేవయే నిజమైన సేవ. ఆ నరహరిని నమ్మితే అంతులేని వరాలిస్తాడు. ఆయన సమారాధన యెన్నడూ 'వితథము' కాదట. అంటే.. చదవండి మరి...

**చం॥ కనుగొనుమే పురాణమున కావ్యమునన్ హరిదాసుడెవ్వడున్**
**వినుమిది యెన్నడున్ చెడదు విష్ణుడె కాచును తోడు నీడయై**
**మును హరిబ్రోచెనా ధ్రువుని మోసెను భక్తుల భారమంతయున్**
**అనఘుడు అన్నమయ్య యిటు అద్భుత కీర్తన మాలపించెరా.**

**రాగం : గౌరిమనోహరి**

ఏ పురాణముల నెంత వెదకినా
శ్రీపతిదాసులు చెడ రెన్నడును ॥ఏ పురాణము॥

హరివిరహితములు అవి కొన్నాళ్లకు
విరసంబులు మరి విఫలములు
నరహరి గొలిచిటు నమ్మినవరములు
నిరతము లెన్నడు నెలవులు చెడవు ॥ఏ పురాణము॥

కమలాక్షుని మతి గానని పదవులు
కుమతంబులు బహు కుపథములు
జమళి నచ్యుతుని సమారాధనలు
విమలములేకాని వితథము గావు ॥ఏ పురాణము॥





శ్రీవల్లభుగతి జేరని పథములు
దావతులు కపట ధర్మములు
శ్రీవేంకటపతి సేవించు సేవలు
పావనములధిక భాగ్యపు సిరులు ॥ఏ పురాణము॥

## భావామృతం

ఓ భక్తులారా! మీరు ఏ పురాణాలు, యెంత చదివినా ఒక్కటే సత్యం తెలుస్తుంది. అదే.. శ్రీహరి భక్తులు ఎన్నటికీ చెడిపోరు. వారికి యెప్పుడూ మేలే జరుగుతుంది. హరిదాసులకు అనర్థమే జరుగదు.

శ్రీహరికి చెందని ఏదయినా కొన్నాళ్లకు విరసములై ఆ ప్రయత్నాలన్నీ విఫలమైపోతాయి. నరసింహుని అవతారం దాల్చిన శ్రీమన్నారాయణుని నమ్మిసేవిస్తే ఆయన ఇచ్చే వరములు నిరంతరమైనవి. అవి సుస్థిరమైనవి.

పద్మదళాయతాక్షుడైన పద్మనాభుని ఆత్మలో దర్శించుట నేర్పని చదువులు వ్యర్థం కదా! అవి చెప్పే మార్గములన్నీ చెడుమార్గములే కదా! ఆ మతములన్నీ చెడు మతములే కదా! అచ్యుతునికి చేసె సమారాధనలు (బాగుగా ఆరాధించుట) అతి నిర్మలములై అనేకములైన మేళ్లను చేస్తాయి. అవి అసత్యమైన మాటలు కావు.

శ్రీహరి మార్గంలో పోకుండిన ఏ పదవియైన ప్రయాసతో కూడిన చెడుదారియే. ఆ మార్గమే అనవసరం. అది మోసపూరిత ధర్మమే. శ్రీవేంకటేశ్వరుని సేవించే సేవమాత్రమే పుణ్యప్రదమైనసేవ. అదే అనంతమైన సిరిసంపదలను, మహాద్భాగ్యమును ప్రసాదిస్తుంది. ఇది సత్యం.

## 2-81

### మున్నుడి

అన్నమాచార్యులవారు హరినామ సంకీర్తన ఇచ్చే సౌఖ్యం గురించి వివరిస్తున్నారు ఈ కీర్తనలో. జన్మ అంటేనే బంధనం. అది ఒక చెఱ. అమ్మతో మొదలై చివరికి నోట్లో తులసితీర్థం పోసేవాడిదాకా అంతా ఏదో ఋణానుబంధం వల్ల కలిగినవారే. హరినామమనే మంత్రం ఆ జన్మల చెఱనుండి విడిపిస్తుంది. పదివేల నరక కూపాలను తప్పిస్తుంది. వేంకటేశ్వరుని నామసంకీర్తన కల్ప భూజంబు (కల్పవృక్షం) లాగ ఆశించిన కోరికలను తీరుస్తుంది. చాలా తేలికగా అర్థవంతమైన ఈ కీర్తన 'ఓం నమో వేంకటేశాయ' అంటే చాలు అని బోధిస్తున్నది.

**ఉ॥ చాలదె నామమంత్రమిదు సౌఖ్యము శ్రీహరి భక్తులార! మీ**
**నాలుక కూర్పుదాహితవు నచ్చినవౌ చవులూర జేయుచున్**
**మేలుగ, కల్మషంబు విరమింపగ జేయదె అన్నమయ్యనెన్**
**నీల సరోజవర్ణు నవనీత ప్రియున్ తను సన్నుతించెరా**

**రాగం : హంసధ్వని**

చాలదా హరినామ సౌఖ్యామృతము తమకు
చాలదా హితవైన చవులెల్ల నొసగ ॥చాలదా॥

ఇది ఒకటి హరినామ మింతైన చాలదా
చెదరీక జన్మముల చెరలు విడిపించ
మదినొకటె హరినామ మంత్రమది చాలదా
పదివేలు నరక కూపములు వెడలించ ॥చాలదా॥

కలదొకటి హరినామ కనకాద్రి చాలదా
తొలగుమని దారిద్ర్య దోషంబు చెఱుచ
తెలివొకటి, హరినామ దీపమది చాలదా
కలషంపు కఠిన చీకటి పారద్రోల ॥చాలదా॥





తగు వేంకటేశు కీర్తన మొకటి చాలదా
జగములో కల్ప భూజంబువలెనుండ
సొగిసి ఈ విభుని దాసుల కరుణ చాలదా
నగవు చూపులను ఉన్నతమెపుడు చూప ॥చాలదా॥

### భావామృతం

శ్రీహరినామ సంకీర్తన ఇచ్చే సౌఖ్యం ఎంతో మేలైనది. తమకు అదొక్కటి చాలదా? అది ఎంతో మేలు చేసే అభీష్టములను (చవులను) ప్రసాదిస్తుంది.

ఈ హరినామ సంకీర్తనం పిసరంతైనా చాలు కదా! చెదరక (కలత చెందక) మనని జన్మల యొక్క బంధనములనుండి అది విముక్తులను చేస్తుంది. మనస్సులో 'హరి' అనే మంత్రం జపిస్తే చాలు కదా! పదివేల నరక కూపములనైనా అది తప్పిస్తుంది. ఇందులో సందేహం లేదు.

ఈ శ్రీహరి నామము బంగారుకొండవంటిది. ఇదొక్కటి ఎంత గుండె నిబ్బరాన్నిస్తుందో ఒకసారి ఆలోచించండి. దరిద్రము వల్ల కలిగే దోషం మిమ్మల్ని సమీపించగలదా? మీ దరిదాపుల్లోకి రాదు, మీ దగ్గర హరినామం జపించే తెలివి (స్పృహ) ఒకటి వుంటే హరినామం అనే ఒక దీపము మీ దగ్గరవుంటే అది కలుషము (పాపము) అనే కఠోరమైన చీకట్లను తొలగిస్తుంది.

తగిన విధంగా శ్రీవేంకటేశ్వరుని కీర్తనము ఒక్కటి చేస్తే చాలదా? (చాలు, చాలు, చాలు ముమ్మాటికీ చాలు) ప్రపంచంలోని కల్పవృక్షం అది. (అసలు కల్పవృక్షం స్వర్గలోకంలో వున్నా... దానికంటే ఇదే మేలైనది) సొగిసి (ఇంపుగా) ఈ జగన్నాథుని దాసుల కరుణ వుంటేనే చాలు, అది, సంతోషకరమైన పరిస్థితులను కలుగజేసి, ఔన్నత్యము కలిగిస్తుంది. (అంతగొప్ప హరినామం దొరికింది మీకు. కనుక ఒక్కసారి మనస్సులో ఆ దివ్యమంగళ రూపాన్ని స్మరించి, అనండి... ఓం నమో వేంకటేశాయ...)

## 2-82

### మున్నుడి

అన్నమాచార్యులు తన జీవితకాలంలో 'హిరణ్యకశిపుని' సంహరించిందెవరో తెలియని ఒక యువతరం ఆంధ్రదేశంలో ఉద్భవిస్తుందని కలలో కూడా ఊహించి వుండరు. అట్లా అయితే ఇట్లాంటి గోపికల కీర్తనలో 'జమళిచేతుల' వాడు 'చెందమ్మి కనుల' వాడు, 'పచ్చపైడిదట్టి' వాడు అనే పదములు వాడే వారే కాదేమో. ఇక ఈ మున్నుడిలోని పద్యములు మరీ నిరుపయోగమేమో!! మనం ఆశాజీవులం. మళ్ళీ ఆంధ్రసాహిత్యానికి మంచిరోజులు వస్తాయి. వేంకటేశ్వరుడే రప్పిస్తాడు. అప్పటివారికోసమే ఈ నా తిప్పలు. తనని ఒక గోపికగా వూహించుకొని ఆచార్యులవారేమంటున్నారో చూడండి.

**చం॥ వలచితి వచ్చితిన్ మనసు వానికి నిచ్చితి అన్నమయ్యనెన్**
**తలచెను భావనన్ మురిసి తానును యింకొక 'చాన' యట్లుగా**
**నెలవుగ మాదు పల్లెతను నీరజనాభుడు నుంటవెల్లడై**
**నిలిచితి, వేంకటేశ్వరుడు నీమముగా ననుకూడు నమ్మరో!**

**రాగం : హంసానంది**

వలచి వచ్చితి నేను వానికి గాను
నెలవై మీ గొల్లవాడనే తానుండునంటా ॥వలచితి॥

చెందమ్మి కనులవాడు చేతపిల్లగోవివాడు
ఇందువచ్చెకంటిరా ఏమిరే అమ్మా
మందుల పసువులవాడు మకరాంకములవాడు
ఎందునున్నాడు చెప్పరే ఏల దాచేరమ్మా ॥వలచితి॥

నెమిలిపించములవాడు నీలమేఘకాంతివాడు
రమణుడాతడు మొక్కేను రమ్మనరమ్మా
జమళి చేతులవాడు సంకు చక్రాలవాడు
అమర మీపాల చిక్కునట చూపరమ్మా ॥వలచితి॥





పచ్చపైడి దట్టివాడు పక్షివాహనపువాడు
ఇచ్చినాడు నాకుంగరము ఇదివో అమ్మా
చెచ్చెర కోనేటివాడు శ్రీవేంకటేశ్వరుడు
వచ్చినన్ను కూడినాడు వాడు ఓయమ్మ ॥వలచితి॥

### భావామృతం

ఓ గోపికల్లారా! దయచేసి నేను చెప్పేది విని నాకు సహాయం చేస్తారా? నేనూ ఆ యశోదానందనునే వలచి, వానికిగాను (వానికోసం) వచ్చాను. తానుకూడా మీ గోకులంలోనే నివసిస్తున్నాడట కదా! (కాస్త సమాచారం ఇవ్వండమ్మా!)

వాడు చెందమ్మి (ఎఱ్ఱతామరపూలు) కనులతో చేతితో మురళి పట్టుకొని వుంటాడు. ఇటువైపేమన్నా వచ్చాడా? మీరు చూశారా ఏమిటే? కాస్త చెప్పండే! వాడు పశువుల మందని మేపుతుంటాడు. (నిజమే కదా! పశువుల్లాంటి మనందరికి రోజూ తిండిపెట్టి బ్రతికిస్తున్నదెవరు? ఆ జగద్రక్షుడే కదా!) అతను మకరాంకములవాడు (మన్మధుడు) అనుకోండి. ఇంకా ఎందుకు దాచిపెడతారమ్మా వాడిని? ఎక్కడున్నాడో కాస్త చెప్పండమ్మా!

వాడు సిగలో నెమలి పించము ధరించి యుంటాడు. వాడి శరీరం నీలమేఘమువలె నిగనిగలాడుతూ ఉంటుంది. నాకు చక్కటి జతగాడు మీకు దండము పెడతాను వాణ్ణి కాస్తరమ్మనండమ్మా! (ఒక్కసారి కనులారా చూస్తాను). ఇంకా చెప్పాలంటే.. వాడు జమళిచేతులవాడు. (జమళి అంటే జంట అని అర్థం. చేతులు రెండు మనందరికి కాని ఆయనకు జమళిచేతులు అంటే రెండు రెండ్లు నాలుగుచేతులు). వాటిలో శంఖ చక్రములను ధరించియుంటాడు. మీది మధుర భక్తి కాబట్టి మీకు వశమై చిక్కాడట. కాస్తచూపించండమ్మా!

వాడు పచ్చపైడి దట్టి ధరించి యుంటాడు, (పీతాంబరధరుడు). పక్షి వాహనమువాడు (గరుడగమనుడు). ఇదిగో చూడండమ్మా! నాకు తన ఆనవాలుగా తన వుంగరం తొడిగాడు. చూడండి. ఇంకొక సంగతి. వాడు కోనేటి రాయుడు అని కూడా పిలువబడే శ్రీవేంకటేశ్వరుడు. వాడు చెచ్చెర (శీఘ్రముగా) వచ్చెనమ్మా! వచ్చి నన్ను వలపించి నాతో జత అయ్యాడు. (నాదే కదా! జన్మ అంటే..)

## మున్నుడి

శ్రీ వేంకటేశ్వరుడు ఆది మూలము. నాకుమూలము (మొదట) నా తండ్రి. ఆయనకు ఆయన తండ్రి. ఆయనకు ఆయన తండ్రి.. ఇలా మొట్టమొదట ఎవరు? అతడే ఆదిమూలము. అదెవరు? జగత్పితయైన శ్రీహరియే కదా! "అంతకోపగావవే" అంటే.. (అంతకు + ఓప + గావుము... అంటే ఆ మొత్తం ఇంకచాలు నన్ను రక్షించు అని) అంటే అసలు నాకింక వద్దే వద్దని. ఇది నా భావన... అసలర్థం అన్నమాచార్యులవారికే... మరియొక విశేషమేమంటే మనవన్నీ "సంతల చుట్టరికాలు". సంత అంటే నేటికాలంలో 'మార్కెట్'. అక్కడ చుట్టరికాలన్నీ, బాగున్నారా... అని పలకరించుకోటానికే గాని, శుద్ధ... దండగ.

**ఆ.వె॥ విభుడవింతటికిని వెరవుతో గావుము**
**అభయహస్తమడిగె నన్నమయ్య**
**అంతరాత్ముడైన ఆదిమూలంబని**
**వేంకటేశు గొలిచె వేడె శరణు**

**రాగం : శహన**

విభుడ వింతటికి వెరవుతో ననుగావు
అభయ హస్తముతోడి అదిమూలమా ॥విభుడవు॥

పలు లంపటాల చేత పాటువడి పాటువడి
అలసితి గానవే వో ఆదిమూలమా
చలమరి యితర సంసార భ్రాంతి చిక్కితి న-
న్నలరించి కావవే వో ఆదిమూలమా ॥విభుడవు॥

యెంతకైనా ఆసలచే యేగేగి వేసరితి
అంతకోప గావవే వో ఆదిమూలమా
సంతల చుట్టరికాల జడిసితినిక గావు
అంతరాత్మ నా పాలి ఆదిమూలమా ॥విభుడవు॥





రంట దిప్పు నింద్రియాల రవ్వైతి గావవే
అంటిన శ్రీవేంకటాద్రి ఆదిమూలమా
గెంటక ముమ్మాటికిని నీకే శర-
ణంటి కావవే వో ఆదిమూలమా ॥విభుడవు॥

## భావామృతం

ఓ జగన్నాథా! ఈ సర్వస్వానికి నీవే భర్తవు. నన్ను వెరపుతో (ఏదైనా చక్కటి ఉపాయముతో) రక్షింపుము. ఆది మూలములైన ఓ శ్రీహరీ! నీ అభయహస్తము నాకు చూపి నన్ను అనుగ్రహింపుము.

నేను అనేక బంధనాలలో తగులుకొని ఇబ్బందులు పడి.. పడి... అలసిపోయాను. నన్ను నీవే కాపాడవలెను. మచ్చరముతో (చలమరినై) అన్నీ నేనే చేయగలను, నేనే గొప్పవాడిని అనుకొని సంసార భ్రాంతికి లోనయ్యాను. ఓ ఆదిమూర్తీ! నన్ను రక్షించి ఉపశమనం కలిగించు తండ్రీ!

ఓ ప్రభూ! నేను ఆశల మాయలో పడి యెంతకైనా తెగించి, యెక్కడెక్కడికో వెళ్ళి విసిగిపోయి వున్నాను. ఆ మొత్తం యాతనలు ఇంకచాలు. ఓ ఆదిపురుషా! నన్ను రక్షింపవయ్యా! అదీగాక... నాకున్న చుట్టరికాలన్నీ సంతలో చుట్టరికాలు. ఈ మాయదారి చుట్టరికాలు శుద్ధ దండగమారి చుట్టరికాలు. ఇవంటే నాకు భయంపట్టుకొన్నది. నాకు వద్దే వద్దు. నాలో అంతరాత్మునిగానున్న ఓ ఆదిమూలమా! నాకు నువ్వొక్కడివే చాలు.

స్వామీ! నా ఇంద్రియాలు ఎప్పుడూ నాకు అతుక్కుపోయి వుండి నన్ను క్షణం కూడా వదలక క్షీణింపజేశాయి. ఆది మూలములైన ఓ వేంకటేశా! నేను ముమ్మాటికీ (మనో,వాక్, కాయము) నిన్నే అంటిపెట్టుకొని శరణు శరణు అంటున్నాను. నన్ను మాత్రం గెంటివేయవద్దు. నాకు నీవే దిక్కు. నన్ను రక్షించు తండ్రీ!

**2-84**

## మున్నుడి

శ్రీమత్‌భాగవతంలో కాక అన్నమయ్య భావనాకాశంలో మెఱసిన కృష్ణలీలలు ఈ కీర్తనలో వున్నాయి. 'రవి' గాననిచో కవి గాంచునే కదా!' అని శ్రీకృష్ణదేవరాయలు అన్నారట. ప్రపంచంలో లేనివి కూడా కవి ఊహించగలడు. మన్ను తిన్నావా నోరు చూపించు అని యశోద అడిగితే కృష్ణయ్య తననోటిలో బ్రహ్మాండం చూపాడని భాగవతం చెప్పింది, కానీ ఈ లీలలు మాత్రం అన్నమయ్య రచనా చాతుర్యమే. ఆ రోజుల్లోని కొన్ని తెలుగు నుడికారాలు నేడులేవు. పాలార్చి, ఓలి, పెంటలు, ఇత్యాది కొన్ని పదాలు అర్థం కావాలంటే... తేలికకాదు.

**మ॥ భళిరా!! యెంతటి మాయకాదు 'హరి' ఈ భామన్ యశోదాసతిన్**
**నిలువెల్లన్ భ్రమలోన ముంచెగద! ఆ నింగిన్ సుధాంశుండుతా**
**నలరన్ జేయగ వచ్చె బాలుదరికిన్ అన్నయ్య భావించెరా**
**సులువా!! వేంకటరాయునిట్లు గొలువన్ సొంపైన భావంబులన్**

### రాగం : వళపంజరం

వెఱపింపబోయి తానె-వెఱచె దల్లి యశోద
మఱచి యీ బాలునెట్టు-మానిసెంటా నుండెనో ॥వెఱపింప॥

వెంట రాకు మని కృష్ణు - వెరపించి యశోద
వొంటి మందలో గొంగ - వున్నాడనె
అంటి గొంగ యెందునున్నా-డని నోరు దెరచితే
పెంటలై బ్రహ్మాండాలు - పెక్కు గానవచ్చెను ॥వెఱపింప॥

చందమామ బాడి తల్లి-సరి బొత్తుకు రమ్మంటే
చందురు జూచి కృష్ణుడు-సన్న సేసెను
ముందర జంద్రుడు వచ్చి-మొక్కితే యశోదచూచి
ముందేలా యంటినో యని-ముంచి వెరుగందెను ॥వెఱపింప॥





పాలార్చి తొట్టెలలో -బండబెట్టి యశోద
నీలవర్ణు దొంగిచూచె - నిద్దురో యని
ఓలి శంఖ చక్రాలతో - నురము శ్రీసతితోడ
యీ లీల శ్రీవేంక-టేశుడై యున్నాడు ॥వెఱపింప॥

### భావామృతం

శ్రీకృష్ణ పరమాత్మ చిన్నారి బాలునిగా తల్లి యశోదమ్మ దగ్గర మారాము చేస్తున్నాడు. వీడికి కాస్త భయం నేర్పాలనుకొంది ఆవిడ. అయితే ఆవిడ కృష్ణయ్యను భయపెట్టబోయి తానే భయపడింది. అట్లా భయపడి కూడా ఆయన లీలవల్ల జరిగింది. మఱచి (ఆయన సర్వేశ్వరుడన్న సంగతి మఱచి) మానవ శిశువుగానే భావించి ఎట్లు భ్రమలోపడి పోయిందో కదా!

కృష్ణుడు తను వద్దన్నా మారాము చేసి వెంట పడుతున్నాడని "నాతో సంతకు రావద్దు నాన్నా! అక్కడ గొంగ (శత్రువు) వున్నాడు. వాడే బూచి. నిన్ను పట్టుకుంటాడు" అని బెదిరించింది. కృష్ణయ్య "అమ్మా! ఏడే? యెక్కడున్నాడే" అని అమాయకంగా నోరు తెరిచాడట. ఆ నోట్లో ఆ యశోదాదేవికి చతుర్దశ భువనాలే కాక తనకు తనే కనపడి నివ్వెరపోయిందట. బ్రహ్మాండమంతా పెంటలై (దిబ్బలై) కనిపించిందేమిటో అని, తనే ఎంతో భయపడిందట.

ఇంకొకసారి యశోద "చందమామ రావే మా కన్నయ్యతో ఆడుకోవే" అని పాడింది. కృష్ణుడు చంద్రుణ్ణి చూచి మెల్లగా ఏదో సైగ చేశాడు. ఇంకేముందీ, అమాంతం చంద్రుడు కృష్ణయ్య ముందు నిలబడి యశోదకు నమస్కరించినాడు. ఆమె దిగ్భ్రమ చెందటమే, కాక ముందు నేనాచంద్రుణ్ణెందుకు రమ్మన్నానా అని వెరగుపొందిందట.

ఇంకొకసారి యశోద నీలమేఘ శ్యాముడైన కృష్ణుని ఆడించి (పాలార్చి) ఊయలలో పడుకోబెట్టి నిద్రించాడో లేదో చూద్దాం అనుకొని తొంగి చూచిందట. ఆమెకు వూయలలో చిన్నికృష్ణుని బదులు వరుసగా (ఓలిన్) శంకచక్రధారియైన చతుర్భుజుడు శ్రీవేంకటేశ్వరుడు వక్షస్థలంపై లక్ష్మీదేవితో కనిపించాడట. ఇంకేముంది ఆ యశోద భయంతో నివ్వెరపోయిందిట.

## 2-85

## మున్నుడి

ఇరవై ఏళ్ల క్రిందట ఈ కీర్తన విన్న నేను 'లలిత' మైన ఈ రాగానికి ముగ్ధుడనయ్యాను. ఆనాడు ఈ కీర్తన అన్నమాచార్యువారిదనిగాని, ఇది నారాయణుని దశావతారములను 'నిందాస్తుతిగా' సన్నుతించే కీర్తన అనిగాని, ఒకనాడు నేను ఇలా దీని మున్నుడి వ్రాసి భావము వివరిస్తానని గాని తెలియను. ఓ ఏడుకొండల రాయా! ఏ జన్మలో ఏ పుణ్యం చేశానో కాని నాకీ మహద్భాగ్యాన్నిచ్చి దయచూపించావు. అన్నమయ్య అన్నట్లు "ఇదిగాక సౌభాగ్యమిదిగాక తపము మఱి యిదిగాక వైభవం బికనొకటి కలదా?" లేదు తండ్రీ! లేదు.

**కం॥ నారాయణు దశ విధ అవ-**
**తారంబుల నన్నమయ్య తగ గీర్తించెన్**
**ఈ రీతి భావ వివరణ**
**కోరిక తీరంగ జెప్పి కొలుత నిరువురన్.**

**రాగం : లలిత**

తెప్పగా మఱ్ఱాకు మీద తేలాడువాడు
ఎప్పుడూ లోకాల నేలేటి వాడు ॥తెప్పగా॥

మోత నీటిమడుగులో ఈత గఱచినవాడు
పాతగిలేనూతికింది బాయని వాడు
మూతి దోసిబట్టి మంటిముద్ద పెల్లగించువాడు
రోతయైన పేగుల పేరులు గలవాడు ॥తెప్పగా॥

కోడికూత నోరివాని కుఱ్ఱ తమ్ముడైన వాడు
బూడిద పూసిన వాని బుద్ధులవాడు
మాడవన్నె లేడివెంట మాయల తగిలినవాడు
దూడల నావుల గాచి దొరయైనవాడు ॥తెప్పగా॥





ఆకసాన పారేవూరి అతివల మానములు
కాకుసేయు వాడు, తురగముపై వాడు
ఏకమై వేంకటగిరి నిందిరా రమణి గూడి
యే కాలము బాయని యెనలేని వాడు ॥తెప్పగా॥

**భావామృతం :**

ఇంకా సృష్టి ఆరంభం కాలేదు. అంతా జలార్ణవమే. ఆ నీటిపై ఒక మఱ్ఱి ఆకు తేలుతూ పోతున్నది. ఆ మఱ్ఱి ఆకుపై శిశువు రూపంలో నారాయణుడు పడుకొని వున్నాడు. తనకాలి బొటనవ్రేలిని తననోటిలో పెట్టుకొని బాల్యచేష్టగా దానిని చీకుతున్నాడు. నిరంతరం లోకాలనన్నింటిని పరిపాలించే శ్రీమన్నారాయణుడు వాడే.

ఆయన, మోత నీటిమడుగు (బరువైన నీరు వున్న సముద్రం) లోన ఈదులాట నభ్యసించిన వాడు (మత్స్యావతారం). ఆయన పాతగిలె నూతికింద (పాతబడ్డ బావిలో) బాయని వాడు (విడువకుండా వుండే తాబేలు (కూర్మావతారం). మూతిని అంజలివలె పట్టి, మట్టి ముద్ద అయిన భూమండలాన్ని సముద్రంలోంచి పెల్లగించి నిలబెట్టినవాడు (వరాహావతారము). ఆయన రోతకలిగించు పేగులను హారములుగా ధరించినవాడు (నరసింహావతారము).

ఆయనకోడి కూత నోరు (ధ్వని) వాని (అంటే... ఇంద్రుని) కుఱ్ఱతమ్ముడైనవాడు (పొట్టి వామనావతారము). ఆయన బూడిద (విభూతి) పూసికొనువాని బుద్ధులు గలవాడు. బ్రాహ్మణ ధర్మము నాచరించిన వాడు (పరశురామావతారము). మాడవన్నెలేడి (బంగారులేడి) వెంట మాయకులోనై పరుగుతీసినవాడు (శ్రీరామావతారం). చిన్నప్పుడు దూడలను పెద్దయ్యాక ఆవులను కాచి ఆ తరువాత ఏలికయై ద్వారకను కాచినవాడు (శ్రీకృష్ణావతారము).

ఆయన, ఆకసాన పారేవూరి అతివల (ఆకాశంలో ఎగిరే త్రిపురాసురుల భార్యల) మానములను, కొల్లజేసిన (చెడగొట్టిన) వాడు (బుద్ధావతారము). ఆయన తురగము (ఉచ్ఛైశ్రవము అను అశ్వమును) యెక్కిన వాడు (కల్కి అవతారుడు). ఇవన్నీ ఏకమై నేడు వేంకటాద్రిపై అలమేల్మంగమ్మతో గూడ ఏ కాలముననైనా విడువని అసమానుడై అవతరించాడు. అనండి ఏడుకొండలవాడా... వేంకటరమణా... గోవిందా.

## 2-86

### మున్నుడి

చతుర్విధోపాయముల ద్వారా మానవజన్మకు సాఫల్యత తెమ్మన్నారు పెద్దలు. ధర్మమార్గమున అర్థమునార్జించి, ఆ ధర్మార్థముతో కామమునను భవించి ఆ ధర్మార్థ కామము లందును విరక్తి కలిగి వైరాగ్యంతో మోక్షమును పొందమన్నారు. కామమును కూడ ఒక యజ్ఞమువలెనే భావించి కేవలం 'తృష్ణ' కే కొక కైవల్య సాధనకు సోపానంగా యెన్నుకొన్నారు. శృంగారరసం జాలువారే ఈ కీర్తనలో అన్నమాచార్యులవారు అలమేల్మంగ స్వామివారికోసం దేవతల ప్రీతికై కామయాగం నిర్వహించి తిరుమలేశుని 'పొందు' అనే దివ్యభోగమును సంపాదించిందని అంటున్నారు.

**మత్తకోకిల :**

**కామయాగము చేసెనప్పుడు కల్కి కామన పూర్తికై**
**ప్రేమనే సురవర్యులందరి ప్రీతికర్పణ జేసెరా**
**ఏమిచేసెను యెన్ని చేసెను యెట్లు శ్రీపతి గెల్చెనో**
**భామపాట్లను అన్నమార్యుడు పాడెనద్భుత కీర్తనన్**

**రాగం : కన్నడగౌళ**

కామయాగము చేసె కలికి తన
ప్రేమయే దేవతాప్రీతిగాను ॥కామ॥

పొలుపలర సురత తాంబూల రసపానంబు
నలినాక్షి సోమ పానంబుగాను
కలకలంబుల మంచి గళరవంబుల మోత
తలకొన్న వేదమంత్రములు గాను ॥కామ॥

పడతి తన విరహతాపమున పుట్టినయగ్ని
అడరి దరికొన్న హోమాగ్ని గాను
ఒడబడిక సమరతుల నుదయించిన చెమట
దడియుటే యది యవభృథంబుగాను ॥కామ॥





తనర కుచముల రుచులు దంతక్షతక్రీడ
ననుపైన పశుబంధనంబుగాను
యెనసి శ్రీతిరువేంకటేశ్వరుని పొందు
ఘనమైన దివ్యభోగంబుగాను ॥కామ॥

**భావామృతం :**

ఆ భామిని అలమేల్మంగమ్మ దేవతల ప్రీతి కొఱకు స్వామిపై తన ప్రేమను వినియోగించి కామయాగమును నిర్వహించినది. తత్ఫలితంగా ఆయన పొందునార్జించి యజ్ఞఫలం సంపాదించింది. ఆవిధంబెట్టిదనిన..

పద్మనయన అయిన ఆ పద్మావతి సురతంబున ఒప్పుగా తాంబూలరసాస్వాదనమే సోమపానముగా భావించినది. చక్కటి తన కంఠస్వరము యొక్క ధ్వని వేదమంత్రములను వల్లించుచున్నట్లున్నది.

ఆ జవ్వని తను స్వామి విరహముతో తపించగా పుట్టిన విరహాగ్నినే అధికమై నెగడినట్టి హోమాగ్నివలె భావించినది. ఆమె స్వామివారితో ఒడంబడిక చేసికొని సమరతి నిర్వహించగా స్వేదజలము అధికమై వారు తడిసిపోయిరి. ఈ కామయాగమున వారిద్దరు అవభృత స్నానము (యజ్ఞమున దోషనివారణార్థము మంత్రోక్తముగా నాచరించు అభ్యంగన స్నానము) అనునట్లున్నది.

అతిశయించిన కుచద్వయములపై దంతక్షత కాంతులు మిఱుమిట్లు గొలుపుతూ అవి విద్యుక్తమైన యజ్ఞపశువైన మేకను బంధించిన త్రాటి ఒరిపిడి గుర్తులేమో అన్నట్లున్నది. చతుర్దశ భువనాలలో ఏ యజ్ఞం నిర్వహింపబడినా దాని భోక్త శ్రీమన్నారాయణుడైన శ్రీవేంకటేశ్వరుడే. కనుక ఆ దేవి నిర్వహించిన ఈ కామయాగమునకు కూడ శ్రీవేంకటేశ్వరుడే భోక్త. ఆమె పొందును స్వామివారు ఘనమైన దివ్యభోగముగా స్వీకరించి ఆమెను ఆనందంలో ముంచారు.

**2-87**

## మున్నుడి

పరమాత్మ తత్త్వాన్ని విశదపరుస్తున్నారు అన్నమయ్య. పిండికొద్ది రొట్టె అన్నట్లు భక్తికొద్ది భగవంతుడు. చేసికొన్నవారికి చేసికొన్నంత. ఇది జగమెరిగిన సత్యమే. ఈ కీర్తనలో ఆచార్యులవారు పరమాత్మను కంసాలి గీటురాయి, పచ్చిపాలలో వెన్న, బట్టబయలుచేసిన ధనం, పట్టపగటి కాంతి, అందివచ్చిన బిడ్డ, పలుకులలోని తేటవంటి అసమాన వుదాహరణలతో పోలుస్తున్నారు. ఆ అద్భుతవైనం చిత్తగించండి. భగవంతుడైన శ్రీవేంకటేశ్వరుడే జీవులలో ప్రాణము రూపంలో వున్నాడంటున్నారు.

**తే॥ భక్తి తగినట్లు పరమాత్మవ్యక్తుడగును**
**భువిని జీవులకొసగును భుక్తి, ముక్తి**
**అన్నమార్యుడు భక్తితో ఆలపించి**
**వేంకటేశుని తత్త్వము విశదపఱచె**

**రాగం : రామక్రియ**

భక్తి కొలది వాడే-పరమాత్ముడు
భుక్తి ముక్తి దానె యిచ్చు- భువి పరమాత్ముడు ॥భక్తి॥

పట్టిన వారి చే బిడ్డ-పరమాత్ముడు
బట్ట బయటి ధనము-పరమాత్ముడు
పట్టపగటి వెలుగు-పరమాత్ముడు
ఎట్టయెదుటనే వున్నా-డిదే పరమాత్ముడు ॥భక్తి॥

పచ్చిపాలలోని వెన్న-పరమాత్ముడు
బచ్చెన వాసిన రూపు-పరమాత్ముడు
బచ్చు చేతిఒరగల్లు-పరమాత్ముడు
ఇచ్చకొలది వాడు పో-యీ పరమాత్ముడు ॥భక్తి॥





పలుకులలోని తేట-పరమాత్ముడు
పలియించు నిందరికి -పరమాత్ముడు
బలిమి శ్రీవేంకటాద్రి -పరమాత్ముడు
ఎలమి జీవుల ప్రాణ-మీ-పరమాత్ముడు ॥భక్తి॥

**భావామృతం :**

పరమాత్మకు మనపట్ల కలిగే కరుణయెప్పుడూ మనభక్తికి తగ్గట్లుగానే వుంటుంది. జీవులకు భుక్తి ముక్తి రెండూ ఇచ్చేవాడు ఆ పరమాత్ముడు దక్క వేరెవ్వరూ కాదు.

పరమాత్మ 'పట్టినవారిచే బిడ్డ'. అంటే ఎవరు ఎత్తుకొంటే వారి దగ్గరకు వెళ్ళే బిడ్డవలె ఎవరు నాకు నీవే కావాలి తండ్రీ! అంటే వారిని కరుణిస్తాడు. పరమాత్మ బట్టబయలు చేసుకోగలిగిన ధనం (వైట్ మనీ అన్నమాట). గుప్తధనంకాదు. పరమాత్ర ఆరుబయట పట్టపగలు కనబడే సూర్యకాంతి వంటివాడు. కృత్రిమంగా వెలిగించిన దీపంకాదు. పరమాత్మ వేరెక్కడనో లేడు, మన యెట్టయెదుటనే వున్నాడు. (మనపుణ్యం కొఱవైనందువలన మనకు కనిపించడు. అంతే...

వెచ్చజేయని పచ్చిపాలలో దాగియున్న వెన్నవలె ఆ పరమాత్మ అణువణువులో వున్నాడు. పరమాత్మ 'బచ్చెనబాసిన రూపు' అనగా ఏవిధమైన పైపూతల వంటి మెఱుగులు లేని నిజస్వరూపుడు. పరమాత్మ బచ్చు (వైశ్యుడు) చేతిలోని 'ఒరగల్లు' అనగా గీటురాయి. (అన్నమాచార్యుల కాలంలో వైశ్యులే నేటికాలంలో స్వర్ణకారులు చేసే పనికూడా నిర్వహించేవారు). ఎవరిదెంత నిజమైన భక్తియో ఆ గీటురాయికి తెలియకుండా వుంటుందా? మన ఇచ్చ (కోరిక) కొలది ఆయన మనని అనుగ్రహిస్తాడు.

పరమాత్మ పలుకులలోని తేట. అనగా వేదవేదాంగము లన్నింటిలోని వాక్యములలోని భావస్వరూపుడు. ఇంతమంది జీవులకు స్వపరభేదం లేకుండా "చేసికొన్నవారికి చేసికొన్నంత" ఫలితం ఇచ్చే న్యాయమూర్తి. ఈయనే శ్రీవేంటాద్రిపై వెలసిన పరమాత్ముడైన శ్రీవేంకటేశ్వరుడు. ఈయన అనుపమ శక్తి సంపన్నుడై వాత్సల్యంతో జీవులందరిలోను ప్రాణరూపంలో వున్న పరమాత్మ.

## మున్నుడి 2-88

"ఇన్నిటా చక్కని 'జాణ' జవరాలు, చక్కెర బొమ్మవంటిది" అని మెచ్చుకొంటూ స్వామికి విన్నవిస్తున్నారు అన్నమాచార్యుల వారు. నాయకుడు వేంకటేశ్వరుడే కాని నాయిక అయిన ఆ 'జాణ' స్వామివారి అసంఖ్యాక జవరాళ్లలో ఎవరైనా కావచ్చు. ఆయనకోసం విరహంతో ఏ జవరాలు 'వేగి' పోదు చెప్పండి. ఈరోజు దీపావళి. తెల్లవారుజామున నా భావనాకాశంలో తళుక్కుమని మెరసిన నాయిక సత్యభామ. శ్రీవేంకటేశ్వరుడే మోహనకృష్ణుడు. నారాయణుని 'నందక ఖడ్గం' కూడా 'సెబాస్' అని తళుక్కుమంటుంది స్వామి సన్నిధిలో. శృంగార కీర్తన కాబట్టి భావామృతం నిగూఢముగానే వుంచాను. 'జాణ' అంటే నేర్పరి. ఇక్కడ శృంగారంలో అని భావించాలి.

**ఉ॥ చక్కని జాణయీమె తగు స్వామికి ఈ జవరాలు జంటగా**
**చక్కెర బొమ్మవంటిదని 'సత్య'ను మెచ్చిరి అన్నమార్యుడున్**
**మ్రొక్కుచు పాడె కీర్తనము మోహనకృష్ణుని వేంకటేశుగా**
**"చొక్కెను జంటలౌ రతుల సుందరియౌజవరాలనెన్", భళా!!**

**రాగం : శుద్ధ ధన్యాసి**

చక్కని జాణ యిన్నిటా జవరాలు
చక్కెర బొమ్మవంటిది జవరాలు ॥చక్కని॥

కన్నులు తప్పక చూచి కప్పురాన నిన్నువేసి
సన్నసేసీ నిదివో జవరాలు
వెన్నెల నవ్వులు నవ్వీ వేడుక నీకు పుట్టించి
చన్నుల నొరసీ నిన్ను జవరాలు ॥చక్కని॥

తెరమరుగున నుండి తేనెగార మాటలాడి
సరిపెనగీ నీతో జవరాలు
విరులు నీపై చల్లి వింత చేత లెల్లా చేసి
సరసములు నెరపీని జవరాలు ॥చక్కని॥





తమకము నీకురేచి దయపుట్ట సేవసేసి
సముకాన కొసరీనీ జవరాలు
అమర శ్రీవేంకటేశ అన్నిటా నీవు గూడగా
జమళి రతుల చొక్కీ జవరాలు ॥చక్కని॥

**భావామృతం :**

స్వామీ! నీజవరాలైన ఈ భామామణి చక్కని జాణ. చాలనేర్పరి. నిజంగా చక్కెర బొమ్మవంటిది అనుకో. (అటువంటి నీ జవరాలి నేర్పరితనం గురించి విను)

ఆమె నిన్ను 'కన్నులు తప్పక' చూస్తుంది. అంటే తన రెప్పకూడ వాల్చక చూస్తుంది. కర్పూరంతో నిన్ను వేస్తుంది. ఇదిగో నీ జవరాలు ఏవేవో నర్మగర్భమైన సైగలు చేస్తున్నది నీకు. మనోహరమైన వెన్నెల కురిపించే చిరునవ్వులు చిందిస్తున్నది. తద్వారా నీకు ఉల్లాసమును కలిగిస్తున్నది. నిన్ను తన కుచకుంభముల ఒరిపిడికి గురిచేసి నీ జవరాలు నిన్ను పులకరింపజేస్తున్నది.

'అవనిక' మరుగున నుండి తేనెలు జల్లువారినట్లు మధురంగా మంజులంగా మాట్లాడుతున్నది. కాని నీమాటకు తగిన జవాబు చెప్పుచున్న నీజవరాలిని చూశావా స్వామీ? (ఇక నిన్ను మాటలతో గెలవలేనని) నీపై పుష్పములను చల్లి ఏవేవో వింతచేష్టలు చేసి నీజవరాలు నీతో సరసములాడింది.

స్వామీ! దానితో (ఆ చేష్టమూలంగా) నీకు పరవశత్వము అధికమైనది. నీకు ఆమెపై దయకలిగింది. నీవు ఆమెకు పరిచర్యలు చేయుట నారంభించితివి. ఇప్పుడు ఆమె బెట్టు చేస్తున్నది. నీ జవరాలు నీ సముకాన (నీవు యెదురుగా వుండగా) సంకోచిస్తున్నది. ఓ మహానుభావా! నీవెవరవ? సాక్షాత్తు అలనాటి శ్రీకృష్ణుని చిలిపితనమంతా కలబోసుకొన్న శ్రీవేంకటేశ్వరుడవు నీకు లొంగకుండవుండుట సాధ్యమేనా? అమరియున్న నీవు ఆమెను (సత్యభామను) అన్ని విద్యలతో నీవు కూడి, మురిపించగా నీ జవరాలు జంటరతులతో పరవశించిపోయింది. (ఇంతకన్న నేనేం చెప్పగలను మహానుభావా! నీవు సర్వజ్ఞుడివి తండ్రీ!)

**2-89**

## మున్నుడి

చిన్నతిరుమలాచార్యులవారు మన కందించిన అనేక ఆణిముత్యాలలాంటి భజనలలో ఇదికూడా ఒకటి. సాధారణ మానవుడు, జ్ఞానం పెద్దగా లేనివాడు కూడా హరికి 'దగ్గరయ్యే' అత్యుత్తమ మార్గం భజనయే. హరికథాశ్రవణంలో మధ్య మధ్య 'పరధ్యానం' కలుగవచ్చును గాని భజనలో ఆ ప్రమాదం లేదు. ఈ కీర్తనలో అన్ని తేలిక పదాలే కాబట్టి భావామృతం పెద్దగా అవసరం లేదు అనుకోకండి. వివరణ కావలసిన పదాలు ఇందులోను ఒకటి రెండు లేకపోలేదు. 'సోవల' అంటే... ఏమిటి? 'సావ' అంటే జాడ. 'సోవ'ల అనే పదం నాకు దొరకలేదు. సోవల అంటే సోవల రూపాంతరంగా అని 'భావించాను'.

**కం॥ కొలువరె గోవిందా యని**
**పలుకుచు హరి నామములను పాయక ఎపుడున్**
**తొలగును పాపపురాసులు**
**తెలిపెను చిన తిరుమలయ్య తిరుమల రాయా!**

**రాగం : బృందావని**

గోవింద గోవిందయని కొలువరే
గోవిందాయని కొలువరే ॥గోవింద॥

హరియచ్యుతాయని యూడరే
పురుషోత్తమాయని పొగడరె
పరమ పురుషయని పలుకరే
సిరివరయనుచును చెలగరె జనులు ॥గోవింద॥

పాండవ వరదాయని పాడరే
అండజ వాహను కొనియాడరె
కొండలరాయనినె కోరరె
దండితో మాధవునినె తలచరె జనులు ॥గోవింద॥





దేవుడు శ్రీ విభుడని తెలియరె
సోవల ననంతుని చూడరె
శ్రీవేంకటనాథుని చేరరే
పావనమై యెప్పుడును బ్రదుకరె జనులు ॥గోవింద॥

**భావామృతం :**

ఓ జనులారా! మనస్ఫూర్తిగా మీరంతా 'గోవింద.. గోవింద' అని శ్రీమన్నారాయణునికి మ్రొక్కండి. పూజించండి. గోవిందుని స్మరించండి.

ఓ భక్తులారా! పరవశించి మీరంతా హరీ.. అచ్యుతా... అంటూ నాట్యం చేయండి. పురుషోత్తమా... అంటూ ఆ మహానుభావుని పొగడండి. పరమపురుషా! అని పిలవండి. ఆ నామం పలకండి. సిరివరుడు అంటే లక్ష్మీకాంతా! అని విజృంభించి ఆ నారాయణుని భజించండి.

ఓ ప్రజలారా! శ్రీకృష్ణావతారుడై ధర్మస్థాపకుడైన ఆ స్వామిని పాండవ వరదుడని పాడుచూ కీర్తించండి. అండము(గ్రుడ్డు) నుండి పుట్టిన గరుత్మంతుడు వాహనముగా గల విష్ణుమూర్తిని కొనియాడండి. ఏడుకొండల రాయుడని ప్రసిద్ధిజెందిన ఈ స్వామిని మీకు కావలసిన వర్ణాలు కోరుకోండి. ధైర్యంగా ఆ మాధవుడే (లక్ష్మీకాంతుడు) దిక్కని తలచండి సందేహించకండి.

మానవులారా! ఈ శ్రీ వేంకటేశ్వరుడే శ్రీపతి. ఈయనే దైవం అని తెలియండి. అనంతుడని, వినుతి కెక్కిన ఆ ప్రభువు జాడ గ్రహించి ఆయనను దర్శించండి. ఆ విధంగా మీరు శ్రీవేంకటనాథుని చేరండి. ఆ విధంగా పుణ్యాత్ములై ఎప్పుడూ ఆ శ్రీవేంకటరమణునే ధ్యానిస్తూ బ్రతుకును వెళ్లబుచ్చండి.

**2-90**

## మున్నుడి

అన్నమాచార్యులవారి అత్యద్భుత వైరాగ్య కీర్తనమిది. అక్కరకు రాని చుట్టరికాలతో, సంతలలో (బజార్లు అనబడె కూటములు) పలకరించుకొనే 'ఆత్మీయతలతో', విసిగి వేసారిపోయి తిరుమలయ్య యొక్కడే దిక్కు అని ఎలా ఆక్రోశిస్తున్నారో చూడండి. ముయ్యంచు (ముప్విధంబులగు) మనస్సుతో (మనో,వాక్,కర్మలు చేత) మోహమతినై చెడిపోయానంటున్నారు.

**సీ॥ అయ్యయ్యో! ప్రాయంబు అంతమై పోయెనే**
**కాలంబు గడచనే!! కనుల ముందు**
**ముప్విధంబుల మదిన్ మోహంబునన్ జిక్కి**
**'సంతకూటముల సంచారి' నైతి**
**తల్లిదండ్రులుగాని తగు బంధువులు గాని**
**అన్నదమ్ములుగాని అక్కరవరు**
**సుతులు కాంతలుగాని హితులు భృత్యులుగాని**
**సాయంబు కారురా జంటరారు**

**ఆ.వె॥ అంతరాత్ముడైన హరియొక్కడే దిక్కు**
**అన్నమయ్య తెలిపెనద్భుతముగ**
**నమ్మికొలువుడయ్య నారాయణుని నేడె**
**వేంకటాద్రిపైన వెలసినాడు**

**రాగం : శివరంజని**

అయ్యోపోయె బ్రాయము కాలము
ముయ్యంచు మనసున నే మోహమతినైతి ॥అయ్యో॥

చుట్టంబులా తనకు సుతులు కాంతలు చెలులు
వట్టియాసల పెట్టువారేకాక
నెట్టుకొని వీరు కడు నిజమనుచు హరినాత్మ
బెట్టనేరక వృథా 'పిరి వీకు' లైతి ॥అయ్యో॥





తగుబంధులా తనకు తల్లులును తండ్రులును
వగల బెట్టుచు తిరుగువారేకాక
మిగుల వీరల పొందు మేలనుచు హరినాత్మ
తగిలించలేక చింతాపరుడనైతి ॥అయ్యో॥

అంతహితులా తనకు అన్నలును తమ్ములును
వంతువాసికి పెనగువారేకాక
అంతరాత్ముడు శ్రీవేంకటాధీశు కొలువకిటు
సంతకూటముల అలజడికి లోనైతి ॥అయ్యో॥

**భావామృతం :**

అయ్యో! హతవిధీ! నాకు భగవంతుడిచ్చిన కాలం అంతా తరిగిపోయింది. వయస్సు గడచిపోయింది ముయ్యంచు (మూడు విధములుగా నుండు) మనస్సుచేత (మనోవాక్ కర్మలచేత) నేను మోహమతినై చెడిపోయాను.

నా కుమారుడు, నా భార్య, నా స్నేహితులు అని మురిసిపోతామే!! వీరంతా ఏ విధమైన చుట్టాలు? వీరంతా ఆశలు కలిగించి చివరికి నిరాశయే మిగిల్చి పోతారు కాని వేరుకాదు. అతిశయముతో వీరే నిజమైన వారని నమ్మి శ్రీహరిని ఆత్మలో ధ్యానింపక వ్యర్థముగా 'పిరివీకు' (పీకు + పీకు అంటే పీకులాట) కలవాడ నయ్యాను.

నా తల్లి నాతండ్రి అని బాల్యం నుంచి చచ్చేదాకా ఎంతో ఇష్టపడతామే కాని వీరు తగిన బంధువులా? వీరంతా అంతులేని వేదన కలిగించే వారే. కాని వీరి పొందు మేలు చేస్తుందని నమ్మి శ్రీహరిని ఆత్మానుసంధానం చేసికొనలేక చింతామతినై జీవితం వ్యర్థం చేసికొన్నాను.

నా అన్నదమ్ములు అని నేనింతకాలం ఎంతో మమకారం పెంచుకొన్నాను. నిజానికి వీరంతా నా వారా? అంత హితులా? వారంతా మా పిత్రార్జితంలో వారి వారి వంతువాసికి (వాటా) కోసం ఆరాటపడే వారే. పెనగు వారే (పోట్లాడే వారే) కాని మేలుచేసే వారు కాదు. నా అంతరాత్ముడై యున్న శ్రీ వేంకటేశ్వరుని కొలువక ఈ ప్రపంచం అనే సంతకూటమి (బజారు, సంత ఏదో ఒకరోజు ఒక ప్రదేశమున ఏర్పాటుచేయబడి సరుకుల క్రయ విక్రయములు చేయబడు ప్రదేశము) లో కలిగే సంబంధాలతో అలజడి (వ్యాకులత)కి లోనై నానా బాధలు పడ్డాను. ఇకచాలు.

**2-91**

## మున్నుడి

అన్నమాచార్యులవారు చెప్పిన సరళమైన మేలుకొలుపు కీర్తన ఇది. వేంకటేశ్వరుడే ఆనాటి బాలకృష్ణుడని భావించి చెప్పిన కీర్తన. కృష్ణయ్య "మిన్నక వేసాలు" (ఊరకనే కొంటె వేషములు) వేస్తున్నాడట. అవి మాని మేలుకోవయ్యా స్వామి అంటున్నారు. సన్నలు అంటే సంజ్ఞలు. నీ సన్నల యోగనిద్ర అంటే సంకేతము నిచ్చే యోగనిద్ర. (అంటే నేను నిద్రపోవటం లేదు, లోకాల నన్నింటినీ గమనిస్తున్నాను అనే సంకేతమునిస్తున్న యోగనిద్ర) ఇక చాలు మేలుకో నందనందనా! అని అంటున్నారు.

**ఉ॥ మిన్నక వేసముల్ వలదు మేలుకొనంగదె బాలకృష్ణ! నీ**
**సన్నల యోగ నిద్ర యిక చాలును యెందరు గోప భామినుల్**
**నిన్నిటు ముద్దులాడుటకు నీదరిజేరిరి అన్నమయ్యనెన్**
**ఎన్నికజేసి వేంకటగిరీశుడె ఆ యదునందనుండనెన్.**

**రాగం : కీరవాణి**

మిన్నకవేసాలు మాని మేలుకోవయ్యా
సన్నల నీ యోగనిద్రచాలు మేలుకోవయ్య ॥మిన్నక॥

ఆవులు పేయలకుగా నఱచీ పిదుకవలె
గోవిందుడా ఇక మేలుకోవయ్యా
ఆవలీవలి పడుచులు ఆటలు మరిగివచ్చి
త్రోవగాచుకున్నారు ప్రొద్దున మేలుకోవయ్యా ॥మిన్నక॥

వాడల గోపికలెల్లా వచ్చి నిన్ను ముద్దాడ
కూడియున్నారిదే మేలుకోవయ్యా
తోడనే యశోద గిన్నెతో పెరుగువంటకము
ఈడకు తెచ్చిపెట్టేనింక మేలుకోవయ్యా ॥మిన్నక॥





పిలిచీ నందగోపుడు పేరుకొని అదె, కన్ను
కొలుకులు విచ్చి (ఇంక) మేలుకోవయ్యా
అలరిన శ్రీవేంకటాద్రి మీది బాలకృష్ణ
ఇలమా మాటలు వింటివింక మేలుకోవయ్యా ॥మిన్నక॥

**భావామృతం :**

ఓ బాలకృష్ణా! ఊరకనే దొంగ వేషాలు వేసి నిద్రనటిస్తున్నావు. ఇక మేలుకో తండ్రీ! యోగనిద్రపోతూనే ఒకకంట లోకాల నన్నింటినీ గమనిస్తూనే వుంటావు. ఇక నీ నిద్ర చాలించి మేలుకో మహానుభావా!

వింటున్నావా! ఆవులు వాటి దూడల కోసం అంబారావాలు చేస్తున్నాయి. నీవు దూడల్ని వదిలి వాటికడుపు నిండాక గాని గోమాత పాలు మనం త్రాగరాదు. దూడల్ని వదలాలి కదా! లేనాన్నా! నిద్రలే. నీవు ఎవరివి? గోవిందుడవు. ఇక మేలుకోవయ్యా! అక్కడా ఇక్కడా నీతోటి సహవాసగాళ్లు పడుచు కుర్రాళ్లు నీతో ఆటలు మరిగి దోవకాచుకొని యున్నారు. పాపం పొద్దుపోయింది. నిద్రమేలుకోరా బాబూ!

గోపవాడల్లోనుంచి గోపికలు నిన్నుపట్టుకొని ముద్దుల్లో ముంచెత్తాలని మూకుమ్మడిగా కూడియున్నారు. నిద్దురమేలు కొనవయ్యా! నీకు నిద్రలేవంగానే ఆకలేస్తుందనే గొప్ప ఆదుర్దాలో తనతోపాటు పెరుగువంటకము (దద్ధోజనం లేక పెరుగుపచ్చడి అన్నం) ఇక్కడికే తీసికొచ్చి నీకోసం నిరీక్షిస్తోంది, మీ అమ్మ యశోద. మేల్కొనరాదా? తండ్రీ!

అదిగో అటు చూశావా, మీనాన్న నందగోపుడు కన్నయ్యా! అని పేరు పెట్టి పిలుస్తున్నాడు. ఇకనైనా మేలుకో. నామాట అబద్ధమైతే నీ కనుకొలుకుల లోంచి నీవే చూడు. శ్రీ వేంకటాద్రిపై వెలసిన వేంకటకృష్ణుడవైన బాలకృష్ణా! నీవు మా మొరలన్నీ వింటూనే వున్నావు. (అసలు మా గోలతో మేము నిన్ను నిద్రపోనిస్తే కదా! అట్లా లాలి పాట పాడి నిద్రబుచ్చి వెంటనే సుప్రభాతం అని ఊదరగొట్టేస్తూనే వున్నాం కదా!) అందుకని నిద్రమేలుకొని మమ్మల్ని రక్షించు.

## 2-92

### మున్నుడి

'కేసరము' అంటే జూలు. కేసరి అంటే జూలు కల సింహం. నరకేసరి అంటే నరసింహస్వామి. అన్నమాచార్యులవారు అహోబల నరసింహునిపై చెప్పిన చక్కటి కీర్తన ఇది. గరుడాద్రిపై వెలసిన, మనోహరమైన నవ్వు మోము నరసింహుని కీర్తిస్తున్నారు. ఎడమతొడపై ఆదిలక్ష్మిని కూర్చొనబెట్టుకొని యున్న కనక నరసింహుడని మొక్కుతున్నారు. "రవి చంద్ర శిఖ నేత్రుడు" అంటె సూర్య, చంద్రులు మరియు శిఖ అను మూడు నేత్రములు కలవాడు. ఇకపోతే 'శిఖ' అంటే 'సెగ'. అంటే అగ్ని ఆయన మూడవ కన్ను.

**ఆ.వె॥నగు మొగంబుతోడి 'నరకేసరై' బ్రోచు**
**గరుడ శిఖరమందు కలతబాపు**
**వేంకటాద్రి నున్న విభుడునీ 'సింగవే'**
**అన్నమయ్య తలపె అద్భుతముర.**

**రాగం : మాళవి**

నగుమోముతోడి ఓ నరకేసరి
నగరూప గరుడాద్రి నరకేసరి ॥నగుమోము॥

అమిత దానవహరణ ఆదినరకేసరి
నమిత బ్రహ్మాది సుర నరకేసరి
కమలాగ్ర వామాంక కనకనరకేసరి
నమో నమో పరమేశ నరకేసరి ॥నగుమోము॥

రవిచంద్ర శిఖనేత్ర రౌద్ర నరకేసరి
నవ నారసింహా నమో నరకేసరి
భవనాశినీ తీర భవ్య నరకేసరి
నవరసాలంకార నరకేసరి ॥నగుమోము॥





శరణాగతత్రాణ సౌమ్య నరకేసరి
నరకమోచననామ నరకేసరి
హరి నమో శ్రీవేంకటాద్రి నరకేసరి
నరసింహ జయజయతు నరకేసరి ॥నగుమోము॥

### భావామృతం :

నవ్వులు వెలయించుచున్న వదనము గల ఓ నరసింహా! పర్వ రూపమునున్న గరుత్మంతుడు గరుడాద్రియై దానిపై నెలకొని యున్న నీకు వందనములు.

ఓ ఆదినరసింహా! అసంఖ్యాకులైన దానవులను నిర్జించినవాడవు నీవే. బ్రహ్మాది దేవతలు వినమ్రతతో మ్రొక్కు దేవదేవుడవైన నరసింహుడవు. ఆదిలక్ష్మిని ఎడమతొడపై కూర్చొన బెట్టుకొనిన కనక నరసింహుడవు నీవే. అట్టి పరమేశ్వరుడవైన నీకు నమస్కారములు.

ఓప్రభూ! నీవు రౌద్రరూపంలో వున్నప్పుడు నీకు మూడునేత్రములుగా సూర్యచంద్రులు మరియు అగ్ని దీప్తించుచున్నారు. అట్టి క్రొంగొత్త రూపముగల ఓ నరకేసరీ! నీకు వందనములు. భవనాశినీ నదీ తీరంలో వెలసిన శుభకరుడవైన నరసింహుడవు నీవు. శృంగార, రౌద్ర, భీభత్సాది నవరసములు అలంకారముగా ప్రదర్శించు నరకేసరివి. అట్టి నీకు వందనములు.

శరణు జొచ్చినవారికి బలము అనిపేరు పొందిన మనోజ్ఞ మూర్తి ఈ నరసింహుడు. ఈయన భక్తులను నరకమునుండి తప్పించును. శ్రీవేంకటాద్రిపై వెలసిన ఆ స్వామికూడా ఈ నరకేసరియే. ఓ నరసింహా! నీకు జయము. ఓ నరకేసరీ! నీకు జయమగు గాక!

**2-93**

## మున్నుడి

'మంగాంబుధి' లో వెలసిన హనుమంతుని సేవించి అన్నమాచార్యులవారు అనేక కీర్తనలు చెప్పారు. వాటన్నిటిలాగా ఈ కీర్తనకూడ బహుళ జనాదరణ బొందింది. ఇందులో వుటంకించిన భారత గాధలు సవివరంగా చెప్పాలంటే స్థలాభావం వలన సాధ్యంకాదు. క్షంతవ్యుడను. సుగ్రీవుడు రాముని సేవించి ధన్యుడయింది హనుమవల్లనే. శ్రీరాముడు ఆంజనేయుని వలననే సీతాదేవిని ప్రేమముతో 'ముగుడను బెండ్లాడె' (మరల భార్యగా పొందినాడు) అని అంటున్నారు. వేంకటేశ్వరుని 'యండనే' (ఆశ్రయము వలననే) హనుమ ఇవన్నీ చేయగలిగాడంటున్నారు అన్నమయ్య.

**చం॥ అనిలజుడైన యా హనుమ అంజన పుత్రుడు వాని చేతలన్**
**ఘనులగు దేవతాళికిని కాదిక నెంచగ అన్నమయ్యనెన్**
**అనుపమ లీలతో గెలుపు అర్జునుకిచ్చెను ఆలమందనెన్**
**వినుడిది అండ మారుతికి వేంకటనాధుడె తాననెన్ భళా!!**

**రాగం : ఆరభి**

ఆంజనేయ అనిలజ హనుమంత నీ
రంజకపు చేతలు సురలకెంచ వసమా ॥ఆంజనేయ॥

తేరిమీద నీ రూపుదెచ్చిపెట్టి యర్జునుడు
కౌరవుల గెలిచె సంగర భూమిని
సారెకు భీముడు పురుషామృగము దెచ్చుచోట
నీ రోమములు గావా నిఖిల కారణము ॥ఆంజనేయ॥

నీ మూలమున గాడె నెలవై సుగ్రీవుడు
రాముని గొలిచి కపిరాజాయెను
రాముడు నీవంకనే పో రమణి సీతాదేవి
ప్రేమముతో మగుడను బెండ్లాడెను ॥ఆంజనేయ॥





బలుదైత్యులను దుంచ బంటుతనము మించ
కలకాలమును నెంచ గలిగితిగా
అల శ్రీ వేంకటపతి యండనే మంగాంబుధి
నిలయపు హనుమంత నెగడితిగా ॥ఆంజనేయ॥

**భావామృతం :**

అంజని పుత్రుడవైన ఓ హనుమంతా! నీవు అనిలజుడవు (వాయునందనుడవు). మనోహరమైన నీచేష్టలను వివరించటం దేవతలకైనను సాధ్యమయ్యే పనేనా? ఎన్నటికీ కాదు.

ద్వాపరయుగంలో అర్జునుడు తన రథంపై 'జెండా' మీద నీ రూపము నుంచుకొని కౌరవలను గెలిచి విజయుడైనాడు. వాయునందనుడవుటచే నీ సోదరుడైన భీమసేనుడు 'పురుషామృగము'ను తెచ్చు సందర్భమున నీ రోమము (వెంట్రుక) తోనే ఆ కార్యము సాధించ గలిగెను. (త్రేతాయుగమునాటి నీవు చిరంజీవి వవుట చేతనే అట్లు చేయగలిగితివి కదా!)

త్రేతాయుగంలో శ్రీరామచంద్రునికి, సుగ్రీవునికి నీమూలంగానే పరిచయం కలిగి ఆత్మీయులై పరస్పరం సహాయం చేసికొన్నారు. కపిరాజై సుగ్రీవుడు శ్రీరాముని సేవించాడు. అంతెందుకు నీవు సీతా శోక వినాశకుడవు కనుకనే రాఘవుడు మరల జానకీదేవిని భార్యగా పొందాడు.

అసంఖ్యాకులైన దానవులను తెగటార్చి శ్రీరామదూత అని అజరామరమైన కీర్తిని సంపాదించి, కలకాలము నిన్ను కొలుచు భక్తులను రక్షించుచున్నావు. ఆనాటి శ్రీవేంకటేశ్వరుని ఆశ్రయించుటవలన నేటికీ మంగాంబుధిలో నివాసివైన హనుమంతుడవై ఎనలేని కీర్తిని సంపాదించితివి. (అందుకే, 'శ్రీరామదూతం శిరసా నమామి' అని కీర్తించు అందరికీ నీ సహాయం దొరుకుతున్నది)

## 2-94

### మున్నుడి

'సువ్వి' అనే మాటకు అర్థం లేదు. దంచే ప్రక్రియలో ఆయాసం తీర్చుకొనుటకు దంచువారు నోటితో చేయు 'ధ్వని' అది. 'లాల' అంటే 'చొంగ'. లాలి అంటే ఉయ్యాల. ఉయ్యాల పాపాయిని ముద్దుగా 'లాల' అని పిలుస్తారు. దంచుతున్న భామలు చిన్నారి కృష్ణుని తలుచుకొంటూ 'ఓలాల!' అని పిలుస్తున్నారు. ఇంతకీ ఆ పాపాయి ఎవరు? కృష్ణయ్యే కాదు ఆయనే నేటి ఏడుకొండలవాడు. ఈయన పాపాయిలా చొంగకార్చుట లేదు, తెప్పలుగా రతి తేలుచు కోనేటి అప్పని వలెనున్నాడు. కోనేటి చెంతునున్న ఈ అప్పని (అయ్యని) కొలవని వానిది జన్మయేనా? వివరణకి భావామృతం చదవాల్సిందే.

**ఆ.వె॥ కొలిచి రన్నమయ్య 'కోనేటి అప్పని'**
**ఇవ్విధముగ పాడి 'సువ్విపాట'**
**కన్నెలంత చేరి 'కనుచూపు రోకండ్ల'**
**బాగ దంచిరనిరి, వహ్వా!! లాల!!**

**రాగం : కేదారగౌళ**

సువ్వి సువ్వి సువ్వని
సుదతులు దంచెద రోలాల ॥సువ్వి సువ్వి॥

వనితలు మనసున కుంచన చేసిటు
వలపులు తగనించో లాల
కనుచూపులనెడు రోకండ్లను
కన్నెలును దంచెదరో లాల ॥సువ్వి సువ్వి॥

బంగరు చెరగుల పట్టు పుట్టములు
కొంగులు తూలగ వోలాల
అంగనలందరు నతివేడుకతో
సంగడి దంచెద రోలాల ॥సువ్వి సువ్వి॥





ఘల్లుఘల్లుమను కంకణ రవముల
పల్లవ పాణులు వోలాల
అల్లన నడుములు అసియాడుచు సతు
లొల్లనె దంచెద రోలాల ॥సువ్వి సువ్వి॥

కప్పుర గంధులు కమ్మని పువ్వుల
చప్పరములలో నోలాల
తెప్పలుగా రతితేలుచు కోనే
టప్పని పాడెదరోలాల ॥సువ్వి సువ్వి॥

**భావామృతం :**

(ఇద్దరు స్త్రీలు ధాన్యం రోట్లో దంచుతున్నారు. 'సువ్వి' అంటూ నోటితో అని, బలంగా రోకటిపోటు వేసింది ఒకామె. ఆమె రోకలిపైకి తీయంగానే రెండవ ఆమె 'సువ్వి' అంటూ తనూ రోకటి పోటు వేసింది. దంచటం పూర్తయ్యేదాక వారు 'సువ్వి', 'సువ్వి' అంటూనే వున్నారు. ఓలాల! ఈ సుదతుల్ని (స్త్రీలను) చూచితివా?)

ఓలాల! దంచుతున్న ఆ స్త్రీలు మనస్సులలో ఈవిధముగా తలపోయుచూ అతిశయించిన ప్రేమను నింపుకొనిరి. వారు కనుచూపులు పైకి క్రిందికీ మరల్చుచున్నందువల్ల (దంచేటప్పుడు రోకలిని గమనిస్తారు కదా!) ఆ కన్నెలు చూపుల రోకళ్లతో దంచుతున్నట్లు వున్నది.

బంగారు జరీగల పట్టు వస్త్రములను వారు కట్టిరి. ఓలాల! అందుచేత దంచుతున్నప్పుడు వారి కొంగులు తూలుచున్నవి. అక్కడి స్త్రీలందరు మిక్కిలి వేడుకతో ఒక కూటమిగా చేరి ఈ దంచుడు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇది అద్భుతముగా నున్నది.

ఓలాల! పల్లవ పాణులు (చిగురుటాకులవంటి చేతులు గల) యైన ఆవనితలు ముంజేతి కంకణములు ఘల్లుఘల్లుమని ధ్వనించుచుండగా దంచుచున్నారు. వారి నడుములు మెల్లగా అటూ నిటూ చలించుచున్నవి. అది మనోహరముగా నున్నది.

ఓలాల! చప్పరములలో (పందిళ్లలో) దంచుచున్న ఆ కప్పుర గంధులు (కర్పూరపు ఒంటి సువాసన గల స్త్రీలు) కమ్మన పుష్పములను చల్లారు. అతిశయించిన రతుల దేలెడి ఆ కోనేటి అప్పడు (కోనేటి దరినున్న తండ్రి) అయిన శ్రీవేంకటేశ్వరుని పాడి కీర్తించెదరు. ఓలాల! వారిదే భాగ్యమంటే.

## 2-95

### మున్నుడి

శ్రీరామచంద్రుని కీర్తిస్తుంటే అన్నమాచార్యులవారిని, వినినవారు యెంత పులకించి వుంటారో ఊహించలేను కాని, ప్రతి కీర్తనలోను శ్రీరామదర్శనం నేటికీ చేయిస్తున్నారని చెప్పగలను. ఖర, దూషణాది పదునాలుగు వేలమంది దానవులను 'చదిపి' నాడట శ్రీరాముడు. ఒకే ఒక్క శరముతో ఏడు తాటిచెట్లను ధరను కూల్చాడట!కొండలతో జలనిధిని 'కట్టించి' లంకమీద విడిసినాడట ఈ ఏకాంగవీరుడు. మాల్యవంతాద్రిపై వెలసిన శ్రీరాముడే శ్రీవేంకటాద్రి మీదనే కాక వేవేల చందాల వెలసినాడట. "సొగసుచూడతరమా..."

**ఉ॥ ఈతడె రామచంద్రుడట ఏపుగ తానసహాయ శూరుడున్**
**ఏతల జూచినా ఇరవు ఈతడె శంభుని విల్లు ద్రుంచెరా**
**చేతలు జానకీపతివి చెప్పనుయెన్నని, మాల్యవంతమం**
**దీతడె తాను వేంకటగిరీశుడు యీతడె అన్నమయ్యనెన్**

### రాగం : రామక్రియ

ఈతడు వో రాముడు ఏకాంగ వీరుడు
ఏతల జూచినా తానె ఇరవుకొన్నవాడు ॥ఈతడు॥

చిరుతప్రాయమునాడు శివుని విల్లువిరచి
మెరసి సీతను పెండ్లాడి మించినవాడు
తరి పదునాలుగు వేల దానవుల నిమిషాన
జరసి తానొక్కడే చదివిన వాడు ॥ఈతడు॥

వోడక విల్లెక్కుపెట్టి ఊరకే ఒక్కమ్మున
ఏడు తాళ్లు ధరను కూలవేసినవాడు
జాడగా కొండలచేత జలనిధి గట్టించి
వేడుకతో లంకమీద విడిసిన వాడు ॥ఈతడు॥





రావణ కుంభకర్ణాది రాకాసుల పరిమార్చి
ఈవల అయోధ్యాపట్నమేలిన వాడు
శ్రీవేంకటాద్రిమీద జేరి మాల్యవంతమున
వేవేలు చందములను వెలసినవాడు ॥ఈతడు॥

### భావామృతం

ఓ భక్తులారా! ఇదిగో చూడండి. ఇతడే శ్రీరామచంద్రుడు ఈయన అసహాయ శూరుడు. ఎవ్వరి తోడులేకనే ఒంటరి పోరాటం జరుపగల ధీశాలి. ఎటువైపు చూచినా తానే యుద్ధం చేస్తున్నట్లు కనిపించునట్లుండు రణరంగమార్తాండుడు.

నవయౌవన ప్రాయంలోనే శివధనస్సును విరిచిన అసాధ్యుడు. తత్ఫలితంగా శోభాయమానంగా సీతాదేవిని పెండ్లియాడినాడు. పదునాలుగు వేలమంది రాక్షసులను (ఖరుడు మొదలైనవారు) మధించి ఒక్క నిమిషంలో, తానొక్కడే (లక్ష్మణుని సీతకు కావలియుంచి), జరసి(పోయి) చదివిన (చంపిన) వాడు.

ఈ శ్రీరాముడు ఓడక (వెనుకాడక) ధనస్సు నెక్కుపెట్టి ఊరకనే ఒకేఒక్క బాణముతో ఏడు తాటి చెట్లను నేలపడగొట్టాడు. (దానివల్ల సుగ్రీవునకు తనశక్తిపైన నమ్మకం కలిగించాడు. గుర్తించబడునట్లు అనంత జలరాశియైన సముద్రంమీదనే కొండరాళ్లతో వంతెన కట్టించి లంకకు విడిసిన (ప్రయాణమైన) వాడు, ఈ శ్రీరాముడు ఆ తరువాత రావణ కుంభకర్ణాది రాకాశి మూకను సంహరించి, ఇటు అయోధ్యా నగరాన్ని జనరంజకంగా పరిపాలించాడు. ఈయనే శ్రీవేంకటాద్రిపై చేరిన శ్రీవేంకటేశ్వరుడు ఈ మాల్యవంతమనే కొండమీద వెలసి అనేక రకములుగా ప్రజలను రక్షించుచున్నాడు.

**2-96**

## మున్నుడి

ఆంధ్రదేశంలో అతి సామాన్యులు కూడా నిత్యమూ వాడే సామెతలకి అన్నమాచార్యులవారి ఇటువంటి కీర్తనలే స్ఫూర్తియేమో అనిపిస్తుంది. “పరిగెత్తి పాలుతాగేకంటే నిలబడి నీళ్లుతాగితే మేలు”, “కాకిలాకలకాలం బ్రతికేకంటే కోకిలలా కొద్దిరోజులు బ్రతికితే చాలు” వంటి అసంఖ్యాక సామెతలకు మూలం ఇదేనేమో! ఇంత చిన్న కీర్తనలో నాబోటి ‘తెలుగు’ వాడికి అంతుపట్టని మాటలు కోకొల్లలు. తప్పులేని జీతమొక్క తారమైన చాలు - అంటే? తప్పు చేయించకుంటే జీతము ఒక్క ‘తారము’ అయినా అంటే నాలుగు కాసులు అయినా చాలు.

**ఆ.వె. ‘తిప్ప’ లెన్నియైన ‘అప్పు’ లేకుండిన**
**అదియె మేలు అనిరి అన్నమయ్య**
**‘తార’ జీతమైన తప్పులేకున్నచో**
**చాలు, వేంకటేశ! జగతియందు.**

**రాగం : మిశ్రమలహరి**

అప్పులేని సంసారమైన పాటేచాలు
తప్పులేని జీతమొక్క తారమైనచాలు ॥అప్పులేని॥

కంతలేని గుడిశొక్క గంపంతయిన చాలు
చింతలేని అంబలొక్క చేరడే చాలు
జంతగాని తరుణియే జాతైన నదెచాలు
వింతలేని సంపదొక్క వీసమే చాలు ॥అప్పులేని॥

తిట్టులేని బ్రతుకొక్క దినమైననదె చాలు
ముట్టులేని కూడొక్క ముద్దెడే చాలు
గుట్టుచెడి మనుకంటే కొంచెపు మేలైన చాలు
వట్టిజాలి బడుకంటే వచ్చినంతే చాలు ॥అప్పులేని॥





లంపటపడని మేలు లవలేశమే చాలు
రొంపికంబమౌకంటే రోయుటే చాలు
రంపపు కోరికకంటే రతి వేంకటపతి
పంపున నాతని చేరే భవమే చాలు ॥అప్పులేని॥

## భావామృతం:

ఓ మానవులారా! డాంబికంగా తప్పులు చేస్తూ బ్రతికి గత జన్మపుణ్యవశాన దొరికిన మీ జన్మని వ్యర్థం చేసుకోవద్దు. నామాట వినండి. భగవంతుడు మెచ్చే విధంగా జీవించండి. సంసారం ఈదుస్తున్న సామాన్య మానవుడు ఏవేవో పాట్లు (తిప్పలు) పడుతుంటాడు. అది సహజం. కాని చేతికందిన అప్పులు చేస్తూ చేసే సంసారంకంటే వున్నదాంతో సరిపెట్టుకొని జీవించుట మేలుకదా! అప్పుతీర్చలేక తిట్లు, తన్నులు తినాలి కదా! జీతం ఎక్కువ వస్తున్నదని అకృత్యాలు చేసేకంటే సక్రమమైన కొలువులో ‘తారము’ (నాలుగు కాసుల నాణెం) జీతం లభించినా చాలు.

గంపంత చిన్న గుడిసెలాంటి ఇంట్లో, కంతలు (రంధ్రములు) లేని కప్పుకింద వుండటం మేలుకదా! బాధలు లేకుంటే అంబలి (గంజి) త్రాగి బ్రతికితే మాత్రం నష్టమేమిటి? భార్య గుణవంతురాలైతే ఏ జాతిదైతే నేమి? ఏ కులముదైతేనేమి? ఆమె ‘జంత’ (దుర్మార్గురాలు) కాకుంటే చాలును కదా! అందరూ ఆశ్చర్యంతో నోళ్లునొక్కుకొనే అక్రమార్జితమైన ఆస్తిపాస్తుల కంటే సంపద ఒక వీసమెత్తు (1/16 భాగము) వుంటే నష్టమేమిటి?

నిందలు పడకుండా ఒక్కరోజు బ్రతికినా చాలు కదా! ఎంగిలి చేయకుండా ఒక్కముద్ద భోజనం పెట్టినా ఎంతో మంచిది కదా! పదిమందిలో చులకనయై బ్రతికేకంటే గుట్టుగా కొంచెము వున్నా మేలేకదా! వట్టిగా జాలి చూపించే వాడికంటే తనకి వచ్చినది యేదో కొంత ఇచ్చేవాడు నయము కదా!

ఏవేవో లంపటములు (బంధాలు) గల బ్రతుకుకంటే ఏ చీకాకులేని బ్రతుకు లవలేశము (అతికొంచెము) యైనా నయమే. బురదతో నిండిన స్తంభం ఏ ఆధారమీయగలదు? దానితో అవస్థపడేకంటే దాన్ని విడిచిపెట్టుటయే నయము కదా! రంపపుకోత కలిగించు కోరికలను త్యజించి ప్రీతితో సర్వమూ శ్రీవేంకటేశ్వరుడే అని ఆయన ఆజ్ఞాబద్ధుడై ఆయనను చేరే జన్మయే మిక్కిలి మేలైనది. అదే చాలు.

**2-97**

## మున్నుడి

ఐదురోజుల వివాహమహోత్సవము శ్రీనివాసునికి, అలమేల్మంగమ్మకు జరుగుచున్నది. నాల్గవనాడు నాగవెల్లి అని పిలువబడే 'నాకబలి' తంతు జరుగుచున్నది. ముత్తయిదువులు మురిసిపోతున్నారు. చెలులంతా నృత్యం చేస్తూ పాడుతున్నారు. వధూవరుల పేర్లు చెప్పుకొంటున్నారు. వారిద్దరికీ ఒక్కపేరాయేమన్నానా? సహస్రనామములు గలవారు. ఒకరి కింకొకరు దీటుగా ఉన్నారు. మరి ఇంత చక్కటి జంట ముల్లోకాలలో వుంటుందా? పెదతిరుమలాచార్యుల వారి అపూర్వ సృష్టి ఈ కీర్తన. ఓ చెలులారా! ఈ ఇద్దరికీ ఒకే కైవాడము కలిగింది అన్నారు. అంటే... ఏమో... భావామృతం చూడాల్సిందే.

**చం॥ కనుగొన నేడె పెండ్లియట, గాంచరె మీరలు నాగవల్లినిన్**
**మనముల శోభనా లలర పాడి చెలుల్ ఇటు ఆడరే తగన్**
**వనజ నివాసినిన్ జలదవర్ణుడు గూడెను తాళ్లపాకవా**
**రనె మన వేంకటేశ్వరుడు ఆ వరుడాయమ మంగమాంబరా.**

**రాగం : నాదబృందావని**

నేడే పెండ్లివేళ నేడే నాగవల్లి
ఆడుచు సోబాన పాడుమనరే చెలులు ॥నేడే॥

కనకాంబరుడతడు కనక కుచగిరి యీకె
కొనబుగల యిద్దరికి కూడె పొంతనము
వనజనాభుడతడు వనజలోచన యీకె
ఘనమైన కంకణము గట్టరే చెలులు

నీలవర్ణుడతడు నీలకుంతలి యీకె
చాలుకొని యిద్దరికి జంట తగును
అలరైన శంఖధరు డతడీకె కంబుకంఠి
యీలీల నారతులు యెత్తరే చెలులు ॥నేడే॥





జలధి శాయిని యతడు జలధికన్యక యీకె
కలిగె నిద్దరికి నొక్కకైవాడము
అలరు శ్రీవేంకటేశుడతడీకె మహాలక్ష్మి
వెలయగల సిరి దీవించరే చెలులు ॥నేడే॥

## భావామృతం

ఓ చెలులారా! అపురూపమైన జంటకు పెండ్లి జరుగుచున్నది. ఈ వేళ నాగవల్లి. ఎంత చక్కగా జరుగుచున్నదో చూడండి. మీరంతా కలిసి నాట్యమాడండి. మధురంగా పాడండి. శుభములు కలుగవలెనని దీవించండి. ఈ జంట ఒకరికొకరు సమవుజ్జీగా నున్నారు.

ఈ వరుని చూశారా? ఈయన కనకాంబరుడు (పచ్చని పట్టుపీతాంబరధరుడు) ఈమె కనక కుచగిరుల చిన్నది. ఉద్యానవనం కోనేటి దరిలో వారిద్దరికీ పొత్తుకలిగిందట. ఈయన వనజనాభుడు (నాభియందు పద్మము గలవాడు) ఈమె వనజలోచన (పద్మనయన) వీరిద్దరికీ గొప్ప ముంజేతి కంకణము కట్టండి. చెలులారా! మీ జన్మతరింప చేసికొనండి.

ఇంకొక పోలిక చూశారా? ఈయన నీలవర్ణుడు (నల్లని దేదీప్యమానమైన మేఘవర్ణుడు). ఈమె నీలకుంతల (నల్లని తలవెంట్రుక గల సుందరి). ఒప్పయిన విధముగా ఇద్దరికీ జంట కుదిరినది. అతడు ప్రకాశించు దివ్య శంఖమును (ఆ శంఖము పేరు పాంచజన్యం. దాని ధ్వనికే రాక్షసులు తల్లడిల్లి మరణిస్తారు) ధరించువాడు. ఆమె శంఖమువంటి చక్కటి కంఠము కలది. ఈవిధమైనందున వీరికి హారతుల నీయండి.

ఈయన జలధిశాయి (సాగరముపై శయనించు వాడు శేషతల్పశాయి) ఈమె జలధికన్య (సాగర పుత్రిక). వీరిద్దరికీ ఒకే కైవారము కలిగినది. (ఒకే స్తోత్రముతో కీర్తించబడుతున్నారు. ఆమెను లక్ష్మీం క్షీర సముద్రరాజతనయాం శ్రీరంగధామేశ్వరీం అంటాం. ఆయనా శ్రీరంగధాముడే) నిత్యానందుడైన శ్రీవేంకటేశ్వరుడీయన ఈమె శ్రీమహాలక్ష్మి వీరిని దీవించి శుభములు చేకూర్చండి. ఓ చెలులారా! మీ జన్మలు చరితార్థం చేసికొనండి.

**2-98**

## మున్నుడి

దేవకీ వసుదేవులకు శ్రీమన్నారాయణుడు శిశువుగా కృష్ణునిగా (నల్లనివానిగా) జన్మించబోతున్నాడు. వారికి దివ్యమైన తన చతుర్భుజ రూపమూ తరువాత క్రమంగా అనంతమైన విశ్వరూపం చూపించాడు. చతుర్భుజుడు దశవిధ అవతారములను, సహస్రఫణి ఆదిశేషశయ్యాగతుడై అనంత దివ్యాయుధములతో దర్శనమిచ్చి వారిని ధన్యులను చేశాడు. అన్నమాచార్యులవారు ఆ విశ్వరూపుడే, ఆ శిశువే నేటి అనంత శ్రీవేంకటాద్రీశుడని కీర్తిస్తున్నారు. ఈ సంస్కృత కీర్తనపాడి ఆ పరమాత్మ విశ్వరూపం కన్నుల ముందు తెచ్చుకోండి.

**కం॥ శరణంటినయ్య నీకిక**
**హరిరూపా! చిన్నికృష్ణ! అని తెలిపిరిగా**
**వరుసగ సంఖ్యలలోనే**
**మురిపెంబుగ అన్నమయ్య మురహరి ఘనతన్**

**రాగం : మాండు**

తే శరణమహంతే శరణమహం
శైశవ కృష్ణా తే శరణం గతోస్మి ॥తేశరణం॥

దశవిధావతార ధర్మరక్షకమూర్తి
దశమస్తకాసుర దళన
దశదిశాపరిపూర్ణ తపనీయ స్వరూప
దశావరణ లోక తత్త్వాతీత ॥తేశరణం॥

సహస్రలోచన సంతత వినుత
సహస్రముఖ శేషశయనా
సహస్రకరకోటి సంపూర్ణ తేజా
సహస్రార దివ్య చక్రాయుధ ॥తేశరణం॥





అనంత చరణ సర్వాధారాధేయ
అనంత కర దివ్యాయుధ
అనంత నిజకళ్యాణ గుణార్ణవ
అనంత శ్రీవేంకటాద్రి నివాస ॥తేశరణం॥

## భావామృతం

చిన్నారి శిశువురూపములో నున్న ఓ శ్రీకృష్ణా! నీకు నేనిదే శరణాగతితో వేడుకొంటున్నాను. ప్రభూ! శరణు శరణు శరణు. నీకు శరణు.

(నీ ఘనతను వర్ణించుట నావలన అయ్యే పనియేనా? అయినా ప్రయత్నిస్తాను)

నీవు దశవిధములైన, దివ్యమైన అవతారములను ధరించితివి. ధర్మరక్షకుడవై సర్వులను అనుగ్రహించితివి. పదితలల రావణాసురుని పరిమార్చితివి. దశదిశలు (ఎనిమిది దిక్కులు, ఊర్ధ్వ అధోలోకాలు) విస్తరించి సంపూర్ణముగా నిండిపోయినటువంటి తపనీయ స్వరూప (బంగారు కాంతితో మెరిసిపోయే స్వరూపుడవు). సమస్తలోకములలోని తత్త్వములకు అందని వాడివి.

ఓ దేవా! నీవు ఎల్లప్పుడూ సహస్రాక్షుడైన దేవేంద్రునిచే కీర్తించబడుతుంటావు. సహస్రఫణియైన ఆదిశేషుడు పాన్పుగా పాలకడలిలో వుంటావు. కోటిమంది సహస్రకర (సూర్యుల) పరిపూర్ణ తేజస్సుతో వెలుగొందుతూ వుంటావు. వేలకొలది అంచులుగల దివ్య చక్రాయుధమును ధరించి యుందువు.

ఓ మహానుభావా! నీవు అనంతమైన చరణములు (పాదములు) గలవాడవు. సర్వులకు ఆధార భూతుడైన వాడవు. అనంతమైన బాహువులలో అసంఖ్యాకమైన ఆయుధములను ధరించి యున్నావు. అనంతమైన కళ్యాణగుణ సాగరుడవు. ఈ దివ్య మంగళ స్వరూపముతో శ్రీవేంకటాద్రిపై నిలిచి శ్రీవేంకటేశ్వరుడని కీర్తించబడుతున్నావు.

2-99

## మున్నుడి

ఆరువందల సంవత్సరాల క్రిందట, అన్నమాచార్యులవారి నాటి 'ధన సంపాదన చదువును' దుయ్యబడుతున్నారు. ఆచార్యులవారు. ఏవేవో మాటలు చెప్పి ఆ రోజుకారోజు ఏదోరకంగా ధనం కోసమే ఉపయోగపడుతుంది నాచదువు. ఈ 'కలి' కాలం చదువు పరమాత్మను మఱిచేట్లు చేస్తుంది. ఈ ప్రౌఢల చదువు నిరుపయోగం. బ్రహ్మాది దేవతలు వేంకటపతిని నేర్చే చదువుకోసం ఆరాటపడుతుంటే శ్రీహరిని మఱచెడి సిరిసంపదల కోసం ఈ 'చదువు' పనికి వస్తున్నది అంతే... అంటున్నారు. ఆరువందల సంవత్సరాల తరువాత కూడా అదే కథ. దొరల కాళ్లు పట్టడమే పని. ఛీ! ఛీ!

**ఉ॥ నాటికి నాడె నా చదువు నాణ్యతలేనిది అన్నమయ్యనెన్**
**మాటలు మెండుగా కలిగి మాధవునెంచని దేమి విద్యరా?**
**యేటికి? వ్యర్థమా చదువు యేలికలందరి కాళ్లనొత్త, కో**
**నేటి పతిన్ మనోహరుని నీరజనాభుని 'విద్య' నేర్వుడీ**

**రాగం : వలజ**

నాటికి నాడే నా చదువు
మాటలాడుచును మఱచేటి చదువు ॥నాటికి॥

ఎనయ నీతని ఎఱుగుటకే పో
వెనక వారు చదివిన చదువు
మనసున నీతని మఱచుటకే పో
పనివడి యిప్పటి ప్రౌఢల చదువు ॥నాటికి॥

తెలిసి యితనినే తెలియుటకే పో
తొలుత గృతయుగాదుల చదువు
కలిగిన యీతని కాదననే పో
కలియుగంబులో కలిగిన చదువు ॥నాటికి॥





పరమని వేంకటపతి గనుటకే పో
దొరలగు బ్రహ్మాదుల చదువు
సిరులనితని మఱచెడి కొరకే పో
విరసపు జీవుల విద్యల చదువు ॥నాటికి॥

## భావామృతం

నేను నేర్చిన నా చదువంతా ఏ రోజుకారోజుకు మాత్రమే ఉపయోగపడుతుంది. ఏవేవో మాటలు చెప్పుకొని బ్రతికే చదువు. అది మఱపు కలిగిస్తుంది. పరమాత్మ దారిలో పోనీయక మనకు చెఱుపు చేస్తుంది.

పరిశీలించి చూస్తే మన పూర్వీకులైన ఋషులు చదివిన చదువంతా కేవలం 'ఇతనిని' (పరమాత్మని) తెలుసుకొనుటకే వినియోగించారు. మరి, ఈనాటి మన చదువులు ఇప్పటి 'పెద్దల' చదువులు. ఇవియెందుకు వుపయోగ పడుతున్నాయో తెలుసునా? 'ఇతనిని' (పరమాత్మను) మఱచుటకు మాత్రమే ఉపయోగపడుతున్నాయి.

తొలుత కృత, త్రేతా, ద్వాపరయుగాలలో గ్రహింపు తెచ్చుకొని 'ఇతనిని' (పరమాత్మను) తెలుసుకొనుటకే చదువు వినియోగింపబడినది. కాని నేటి కలియుగంలోని కలికాలం చదువులు, కలిగిన ఇతడు (పరమాత్మ) లేడని వాదించుట నేర్పెడి చదువు మాత్రమే. దానివలన ఏ ప్రయోజనమూ లేదు.

బ్రహ్మాది దేవతలు తాము ఆచరించి, మనకు 'పరము' అని నేర్పిన చదువు ఈ శ్రీవేంకటేశ్వరుని భావించుటయే. (ఇప్పుడు మీరు చేస్తున్న ప్రయత్నం కూడా ఆ 'చదువు' కోసమే సుమండీ...) అయితే విరసపు జీవుల (విరుద్ధంగా, వ్యతిరేకంగా ఆలోచించే జీవుల) విద్యలు నేర్పే 'చదువులు' కేవలం సిరి సంపదలు కూడబెట్టుకోటానికే పనికొస్తాయి. దాని వలన ఆ సిరిపతిని మఱచిపోతాం (తత్ఫలితంగా శ్లేష్మంలో పడిన ఈగలాగ చస్తూనే బ్రతుకుతాం).

**2-100**

## మున్నుడి

ఇహము అంటే ఈ భూమిపై జీవించు వేళ, పరము అంటే భూమిని వదలి వేరే లోకం చేరుకొన్నాక కూడ ఈ జీవుడికి దిక్కు పరమాత్మ శరణాగతి మాత్రమే. వేంకటేశ్వరుడే కనికరించి పాలించకపోతే నా గది అధోగతే. ఓ నారాయణా! అచ్యుతా! అనంతా! గోవిందా! శరణు. శ్రీహరీ! జగత్తులోని సారము తెలిసింది. ఇందులో అన్నీ ద్వంద్వాలే. సుఖదుఃఖాలు, పాపపుణ్యాలు, రాత్రింబగళ్లు, నవ్వులు, ఏడ్పులు, ఇవన్నీ వ్యతిరేకములే. పులుపు, తీపి, వగరు, కారములు కల భోజనంచేసినట్లే ద్వంద్వ భావాలుగల సంసారంలో జీవించక తప్పదు. నన్ను కరుణించు. నేను గట్టెక్కి నిన్ను చేరునట్లు చేయి ప్రభూ! అంటున్నారు అన్నమాచార్యులవారు.

**చం॥ మనుజుల ద్వంద్వ భావముల మగ్గుట తప్పదు రేబవళ్లుగా**
**పనిగొని వేంకటేశ్వరుడ! భ్రాంతిని ముంచెదవయ్య! జీవులన్**
**వినుతిని జేసి నిన్ను యిటు వేడెదనే కరుణింపు మయ్యరో!**
**అనెనిటు తాళ్లపాక గురుడన్నయ కీర్తనమెంచి చూడుడీ**

**రాగం : మాళి గౌళ**

నారాయణాచ్యుతానంత గోవిందా హరి
సారముగ నీకు నే శరణంటిని ॥నారాయణా॥

చలువయును వేడియును సటల సంసారంబు
తొలకు సుఖమొకవేళ దుఃఖమొక వేళ
ఫలములివె ఈరెండు పాపములు పుణ్యములు
పులుపు తీపును కలిపి భుజియించినట్లు ॥నారాయణా॥

పగలు రాత్రుల రీతి బహుజన్మ మరణాలు
తగుమేను పొడచూపు తనుతానె తొలగు
నగియించు నొకవేళ నలగించు నొకవేళ
వొగరు కారపు విడెము ఉబ్బించి నట్లు ॥నారాయణా॥





యిహము పరమును వలెనె యెదిటికల్లయు నిజము
విహరించు భ్రాంతియును విభ్రాంతియును మతిని
సహజ శ్రీవేంకటేశ్వర నన్ను కరుణింప
బహువిధంబుల నన్ను పాలించవే ॥నారాయణా॥

**భావామృతం :**

ఓ నారాయణా! అచ్యుతా! అనంతా! గోవిందా! శ్రీహరీ! శరణు-శరణు-శరణు. జగత్తుయొక్క సారము తెలిసింది. దీని చేవనెరిగితిని. నీకు శరణంటిని.

అన్నియును ద్వంద్వములే, విరుద్ధమైనవే ప్రభూ! చల్లదనము వేడిమి వలె ఈ కపటపు ప్రపంచమున ఒకప్పుడు సుఖ పారవశ్యము ఇంకొకప్పుడు దుఃఖ వివశత్వము కలుగుతాయి. మరి ఈ రెండును పుణ్యము పాపముల ఫలం అనుభవించే మార్గములే కదా! భోజనంలో ఒకప్పుడు తీపి మరొకప్పుడు పులుపు రుచులు కలుగుట సహజమే కదా!

పగలు రాత్రి ఒకదాని తరువాత ఇంకొకటి వచ్చినట్లు, శరీరానికి అనేక జనన మరణాలు అనుసరించి వస్తానే వుంటాయి. వాటంతట అవే తొలగిపోతుంటాయి. ఆ పరంధాముడు ఒకసారి నవ్విస్తుంటాడు. ఒకసారి బాధలతో నలగ కొడుతుంటాడు. తాంబూలం వేసికొంటే అది ఒకసారి కారంగా (ఘాటుగా) మరొకసారి వొగరు (కాచు ఎక్కువైనప్పుడు) గా ఉంటుంది. అట్లాగే మనకు కలిగే ఈ ద్వంద్వాలు కూడ.

మనం ఇహలోకంలోను పరలోకంలోను అనుభవించే కష్టసుఖాలు కూడా కల్ల నిజము వలె ద్వంద్వమే. భ్రాంతి (ఉన్నది లేనట్లు లేనిది ఉన్నట్లు భావించు స్థితి) నొందుట భ్రాంతిని వీడుట కూడ పరమాత్ముని అనుగ్రహం వల్లనే కలుగుతాయి. సహజ స్వభావుడవైన ఓ శ్రీవేంకటేశ్వరా! నన్ను అనేక విధములుగా కరుణించి నన్ను రక్షించు చున్నావు. నేను సదా నీకు శరణార్థిని. నీ భృత్యుడను. నీకు విధేయుడను నన్ను కటాక్షింపుము తండ్రీ!

**2-101**

## మున్నుడి

ఆదిదేవుడైన ఆ శ్రీవేంకటేశ్వరుని కృపాధనమును సంపాదించాలని నేను ప్రయత్నించినప్పటికీ నా అసలు ఆశయం పూర్తిగా సిద్ధించే దాకా నాకు తృప్తిలేదు. 6 సంపుటాలలో 606 కీర్తనలకి అన్నమాచార్యుల వారిని, సంస్మరిస్తూ 'మున్నుడి' మరియు 'భావామృతం' వ్రాస్తాను. నా ఆశయం నెరవేరాలంటే ఆ ఏడుకొండలవాడే దిక్కు. దీనితో రెండవ సంపుటి పూర్తి అవుతున్నది. ఎలుగెత్తి నాతో మీరూ అనండి. "ఏడుకొండల వాడా! వేంకటరమణా! గోవిందా! గోవింద!"

**ఆ.వె॥జయము మంగళంబు సర్వేశ్వరా! నీకు**
**జలజవాసినికిని జయము శుభము**
**అన్నమయ్య కృతికి మున్నుడి భావంబు**
**వినరె, జనులగావ వినుతి జేతు**

**రాగం : మధ్యమావతి**

జయ మంగళం నీకు సర్వేశ్వరా
జయమంగళం నీకు జలజవాసినికి ॥జయ॥

శరణాగత పారిజాతమా
పొరి నసురుల పాలి భూతమా
అరుదైన సృష్టికి ఆదిమూలమా
హరీ నమో పరమపుటాలవాలమా ॥జయ॥

సకల దేవతా చక్రవర్తీ
వెకలివై నిండిన విశ్వమూర్తి
అకలంకమైన దయానిధి ఓ
వికచముఖ నమో విధికి విధి ॥జయ॥





కొలిచిన వారల కొంగుపైడి
ములిగిన వారికి మొనవాడి
కలిగిన శ్రీవేంకటరాయా
మలసి దాసులమైన మాకు విధేయా ॥జయ॥

## భావామృతం

ఓ సర్వేశ్వరా! నీకు జయము కలుగుగాక! నీకు సమస్త సన్మంగళములు కలుగుగాక. పద్మసంభవి, పద్మనివాసినియైన నీ అర్ధాంగి శ్రీమహాలక్ష్మికి జయము, శుభము కలుగుగాక!

ఓ దేవా! నీ శరణు జొచ్చిన వారికి దివ్య పారిజాత వృక్షమువలె సర్వాభీష్టములను తీర్చుమహానుభావుడవు. మాటి మాటికీ అసురులు పాలిటి 'భూతము' వలె పట్టి పట్టి నిర్మూలించిన వాడవు. ఈ సృష్టికి నీవొక్కడవే ఆదిమూలము అయినవాడవు. ఓ శ్రీహరీ! సర్వమునకు నీవే ఆలవాలము (పాదు) అయివుంటివి. అట్టి నీకు వందనములు.

ఓ ప్రభూ! సకల దేవతలకు నీవు చక్రవర్తివి. అందరూ నీకు విధేయులే. ఆసక్తి కలిగించు విశ్వరూపమును ధరించినవాడవు. నిరాక్షేపణగల దయగలవాడవు. వికచముఖుడవు. (వికసించిన వదనము గలవాడవు) విధికి విధివి (బ్రహ్మకే బ్రహ్మవైన పరబ్రహ్మవు) అట్టి నీకు నమస్కారములు.

ఓ దేవదేవా! నిన్నుకొలిచిన వారిని నీవు ఎల్లప్పుడూ కొంగులో దాచుకొన్న బంగారమువలె తక్షణమే ఆదుకొంటావు. ములిగిన వారికి (మూలుగుచున్న ఆర్తులకు) నీవు మొనవాడివి (ముందుండి దారి చూపించువాడవు) ప్రత్యక్షముగా యెదుట నున్న శ్రీవేంకటేశ్వరుడవు. మలసి (నిశ్చయముతో) నీకు దాసులమైన మాకు నీవు సర్వదా విధేయుడవు. ఇది నిజం.

శ్లో॥ నిత్యాయ నిరవద్యాయ సత్యానంద చిదాత్మనే
సర్వాంతరాత్మనే శ్రీమద్వేంకటేశాయ మంగళమ్॥

## ప్రత్యేక కృతజ్ఞతలు

సర్వశ్రీ....

1. డా॥ మంగళంపల్లి బాలమురళీకృష్ణ
2. డా॥ సముద్రాల లక్ష్మణయ్య గారు
3. నేదునూరి కృష్ణమూర్తి గారు
4. గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ గారు
5. గరికపాటి వెంకట్ గారు
6. గురు కొండవీటి జ్యోతిర్మయి గారు
7. శోభారాజ్ గారు (అన్నమయ్య ప్రేరణ వీరివల్లనే)
8. ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం గారు
9. శంకర చంద్ర పవన్

ఇంకా ఎందరో, మరెందరో... వారందరికీ

భావయామి వేంకటేశం

